
ఆంధ్రసచిత్రవార
పత్రిక
24-3-67



40 పైసలు



మైసూరు: సుదరన్ మూవీస్, బెంగుళూరు.



మందరపు వెంకట రత్నమ్మ

జననం 13-2-1912 | మరణం 4-3-1967

పవిత్రమైన స్మృతిని మాకు మిగిల్చి దైవ సాన్నిధ్యం చేరుకున్న మీ ఆత్మశాంతిని కోరుతూ..... భర్త, పిల్లలు
మందరపు గంగయ్యాచారి, సరోజిని, పద్మ, లలిత, సాంబు (వసుంధర)సాయి

ఉత్తరాలు

సీరియల్

గుంటూరు పాఠకులు ఆకుల వెంకటేశ్వర్లు గారికి నమస్కారాలు.

నా రచనను, విమర్శనా దృష్టితో చదువుతున్నందుకు ధన్యవాదాలు.

కొన్ని కొన్ని ఇంగ్లీషు మాటలు నిత్యవ్యవహారంలో స్థిరపడి, అలవాటుగా మన మాటలలో దొర్లిపోవటం, పాఠకులకు కూడా తెలియంది కాదు

ఏ పాఠశాలలోను చదువుకోని మా అత్తగారు, అమ్మమ్మ, తమ తమ మాటలలో అనేక ఇంగ్లీషు పదాలు వాడటం నా స్వానుభవం

సద్విమర్శ రచయితల అభివృద్ధికి అత్యావశ్యకం. నా రచనలలో లోపాలుగా కనిపించిన వాటిని నా దృష్టిలోకి తెచ్చిన పాఠకులకు కృతజ్ఞతలు

— సి. ఆనందారామం.

కథలు

వారు నరహరిగారు రచించిన "విధి తెచ్చిన మార్పు" చాల గమ్మత్తుగా వుంది, చాలా బాగుందని కూడా చెప్పొచ్చు. రచయితకు నా ధన్యవాదములు.

శ్రీమతి పరిమళా సోమేశ్వర్ గారి 'రచయిత్రి' కథ చాలా బాగుంది అందులో రచనలను పంపి అవి తిరిగివచ్చునప్పుడు రచయితలు విచారించు తీరును చాలా బాగుగా రచయిత్రి వ్యక్తీకరించిరి వారికి నా ధన్యవాదములు

వంగనామముల విఠల్‌కుమార్ (మల్లవరం)

* * *

"వల" కథానిక చాల బాగుంది అన్ని అర్హతలూ వుండి కూడ గొప్ప గొప్ప కట్నాలివ్వలేక ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయలేక సతమతమయ్యే తల్లిదండ్రులు ఇలాంటి ఉపాయాలు వెతుకుతున్నారు అవి వారికి ఎలా పరిణమిస్తాయో తెలియజేస్తూ "వల" పేరుతో కథ అల్లారు రచయిత్రిగారు.

మధ్యలో ఒకచోట "ఆతనికి కూతురిని చూపించి వలలో వేసుకుందామనుకున్నావు' — "అబ్బాయిని, వలలో వేసుకుని దమ్మిడీ కట్నం లేకుండా పెళ్ళి చేసేద్దాం అనుకున్నావు" లాంటి వాక్యాలు అసభ్యంగా వున్నాయి. అచట పెళ్ళి చేసుకొనేది (వలలో వేసుకొనేది) తల్లియా ? లేక కూతురా?

కార్టూన్లలో ఏదో ఒక భార్య భర్తను కొట్టినట్లు అతను చేతికి కట్లు కట్టుకొన్నట్లు చిత్రిస్తున్నారు. ఇలాంటి వాటిని ఇకమీదట ప్రచురించవద్దని కోరుచున్నాను.

స్త్రీలు మరీ అంత అధ్వాన్నంగా లేరు. గయ్యాళి భార్యలున్నారు గాని భర్తను కొట్టేవారు ఎక్కడున్నారు?

జెట్టి జయరాంచౌదరి (చింతలాంపల్లి)

* * *

10—3—1967వ తేది సంచికలో జీడిగుంట రాజ్యలక్ష్మి గారు వ్రాసిన "రాధ" కథ చదివేను. సగం చదువుతూ ఉండగానే ఈ ఉత్తరం వ్రాయాలనిపించింది అసలు విషయానికి వద్దాం. "తన కోసం ఎవరైన స్టేషన్‌కు రాకపోతారా అనుకున్న మధుకు ఆశాభంగమే అయింది అయినా, తాను ఫలానా బండిలో వస్తున్నట్లు ముందుగా ఇంటికి ఉత్తరము వ్రాసుంటే బండి కట్టించి ఎవర్నైన పంపించి ఉండేవాడు తన తండ్రి" అని రచయిత్రి తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చేరు ఇంకొక సందర్భంలో, "హఠాత్తుగా బయలుదేరి రమ్మని తన తండ్రి టెలిగ్రాము ఎందుకిచ్చాడో యెంత ఆలోచించినా అర్థం కాలేదు మధుకు" అని రచయిత్రి వివరించేరు కనుక, తండ్రి టెలిగ్రాం చూచి హఠాత్తుగా బయలుదేరి వచ్చిన మధుకు, ఏ బండిలో వస్తున్నది ఉత్తరం వ్రాయటం అసాధ్యం ఉత్తరమునకు బదులుగా టెలిగ్రాం అని ఉంటే చాలా బాగుణ్ను. మొత్తం మీద కథ బాగానే ఉంది రచయిత్రికి నా ధన్యవాదాలు మిగతా కథలు అనగా "రచయిత్రి కథ, విధి తెచ్చిన మార్పు, చావు" చాలా బాగున్నాయి.

మండలేముల శ్రీరామ్ (రూర్కేలా)

మెదడుకి మేత

ది 3—3—1967 తేది ఆంధ్రసచిత్ర వారపత్రికలో మీరు వ్రాసిన వ్యాసం "ఫలానా తేదీ ఏ వారం" అన్నది చదివాను. చాలా బాగుంది దైనందిన జీవితంలో బాగా ఉపయోగపడుతుంది మీకు నా అభివందనలు

మీరు మీ వ్యాసంలో మొదటి పేరా ఒకటున 1—1—1964 గురువారం అని, లీపు సంవత్సరానికి అలాగే వస్తుందని కూడ వ్రాశారు కాని 1—1—1964 గురువారం కాదు, బుధవారం అయింది పాత కాలెండర్లు కూడ చూసాను. మీరు చెప్పిన పద్ధతి ప్రకారం అయితే గురువారం వస్తుంది

మీరు చెప్పిన పద్ధతి ఒక్క లీపు సంవత్సరానికి తప్ప మిగిలిన ఏ సంవత్సరానికైనా వర్తిస్తుంది. అందుచేత లీపు సంవత్సరంలో ఫలానా తేదీ ఏ వారం అయిందో చెప్పాలంటే, మీరు చెప్పిన పద్ధతి ప్రకారం లెక్కకట్టి, భాగించగా వచ్చిన శేషము నుంచిగాని, అంతకన్న సులువైన పద్ధతి అంకెలు కూడగా వచ్చిన మొత్తం నుంచిగాని ఒకటి తీసివేసి, ఆ వచ్చిన దానిని 7చే భాగించినచో సరియైన జవాబు వచ్చును.

అందుచేత పైన వ్రాసిన విషయం సమగ్రముగా పరిశీలించి వివరించగోర్తాను.

కె. వి. రమణమూర్తి. (భిలాయ్)

జవాబు

3—3—1967వ తేదీ ఆంధ్రపత్రికలో "ఫలానా తేదీ ఏ వారం?" అనే నా వ్యాసం మీద రమణమూర్తి గారి విమర్శ చూచాను. వారు చూపించినది నిజమే. నేను గమనించని విషయాన్ని నా దృష్టికి తీసుకువచ్చినందుకు వారికి కృతజ్ఞుణ్ణి. కాని, వారు చెప్పినది పూర్తిగా నిజంకాదు. లీపు సంవత్సరంలో జనవరి ఒకటవ తేదీ నుంచి ఫిబ్రవరి 29వ తేదీ వరకూ మాత్రమే రమణమూర్తిగారు చూపించినది నిజం. ఫిబ్రవరి 29వ తేదీ తరువాత లీపు సంవత్సరం అయినాసరే నేను ఆ వ్యాసంలో వ్రాసిన నియమం సరిగ్గానే ఉంటుంది. నేను చెప్పిన నియమం 17, 18, 19, 20 శతాబ్దాలకు, మాత్రమే కాక ఇంకా మిగిలిన అన్ని శతాబ్దాలకూ



మార్చి 31 విడుదల
MOULI
మాటలు మహారథి
పాటలు అనిసెట్టి
సంగీతం విశ్వనాథన్ రామమూర్తి
ఫోటోగ్రఫీ లక్ష్మణ్ గోరే
సుజాత ఫిలిమ్స్ వారి
హంతకుని హస్తం
దర్శకుడు. చంద్రబాబు
నిర్మాత P. బాబ్జి.
ఈస్టిండియా రిలీజ్

అన్వయించేటప్పుడు చేయవచ్చు ఈ వ్యాసంలో తప్పించని విశేషాలు కొన్ని ఇక్కడ ప్రస్తావి

లీపు సంవత్సరంలో జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29 వరకూ గల 60 రోజులనూ "ప్రత్యేక దినములు" అని వ్యవహరిద్దాం. వీటికి తప్ప మిగిలిన అన్ని తేదీలకు సంవత్సర సంఖ్య + దానిలో నాలుగో వంతు + నెల విలువ + తేదీ + శతాబ్దపు విలువ: ఈ ఐదు సంఖ్యల మొత్తమును 7చే భాగించి శేషం ఎంత వస్తుందో తెలుసుకోవాలి. ఆ శేషం 0, 1, 2, 3, 4, 5, 6, లు అయితే వరుసగా ఆది, సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శనివారములు అవుతాయి అని ఇదివరలో తెలుసుకున్నాం. ఈ సామాన్య సూత్రానికి చిన్నసవరణ ప్రత్యేక దినములకు చేయాలి. అది ఏమిటంటే ఈ ప్రత్యేక దినములలో

ఉత్తరాలు

ఏ తేది ఇచ్చినా పై ఐదు సంఖ్యల మొత్తంలో నుంచి 1 తీసి వేసి ఆ తరువాత 7చే భాగించాలి. లేదా 7చే భాగించిన తరువాత మిగిలే శేషంలో నుంచి 1 తీసి వెయ్యాలి. లేదా మామూలు నియమం ప్రకారం కనుగొన్న వారానికి వెనుకటి వారం వర్తింప చేయాలి.

ఉదాహరణకి : 4—2—1968వ తేది ఏ వారం అయింది? ఇది లీపు సంవత్సరపు ప్రత్యేక దినములలో ఒకటి అని గుర్తించుకోవాలి.

68 సంవత్సర సంఖ్య
17 అందుల నాలుగోవంతు
0 శతాబ్దపు విలువ
3 నెల విలువ
4 తేదీ
—1 ప్రత్యేకదినం కనుక
———
మొత్తం 91

91ని 7చే భాగిస్తే శేషం సున్న కనుక ఆనాడు ఆదివారం

అదే లీపు సంవత్సరంలో మరో తేదీ (ప్రత్యేక దినములలో చేరనిది) చూద్దాం

4—3—1968వ తేదీ ఏ వారం?

ఇది లీపు సంవత్సరం అయినా ప్రత్యేక దినములలో ఒకటి కాదు కనుక 1 తీసివేయ నక్కరలేదు.

68 సంవత్సర సంఖ్య

(63 వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 24—3—'67

పరాభవనామ సం॥ ఫాల్గుణమాసం శుద్ధ త్రయోదశి

సంపుటము : 59 సంచిక : 28

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెటి వీధి, మద్రాసు-1

చందా వివరాలు 10-2-1967 మొదలు
భారతదేశం

పోస్టు ద్వారా

సంవత్సర చందా	22 40
6 మాసముల చందా	11 20
3 మాసముల చందా	5 60
విడిప్రతి	0 40

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	42 00
అర్ధసంవత్సర చందా	21 00

విషయానుక్రమణిక

ముఖచిత్రం: నటి కె ఆర్. విజయ
(ఫోటో : ప్రభాకర్)

కథలు :

కీర్తి	— 8
సీతమ్మా-కొడుకూ-కోడలూ	— 17
అనూహ్యం	— 36
అంతర్జ్వాల	— 44
విచ్చిన మబ్బులు	— 49

సీరియల్ కథలు:

మంచుపాతం	— 24
రామ్‌శాస్త్రి	— 32
జాహ్నవి హైమవతులు	— 40

శీర్షికలు, వ్యాసాలు సినిమా.

ఉత్తరాలు — 2, ఉమెన్-కార్టూన్ — 5, విద్యార్థిలేఖ — 6, లోకంపోకడ — 7, గోల్డ్‌ఫింగర్-12, ట్రాఫిక్ కానిస్టేబుల్-14, వనితాలోకం—30, వనితలు వెన్నుపోట్లు—31, వారఫలం — 34, మెదడుకిమేత — 35, వైజ్ఞానికగాథాశతి — 48, వైనాకథ అడ్డం తిరిగింది'—53, అవీ-ఇవీ, పుస్తకాలు — 54, శ్రీ బి. యన్ రెడ్డి (వ్యాసం) — 55, నా విదేశయాత్ర — 56, చిత్రసమీక్ష, చిత్రతహరి — 58,



శ్రీకృష్ణ

ఎన్నికల తర్వాత రాజకీయాల పరిస్థితి

విశృంఖలంగా వోటు వేసినంతమాత్రాన, పూర్తి హక్కును పొందగలిగారని, అదే ప్రజాస్వామ్యమని అనుకోవడానికి ఎంతమాత్రమూ వీల్లేదు. సమగ్రంగా తర్కించుకుని, అభిప్రాయాల్ని ఏర్పరచుకుని, ప్రజలకు సమున్నతం కలిగేటట్లు వారి జీవన విధానాన్ని చక్కదిద్దినవాడే ప్రజాస్వామ్యం అనే పదం ప్రయోగార్హమై ఉంటుంది.

భావిన రాతల్లో కావాల్సినంత ప్రజాస్వామ్యం ఉంది. క్రిందటి సార్వత్రిక ఎన్నికల అనుభవం ద్వారా, మనదేశంలో ప్రజాస్వామ్యం ఎవరూ పెళ్ల గించ లేనంత బలంగా పాతుకుపోయిందని అనుకున్నారు. ఇలాంటి అనుకోవడాలకు కారణం విదేశాల నుండి దిగుమతి అయిన విలేఖరులు! ఇప్పుడు వారికి తగిన సమాధానం లభించే ఉండాలి! ముఖ్యంగా లండన్ టైమ్స్ విలేఖరి, శ్రీ మాక్స్‌వెల్ 'ఈ అరవయ్యేడు తర్వాత, భారతదేశంలో ఇక మరి ఎన్నికలు జరుగవు, ఇదే ఆఖరిది' అన్నారు! దీని మీద అనేకమైన వాదోపవాదాలు లేవడానికి అస్కారం ఉంది. అయినా పరవాలేదు. భారతీయుల నుంచి వచ్చే విమర్శల్ని, బ్రిటిష్ వారు ఇచ్చే దీవనల్ని భరించడం విశాలమైన భుజాస్కంధాలున్న శ్రీ మాక్స్‌వెల్‌కు కష్టమేమీ కాదు. ఇటువంటి ఎంత బరువునైనా ఆయన భరించడానికి సంసిద్ధంగా వుంటారు. కాని ఇక్కడ కొంత వ్యాఖ్యానం అవసర మనిపిస్తూ ఉంది.

మన భారతీయులు, విశాల హృదయంతో విమర్శను అంగీకరించే స్థితికి ఇంకా రాలేదు. అందుకు మనవాళ్ళు ఇంకా ఎదగవలసి ఉంది. ఒక ఉదాహరణ చెబుతాను. బ్రిటన్‌లోని బెర్నార్డ్‌షా గారు ఐరిష్ వంశస్థుడు. ఆయన అనేకమైన రాతలు రాశారు. ఆ రాతల్లో బ్రిటిష్‌వారిని పట్టుకుని సుమారు ముప్పయేళ్లపాటు ఝూడించి పారేశారు. ఆయన రాతల్ని అరికట్టనూ లేదు, ఆయన నాటకాల్ని అడ్డుపెట్టనూ లేదు. పైగా, లండన్‌లోని జన సమ్మర్దమైన ప్రదర్శనశాలల్లో వాటిని ప్రదర్శించారు! బెర్నార్డ్‌షా గారు చనిపోయిన తర్వాత ఆయనకు అఖండ మర్యాదల్ని అందజేశారు. 'వెస్ట్‌మినిస్టర్' సమాధిస్థల మున్నదంటే, అందులో మహా గొప్ప గొప్పవాళ్ళని గాని సమాధి చేయరు. ఈయన్ని అక్కడ సమాధి చేశారు! ఇది విమర్శకులకు బ్రిటిష్ వారిచ్చిన గౌరవం. ఇక మన చుట్టూ పరిశీలించుకుందాం. ముప్ఫయ్యేళ్ల క్రితం భారతదేశంలో 'మదర్‌ఇండియా' అనే గ్రంథం వెలువడింది. అది పుడుతూనే మరో కొన్ని పుస్తకాలకు సంధి కొట్టింది. అంతే అవన్నీ గంగలో కలిసిపోయాయి. భారత ప్రజాజీవితంలో విమర్శ అనేది 1950 నుండి చచ్చిపోయింది!

ఈ నాడు మన ఆర్థిక విధానం అధోగతిలో ఉంది. దానికొక తీరు, తెన్ను అంటూ ఏమీ కనిపించడం లేదు. భారత ఆర్థిక విధానం మీద వచ్చే విమర్శల్ని పక్కనపెట్టి. విమర్శల్ని సుహృద్భావంతో అవగాహన చేసుకుని, విధానాన్ని సరిదిద్దుకుని ఉన్నట్లయితే మన పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉండేదికాదు. మనం ఒకసారి వెనక్కితిరిగి చూద్దాం. శ్రీయుత మాక్స్‌వెల్ మహాశయులు, 1962 ఎన్నికల పర్యవసానంగా తాను ఏర్పరచుకున్న నమ్మకానికి తిలోదకాలిచ్చుకున్నట్టుగానే కనిపిస్తున్నారు. కాంగ్రెసు బలం ఉన్న ఎనిమిది రాష్ట్రాలు కనుమరుగు అవగా లోక్‌సభ 282 సంఖ్యతోనే సాక్షాత్కరిస్తుందని ఆయన జోస్యం! మరి ఆయన 1967 లో ఏం చూశారు? ఇప్పుడున్న దారుణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకున్నట్టయితే, మతాతత్వము, వర్గవైషమ్యాలు పరంపరగా కొనసాగుతూ వుంటే 1967 సార్వత్రిక ఎన్నికలే చిట్టచివరివి, అన్నారు. అంటే అర్థం ఏమిటి? ఇప్పుడు కాంగ్రెసు ఉబ్బరంగా పడిపోయింది, దీపం ఆరిపోయాకైనా ఇల్లు చక్కదిద్దుకుంటే బాగుంటుందనా? లేకపోతే అస్త్ర సన్యాసం చేసేస్తుందనా? మన రాజధానిలో పదవుల కోసం ప్రాకులాట చూస్తుంటే కడుపులో దేవినట్టుగా ఉంటుంది. ఒకవైపు నుంచి కాంగ్రెసు కూలిపోతోంది, పరువు నిలబెట్టండి అనే నినాదం ఉంది. అదేసమయంలో పదవుల కోసం ఉన్మాదమూ ఉంది! ప్రధాని పదవి గురించిన పీకులాట దీనికి చక్కని సమాధానం అవుతుంది. ఈ తగూలాట గాంధీయిజాన్ని సంరక్షించడానికి జరుగుతోందా, లేకపోతే కాంగ్రెసు సిద్ధాంతాల పేరు మీద జరుగుతున్న డంబాచారమా? ఒక సాధారణ పౌరుడి జీవితానికి ఆసరాగా కాంగ్రెసు నిలబడి ఉంది, ఉండాలనేది కాంగ్రెసు సిద్ధాంతం. మహాత్మా గాంధిగారు 'అడిగే ముందు అర్హత ఉన్నదా?' అనే కొలబద్దతో రాజకీయ నేతల సందర్శి కొలుస్తూ ఉండేవారు. కీర్తిశేషులైన నెహ్రూ భారతదేశాన్ని గొప్పదానిగా చేయడానికి, మహాఘనమైన దానిగా చేయడానికి, ఆయన జీవితమంతా ధారపోశారు.

ఇప్పుడు మొత్తం లోక్‌సభ విధానమే మారిపోయింది. కాంగ్రెసు నాయకత్వం ఎప్పుడూ తెలివితేటలకు, రాజకీయ చతురత్వానికి పుట్టినిల్లుగా ఉండాలి. గోడ మీద పిల్లి వాటంగా తప్పించుకుపోదామన్నా కష్టమే, స్వతంత్ర భావశూన్యంగా బుర్రను కప్పల తక్కెడ చేసుకున్నా హానికరమే! సదా సద్వివేకంతో పనుల్ని చక్కబెట్టడం ఆ నాయకుని విధి. ఈ విధిని నిర్వహించడంలో శ్రీ కామరాజు ఇదివరలో ఎంతటి నేర్పును ప్రదర్శించారో అందరికీ అనగతమైన విషయమే. ఈ 'చివరి ఎన్నికల్లో' (మాక్స్‌వెల్ ఉవాచ) ప్రతిపక్షాలకు ధైర్యంగా ఎదురు నిలబడగల శ్రీయుతులు క్రిష్ణమీనన్, యస్. కె. పాటిల్, సి. సుబ్రహ్మణ్యం, మసూభాయ్‌షా వగైరా భారీ విగ్రహాలు తెరచాటుకు వెళ్లిపోయాయి.

స్వపక్షంలోని జగజెట్టీల బలం తగ్గిపోయిందని ఒకవైపు నుంచి విచారిస్తుండగా, ప్రతిపక్షంలోని యోధాగ్రేసరులు నక్షత్రమండలం దాకా ఎదిగారు, శ్రీయుతులు డాంగే, గోపాలన్, హిరేన్ ముఖర్జీ - దవుదేకర్, ఫెర్నాండెజ్, పి. సి. దేశాయ్, రామమనోహర్ లోహియా సర్వసన్నద్ధులై నిలబడ్డారు. బాగున్నారా అని పరామర్శిస్తేనే కలబడే వీరులు వీరు! ఇలాంటి వారితో శ్రీమతి గాంధి నెగ్గుకు రాగల్గుతారా అనేది అందరి ముందు ఉన్న ఒక పెద్ద చిక్కు సమస్య. ఇంకెంత, రోజులు దగ్గరి కొచ్చేస్తున్నాయిగా, ఏం జరుగుతుందో ఎదురు చూద్దాం!

ఇక, ఉద్యోగస్థులు, మంత్రి పదవుల కొగబడే వారూ, మమ్మల్ని గుర్తించండంటే మమ్మల్ని గుర్తించండంటూ 'ఫేషన్ పెరేడ్' చేస్తున్నారు. నా జేబులో ఏడు హర్యానా వోట్లున్నాయి చూసుకోండి భాన్సు, అంటున్నారు లాలా గుల్జారీలాల్ నందాగారు. ఇదివరకయితే బాబూ జగ్జీవన్‌రావ్ గారికి కొంత పలుకుబడి వుండేది. ఇప్పుడా బలం చాలవరకు తగ్గిపోయింది. ఈ మధ్య ఆయన శ్రీమతి ఇందిరాగాంధి యింటికి వెళ్లి వారిని సందర్శించి వచ్చారు. ఆయన శ్రీమతి గాంధిని సమర్థిస్తూ ఉపన్యసించి వచ్చారన మాట! శ్రీ సి. బి. గుప్త గారున్నారు. ఆయన ఉత్తరప్రదేశ్‌లో ఉన్న 47 వోట్లను తాడువేసి లాగుతున్నారు. శ్రీమతి గాంధి కంటపడాలని నానా హంగామా చేసేస్తున్నారు. కొద్దిరోజుల్లో ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయే లక్షణాలు కనిపిస్తున్నాయ్! మరో ఆరు నెలల తర్వాత కమలాపతి త్రిపాఠిగార్కి ముఖ్యమంత్రిగిరీ చుట్టబెట్టి ఆయన కేంద్రంలో తిష్ట వేస్తారు! ఇదంతా తెరవెనక చరిత్ర. దొడ్డిదారి అంటామే అదన్నమాట!

ఇది భారతదేశం ముఖంమీద ఒకవేంప కలిపిస్తున్న ప్రజాస్వామ్యం. రెండో వేంప రాజస్థాన్‌లో కనిపిస్తోంది.

ఇదో కష్టదసుంయిన కథ. మొత్తం తొంభయ్యొయిదు గురులోను ఎనభయ్యొయిదుగురు ఎదురు తిరుగుతున్న కొలువు కూటానికి శ్రీ సుఖాడియా నాయకుడు! ఆయన ముందుగా జాగ్రత్త పడదామని ఒక స్వతంత్రుడిని, మరో ఇండిపెండెంటును కాంగ్రెసు పార్టీలో చేర్చుకుని, ఇద్దరి బలమున్నది సరేలే అని సంతృప్తి పడ్డారు. ఇలా చేయడానికి కూడా ఒక కారణం ఉంది. ఒక కాంగ్రెసు వ్యక్తిని ప్రతిపక్షం వోడించింది అని ఆయన చెవిని సోకగానే ఆయన అలా వల వేశారు. ఇదే ప్రజాస్వామ్యం అనుకుంటే, ప్రజాస్వామ్యం అర్ధసన్యాసమయినా చేసి ఉండాలి, లేదా మనుష్యుల్లో నిజాయితీ అయినా మరిగిపోయి ఉండాలి!

1937 మార్చి ఏడవ తేదీ 'స్టేట్స్‌మన్'లో ఒక వ్యాసం ప్రచురింపబడింది:

"కాంగ్రెసేతర పక్షాలు ఉమ్మడిగా మహారావల్ లక్ష్మణ్‌సింగ్‌ను ఎన్నుకున్న తర్వాతనే గవర్నరు గారు శ్రీ సుఖాడియాను ఆహ్వానించారు."—

ష

స్వేచ్ఛగా ప్రాచుర్యమున్న కథనం. ఈ ఆహ్వానానికి అనేక అభ్యంతరాలు చెప్పబడ్డాయి. భిన్నసందేహాలు వెలువడ్డాయి. రాజస్థాన్ అసెంబ్లీలో కాంగ్రెసుకున్న స్థానాన్ని పురస్కరించుకొని చట్టసంబంధమైన కొన్ని ఆక్షేపణలు తెచ్చారు. కాని, పంజాబ్, ఒరిస్సా, బీహార్ రాష్ట్రాల్లో ఎవరూ ఆక్షేపించలేదు. పార్టీ బలాన్ని చూసి ఏ ఒక్క గౌరవనీయులైన గవర్నరుగారూ నాయకుణ్ణి ఆహ్వానించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరలేదు. మరి, రాజస్థాన్ విషయంలో ఇటువంటి ప్రత్యేకత ఎందుకు చూపించారు?

ఇక్కడ శ్రీయుత కామరాజ్ వివరణ చాలా ఉంది. ఇది తర్కానికి నిలిచేది కాదు, చట్టబద్ధమైన వాదం అంతకంటే కాదు.

శ్రీ సుఖాడియాను ప్రభుత్వాన్ని ఏర్పాటుచేడానికి నియోగించిన వెనువెంటనే కాంగ్రెసేతర ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి. ఆందోళన లేవదీశారు. మొన్నటి మంగళవారం కాల్పుల వల్ల అనేక ప్రాణాలు బలి అయిపోయాయి. శ్రీ సుఖాడియా గారు ఇరవయి నాలుగ్గంటల 'కర్ఫ్యూ' విధించారు. పతాకలు ఎగురుతున్న ఢిల్లీలో పట్టి అక్కడ విరివిరి వారు గస్తీ తిరుగుతున్నారు. ఇది, శ్రీ సుఖాడియా పేరు తలచ కోగానే సంభవించిన దుర్ఘటన!

ఇదే పరిస్థితిని మరో విధంగా ఆలోచించ వద్దాం. మన కాంగ్రెసు నాయకులు ఆందోళన అంటే పెడముఖం పెట్టేవారు, శాంతికాముకులు అని కదా అర్థం! సరే, మనల్నింకా బ్రిటిష్ వారు పాలిస్తున్నారూ అనుకుందాం, అదే కాలంలో కాంగ్రెసు మెజారిటీతో నెగ్గింది అనుకుందాం. ఇప్పుడు కాంగ్రెసు అవలంబించిన పద్ధతినే బ్రిటిష్ వారు పనేపెట్టి న్యాయితే మన శాంతికాముకులయిన కాంగ్రెసు నాయకులు ఏమిచేసి ఉండేవారు? ముక్కు మూసుకుని శాంతి శాంతి అంటూ జపం చేసుకునే వారేనా? అక్కడే అసలు రంగు బయట పడేది. మరో ముఖ్య విషయం గురించి ప్రస్తావించు కుందాం. మన ఎన్నికల కమీషనరుగారు శ్రీ కల్యాణ సుందరం. ఆయన, ఎన్నికలు ఎంత శాంతియుతంగా జరిగిపోయినాయో తలచుకుని భారతదేశంలో ప్రజాస్వామ్యం వేళ్ళు పాతుకుపోయింది—అని అనుకుని వుంటే బాగానే వుంటుంది! ముందు చెప్పినట్టుగా, ప్రజాస్వామ్యం పరీక్షా ఫలితాలు పోలింగ్ బూత్‌లలో లభించవు. మన ప్రజాస్వామ్యానికి ప్రతిబింబాలని చెప్పబడుతున్న సంస్థల కార్యకలాపాల్లో ప్రతిబింబిస్తువుంటుంది! కాంగ్రెసు విజయం తథ్యం అని మనందరికీ తెలుసును గనక ఎన్నికలు శాంతియుతంగా జరిగిపోయాయి, అని మరో విధంగ చెప్పుకోడానికి అవకాశం ఉంది. 1972 లో కాంగ్రెసు కాళ్ళలయాల్ని ఆక్రమించుకునేందుకు వాతావరణం బాహాటంగా ఉన్నట్టయితే అప్పుడు ఏమవుతుంది? వోటర్ల అభిమతం తెలుసుకుని, వారి అభిప్రాయానికి అనుగుణంగా, ప్రభుత్వం ఎవరికో ముందుకో జరిగితే అది సిసలైన ప్రజాస్వామ్యానికి పరీక్ష అవుతుంది. ఇదే రాజస్థాన్‌లో జరగడంలేదు. కాంగ్రెసువారి పేరు చెబితేనే అల్లర్లు ఆందోళనలు లేస్తున్న రాజస్థాన్‌లో, కాంగ్రెసు పూర్తిగా రాజ్యం చేస్తున్నప్పుడు, శాంతి భద్రతలనే మాటలు మరిచిపోవడం మంచిదేమో! ఇది ఇలా ఉండగా కేంద్ర మంత్రివర్గం ఒకటుంది. అక్కడ కాంగ్రెసు పక్షానికి మెజారిటీ లేకపోతే ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు!

మ్యాడిక్లీలో వాతావరణం అంత బాగలేదు. ప్రధాని ఎన్నిక కోసం ఇక్కడ గ్రూపులు నిర్విరామంగా కృషి చేస్తున్నాయి. ఫలానా వారికి బాగా మెజారిటీ వుంది, వారిని బలపరచ పోతే మనకు

(11 వ పేజీ చూడండి)

లోకం పోకడ

—వోటర్లు తమ తలను తీసేసినా, 'హై కమాండ్' అనబడేవర్గం సభ్యులు శ్రీయుతులు కామరాజా, అతుల్యఘోష్, ఎస్. కె. పాటిల్‌లు దొడ్లో తలలు కోళ్ళ మాదిరి నట్లు సరిగాట్లతున్నారు..... శ్రీ సంజీవరెడ్డి గారు, మెడ తెగినప్పటికీ దక్కించుకోయి వారి వెంట కుంటుతున్నారు.

10—3—67 ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో —'అర్జున్'

* * *

—జవహర్‌లాల్‌నెహ్రూ క్రింద ఉన్నప్పటి మనో ప్రాముఖ్యత నేడు ప్రధానమంత్రి పదవికి లేదు.

—పేట్రియాట్ (9—3—67)

* * *


—రేపు లార్డ్ మౌంట్‌బాటెన్ వస్తున్నారు. ఆయన ఎందుకు వస్తున్నారో మాకు తెలీదు. వస్తున్నందుకు ఆశ్చర్యంగ ఉంది.

—ఆర్గనైజర్ (5—3—67)

* * *

—తమ వర్గంవారు ఎన్నికలలో బాగా నష్టపోయారు కాబట్టే శ్రీ సి. బి. గుప్త ఇతి క్లిష్ట పరిస్థితులలో ఉన్నారు. ఒకటంటే కొత్త శాసనసభలో గుప్తవర్గానికి 94 కన్నా మించిన బలంలేదు.

—లింక్ (5—3—67)



మద్రాసు ద్రావిడమున్నేత్ర కజగం మంత్రివర్గం

కూర్చున్నవారు (ఎడమనుండి కుడికి) శ్రీయుతులు— కె. ఎ. మతియళగన్, వి ఆర్ నెడుంజెళియన్, సి. ఎన్ అన్నాదురై, గవర్నర్ సర్దార్ ఉజ్జల్‌సింగ్, సర్దారిణి ఉజ్జల్‌సింగ్, ఎం. కరుణానిధి, శ్రీమతి సత్యవాణిముత్తు, నిలుచున్నవారు (ఎడమనుండి కుడికి) శ్రీయుత లు— ఎస్. మాధవన్, ఎస్. సాదిక్‌బాషా, ఎం. ముత్తుస్వామి, ఎ. గోవిందస్వామి

కిట్టీ

మెట్లపల్లి
కామేశ్వరశర్మ



ఆ జనవరి ఒకటవ తేదీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు — అని భావించాడు మాధవరావు.

ఆ రోజు—

తనొక ఘనమైన కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నాడు.

చిరకాలంగా తన చేత గడ్డి తినిపించి డబ్బు చేసుకున్న హోటలు వాడికి గడ్డి పెట్టబోతున్నాడు. మగవాడు తనవని భావించే హక్కుల్ని (ఉదా: స్క్వేర్ చెస్) క్రమక్రమంగా అక్రమంగా తనవి చేసుకుంటున్న మహిళాలోకానికి చెప్పుదెబ్బ కొట్టబోతున్నాడు.

స్వయం పాకం చేసుకోబోతున్నాడు.

నాందిగా క్రిందటి రాత్రే తళతళలాడే కొత్త స్టీలు గిన్నెలో పాలు తోడుపెట్టి సంతృప్తిగా కళ్ళు మూశాడు. సదరు ఒకటవ తేదీన—

నూతన సంవత్సరపు విజయాలలో మొదటి దానిని తంచగా అనుభవిస్తూ తెల్లవారు జామున ఆరున్నరకే మేల్కొని సగర్వంగా కళ్ళు తెరవబోయాడు.

ఆతర్వాత ఏం జరిగిందో తెలుసుకునే ముందు—

కిట్టి గురించి తెలుసుకోటం చాలా అవసరం.

ఒకానొక ఇంజనీరు గారికి జానకి అనే చక్కటి కూతురుంది. ఆ కూతురికి ఒక పెంపుడు పిల్లి వుంది. దాని పేరే కిట్టి.

పుట్టి పెరిగింది మొదలు కిట్టి జానీతోనే సావాసం చేసింది. పూర్వజన్మ వాసన వల్లనండీ, లేక జానీ (జానకి) ప్రభావం వల్లనండీ—కిట్టికి సభ్యత అంటే చచ్చేపట్టింపు

అయితే, ఎంతవారికీ జీవితం ఒక్కతీరుగా నడవదు. డిశంబరు 31వ తేదీ కిట్టి జీవితం ఒకకొత్త మలుపు తీసుకుంది. ఆరోజు జానీ వాళ్ళు ఒక్క టైగర్ని ప్రవేశ పెట్టగానే, కిట్టికి ఆ ఇంటితోనూ, మనుషులతోనూ ఋణం తీరిపోయింది. చెప్పి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, ఉన్నది ఉన్నపళాన ఆ ఇంటి నుంచి లేచి వచ్చి విశాల విశ్వంలోకి అడుగు పెట్టింది.

అదృష్టమో, దురదృష్టమో గాని విశాల విశ్వం కిట్టికి సరిగ్గా మాధవరావు పాలు తోడు పెట్టిన గిన్నె దగ్గర ఆగిపోయింది. పరగడుపుతో బయల్దేరటం వల్లనైతేనేం లేక అప్పటికి పన్నెండు కొట్టటం వల్లనైతేనేం కిట్టి ఆకలితో నకనకలాడుతోంది. అయితే కిట్టికి ముందే చెప్పినట్లు సభ్యత అంటే చచ్చేపట్టింపు. పరులసొమ్ము పూచికపుల్లయినా ముట్టుకోటం సభ్యత కాదని తెలుసు. అలాగే ఒకవేళ పరిస్థితుల ప్రభావం వల్ల ముట్టుకున్నా వెంటనే క్షమార్పణ చెప్పుకోటం సభ్యత అనికూడా తెలుసు. అందుకే ప్రస్తుతానికి కళ్ళు మూసేసుకుని క్షుద్బాధ చల్లార్చుకుంది. అక్షణం నుంచీ భరించని పశ్చాత్తాపంతో మాధవరావు ఎప్పుడూ కళ్ళు తెరుస్తాడా? ఎప్పుడు క్షమార్పణ చెప్పుకుందామా? అని ఎదురు చూస్తోంది?

బరే ఝూ మాధవరావు.

అరుస్తూ ఉరకొడుతుంటే..

తన జీవిత చరిత్రలో సువర్ణ ఘట్టాన్ని లేఖిస్తున్న నూతన సంవత్సరపు ప్రథమ దర్శనం ఎంత అందంగా ఉంటుందో చూద్దామన్న కుతూహలంతో కళ్ళు తెరిచాడు.

"ఎక్స్ క్యూస్మియావ్ మియావ్!.." పరుగున వచ్చిన కిట్టీ క్షమార్పణ చెప్పుకోబోయింది. కోబోయిన మరుక్షణంలో తనకి కూడా అవియం త్రిత పేశీ కండరాలమర్చిన సృష్టికర్తకి ధన్యవాదాలర్పించింది.

ఎందుకంటే మృత్యువులా శరవేగంగా తన వైపు దూసుకొచ్చిన పేపర్ వెయిట్‌ని వెంట్రుక వాసిలో తప్పించుకోగలిగింది వాటి ప్రభావం వల్లనే.

అయితే కిట్టీ ఎంత తప్పుకున్నా, ఆ పేపర్ వెయిట్‌కి మాత్రం ఒక ప్రత్యేకమైన దీక్ష వుంది.

దానికి రామబాణంలా ఒకమారు ప్రయోగించబడిన తర్వాత వృథపోవటం అన్నది ఆక్షణం వరకూ అలవాటు లేదు. అందుకే ఈ ఘట్టాన్ని ఆశ్చర్యంగా వీక్షిస్తున్న అమాయకమైన బెల్జియం గ్లాసు అద్దాన్ని ఢీకొని క్షణంలో పొడి చేసింది.

మాధవరావు కోపంతో కాళ్ళు విస్మయంగా విసకొట్టాడు.

పిల్లి దుశ్శకునమే! సందేహంలేదు లేకపోతే ఎదరైన మరుక్షణంలో విక్షేపం లాంటి శబ్దం పాపం వాదు. అనుకున్నాడు మాధవరావు పెంకులు పోగు చేస్తూ.

ముఖాన్ని మెరికలు దిప్పి చూపించేది. సన్నని తన మీసాన్ని నిర్దుష్టంగా చూపించలేనిది అయిన పాత అద్దంతో పాత సంవత్సరంతో పాటు తెగతెంపులు చేసుకుని, యదార్థవాదిలాంటి కొత్త అద్దాన్ని ఎంతో ఎనసుపడి క్రితం రోజే కొన్నాడు. పెంకులు పోగుపెట్టి ఉసూరుమన్నాడు మాధవరావు.

కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న సుముహూర్తంలో పరుగుపిల్లి ఎదురవటం మాట అటుంచినా సకేసంలాంటి అద్దాన్ని పొట్ట పెట్టుకుని పిడేళ్ళ తిరిని గారంటీ చెయ్యటం మాత్రం సహించలేకపోయాడు.

అందుకే క్రిందపడ్డ పేపర్ వెయిట్‌ని మరోసారి చేతులకి తీసుకుని చుట్టూ చూశాడు మాధవరావు.

అపరిచితుల పట్ల అతని అసభ్యపు ప్రవర్తనకి ముందు నిర్ఘాంతపోయినా, ఈలోగా మనసేమైనా మారిందేమోనన్న ఆశతో కిట్టీ కిటికీ లోంచి అతనిని గమనిస్తోంది.

అది కంటబడ్డ మరుక్షణంలో మాధవరావు చేతిలోని పేపర్ వెయిట్ ఆ దిశగా లంఘించింది.

ఎంత ఆశ పడుతున్నా తన జాగ్రత్తలో తను ఉన్న కిట్టీ అది లాఘవంగా తప్పుకుంది.

వెనుకంజ గిట ని ఆ పేపర్ వెయిట్ మాత్రం అదే వేగంతో కిటికీ లోంచి పక్కింటి పెరటి వైపు దూసుకుపోయింది.

ఇక్కడ దాని దీక్ష గురించి పెన పేర్కొన బడ్డ ఉదాహరణ దృష్టిలో ఉంచే మరో మాటు ఏదో ప్రాణి దానికి బలి అవబోతోందని వూహించటం ఏమంత అనుచితం కాదు.

మాధవరావు కూడా సరిగ్గా అలాగే వూహించాడు!

అందుకే మరుక్షణంలో దడదడలాడుతున్న గుండెతో మంచమెక్కి నిండా ముసుగుపెట్టి కదలకుండా పడుకున్నాడు!

పక్కింటి పెరట్లో బాదంకాయలు కొట్టటానికి సరైన అర్హతలున్న రాయి కోసం వెతుకుతున్నాడు పదేళ్ళ బాబు. ఎంత పేపరు వెయిట్లైనా అటువంటి వాటి కోసం ఆ వాయలకి మరోసారి రాకుండా తన యావచ్ఛక్తితో ఒక పసివాణ్ణి ఢీకొనేటంత రాతిగుండె కాదు దానిది. అందుకే ఆ పక్కనె జాగ్రత్తగా వాలింది. బాబు కెవ్వున కేక వేశాడు. ఎందుకంటే అటువంటి అర్హతలున్న రాయి తనని వెతుక్కుంటూ రావటమన్నది ఆ పసివాడికే సంభ్రమాన్ని కల్గించింది. దానిని తీసి సంతోషంగా జేబులో పెట్టుకున్నాడు బాబు.

పండగ పూటా, అద్దంతోపాటు, అందమైన పేపరు వెయిట్ చెయ్యి జారిపోవటమన్నది నిజంగా బాధపడవలసిన విషయమే.

కానీ మాధవరావు ప్రస్తుతానికి అలాంటి వాటిని లక్ష్యపెట్టే స్థితిలో లేడు!

పాడు శకునాల పాలయి పోయిన మొదటి ముహూర్తాన్ని వదిలేసి మరో గంట తర్వాత మరోదాన్ని ప్రయత్నించి చూడబ తున్నాడు! దుప్పటి తొలగించి భయంభయంగా కళ్ళు తెరువబోతున్న మాధవరావు హెచ్చని ఎవడో ఒకడు తప్పక తుమ్ముతాడని అంతరాత్మ హెచ్చరిస్తోంది.

కానీ అతను మంచం మీది నుంచి దుమికిన వేగం వల్లనైతేనే, లగ్న బలం వల్లనైతేనే, ఆక్షణంలో అటువంటిదేది జరుగలేదు.

జరగకపోవటం అతనికి శుభశకునమైనంత ఆనందాన్ని కల్గించింది. దాని వల్లనే బోణీ రోజునే బోసిగా ఎదురైన పెరుగు గిన్నెని చప్పి తమాయించుకోటమే కాక తన కార్యక్రమాన్ని ధైర్యంగా కొనసాగించ గలిగాడు.

రెండోసారి పే. వె. ని. తప్పించుకున్న క్షణం నుంచీ ఇటు కిట్టీ మనసు పరిపరి విధాల పోతోంది.

నకనక లాడుతున్న కడుపుతో అమితంగా ఇలా పయనిస్తున్న సమయంలో తళతళ లాడుతున్న పెరుగు గిన్నె ఇచ్చిన ఆహ్వానం, దాని సహృదయతా కిట్టీని ముగ్ధురాల్ని చేసినా, జానీని వదిలేసిన దిగుల్ని, జీవితం మీద వైరాగ్యాన్ని సుబ్బరంగా తుడిచి వేసినా, ప్రథమ వీక్షణంతోనే ఏర్పడ్డ ఆ నేస్తాన్ని సత్సాంగత్యాన్ని ఒదులుకోటానికి కిట్టీ మనసు ఒప్పలేదు.

కానీ ఇటు మాధవరావు ప్రవర్తన—ముఖ్యంగా, ఆ పే. వె. రెండోసారి నిర్దాక్షిణ్యంగా తనవైపు లంఘించిన పిదప అందుకు పూర్తిగా విరుద్ధమైన ఆలోచనలని కలిగిస్తోంది. ఎంత సభ్యత ఉన్నా జీవితంలో అసభ్యత నెదుర్కోవటం కిట్టీకిది మొదటి సారికాదు. నిజానికి, టైగర్‌తో గడిపిన బహుకొద్ది సేపట్లో కిట్టీ కావలసినంత అసభ్యతని అనుభవించింది. కానీ ఈ మాధవరావు ప్రవర్తన ముందు టైగర్, మిట్ట మధ్యాహ్న సూర్యుడి ముందు మిణుక్కుమన్న అగ్గిపుల్లలా వెలవెలబోతోంది.

అరె! దేవుడి సృష్టిలో జీవికీ జీవికీ పడకపోవటం సహజం! కాదనలేదు. దానిని తను సానుభూతితో తప్పక అర్థం చేసుకోగలదు. కాని కంటబడిన మొదటి క్షణంలోనే, అవతలి వాళ్ళ మనస్తత్వం సరిగ్గా అవగతం కాకముందే పెద్దసైజు పేపరు వెయిట్లు శరవేగంగా విసిరేటంత అర్థంలేని విరోధం ఎందుకు కంగారులో తలబద్దలు కొట్టుకున్నా తెలియలేదు. నిజానికి తను అతని నిద్రని పాడు చేసింది లేదు. పైగా నిద్ర లేచేవరకూ చాలా ఓపికగా కూడా కూర్చుంది—లాభంలేదు! తను అటువంటి మోటువాళ్ళతో మెలగలేదు! తన చేతగాదు! తను పోవలసిందే! ఏమైనాసరే తను పోవాలి!

దీర్ఘంగా నిట్టూర్చి అడుగు ముందుకు వేయబోయిన కిటీ హఠాత్తుగా ఆగిపోయింది!

ఆ ఇంటిని ఆఖరు సారిగా చూడబోయిన కిట్టీకి మాధవరావు పాలు పోయించుకుంటున్న దృశ్యం కంటబడింది. సీలు గిన్నె! తన నేస్తం!

ఆదృశ్యం కిట్టీ మనసులో మరోసారి ఆలోచనలని రేపింది. గతరాత్రి ఆ సీలుగిన్నె సహృదయం, మంచితనం మరోసారి జ్ఞాపకం చేసింది. ఆ చెలిమిని వదిలేసి హృదయంలేని దానిలా, పిరికిదానిలా మహార్యుల దారిలా పారిపోతావా అని పరిహాసమాడింది!

అంతే—

కిటీకి గర్వించదగిన తరతరాల తనవంశచరిత్ర—కీకారణ్యాల్ని గజగజలాడించిన వ్యాఘ్రహాలు కొన్నిటికి, జీవహింస మీద మోహం మొత్తటం, పశ్చాత్తాపంతో గ్రామాలకి వలస వచ్చి నియమాలతో నిష్ఠలతోను దేహాన్ని కృశింపజేసి పిల్లులుగా మారటం కళ్ళకి కట్టినట్లు కన్పించింది.

కిట్టీ చైతన్యం వచ్చింది!

ఏమైనాసరే! తానా సీలుగిన్నెని వదలదు! చచ్చినా వదలదు! వదలలేదు!

కిటీ ఆ నిశ్చయానికి వచ్చిన క్షణం ఎటువంటిదో గాని ఆ సంకల్పం మాత్రం మరి మారలేదు. మొదట కిట్టీకి ఎంత అసహ్యం వేసినా ఒక్కమంచి లక్షణం వల్ల కిటీకి క్రమక్రమంగా చాలా నచ్చాడు! తన నేస్తాన్ని తరచు కలుసుకోటానికి వీలుగా, వంట గదికి కనీసం ఒక దోవైనా తీసి ఉంచటం ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోయేవాడు కాడు.

* * *

కాలగర్భంలో కొన్నిరోజులు కలిసిపోయినై!

సాధకబాధకాలన్నిటికీ ఓర్చి కిట్టీ అక్కడే స్థిరపడి పోయింది!

వినుగు చెందిన విక్రమార్కుడిలా మాధవరావు స్వయం పాకం సాగిస్తూనే ఉన్నాడు ఆరోజు మామూలుగాపగలుపదింటికి వంటింటి దగ్గర కొచ్చింది కిట్టీ ఆ సమయానికి పేపరు వెయిట్ల మీద పడివున్న మాధవరావు ఇంట్లో ఉండడని కిట్టీకి బాగా తెలుసు. కాని ఆరోజు ఎందుకోగాని స్టీలుగిన్నె దగ్గరకి ఆ మార్గాన్ని సుగమం చేసే బుద్ధిమంతురాలైన కిటికీ కోసం శ్రమపడి వెతుక్కోవలసి వచ్చింది. తీరా వెతుక్కుని అందులోకి దూకేలోగా—

కదలటానికి బద్ధకించే [illegible]

తాలూకు మూలుగు లాంటి ధ్వని వెనుక వైపుగా వినిపించింది.

ఏమిటా అని వెనక్కి తిరిగిన కిటీ గుండె గతుక్కుమంది. క్షణకాలం భయంతో నిలువెల్లా వణికిపోయి, అసంకల్పిత ప్రతీకార చర్యవల్ల కిటకిటలాడింది. దూకిన పిదప కిట్టీ గుండె కుదుటపడింది!

టైగర్ జాతికి చెందిన జీవి తను ప్రబల శత్రువు, తన వైపే దొంగ చూపులు చూస్తూ "గుర్ర్.." మంది.

"నీ పేరు?" అన్నట్లు చూసింది కిటీ.

"గుర్ర్..ర్ర్..ర్ర్" నోరు విప్పి చెప్పటానికి సందేహిస్తున్న ఆ కుక్క అణకువ, పోలీసు పట్ల జేబులు కొట్టే వాడు ప్రదర్శించే దీనమైన చూపులకీ దాని చూపులకీ గల సామ్యం కిట్టీని ఆశ్చర్యచకితురాల్ని చేసింది.

"నీ పేరు?" సాదరంగా అడిగింది కిట్టీ.

"రంగడు" బిక్కుబిక్కుమంటూ మనవి చేసింది రంగడు.

ఆ పేరు వినగానే కిట్టీకి రంగడంటే చచ్చే జాలి వేసింది! పాపం బొత్తిగా కల్చరు లేనట్లుంది. ఏ జేబులు కొట్టేవాడు పెట్టాడో! ఆ ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుకి తగ్గట్టు ఆ పేరు మాడు పాపం! అనుకుంది.

కిట్టీ క్షణకాలం ఆలోచించింది!

"నేను చెప్పినట్లు వింటే..."

వింటానన్నట్లు బుద్ధిగా తోక వూపింది రంగడు.

"అయితే విను! ముందా పేరు మార్చు!"

"సరే!" అన్నట్లు మరోసారి తోక వూపింది.

"అలా! నువ్వికనుంచి భోజనానికి ఇబ్బంది పడకు! ఆకలేసినప్పుడు మొహమాటపడక వస్తుండు! నాతో మంచిగా ఉన్నంతవరకు నీకే ఆందోళనా అవసరం లేదు. మాధవరావు మొదటి రకం వంటవాడు!"

మాటను బట్టి ముందే గ్రహించినట్లు తోక ఊపేసింది రంగడు.

"శ్రద్ధగా విను! ఆ కొట్టే దాన్ని గడియారం అంటారు. ప్రొద్దుటికి పన్నెండు కొడుతుంది. ఓ అరగంట రెస్టు తీసుకుని మరొకటి కొడుతుంది. అప్పుడు మాధవరావు వచ్చి ఈ తలుపు తీసి లాక్ చేసి ఆఫీసుకి పోతాడు. అప్పుడు నాలుగు గంటలకు వస్తాడు. పాపం, చాలా ఆకలిగా ఉన్నట్టున్నావ్! అందాకా ఆహారం నిశ్శబ్దంగా ఆగాల్సిందే!" ఉపన్యాసం ముగించి వంటింట్లోకి నిష్క్రమించింది కిట్టీ.

ఆ పైన కమ్మటి అన్నాయంగా చూసి, ఆదేశించిన తోవ వాకిట వెనుకకు మళ్ళింది రంగా.

ఆ సాయంత్రానికి రంగా ఆగమనం మాధవరావు లోని ఆత్మవిశ్వాసాన్ని కొంతవరకూ సడలించిన మాట వాస్తవమే కాని, సంవత్సరాది పూటా కొండ నీరి పెట్టుకున్న ముహూర్తం, దుష్టకాలం దాటిపోవటం అతనిలో ఏదో ఆశ మిణుకు మిణుకు మిణుకుమంటూ మిగిల్చింది.

* * *

కాలగర్భంలో మరో కొన్ని రోజులు గడిచిపోయినై!

వ్యాయామం పాలవ్వు ఆంధ్ర మాధవరావు వ్యాయామాలే చేస్తున్నాడు

కిట్టీ

కిట్టీకి రంగాకి మధ్య స్నేహలత పెనవేసుకుపోయింది!

ఆ రోజు—

శుక్రవారం సాయంత్రం మాధవరావు చాలా హుషార్‌గా ఉన్నాడు. గబగబా వంట పూర్తి చేసి, పాలగిన్నె మీద భద్రంగా మూత పెట్టి కిటికీలన్నీ జాగ్రత్తగా వేశాడు. ఆపైన ప్రతిదీ పదిలంగా వుందని ఒకటికి పదిసార్లు రూఢి చేసుకుని వంట గదికి తాళం వేశాడు. ఆపైన క్షణంలో "స్మార్ట్"గా తయారై ఈలవేస్తూ సినిమాకి బయల్దేరాడు. ఇంత హుషార్‌లోనూ, అతను ఇంటికి బయట తాళం కూడా వేయటం ఆరోజు మరువలేదు.

అలా మరుపక పోటమే రంగాకి తీవ్రమైన ఆందోళన కల్గించింది! బయటికి పోవటానికి ఎత్తైన అవకాశం కోసం ఎదురు చూస్తూ మంచం కింద నక్కి కూర్చున్న రంగాకిది పిడుగుపాటు లాంటి ఆఘాతాన్ని కల్గించింది. ఒక్కొక్కసారి జీవి దేని కావాలని కోరుకుంటాడో అది తీరా జరిగిన పిదప దానికి బాధ పడుతుంటాడు. పాపం రంగాకి కూడా అలాంటి బాధే వేసింది. తను మాధవరావు కంటబడి వుంటే ఎంత బాగుండేది? నిజానికి తనని లోపల పెట్టి తలుపు వేయటానికి అతని మనసు కూడా ఒప్పుకుని ఉండేది కాదు. ప్చ్! కాని ఏం లాభం?

"ఇప్పుడు బయటికి పోవటం ఎలా?" ఉండబట్టలేక కిట్టీని అడిగింది రంగా.

"ఆం, రంగా! పదటానేమిటోయ్ రంగా! నా పు కబుర్లు చెప్పు" కిట్టీ మందలించింది.

"ఏం చెప్పను?"

"ఏమిటా చెప్పేదంటు ప్రశ్నే వెర్రిమొహమా" కిట్టీ హేళన చేస్తూ కొంపవడింది.

ఇక్కడ మాత్రం ఒక సంగతి ఒప్పుకోక తప్పదు! మొదట రంగడికి కల్చర్ లేదనే దిగులు ఉన్నా ఇప్పుడు రంగాకి మాత్రం ఇలాంటి మాటలు అంటే సహించలేనంత కల్చర్ వచ్చింది. అందుకే కిట్టీ మాటలకి రంగాకి పిచ్చి కోపం వచ్చింది.

"గుర్ర్!" మని కిట్టీకి వార్నింగ్ ఇచ్చింది. ఇష్టంగా మీదికి దూకింది. అయితే అదే వేగంగా దూసుకొచ్చిన టేబుల్ వెనుక్కనే తప్పుకున్న కిట్టీ రంగాని మహా యాసంగా తప్పుకుంది. దానితో రంగాకి మరీ ఒళ్ళు మండిపోయింది. కిట్టీ వెంటబడి తరిమింది. తప్పిస్తూ, ఏడిపిస్తూ రంగాని ఇల్లంతా తిప్పింది కిట్టీ ఇంటంటి పరుగెత్తేస్తూ. రకరకాల వస్తువుల మీద నుంచి అది లాఘవంగా ఎగరగెంతి కొంపనున్నాయి, తరుముతున్న రంగా వాటన్నిటినీ పడదోసుకుంటూ దాని వెర్రిచూపి, తరుముకి ప్రవేశించకుండా ఉండలేక పోయింది.

కొద్దిసేపటికి రంగా పట్టుదలకి ప్రతిఫలం లభించినంత పనయింది. టేబుల్ మీద నుంచి దూకబోయిన కిట్టీ కిందకు తోసేసి తప్పుడు రంగా అరణ్యంలో దూరంలోకి వచ్చింది. కాని ఎంతసేపని ఆ శ్రమస్థితి పనికొస్తుంది. ముందుకు [illegible]

అలా పడింది రంగా.

రంగాకి మెడ బెణికింది. కిట్టీకి నవ్వొచ్చింది. రంగా కోపం పట్టలేకపోయింది. తన దద్దరిల్లేటట్టు అరిచింది. అంతటితో కసి తీరని మాధవరావు ఎక్కువెడి దుప్పటి చింపేయబోయింది.

చింపేయబోయిన రంగా ఆశ్చర్యంతో క్షణకాలం కొయ్యబారిపోయింది.

కోపం ఇట్టే జారిపోయింది.

మాధవరావు దుప్పటి చాలా రుచిగా వుంది.

ఇంతవరకూ వంటగది బయట కూడా అంత వస్తువులు అంత రుచిగా వుంటాయని గుర్తించనందుకు పశ్చాత్తాపంతో కుమిలిపోయింది. ప్రాయశ్చిత్తంగా, దాని రుచిని తెలుసుకున్న గుర్తుగా ఓపిక ఉన్నంతవరకూ దానిని నమలటం చేసింది. ఆ పైన ఏ వస్తువు ఏ పాటిదో ఎవరూ చెప్పలేరు కనుక గదిలోని ప్రతి వస్తువునీ జాగ్రత్తగా రుచి చూసి నచ్చిన వాటిని ఆరగించటానికి యథాశక్తి ప్రయత్నం చేసింది.

* * *

అర్ధరాత్రి పదిగంటలకి, విచ్చేసిన మొండి పిల్లి లాంటి తన రూములోకి మాధవరావు అడుగు పెట్టేసరికి—

అతికష్టం మీద గుర్తుపట్టగలిగిన తన పక్క మీద రంగా హాయిగా నిద్రపోతోంది. కిట్టీ దొంగ చూపులు చూస్తూ నిష్క్రమించింది.

ఆ క్షణంలో మాధవరావుని ఆవేశం ఏది మూసేసిందో, ప్రశాంతతో గాని అతను రంగాని ఎత్తుకు దగ్గర తట్టి లేపి సగౌరవంగా బయటికి సాగనంపాడు. ఆపైన హోటల్ వాళ్ళ ఉద్దేశం.

"హోటల్ వాడా, కాదు. నువ్వే సెలవ్! ఏ గడ్డి పెట్టు! ఏకంగా విషం పెట్టు!" అనుకున్నాడు.

అంతేకాక "మహిళా లోకమా! ఇదే నా శపథం వినుకుంది! ఈ వాక్కుల్ని దురాక్రమణ చేయగలిగిన సమర్థత నాకు లేక పోయింది స్వీకర్ వాపసేకాదు, నువ్వు మిపాశ పెంచినా నీ వాక్యం దోషికి రాదు నీ కిదే నా నమోవాకములు!" అని రెండు చేతులూ జోడించాడు మాధవరావు.

* * *

సరిగ్గా మూడువారాలకి ఎల్లుండి తీర్థ వారికి క్షణమి—

"రాధా!" అని మృదువుగా పిలిచాడు మాధవరావు.

కొన్ని క్షణాలైనా సమాధానం రాకపోయేసరికి అతని పెదవులు లేత గులాబీ రేకుల్లాంటి ఆమె పెదవుల్ని వెచ్చగా తాకిన చేసి,

"వూ..."

"నీకు పిల్లి అంటే ఇష్టమంటే నమ్మకమేనా?" సమాధానం కోసం ఆగకుండా తనే చెప్పేశాడు.

"నాకు మాత్రం లేదు!"

అదే నిజమై ఉంటే స్త్రీల మీద నాకింత గౌరవమూ కలిగేది కాదు, కొత్త సంవత్సరం నాకింత ఆనందమూ తెచ్చేది కాదు! ఆ మాట చెప్పేవాడేగాని ఆమె పెక్కెక్కువ అందాన్ని ఆస్వాదిస్తున్న అతని పెదవులకి తీరిక లేకపోయింది.

న్యూఢిల్లీ లేఖ

(7-వ పేజీ తరువాయి)

బలం ఉండదు, అని కొందరు అనుయాయులు ప్రచారం చేస్తున్నారు. కొందరు కొందరు వ్యక్తులకు, మీమీ విజయాన్ని చూపించి స్వామిధర్మాన్ని నెరవేర్చుకోండి అనే ప్రోత్సాహం అన్నివైపుల నుండి లభిస్తోంది. వాతావరణం పొడిపొడిగా చలిచలిగా ఉంది. సూర్యుడుదయించే వరకూ ఈ చలి తీరేది లేదు! ఈ కుమ్ములాటతో భారతదేశం బాగోపలేనంత పోవడం జరుగుతున్నది. దీని వలన కాంగ్రెసుకు, ముఖ్యంగా భారతదేశానికి ఏదో చేటు దాపురించిందా అనే భయం కల్గుతూ వుంది. ప్రధాని ఎన్నిక అనేది మూతాతత్వాన్ని ప్రబలం జేసేదిగా ఉంది. ఇది మనకు అనుభవైక వేద్యమే!


ప్రధానిని ఏకగ్రీవంగా ఎన్నుకోలేకపోతే, అది కాంగ్రెసు విచ్ఛిత్తికి దోహదం చేస్తున్న విషయం యదార్థం. ఇక్కడ ఆలోచించ తగ్గది మరొకటి ఉంది, కాంగ్రెసు పతనాన్ని కళ్లారా చూడాలనే కాంగ్రెసు వర్గం ఒకటుంది. ఈ వర్గం స్వతంత్ర భారత్‌లోని కాంగ్రెసు పాలనను చూసి ఓర్వలేకపోతుంది. అది రాజవంశస్థుల వాగ్ధాటియుండి సంకల్పాన్ని సిద్ధించుకోవాలని చూసింది. కాంగ్రెసు వైనారిటీలో ఉన్న ప్రదేశాల్లో ఈ రాజవంశస్థులు కాంగ్రెసుకు బలం కూర్చినట్లయితే వారి విజయాన్ని ప్రత్యక్ష సాక్ష్యమవుతుంది! ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టుల అయుక్తత, స్వతంత్రులోని ప్రతిపక్షాల బలం కాంగ్రెసును అప్పుడప్పుడు అల్లాడిస్తూనే ఉన్నాయి. మద్రాసులో ద్రావిడ మున్నేట్ర కళగం, కేరళ, బెంగాల్ రాష్ట్రాల్లో కమ్యూనిస్టులు, బీహార్‌లో యస్సెస్పి ఆధ్వర్యంలో సంయుక్త పాలన, కొంతవరకు సమర్థనీయంగా ప్రభుత్వాన్ని ఏర్పరచుకొని, ప్రజల కోర్కెల్ని తీర్చడానికి కృషి చేస్తాయని మనం ఊహించడంలో తప్పులేదు.

ఇక్కడ మన కేంద్రం తన స్వాతంత్ర్యను ఎలా ప్రతిష్ఠాపనం చేసుకుంటుందో యోచించాలి. 'వింటే మునిగిన తర్వాత అటు చిద్దాం!,' 'కొంచెం ఓపిక పట్టండి', 'చూద్దాం', అనే తత్వాన్ని కాంగ్రెసు ఇక మరచిపోకపోతే భారతదేశం భవిష్యత్తులో విషమమైన సమస్యలను ఎదుర్కొంటుం దన్నమాట వాస్తవం. దక్షిణాత్యులు వారిష్టం వచ్చినట్లు నడుచుకుంటారు. ఉదాహరణకు, హిందీని రుద్దడాన్ని ప్రయత్నిస్తే భంగపాటు తప్పదు. ప్రస్తుత సమస్య దినదినాభివృద్ధి నొందుతున్న ధరలు. ఇవి ఆహారంతో ముడిపెట్టబడి ఉన్నవి. ఈ సమస్య కేంద్ర మంత్రివర్గం మీద ఆధారపడి ఉంది. ప్రధానమంత్రి ఎవరవుతారు? ఆమెయా, అతడా? వారు ఆహారమంత్రిగా ఎవర్ని నియోగిస్తారు? ఆర్థికమంత్రిగా ఎవర్ని పురమాయిస్తారు? విస్తరిలో షడ్రసోపేతాలు ఉన్నాయి. కాని మనం తినేవరకూ నమ్మకం లేదు! ●

సవరణ

ఏడవ తేదీ గల పత్రికలో 'మార్గోనా'కు బదులు 'మంగళూర్' అని, కామత్ ప్రభృతుల గురించిన వ్యాసంలో రాశాము. పొరపాటును గమనించగోర్తాము.

—శ్రీకృష్ణ ●



గోల్డ్‌ఫింగర్ దొంగరవాణా పద్ధతి గురించి ఆలోచిస్తూ భోజనం ముగించాడు బాండ్.

ఇండియా దొంగ బంగారం వ్యాపారానికి ఉనికి పట్టు. గోల్డ్‌ఫింగర్ రెండొందల శాతం లాభం సంపాదిస్తూ వుండొచ్చు.

గోల్డ్‌ఫింగర్ లాభాల్లో 'స్మెర్ష్'కి డబ్బు పెడుతుంటే, వెంటనే ఏదో చెయ్యాలి.

మళ్లీ ఈ పని చేయడానికి అవకాశం ఇవ్వకూడదు. ఇదే ఆఖరిసారి...



గోల్డ్‌ఫింగర్ 'రోల్స్' బంగారంతోనే. ఫ్రాన్స్‌లో ఆగి, బంగారాన్ని కరిగించి, విమానానికి సీట్లుగా మార్చి చేయించి, ఇండియాకు పంపిస్తాడు. ఒక ట్రిప్పుకు మిలియన్ పవున్లు!

బాండ్ గోల్డ్‌ఫింగర్ ఎస్టేటులోకి వచ్చాడు. అతను ఎలాగయితే గోల్డ్‌ఫింగర్ వెంటపడ్డాడో, అలాగే మిస్ టిల్లీ సోమ్స్ కూడా అనుసరిస్తోంది...

టిల్లీ...అలానే వుండు, విను! నేను బాండ్‌ని, స్నేహితుణ్ణి.



టిల్లీ ఆగిపోయింది ఎగ్గి అయింది.

ఊపిరి తీసుకో.. నువ్వు గోల్డ్‌ఫింగర్‌ని వెంటాడుతున్నావా? చెప్పు


వాణ్ణి చంపాలనుకున్నాను.

నువ్వు చేసే హానికంటే, నేను ఎక్కువగానే కష్టం పెడతాను.

అతను నా సోదరిని చంపాడు. ఆమె నీకు మియామీలో తెలుసు కదా.. నీ గురించి చెప్పింది.

ఆమెకు నువ్వంటే చాలా ఇష్టం. నీతో వెళ్ళినందుకే గోల్డ్‌ఫింగర్ ఆమెను చంపేశాడు.

వూహ్... ఘోరం...



మియామీలో అతనితో వున్న ఆ అందమైన అమ్మాయిని గురించి వూహించుకున్నాడు బాండ్


ఆమెను హత్య చేసినందుకు గోల్డ్ ఫింగర్‌కి మంచి పాఠం చెబుతాను ఆమెను చంపుకొని చంపుకుని మరీ బాధ పడేలా చేస్తాను

ఎప్పుడైనా అతన్ని ఎదుటే ఈ ఉంగరం నీకు ఇవ్వమంది

ఆ హ్...

సరిగ్గా పొట్టకు గురి చేయబడి రెండో బాణాన్ని చూసి అటుతిరిగాడు బాండ్

హలో ఆడ్‌జాబ్ కులాసాయా? చక్కని గురి.



టిల్లీకి ఆసరా యిస్తూ గోల్డ్‌ఫింగర్ యింటి ముఖం పట్టాడు బాండ్. అతని వెనకే ఆడ్‌జాబ్ వస్తున్నాడు...

మనం కొంచెం చిక్కుల్లో వున్నాం. నువ్వు నా గర్ల్ ఫ్రెండ్‌వని చెప్పు. సరేనా?..

అదీ కథ.., ఆ రాడార్ తో మనం వున్నట్టు పసిగట్టారు. అదిగో అదిప్పుడు మనల్నే కేంద్రీకరించి వుంది.

వీడు, గోల్డ్‌ఫింగర్ జిత్తులమారి.. అబ్బ.....!



కొరియన్ రక్షకులు! బాండ్ శరీరం గగుర్పొడిచింది. కొరియన్లు ఇలా బందీలై పని చేస్తున్నట్టు అతను విన్నాడు.

చేతులెత్తు!

మేం వెతకాలి.., ఏం పరవాలేదు.., లేకపోతే..

వాళ్ళేం చేసినా నువ్వు మెదలకుండా వుండు.


సరే రావోయ్..

ఆ మార్గం చివర ఒక తలుపు, ఆ వెనక చిరపరిచితమైన కంఠం....

లోపలికి రా మిస్టర్ బాండ్..

(ఇంకా ఉంది)

ట్రాఫిక్ కానిస్టేబుల్



ప్రజా సేవలో ట్రాఫిక్ కానిస్టేబుల్

మద్రాసు నగరం ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆకారం ఆకర్షణీయంగా ఉంటుందని అందరూ అనుకుంటారు ఎర్రటి టోపీ (కొన్నప్పుడు ఖాకీ టోపీ!), తెల్లటి యూనిఫారమ్, నల్లటి బూట్లు కంటికి నదురుగా కనిపిస్తాయి. "మనిషి ఎంత వికారంగా ఠీవిగా నుంచుంటాడు!'' అనిపించేట్లు ఉంటుంది అతని వాలకం

కాని అతని ఉద్యోగం తేలికయినది కాదు. ఎంతో



రచన-'యూ'
ఫొటోలు: ప్రభాకర్

ఫరవాలేదు, ఎవరూ చూడ్డంలేదు...!



నియమాలు తెలిసినా
నిత్యమూ ఇంతే..!

సహనం, ఓపిక కావాలి దానికి! అతివేగంగా కార్లు నడిపి ఇతరులకి ప్రాణాపాయాన్ని కలిగించేవారూ, ముందువెనుకలు చూసుకోకుండా రోడ్డుకి అడ్డంగా నడిచే వారూ—వీరి బాధ ఇంతా అంతాకాదు. అయితే నేమి, అందరినీ గమనిస్తూ తన పని తను చూసు కోవాలి ట్రాఫిక్ కానిస్టేబుల్! ఇక నెమరు వేస్తూ రోడ్ల మీద స్వైరవిహారంచేసే గొడ్లు, జంతువుల సంగతి చెప్పనే అక్కర్లేదు..

స్వేచ్ఛగా తిరిగే జంతువుల పాట అటుంచి జట్కా కట్టే ఎడ్ల సంగతేమిటి? అసలే సందడిగా రద్దీగా ఉన్న బజార్లలో సగం చచ్చి ఉన్న వాటి బాధలు గమనించే దెవరు, వాటిని ఎప్పుడే 'రవాణా మనుష్య' లని గుమనించే దెవరు?

ఇన్ని ఒకాకుల మధ్య తన ఉద్యోగం చేసుకునే ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా ఒక మానవుడే. అతనికి విశేషమయిన సహనం ఉండాలని ఎదురు చూడటమూ అవివేకమే.

అతని పని ప్రతి ఉదయం 5—30కి మొదలవు తుంది. మద్రాసు వంటి నగరాలలో అప్పటికే రవాణా ప్రారంభం అయిపోతుంది. రాత్రి 10 గంటలకి డ్యూటీలు అయిపోతాయి. అంటే ఒక కానిస్టేబుల్ పొద్దున 5—30 నుంచి రాత్రి 10 గంటల దాకా పనిచేస్తూ ఉంటాడని కాదు. ప్రతి కానిస్టేబుల్‌కూ ఉదయం వేళ 3 గంటలూ, మధ్యాహ్నం వేళ 2 గంటలూ, సాయంత్రం వేళలో 3 గంటలూ చొప్పున డ్యూటీ వేస్తారు. సాధారణంగా ఒక పోలీసు కానిస్టేబుల్ ఒక దినానికి 8 గంటలు పనిచేయాలి. (అవసరం వచ్చినప్పుడు 24 గంటలు పనిచెయ్యాలి.) వారానికి ఒకరోజు 'ఆఫ్' ఉంటుంది.

ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉద్యోగం కష్టమయినదే. అతని పని తేలిక పరచాలంటే ప్రజల సహకారం అవసరం. డ్రయివర్లు, పథికులు, సైకిలు తొక్కే వారు, బళ్లవాళ్లు, జంతువులని పెంచుకునేవారూ అందరూ రోడ్లమీద రవాణా మన జీవితంలో ఎంత ముఖ్యమయిన పాత్ర వహిస్తున్నదో తెలుసు కోవాలి! ●



అదంతేకపోతే...,
రోడ్డంతా మా ముగ్గురిదే..!


పుష్పం వంటి తాజాగా
సువాసనగా...
for natural freshness
Himalaya
Bouquet
Talcum Powder
వుండుటకు హిమాలయా బుకే
టాల్కమ్
పుష్ప-పరిమళం, గంటల కొలదీ, అలాగే మీరు వుండగోరుదురు. సహజం! కాబట్టి? మీకు అత్యుత్తమ టాల్కమ్ పౌడర్ కావలెను. పట్టు వంటి మృదువైనది, మరి ఎన్నుకొనుటకు 5 ఆకర్షణీయమైన సువాసనలలో వున్నది. ప్రతిదీ మనోహరమైన రంగుల డబ్బీలో గలదు. కాబట్టి? హిమాలయా బుకే టాల్కమ్ అడగండి. సహజమే!
5 వివిధ సువాసనలలోగల టాల్కమ్ ఇది ఒక్కటే
...ప్రతిదీ వేర్వేరు ప్రత్యేక డబ్బిలో గలదు
హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారి శ్రేష్ఠమైన ఉత్పత్తి



ఆ వీధిలో మూడిళ్ళల్లోవున్న మూడు గడియారాలు ఏక కంఠంతో 'ఏడు' అన్నాయి.

సీతమ్మకు నిజంగా ఏడుపొచ్చింది

కాలసూచన విషయంలో ఏ రెండు గడియారాలకూ ఐకమత్యం కుదరనప్పుడు మూడు కలిపి ముడివేసుకోడం ఆమెకు వింతగా కనిపించింది అంతే కాదు ఇదేదో మంచికి కాదన్న అనుమానం కూడా కలిగింది

నిజం—సీతమ్మ మనసు అల్లకల్లోలంగావుంది. ఎటుచూసినా, ఏది తల్చుకున్నా, ఏది వినిపించినా ఆమె మనసులోవుండే అనుమానం మరింత దృఢతరం కాసాగింది.

ఆ అనుమానం?. . . .

అవును ఆ యింట్లో తను ఓ వంటలక్క—కాదు—పనిమనిషి—కాదుకాదు—రెండు పూట్ల తిండి కోసం మొహం వాచిన బానిస—సీతమ్మ కళ్ళల్లో గిరుక్కున నీళ్ళు తిరిగాయి ఆరింటికే ఆఫీసు నుండి రావలసిన చలపతి ఇంకా ఇల్లు చేరుకోలేదు

ఎందుకు రావాలి?

పెళ్ళాంతో హాయిగా భరతనాట్యం చూసేందుకు పోయుంటాడు.

తనకూ ఎంతో కాలంనుండి ఒక్కగా నొక్క నాట్య ప్రదర్శన చూడాలనుంది. కాని తన మొర విన్నదెవరు? ఆశ ఆరని దీపంలాంటిది. అందుకని అడిగి చూసింది.

'అత్తయ్యా! మీకంత కోరికగావుంటే తప్పకుండా వెళ్ళండి. ఉన్నది ఒక్క టిక్కెట్టు ఆయన కూడా నా కోసమని మానుకున్నారు మీరు ఒంటరిగా వెడతానంటే నా కభ్యంతరంలేదు' అంది మాలతి.

సీతమ్మ కా సమాధానం చురుక్కున తగిలింది.

'ఏదో ఆపేక్షతో 'రండి—మనం యిద్దరం వెడతాం. ముందేమిమ్మల్ని అడుగుదామనుకున్నాను కాని మర్చిపోయాను అక్కడకు వెళ్ళాక మరో టిక్కెట్టు కొనుక్కుందాం' అనివుంటే ఎంత బాగుండేది?

ఆ మాటల్తో తను అమృతం తాగినట్టు ఆనందించి 'ఏదో ముసలిముండను నా కెందుకమ్మా' ఏదో వేడుక కన్నానుగాని ! అని వూరుకునేది అంతటిలో ఆగలేదు

ఏదో విచిత్ర మృగాన్ని చూసినట్టు—ఆకాశంలో నక్షత్రాలు గంతులేసినట్టు

రామం చప్పట్లుచరచి గెంతులేస్తూ 'బామ్మ డాన్సు చూస్తుందట! ఇది ఎనిమిదో వింత! ముసలాళ్ళు డాన్సు చూడటం ఇదే మొదటిసారిగా వింటున్నా సోదర సోదరీమణులారా!. అందరూ వినండి! అరవయ్యేళ్ళ అవ్వ పాతికేళ్ళ పడుచైంది బామ్మా! ఎంచక్కా రాములోరి గుడికెళ్ళి దండం పెట్టు—పుణ్యంవస్తుంది' అనరిచాడు.

తనకు అందరూ ఎదురే .తన మనసులోవుండే బాధను గ్రహించి ఆ కోడలు తప్పు తెలుసుకుందీ? లేదు కొడుకుతో కదలిపోయింది. ఆ గుంట వెధవ పోతూ పోతూ గజం నాలుక అటు యిటూ ఆడించి వెక్కిరించి మరీ పోయాడు. వాడికూడా తనెంత లోకువైంది!

... .ఎప్పుడో ఒకసారి తన మరిది కొడుకు అలా చేస్తే వీపు చిట్లకొట్టింది. ఆయనకూడా తన శిక్ష సమంజసమైందని తీర్పిచ్చారు. కాని ఇప్పుడు? తన మాటలు గాలి మాటలు

సీతమ్మ దేవుడి గదిలో దీపం వెలగించింది. చీకటి కరగి మనసులో గడ్డ కట్టుకుంది ఏడుకొండలవాడి పటంకేసి చూసింది. కొంటెగా నవ్వాడు.

తను తిరుపతికి వెళ్ళాలని ఎంతకాలంగా అనుకుంటోంది! ఈ ఒక్క కోరికను అర్చేవారూ తీర్చేవారూ ఎవరు? చలపతి ఒకోసారి ఒకో సాకు చెప్తాడు అన్నీ దొంగసాకులు

ఒకసారి తనకు శెలవు దొరకదంటాడు.

మరోసారి పెళ్ళానికి వంట్లో బాగా లేదంటాడు.

ఇంకోమాటు చలి కాలమంటాడు

ఇలా డొంక తిరుగుడుగా చెప్పేదానికంటే, కుండబద్దలు కొట్టినట్టు 'కాదం'టే ఎంత బాగుండేది!

ఏడున్నరైంది. ఇంకా చలపతి రాలేదు. ఎందుకొస్తాడు? పెళ్ళాన్ని డాన్సుకు పొమ్మని, తను మాత్రం ఇంటి దగ్గిరుండగలడా? ఆఫీసునుండి తిన్నగా వెళ్ళుంటాడు. ఇదంతా ఓ చక్కటి నాటకం.

సీతమ్మ అరుగుమీద వచ్చి కూర్చుంది.

అప్పుడే సినిమాకు వెడుతున్న లక్ష్మమ్మ కనిపించి పలకరించింది.

'ఏవమ్మా . .వస్తావా సినిమాకు? నా కెందుకురా అంటే వాడు వింటాడా? నువ్వు లేకపోతే నే నా వెళ్ళనంటాడు వాళ్ళెలాగైనా ఒప్పించవచ్చునుకాని ఆ కోడలు? . .అమ్మ నాయనోయ్ ఆవిడ ఆపేక్ష నన్ను చంపేస్తుందంటే నమ్ము. .. రాములవారి కథట వచ్చి తీరాలని మొండి పట్టు—మరి నీమాట?'

సీతమ్మకు తనివి తీర ఏడవాలనిపించింది. అతి కష్టంమీద పొంగివస్తున్న కన్నీటి నాపుకుంది.

'అదృష్టవంతురాలివి! చెప్పినట్లాడే కొడుకూ కోడలు—అంతకంటే ఏం కావాలి? . ...నా గతి చూడు. నన్నింట్లో కాపలాపెట్టి అందరూ డాన్సుకు పోయారు. నేను వస్తానంటే ఆ చిన్న

వేళవ కూడా ఎగతాళి చేస్తున్నాడు.....మరేపోవం. మీకు ఆలస్యమవుతూంది లేట మొదలెట్టేస్తారు. త్వరగా వెళ్ళమ్మా!'

'అవును పాపం! ఎప్పుడూ ఏదైనా పనిచేస్తూనే వుంటావు. ఇలా తీరిగ్గా కాళ్ళు చాపుకుని కూర్చోటం నేను చూసి ఎరుగను' అంటూ లక్ష్మమ్మ కదిలింది సీతమ్మ ఆలోచనలో పడింది.

ఉదయం అయిదు గంటలకు నిద్రలేవాలి. 'ఎందుకత్తయ్యా! ఇంత పెందలాడే లేస్తారు?' అని కోడలంటుంది అదంతా పైపైకే. లోపల అంతా కల్మషమే! చలపతి కూడా పెళ్ళాం మాటలు చిలకలా పలుకుతాడు పది గంటల దాకా వూపిరాడనంత పని- వోగంట రామజపం చేసుకునేసరికి కళ్ళు తిరుగుతాయి రెండు మెతుకులు తినేసరికి మధ్యాహ్నం టిఫినుకోసం ఆరాటాలు—ప్రయత్నాలు. సాయంత్రం మళ్ళీ వంట కోడలికి కాస్త పనిచేస్తే ఆయాసం ముంచుకొస్తుందట—అంత సౌగస్తైన, సున్నితమైన మనిషి. అప్పుడప్పుడు చలపతి పనిమనిషిని పెట్టుకోమంటాడు. ఆమెగారు వెంటనే గ్రామఫోను రికార్డులా 'అబ్బే! ఎందుకు లెద్దురూ! పనిమనిషి తిన్నగా పనిచేయదు అంతా మళ్ళీ నేనే చేసుకోవాలి. ఎలాగో మేమే సర్దుకుంటాం' అంటుంది

ఇదంతా చాకచక్యంతో ఆడుతున్న నాటకం. వీళ్ళ మాటలు విని మోసపోవానికి తను పసిపిల్లా?

ఆలోచించేకొలది సీతమ్మ మనసు మరింత క్షోభ పడింది.

ఏడాదికోమాటు ఏ పుణ్యక్షేత్రానికైనా వెడితే కాస్త మనశ్శాంతైనా వుంటుంది కాని రామేశ్వరానికి తీసికెళ్ళమనటం లేదు ఇంత దగ్గర్లోనున్న తిరుపతికి కూడా తీసికెళ్ళనంటాడు

మూడు గడియారాలూ ఒకసారి ఏడింటి కొట్టాయి

'పాడు నాటకం ఏమీ బాగాలేదు' అనుకుంది సీతమ్మ.

చలపతి వచ్చాడు

అతన్ని చూడగానే ఆమె కోపంతో జారిపోయింది. కన్నకడుపు కదా మరి—పొద్దుట్నుంచి అలసి సొలసిన శరీరం—ఇంత సేవచేసిన మధనంతా మరచి స్నానం చేసొచ్చిన కాఫీ అతని ముందు వుంచింది

'డాన్సుకు వెళ్ళారా?' అన్నాడు కాఫీ తాగుతూ.

సీతమ్మ సమాధానం ఇవ్వలేదు

చలపతి ఆశ్చర్యంగా తల్లి ముఖంకేసి చూశాడు. తుఫానుకు ముందు ప్రశాంతంగా వుండే సముద్రం జ్ఞాపకం వచ్చింది

మౌనంగా బాత్‌రూంవేపు దారి తీశాడు.

* * *

రాత్రి తొమ్మిదిన్నర.

చలపతి భోజనం ముగించి పేపరు చదువు కుంటున్నాడు సీతమ్మ అతని ఎదురుగా గోడ కానుకుని కూర్చుంది. లక్ష్మమ్మ సాయంత్రం అన్న మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆమె మనసు, కొండలు, నదులు, లోయలు, అడవులు దాటి వో విశిష్ట ప్రదేశానికి చేరుకుని స్థిరంగా నిలిచింది

'అయితే మరి తిరుపతి ఎప్పుడ్రా వెళ్ళడం?' అంది.

సీతమ్మా-కొడుకూ...

'త్వరలోనే వెడదాం.' అన్నాడు పేపరు చదువుకుంటూ.

'ఈ మూడేళ్ళుగా అదేమాట అంటున్నావు. నేను బతికుండగా నువ్వు తీసికెడతావన్న నమ్మకం నాకులేదు నేనుపోయాక నీకా బుద్ధి పుట్టినా మాత్రం ఏం లాభం?'

చలపతి తెల్లబోయాడు సీతమ్మ ఇంత కటువుగా మాట్లాడగా అతనెప్పుడూ వినలేదు

'అదేమిటమ్మా? ఇవేళ చిత్రంగా మాట్లాడుతున్నావ్? పరిస్థితులు కొంచెం ఆలోచించవేం. నాలుగు నెలల క్రితమేకదా దానికి వంట్లో బాగా లేదని సెలవు తీసుకున్నాను—మళ్ళీ ఇప్పుడు సెలవెలా దొరుకుతుంది. ఏడు కొండలవాడు అనుగ్రహించినప్పుడు తప్పకుండ వెడదాం—'

సీతమ్మ ఏదీ విన దలుచుకోలేదు ఆమె ఎప్పుడో వో నిర్ణయానికి వచ్చేసింది

'చూడు నాయనా! ఈ అడ్డంకులు తీరుతాయని నేననుకోను ఏదో ఒకటి అడ్డొస్తూనే వుంటుంది కనక నేను ఒంటరిగ వెడతామను కుంటున్నాను'

చలపతి తుళ్ళిపడ్డాడు

'నీకేమైనా మతిపోయిందా? పక్కవూరి కన్నాడా వెళ్ళే ధైర్యం లేదు అంత దూరం ఒంటరిగా వెడుతుందట!'

సీతమ్మ చలించలేదు

'ఎంతమంది వెళ్ళటంలేదూ? నలుగురితో పాటు నేనూ—నేను పసిపిల్లనా? నా ఒంటిమీద నగలున్నాయా? నాకేం భయం?'

'అందుకు నేను ఒప్పుకోను ఏది కాని [illegible]ంది నువ్వు వెళ్ళి పడుకో వాళ్ళు వచ్చేదాకా నేను మేలుకుంటానులే'

చలపతి మళ్ళీ పేపరు చదవబోయాడు

అంతే-సీతమ్మ విరుచుకుపడింది.

'నువ్వు ఒప్పుకునే దేమిట్రా? నీ దగ్గర జీతానికున్న నౌకర్ననుకున్నావా? అవును అదీ నిజమే అంతా నాకు తెలుసు. నేను ఒక్కరోజు ఇంట్లో లేకపోతే ఈ చాకిరీ అంతా ఎవరు చేస్తారు? పాపం! నీ పెళ్ళాం పళ్ళు పంచవలసి వస్తుందని నీ భయం ఇంకా నావల్ల కాదు నేను రేపుదయం బండికే వెడుతున్నా ఎవరువద్దన్నా ఆగేదిలేదు."

చలపతి మాట్లాడలేదు తల్లి మనసు అగ్ని పర్వతం లాంటిదని అతనెప్పుడూ వూహించలేదు.

'సరే! నీ యిష్టం—నిజం నిలకడమీదకాని తెలియదంటారు. ఇప్పుడు నేనేం చెప్పినా నీకు అర్థం కాదు నువ్వు చూస్తున్న కోణంలోంచి అన్నీ నీ అభిప్రాయాల కనుగుణంగానే కనిపిస్తాయి!'

'నేను రెండుమూడు రోజుల్లో తిరిగి వస్తా నమకోకు ఆ ఏడుకొండలవాణ్ణి తనివితీరా తలచి నెంరజాలు పోయాక వస్తాను!'

డాన్సుకు వెళ్ళిన తల్లి కొడుకూ తిరిగివచ్చారు.

సీతమ్మ నిర్ణయం విన్న మాలతి ఆశ్చర్యపోయి తేరుకుని 'అదేమిటత్తయ్యా! ఒంటరిగా ఎలా వెడతారు?......నేనూ వస్తాను' అంది.

'నేనూ వస్తాను......' అంటూ రామం ఎగిరి గంతులేశాడు.

సీతమ్మకు అందర్నీ నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది వో నెలరోజులైనా ఈ రొంపిలోంచి బయటపడి హాయిగా వుందామనుకుంటే, జలగల్లా వీళ్ళెందుకూ? .. తన వెంట ఎవరూ రానక్కర్లేదని గర్జించింది

* * *

సీతమ్మ తిరుపతి స్టేషనులో అడుగు పెట్టే సరికి ఒంటిగంట దాటింది ఎంతకాలం నుండో కళ్ళారా, మనసారా చూసి ఆనందించాలని తహతహ లాడిన ఏడుకొండలవాడు తన కెంతో సన్నిహితుడైపోయాడు. ఆమె మనసు భక్తి పారవశ్యంతో పొంగి పొరలింది నెట్టు మధ్యాహ్నమైనా నిర్మలమైన చల్లగాలి స్వాగతం పలికింది అంతా కొత్త—సీతమ్మ స్టేషనులో అలాగే నిలబడి నాలుగు వైపులా చూసింది.

'టికెట్ ' అన్నాడు టి సి

సీతమ్మను చూడగానే ఆమె టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసిందన్న భావం అతనికి కలిగి నట్టుంది

దూరంగా కనిపించే కొండలవంక చూస్తున్న సీతమ్మకు అతనిమాట వినిపించలేదు

'టికెట్ చూపించమ్మా' అని గదమాయించాడు.

'అలా అరుస్తావెందుకు నాయనా? .. నాకేమన్నా చెముడనుకున్నావా? దేవుడి దర్శనానికోసం ఇంతదూరం వచ్చిన దాన్ని నీ ముష్టి అయిదు రూపాయల టిక్కెట్టు లేకుండా వస్తాననుకున్నావా?'

రెండు నిముషాలు వెతికినా ఆ సంచీలో కవరు కనిపించలేదు సీతమ్మ కంగారుపడిపోయింది. చలపతి పన్నెండున్నర రూపాయలు, ఆ టిక్కెట్టు కవరులో పెట్టి సంచీలో భద్రపరచింది. ఎందరిసార్లు వెతికినా ఫలితం శూన్యం.

రైల్లో నమ్మింటే ఎవరో కాజేసి వుంటారు. ఇప్పుడేం దారి?... .

'ఇంక చాలు ఈ నాటకం కట్టిపెట్టి జరిమానాతో సహా డబ్బు చెల్లించు. టిక్కెట్టు లేకుండా రావటం చాలక మర్యాదస్తురాల్లా మాటలు కూడానా?' అని హుంకరించాడు

తనకు జ్ఞానం వచ్చినప్పట్నుంచి సీతమ్మ ఈనాటివరకూ ఇలాంటి నిష్ఠూరమైన మాటలు పడలేదు ఆమెకు ఏడుపు ముంచుకొచ్చింది. కాని ఏడుస్తే మాత్రం ఆ కవరు ఎగిరొస్తుందా? మరోసారి సంచీ అంతా గాలిస్తే ఆ కవరు దొరికింది విజయగర్వంతో టి సి కేసి చూసి, 'ఇదుగో! నీ దిక్కుమాలిన టిక్కెట్టు' అనబోయి మూర్ఛపోయినంత పని చేసింది. అది ఖాళీ కవరు! ఆ దొంగ తనమీద దయతల్చి ఉన్నదంతా దోచుకుపోవటం న్యాయంకాదని, కవరు మాత్రం వదిలిపోయినట్టున్నాడు.

'ఏమామ్మాయ్! .. ఈ రైలు నీ సొంతమన్నట్టు ప్రయాణం చేయటం చాలక నా టైమంతా వేస్టు చేస్తున్నావు డబ్బు ఇస్తావా, లేక జైలుకు పంపించమంటావా?'

టి. సి. కి సహనం నశించింది. ఒకవేళ ఈ ముసిలాండ పి ప్రదేశాలన్ను అనుమానం కూడా కలిగిందేమో?

'వెంకటేశ్వరస్వామీ! నన్ను నడిసముద్రంలో ముంచేశావు ఒకవేళ ఇతను నన్ను కనికరించి వది లేసినా ఇల్లు చేరుకుని కొడుకూ కోడలి మొహాలు ఎలా చూడగలను?' అని సీతమ్మ లోలోన కుమిలి పోయింది.

'నా దగ్గర పైసాకూడా లేదు నా దగ్గరున్న రెండువందలూ ఎవరో దొంగలించారు'

టి. సి. అట్టహాసంగా నవ్వాడు.

'ఆమె ఎంతివ్వాలండి?'

ఆ మాటలు విని ఆశ్చర్యపోయి ఇద్దరూ వెనక్కి తిరిగిచూశారు.

పొడుగ్గా, నాజూగ్గా, అందంగా, ఆకర్ష ణీయంగా వో యువకుడు పంట్లాం జేబుల్లో చేతులు పెట్టుకుని ఠీవిగా నిలబడ్డాడు నవ్వుతూ. అతని టెరిలీన్ పాంటు, చొక్కా, తళతళ మెరిసే బంగారు వాచీ—వైనల్ చెయిన్, ఖరీదైన కాన్వాస్ చెప్పులు అన్నీ అతని ఆర్థికౌన్నత్యాన్ని ఎత్తి చూపాయి.

'మాట్లాడరేమండి?......ఆవిడ ప్రయాణ బడ లికలో ఎంతో బాధపడుతోంది. అనవసరంగా నిల బెట్టి కాలయాపన చేయకండి—'అంటూ పర్సు తీశాడు. టి. సి. రావలసిన డబ్బు తీసుకుని రసీ దిచ్చాడు.

తన మొరాలకించి తిరుపతి వెంకటేశ్వరుడే ఈ యువకుడి రూపంలో వచ్చాడని సీతమ్మ నిర్ణ యించుకుంది. అతని ముందు సాష్టాంగ పడాలను కుందికూడా.

'రండి పోదాం!....పాపం, మధ్యాహ్నం భోజనం కూడా చేసివుండరు!'

'నేనో ప్రశ్న అడగాలనుకుందిగాని, ఒక్క మాటైనా పెగలలేదు.

'ఎవరు నాయనా నువ్వు?..... ఆ దేవుడే నన్ను కాపాడాడు.....' అంది చివరికి.

ఆ యువకుడు తీయగా నవ్వాడు.

'అలాంటి దేమీ లేదండి...... భారతదేశంలో కోట్ల జనాభాలో నే నొకణ్ణి. ఇవేళ కాలేజీకి సెలవు. ఏం తోచక ఇలా వచ్చాను....

ఆ టి. సి. సింహంలా గర్జించడం, మీరు గజగజ వణకటం చూశాను. నా వల్లనైన సాయం చేద్దా మని ......'

అయస్కాంతం లాగినట్టు అతన్ననుసరించింది. చేతిలోవున్న సామాను మాయమైంది. రెండు రోజులుండి దర్శనం చేసుకోకతప్పదు. ఎంత ఖర్చైందీ తెలుసుకుని ఆ అబ్బాయికి మణి ఆర్డరు చేసేస్తే సరి. ఆ పరిస్థితుల్లో అతని సాయం తప్పించి మరో గత్యంతరంలేదు.

* * *

సీతమ్మ ఆ అబ్బాయి పేరడిగి తెలుసుకుంది. రమణట—నిజంగా ఆ తిరుపతి వెంకట రమణే! సత్రంలో గది కుదిర్చాక వంటకావలసిన వెచ్చా లన్నీ తెచ్చాడు. వంట పనిలో సాయపడ్డాడుకూడా

తృప్తిగా భోజనం చేశాక సీతమ్మ రమణ గురించి అడిగి తెలుసుకుంది. అతనిది కాకినా డట. ఇక్కడి కాలేజీ లెక్చరరుగా ఉంటున్నాడట ఇంకా సంసారసాగరంలో మునగలేదు గట్టుమీద నిలబడి మునిగి తేలుతున్న వాళ్ళనుచూసి ఆనం దిస్తున్నాడు ఉన్న ఒక్క వాలికతో అతన్ని అది శేషువులా పొగిడేసింది

'ఇవేళ్టికి విశ్రాంతి తీసుకోండి రేపుదయం దర్శనానికి వెడదాం.

'మరి నేను వస్తాను కాలేజీలో కొంచెం పనుంది!'

'అలాగే నాయనా!......పొద్దున్నే వచ్చావంటే కాస్త సాయంగా వుంటుంది!'

'మీరేం దిగులుపడకండి. మీ అబ్బాయిదగ్గర మిమ్మల్ని సురక్షితంగా అప్పగించేవరకు నాకు కంటి మీద కునుకురాదు!' అంటూ పెద్దగా నమస్క రించిపోయాడు.

రాత్రి ఎనిమిదైంది. వద్దంటున్నా రమణ కొనిచ్చిన పళ్ళు తిని నిద్ర కుపక్రమించింది. అప్పటికాని ఆమెకు కొడుకు, కోడలు జ్ఞాపకానికి రాలేదు. వాళ్ళు కూడా వెంటవుంటే ఎంత బాగుం డును!

ఆ రామంగాడి అల్లరి అసహనీయమైనా, వాంఛనీయమనిపించింది...... సీతమ్మ ఉలిక్కి పడింది. ఏమిటీ విపరీతమైన ఆలోచనలు? అన్నీ మరిచి, కొంత కాలమైనా నిర్మలత్వంతో నిండిన మనసుతో నిండుగా వుండాలనికదా, తను తెగించి వచ్చింది!

రామం ఏంచేస్తున్నాడో?......ఏమో! ఏం చేస్తే తన కెందుకు?

'బామ్మా!......రాములారు అడవికి పోవటంలో కథ ఆపేశావు.......తరువాత?' అని ప్రశ్నార్థ కంగా చూసే డు అవునవును, ఆ కథ తనింకా పూర్తి చేయలేదు ఆమెకు తనమీద ఆకాశమంత కోపం వచ్చింది మనసును పీకనొక్కి దాచివుంచి నిద్రాదేవిని, రారమ్మని ఆహ్వానించింది

ఆ ఎర్నాడు—

ఏడు కొండలవాణ్ణి తనివితీరా చూడ్డానికి, ఆ దివ్య మంగళాకారుడి మోహనరూపంలో మైమరచి శాశ్వతంగా సన్నిధిలో నిలబడ్డానికి తనొక్కతే భక్తురాలా ఏమిటి? మహా ప్రవాహంలా జనం వచ్చి పడుతున్నారు. ఒక్క నిమిషం కూడా పూర్తిగా దర్శనం దొరక్కపోయినా, తళుక్కున మెరసిన మెరపు ఆమెలోని అజ్ఞానాంధకారాన్ని అంతరింప జేసినట్లనిపించింది.

అక్కడ ప్రకృతి సౌందర్యం ఆత్మకు పంచ రంగులు పూసింది.


'ఇక సాయంత్రం కనిపిస్తానండి ' అన్నాడు రమణ.

'పాపం!..... నాకోసం చాలా శ్రమపడుతున్నావు. ఇవేళ కూడా కాలేజీకి సెలవేనా?'

'మీరలా మాటి మాటికీ అంటే నాకు చెడ్డ కోపం వస్తుంది సుమండి ఇది నా కర్తవ్యమని ముందే చెప్పాను.....ఇక్కడే వుండనుకాని, టైముకు వెళ్ళకపోతే హోటల్లో మంచి కూరలన్నీ అయి పోతాయి. ఏ మాడు వంకాయ కూరో మొహాన పడేసి తినమంటాడు. తప్పుతుందా మరి '

సీతమ్మ నొచ్చుకుంది ఎంతమంచి అబ్బాయి .. పెళ్ళి చేసుకుంటే అడ్డమైన తిండి తినక్కర్లేదు.. వద్దు వద్దు......అతని తల్లి హాయిగా వుండాలంటే కోడలు రాకూడదు.

'రమణా......ఈ పూట ఇక్కడే తిండువు



మిల్లర్ సైకిల్ డైనమో లైటింగ్ సెట్టులు

రాత్రిపూట సురక్షితంగా సైకిల్ త్రొక్కడాన్ని సాధ్యం చేసినవి




మిల్లర్ సైకిల్ డైనమో లైటింగ్ సెట్టులు ముందు 30 గజాల దూరం వరకు వెలుతురు ప్రసారింపజేస్తూ వుండగలవు. సమర్ధవంతంగా, నమ్మకంగా పనిజేయడానికి మిల్లర్ సైకిల్ డైనమో లైటింగ్ సెట్టులనే కోరండి.

ప్రత్యేకతలు :

● తక్కువ వేగముతో నడిచేటప్పుడు కూడా వెలుతురు తగ్గకుండా వుండడానికి ఎనిమిది పోల్ మాగ్నెట్ రోటార్ ● డైనమో ఒకేరకంగా స్థిరంగా పనిచేసేఏర్పాటు. వేగంగా పోయినా బల్బు మాడిపోదు ● వెలుతురు బాగావుండడానికి వనరుగా వాక్యూమ్ మెటలైజ్డ్ రిఫ్లెక్టర్ ● వాతావరణం ఎగుడు దిగుడులను తట్టుకోగల ఏర్పాటు ● పగలకుండాను. గీరలుపడకుండా నుండగల '' డైయాకోన్ '' ఫ్రంట్ లెన్సు.

మిల్లర్ ల్యాంప్ వుంటే మీరు సర్వదా సరియైన దారిలోనే వుంటారు

95 సంవత్సరాలకు పైగా పేరు ప్రఖ్యాతులు గాంచిన హెచ్. మిల్లర్ & కంపెనీ లిమిటెడ్ బర్మింగ్‌హామ్, యునైటెడ్ కింగ్‌డమ్‌వారి సహకారంతో ఉత్పత్తి చేస్తున్నవారు.



టిఐ మిల్లర్ లిమిటెడ్ మద్రాసు-1

వర్క్సు : అంబత్తూరు, మద్రాసు-53

హెచ్. మిల్లర్ & కం, లి, యు కె వారి రిజిస్టర్డు ట్రేడ్ మార్కుకు ఇండియాలో ఉత్పత్తిదారులు, మిల్లర్ లి. మద్రాసు-1, రిజిస్టర్డ్ వాడకందార్లు.

(TI) వారి సంస్థలలో ఒకటి.

FDS-TIM-688TE A

లావి... ..మీకు వచ్చిన కబొరలన్నీ చేస్తాను—'

అతను ఏదో అనబోయాడుకాని, సీతమ్మ అధికార ధోరణిలో తుంచివేసింది.

'మా అబ్బాయిలా నువ్వు కూడా దొంగ సాకులు చెప్పటంలో ఆరితేరినవాడిలా కనిపిస్తున్నావు......నా మాట నువ్వు విని తీరాల్సిందే!'

రవణ నవ్వుకున్నాడు.

'ఇప్పటికి పది పన్నెండుసార్లు మీ అబ్బాయి గురించి, పరాయివాడినైన నా ముందు ఏవేవో ఫిర్యాదులు చేశారు. ఇంతకూ ఆయన చేసిన తప్పేదిం?'

'పరాయివాడా?......ఎవరన్నారు? నువ్వు నా కన్న కొడుకుకంటె మనసుకు నచ్చావు నాయనా.... నీలాంటి కొడుకునుకన్న మీ అమ్మ అదృష్టవంతురాలు.'

'ఇంతకూ మీ అబ్బాయి చేసిన తప్పేదనేదో చెప్పారుకారు.......మీ కభ్యంతరంలేకపోతే చెప్పండి చాలు. మీ కుటుంబ విషయంలో జోక్యం కలుగజేసుకునే అధికారం నాకు ఆపాదించుకునే అవకాశంలేదని నాకు తెలుసు.......మనిషి మనసు బిగురుమట్టిలాంటిది. మన ఆలోచనలు, కోపతాపాలు, సుఖదుఃఖాలు అన్నీ ఆ మట్టితో మనం తయారుచేసే రూపు రేఖలమీద ఆధారపడివుంటాయి. కొన్ని పరిస్థితుల ప్రభావంగా, ఫలానా పుల్లయ్యగారిమీద నాకు మహా చెడ్డ కోపం వచ్చిందనుకోండి. తత్ఫలితంగా నా మనసులో అవే పరావర్తనలు జరుగుతాయి. అప్పట్నుంచి, మంచి, చెడు తెలియవు. ఒక గంటపోయాక స్థిమితంగా ఆలోచిస్తే ఆ పరిస్థితులు ఎంతవరకూ నా మనసులో ఏర్పడే అభిప్రాయాలకు దోహదం చేశాయని కాని, పుల్లయ్యగారి ప్రవర్తన సరైందా కాదాని తెలుస్తాయి. నిజమంటారా?......'

'అమ్మ నాయనోయ్!......ఏవిటో అనుకున్నాను. ఇంత చిన్న అబ్బాయి పెద్ద మనస్తత్వవేత్తలా మాట్లాడుతున్నాడు!' అని సీతమ్మ ముక్కుమీద వేలేసుకుంది.

ఆమె మనసులో వున్న బాధంతా విన్నాక రవణ విరగబడి నవ్వాడు

సీతమ్మ ఉడుక్కుంది.

'మీ యింట్లోవున్న ముగ్గిరితోనూ మీకు జట్టు కలవలేదంటారు.......ముందు మీ అబ్బాయి సంగతి తీసుకుందాం. మిమ్మల్నిక్కడకు తీసుకు రావాలంటే, సెలవుదొరకాలా అక్కర్లేదా? మీరే చెప్పండి!'

'వాడు ప్రయత్నించకుండా, సెలవు తనంతట తను వచ్చిపడిపోతుందా నాయనా?'

'ప్రయత్నించలేదని మీకెలా తెలుసు?..... తెలుసుకుందుకు మీరూ ప్రయత్నించలేదు. అంతా వూహాగానం. నిజానిజాలు తెలుసుకోకుండా ఏవో నిర్ణయాలు చేసుకుంటున్నారు......ఇక మీ కోడలు— మీచేత ఇంటిపనంతా చేయిస్తోందన్నారు. వంట్లో శక్తి వున్నంతవరకు తన కుటుంబాని కోసం కష్టపడితే తప్పేముంది?—అందులోవున్న తృప్తి, ఆనందం, మరెక్కడా లభ్యంకాదు......కానీ, మీరు ఇంట్లో ఏ పనీ చేయనక్కర్లేదని, పూర్తిగా విశ్రాంతి కావాలని ఎప్పుడైనా ప్రకటించారా?.... మీ అభిప్రాయం తెలిశాక కూడా వాళ్ళు మిమ్మల్ని

సీతమ్మ-కొడుకూ..

హింసిస్తే మీరన్నది నిజమని ఒప్పుకుంటాను.....'

'ఉపన్యాసం అయిందా నాయనా?' అని సీతమ్మ అడ్డుపడింది.

'కాస్త ఓపిక పట్టండి. ఒకటి రెండు పాయింట్లుమాత్రం బాకీ వున్నాయి. మీ కోడలు కాలుమీద కాలేసుకుని మహారాణిగారిలా రత్నసింహాసనంమీద కూర్చుని ఉత్తరువు జారీచేస్తోందంటే మీతో ఏకీభవిస్తాను. మీరన్న మాటల్నిబట్టి ఆమెకూడా మీ కెంతో సాయపడుతోంది. పైగా ఆమె శరీర స్థితి గమనించాలికదా!.....అలా అనుకుంటే అందరికంటె ఎక్కువగా కష్టపడేది మీ అబ్బాయి...... పొద్దుట్నుంచి సాయంత్రందాకా ఆఫీసులో పని చేయటంలేదా?.....అతను కూడా బానిసేనా?......

కుటుంబంలో ఒకరొకరు అర్థం చేసుకుంటే ఇలాంటి తగాదాలుండవు.

మీ మనవడు కథలు చెప్పమని వేపుకుతింటున్నారంటారు. అది అనురాగంవల్లనేకదా!....'

'చాలుబాబు నీ వుపదేశం! పెళ్లి చేసుకుని పది మంది పిల్లల్ని కన్న తండ్రిలా మాట్లాడుతున్నావు...'

సీతమ్మ ఏదో అందికాని, మనసులో కదలిక మొదలైంది.

'మరి కాళహస్తి రేపుదయం వెడదామా?...' అని రవణ ప్రసక్తిమార్చాడు.

'అప్పుడే ఏం తొందరొచ్చింది?.....నాలుగైదు రోజులుపోయాక చూద్దాం......!

'పాపం! మీ యబ్బాయి మిమ్మల్ని తల్చుకుని మీరెలా వున్నారోనని బాధపడుతూంటాడు. త్వరగా వెళ్ళటం మంచిదేమో!'

సీతమ్మ అతన్ననుమానంతో చూసింది.

'రవణా! ......నువ్వు ఎంతో మంచివాడవనుకొన్నాను. చివరికి నువ్వూ ఇంతేనా?.....నాకు సాయం చెయటం ఇష్టం లేకపోతే, ఆ మాటన్నిగా అనరాదూ?...... నీ కెందుకు శ్రమ— ఈ సాయంత్రం బయలుదేరుతున్నాలే'.

రవణ పెద్దగా నవ్వాడు.

'మా శారా!.... అప్పుడే పొరబడ్డారు.....మీ కొడుకు, కోడల్ని కూడా అనవసరంగా ఇలాగే ఆడిపోసుకుంటున్నారు......మీకు సాయపడ్డానికే కదా నేను వచ్చింది.....ఏమైనా తప్పుగావుంటే క్షమించండి. రేపుదయం తయారుగా వుండండి. ...కాళహస్తి వెడదాం. ఎల్లుండి ప్రోగ్రాం రేపు నిర్ణయిద్దాం.

నాకు కొంచెం పనుంది. ...వస్తాను. తలుపు లోపల గడియ పెట్టటం మరవకండి—'

* * *

మర్నాడుదయం రవణ వచ్చేసరికి సీతమ్మ జ్వరంతో మూలుగుతోంది. తెరచివున్న కిటికీవైపు బెదురుగా చూస్తూ వణకుతూన్న సీతమ్మను చూసేసరికి రవణకు జాలేసింది.

'నిన్న సాయంత్రం బాగానే వున్నారే!' అన్నాడు

'మానవ జీవితం ఇంతే నాయనా!.....ఎక్కడో గడియారం పన్నెండు కొట్టింది. మెలకువ వస్తే వళ్ళంతా కాలిపోతూ వుంది. మరో గంటకు వణకుమొదలు. తెల్లవారేదాకా వంటిమీది స్పృహేలేదు బాబూ!... దిక్కుమాలిన జ్వరం ఈ దిక్కుమాలినదాన్ని పట్టుకుంది......అప్పుడప్పుడు అనుకునేదాన్ని. ఏడు కొండలవాడి సన్నిధిలో ప్రాణాలుపోతే బాగుండునని. వాడు 'తథాస్తు' అన్నాడు గామాలు!'

'మీకు నీరసంతప్ప ధైర్యం లేదండీ..... అనవసరంగా బెంబేలు పడుతున్నారు. ఇక్కడి ఉక్క గాలి, వాతావరణం మీకు పడివుండదు. అందుకే జ్వరం వచ్చింది......గోరంతలు కొండంతలు చేయకండి.....డాక్టర్ని తీసుకొస్తాను. సాయంత్రానికల్లా అంతా సర్దుకుంటుంది .... ముందు కాఫీ తెస్తాను.'

'మా అబ్బాయిని రమ్మని టెలిగ్రాం యివ్వగలవా నాయనా?'

రవణ నవ్వాపుకోలేకపోయాడు.

'మీరు చాలా విచిత్రమైనవారండీ!.....ప్రతి చిన్న విషయానికి వార్థాలు తీస్తారు. మీ అబ్బాయికి మీకు పడదుగా!......అలాంటప్పుడు అతన్ని పిలవకూడదు. నేను పరాయివాణ్ణికానని మీరే అన్నారుగా!'

రవణ హోటల్నుంచి కాఫీ తెప్పించాక డాక్టరు కోసం వెళ్ళాడు.

సీతమ్మ నిజంగానే హడలిపోయింది. తన కొడుకును ధిక్కరించి రావటం తప్పేమో ననిపించింది... కొడుకూ, కోడలూ దగ్గరవుంటే ఎంత బాగుండును!........మనసుకు కాస్త ధైర్యం వచ్చేది. రవణ మంచివాడేకాని, పాపం, తనకు సపర్య చేయగలడా?.......తనకు పైప్రాయడువస్తే?.... అను పట్టి పిలికిపందని కోడలు అప్పుడప్పుడు హేళన చేసేది.

సీతమ్మకు ఓ ఉదంతం జ్ఞప్తికొచ్చింది. ఏడాది క్రితం తనకోమాటు జ్వరం వచ్చింది. అయిదారు రోజులదాకా తగ్గలేదు. చలపతి సెలవుపెట్టి ఎప్పుడు తన దగ్గరే వుండేవాడు.....మాత్రం?

అపర్ణకూడా సపర్యలు చేసింది. ఒక్కమాటైనా విసుగు—కళ్ళు చిట్లించుపులేవు. నవ్వుతూ ఆప్యాయత ఒలకబోసింది. ఆ కుర్రవెధవ మాత్రం? తనకోసం పుస్తకాల్లో కథలు చదివేవాడు. ఆ పసి హృదయానికి తెలిసిన దింతే!

బామ్మను సంతోషపెట్టాలన్న అభిలాష— పక్కింటి వెంకమ్మకు జ్వరంవచ్చి నాలుగురోజులైనా తిరుగుముఖం పట్టకపోతే ఆమె కోడలు ఇక తనవల్ల కాదని, మొగుడితో మొగాడిలా పోట్లాడి ఆస్పత్రికి పంపించేసింది.

వెంకమ్మ మరి తిరిగిరాలేదు.

రవణన్నట్టు ఎవరి కుటుంబ క్షేమంకోసం వారు పాటుపడటం బానిసత్వం ఎలా అవుతుంది? ఒకవేళ నిజంగానే చలపతికి సెలవు దొరకలేదేమో! బూట్ల చప్పుడు విని సీతమ్మ ఆలోచించటంమానుకుంది.

డాక్టరు పరీక్షచేసి 'భయపడ్డానికేంలేదు, మానసికంగా బాధపడుతున్నట్టున్నారు.......ఈ మాత్రలు వేసుకోండి. ఇంజక్షనిస్తాను. వాతావరణం మార్పువల్ల వచ్చిన జ్వరం' అన్నాడు.

రవణ డాక్టరుకు కృతజ్ఞత తెలియజేసి సీతమ్మకోసం అక్కడేవుండిపోయాడు.



సీతమ్మా-కొడుకూ...

అనుకున్నట్టు సూర్యోదయానికి సీతమ్మ మళ్ళీ మామూలు మనిషైంది సుడిగాలిలా వచ్చిన జ్వరం అలాగే తిరిగిపోయింది

'జ్ఞానోదయం కోసం వచ్చిపడిన జబ్బు—' అనుకుంది సీతమ్మ

'మరి కాళహస్తి ఎప్పుడు వెళదాం?' అడిగాడు రవణ

'ఇంక నేను వెళ్ళేది తిన్నగా ఇంటికే' రవణ తెల్లబోయాడు

'అదేమిటి? ఈమాత్రం జ్వరానికే హడలి పోతున్నారు? ఇంతదూరం వచ్చాక చుట్టు పక్కలవున్న పుణ్యక్షేత్రాలన్నీ చూడకుండ వెళ్ళ కూడదు ఇప్పు డెలాగూ తెగించి వచ్చారు మళ్ళీ రావటం వీలుపడదు మీ అబ్బాయికి సెలవు దొరకదు కూడా'

'అంతటితో ఆగు—ఇంక నన్ను ఎగతాళిపట్టకు'

నేను మా వూరు వెళ్ళాల్సిందే—అప్పుడు. నీ రుణం ఏమాత్రం ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు'

'అదుగో! మళ్లీ మొదలెట్టారు' అంటూ రవణ అడ్డం వచ్చాడు

'మనసులోవున్నమాట అనక తప్పుతుందా నాయనా? నువ్వు మరోలా అనుకోకుండావుంటే నీ ఎడ్రసు కావాలి రాసిచ్చి, నువ్వు నాకోసం ఎంత డబ్బు ఖర్చుపెట్టావో చెబితే బాగుంటుంది నువ్వు చేసిన ఈ మహోపకారాన్ని డబ్బుతో విలువ కడుతున్నాననుకోకు నేను నీకే విధంగానూ ప్రత్యుపకారం చేయలేను

'అయితే మీరు ఒంటరిగా వెడదా మనుకుంటున్నారన్నమాట! ఏమండోయ్! సీతమ్మగారూ! ఈ వప్పులు నా దగ్గరుండవు ముందే చెప్పాను మీ అబ్బాయిదగ్గర మిమ్మల్ని వప్పగించేదాకా, నాకు కంటిమీద కునుకురాదని

సీతమ్మ ఇక వాదించి లాభంలేదని వూరుకుంది.

* * *

ఇంటిముందు టాక్సీ ఆగిన చప్పుడు విని ముగ్గురూ అరుగుమీద కొచ్చారు

'బామ్మా! బామ్మా!' అంటూ గంతులేస్తూ సీతమ్మ కాళ్ళను రామం చుట్టేసుకున్నాడు

మాలతి ఆపేక్షతో చిన్నగ నవ్వింది

చలపతి తనమీది బరువు దిగినట్టు తృప్తిగా నిట్టూర్చాడు

రవణ అందరిముందు ఠీవిగా నిలబడ్డాడు

'అక్కడే నిలబడిపోయావేం నాయనా? లోపలికి రా! అంది సీతమ్మ

'తిరుగుబండిలో తిరిగి వెళ్ళాలండి కాలేజీకి సెలవు పెడితే బాగుండదు!' అన్నాడు రవణ

'అమ్మా ఈ మూడు రోజుల్లో ఎంత చిక్కిపోయావు! నీ చిరకాలవాంఛ నెరవేరిందా?'

'ఇదుగో ఈ అబ్బాయికనక లేకపోతే నేను చిన్నచోట ఆటుంచి, పరలోకం చేరేదాన్ని. దైవంలా వచ్చి కాపాడాడు'

'అలాగా! చాలా థాంక్స్! వెరి కైండ్

ఆఫ్ యూ—బయటే నిలబడిపోయారు లోపలికి రండి!'' అన్నాడు రవణతో కరచాలనం చేస్తూ.

'కాదండి..... నేను వెళ్ళాలి!' అని నవ్వాడు.

'అదంతా నాకు తెలియదు....మా యింట్లో ఎంగిలి పడకుండా వెళ్ళనివ్వను.' అంది సీతమ్మ.

రవణ అయిష్టంతో ఇంట్లోకి వచ్చాడు.

ఉతికినబట్ట లారేస్తున్న పనిమనిషి కనిపించింది.

'ఇదెప్పట్నుంచి?' అనడిగింది సీతమ్మ.

'మీరు వెళ్ళినప్పట్నుంచి' అంది మాలతి.

'ఎందుకు?........' సీతమ్మ ఆశ్చర్యపోయింది.

'అమ్మా!.....తిరుపతికి వెళ్లేముందు నామీద విరుచుకుపడ్డావు. అప్పుడే మర్చిపోయావా?.... ఇక ఇంటి చాకిరీ తగ్గుతుంది......అంతేకాదు. హాయిగా విశ్రాంతి తీసుకో!.....ఇంతకాలం నీ వయసును గుర్తించకుండా బాధపెట్టాం. క్షమించు!'

'నిన్ను క్షమించాలంటే ఒక్క పని చెయ్యి!' ఏమిటన్నట్టు చూశాడు చలపతి.

'ముందా పనిమనిషికి ఇవ్వాల్సిన జీతం ఇచ్చేసి పంపేయి. నాకు విశ్రాంతి కావలసినప్పుడు నేనే తీసుకుంటాను. ఈ ఇంట్లో నాకు సంపూర్ణ స్వాతంత్ర్యంవుంది.......అదలావుంచి, ఈ అబ్బాయికి మనం ఎంతివ్వాలో కనుక్కో.....'

'అబ్బే!......అదేం వద్దండి!' అన్నాడు రవణ.

అందరూ ముసిముసినవ్వులు విసిరారు సీతమ్మ అయోమయంగా చూసింది.

'ఏవిట్రా!......ఏదైనా నాటకం ఆడావా ఏవిటి?'

'ఏం నాటకం అమ్మా?......ఈ జగమే ఓ నాటకం. అందులో మనమంతా పాత్రధారులం.'

ఒక్క సీతమ్మ తప్పించి అందరూ విరగబడి నవ్వారు.

'అన్నయ్యా!......' అంటూ వో పదేళ్ళఅబ్బాయి పరుగెత్తుకొచ్చాడు.

అన్నయ్య మాట్లాడకపోయేసరికి 'ఎప్పుడొచ్చావన్నయ్యా?.......నన్ను మాత్రం ఎందుకు తీసుకెళ్ళలేదు?....... అమ్మతో చెప్పాను. నీ భరతం పడతానంది......నువ్వొచ్చావని గోపి అంటే పరుగెత్తుకొచ్చాను.' అన్నాడు.

ఇక రహస్యాన్ని దాచివుంచి ప్రయోజనంలేదని గ్రహించి చలపతి మొదలుపెట్టాడు.

'అమ్మా!......నన్ను క్షమిస్తానంటే అంతా వివరిస్తాను.'

సీతమ్మ తల నిలువునా ఆడించింది.

'నువ్వు తిరుపతి వెళ్ళాలని మొండిపట్టుపట్టావు నిన్ను అడ్డుకోటంవలన మామీదుండే తప్పు టభిప్రాయాలు మరింత దృఢతరమౌతాయనే భయంతో వూరుకున్నాను.... కాని, ఒంటరిగ నీ వూరు వెళ్ళి ఎటుగనిదానవు. ఎక్కడెలా అవస్థలుపడతావోనని చాలా బాధపడ్డాను. ఆఫీసులో ఆడిటింగు జరుగుతోంది. మూడురోజులపాటు అటుంచి, మూడు గంటలుకూడా సెలవివ్వరు—ఈ రవణ మన అకౌంటెంటు రత్నంగారి కొడుకు. కాలేజీలో చదువుకుంటున్నాడు. పరీక్షలై సెలవుల్లో వున్నాడు. నీకు సాయపడమని వేడుకున్నా. చాలా మంచివాడు. కనక సరే నన్నాడు. నువ్వెక్కినరైల్లోనే నిన్ను వెంబడించాడు. అతని ఉపకారం నేను జన్మలో మరవను.....ఇలా ఏర్పాటు చేసినా కూడా మాలతి నేనూ ఈ మూడు రోజులు సంగ్గా నిద్రపోతే ఒట్టు.....ఆ ఏడుకొండలవాడే నన్ను కాపాడాడు......రత్నంగారు పక్కవీధిలో వున్నారు. నువ్వాయన్ను చూసేవుంటావు.'

సీతమ్మ ఓ నిమిషంపాటు రాయిలా కూర్చుంది.

'అయితే ఆ రెండువందలు మాయంచేసింది కూడా నువ్వేనా బాబూ!' అంది నవ్వుతూ.

'రామ.....! రామ!.. ఆ పనిమాత్రం నేను చేయలేదండోయ్! మీకు చేసిన సాయానికి రుణం తీర్చుకోలేనన్నారు.....ఇలాగేనా నింద వేయటం?'

మాలతి నెస్కఫే కాఫీ తీసుకొచ్చింది అందరికీ.

'అత్తయ్యా!......మరో సంగతి చెప్పటం మరిచాను. లక్ష్మమ్మగారు కొడుకూ, కోడలూ పోట్లాడి వేరేవుంటోంది.'

సీతమ్మ 'ఏవిటేవిటి?' అంటూ ముక్కుమీద వేలేసుకుంది.

'ఎవరూ?....ఈ వీధిలో వుండే లక్ష్మమ్మా?... రోజూ సినిమాకు డ్రామాకి తీసికెళ్ళమని కొడుకును చంపుకు తింటుండట. ఎంత కాలమని వాళ్ళు మాత్రం సహించగలరు?...... కోడలు జ్వరంతో మంచంపడితే కాస్త జావ కూడా కాచివ్వలేదట' అన్నాడు రవణ.

'ఒకరి సంసారపు గొడవలు మన కెందుకు?... మనం ఒకర్నొకరు అర్థం చేసుకుని హాయిగా వుందాం' అంది సీతమ్మ.

'అయితే రవణా!......నువ్వు స్నానం చేసి వచ్చెయ్. ఈ పూట భోజనం ఇక్కడే!' అన్నాడు చలపతి.

'అంతకంటేనా?......' అంటూ రవణ బయలుదేరాడు.


చలపతికి తనమీదుండే ప్రేమాభిమానాలు రవణరూపంలో నడచి పోతున్నట్టనిపించింది సీతమ్మకు.

'బాప్పా! ...రాములోరు అడవికి పోయిన తరువాతి కథ ఇవేళ చెప్పాలి సుమా!' అన్నాడు రమేం.

సీతమ్మ మాట్లాడలేదు.

ఆమె ముఖంలో కనిపించిన వో కొత్త వెలుగులో, తృప్తి, ఆనందం, అనురాగం, ఆప్యాయత, సహనం, శాంతం ఇంకా ఎన్నో కరిగి వింత వింగులలో ప్రకాశించాయి.

హాలులో గడియారాలు ఒక్కసారిగా తొమ్మిది కొట్టాయి.





జరిగిన కథ

రామదాసును హత్యచేసి ఆయన దాచుకొన్న దంతా ఎవరో దోచుకుపోయారు. అంతక్రితమే సత్యమూర్తితో తన కథ కొంత చెప్పారు రామదాసు. ప్రకాశం తన సుగర్ ఫ్యాక్టరీలో సత్యమూర్తికి ఉద్యోగం ఇచ్చాడు. ఆ చుట్టుపక్కల ప్రకాశానికి చాల పరపతి ఉంది అతనికి దామోదరం నమ్మిన బంటు. భానుమతిని వశపరచుకుంటే కావలసినంత ఆస్తి దక్కుతుందని అందుకు దామోదరం ప్రయత్నిస్తున్నాడు. సత్యమూర్తి, భానుమతి పరస్పరం ఆకర్షించుకున్నారు. భానుమతిపేర నెలనెలా వచ్చే మనియార్డరు ఎవరిదగ్గర్నుంచో తెలుసుకోవాలని ఆరాటపడుతున్నాడు సత్యమూర్తి. భంగపడిన బెనర్జీ, దామోదరం కొడుకు గోపాలన్ ఇద్దరూ భానుమతిమీద మక్కువ చూపిస్తున్నారు.

సుప్రభాతం

(సీరియల్)

రంగనాథ్

21

భానుమతిని రోజులాగే మాలతి కారులో దిగబెట్టింది. ఇంటిపెద్ద భానుమతి దిగగానే, స్వామిగారూ, మరొక వ్యక్తి మాట్లాడడం చూసింది రెండవ వ్యక్తిని చూడగానే, "నమస్కారం ఇన్‌స్పెక్టరు గారూ." అంది.

ఇన్‌స్పెక్టరు రజాక్, "ఏమమ్మా, గోపాలన్ ఇక్కడే వుండేటట్లు వున్నాడు. ఏమయింది? మేము వాణ్ణి ఒక కంట కనిపెట్టున్నాము' అన్నాడు.

లోపలికి ఎళ్ళిన భానుమతి, "నేను మీరు చెప్పినట్లుగానే బుజువు కావాలని అడిగాను. తెస్తానన్నాడు.' అంది.

"తెస్తానన్నాడూ. ఏమిటట? ఎప్పుడు తెస్తాడు?"

"ఒక ఫోటో, ఒక ఉత్తరం తెస్తాడుట. అవి ఒక గంట నా దగ్గర వుంచడానికి ఒప్పుకున్నాడు. అవికాక ఇంకా చాలా కాగితాలు వున్నాయట అవన్నీ భవిష్యత్తులో పనికి వస్తాయట. అందుకని తిరిగి ఇచ్చెయ్యమన్నాడు."

"అయితే సరే మాకు కావలిసిన ఏర్పాట్లు చేయిస్తాను. వాటిని ఫోటో తీయిద్దాము. చాలా వరకూ నేననుమానించిందే నిజం అనుకుంటాను." అని లేచి, "వెళ్ళి వస్తానని" బయల్దేరాడు. 'మఫ్టీ'లో వున్న సి. ఐ. డి. ఇన్‌స్పెక్టరు రజాక్. భానుమతి ఇంటి లోపలికి వెళ్ళింది.

* * *

ఉమకు ఆ రాత్రి నిద్రపట్టలేదు మధ్య మధ్య ప్రక్క గదిలో మంచం మీద పడుకుని నిద్రపోతున్న యువకుణ్ణి చూస్తోంది. అతని వంటి నిండా గాయాలే. వారం రోజులనుంచి అతను చాలా బాధ పడ్డాడు. ఈ రోజు అతినికి చాలావరకూ నయంగా వుంది. జ్వరం కూడా తగ్గుముఖం పట్టింది. మరొక రెండు రోజులలో కుట్లు విప్పేస్తారు. అదృష్టవశాత్తూ అతినికి ప్రమాదకరమైన దెబ్బేదీ తగుల లేదు. అదంతా వెంకట రమణమూర్తి దయ యేమో ననిపిస్తోంది.

బయట రాత్రి చాలా అందంగా, వెన్నెల ఆ కొండ ప్రదేశంలోని బయలంతా ఆక్రమించుకుని, తెల్లని నైలాన్ చీర కట్టుకున్న తెల్లని యువతి శరీరాన్ని బయట పెట్టినట్లుంది. అది కిటికీ లోంచి అవతలవైపు చూస్తే కనిపించే దృశ్యం. మరొకవైపు చూస్తే, తండోపతండాలుగా వస్తున్న యాత్రికులూ, వారి అకుంఠిత భక్తి విశ్వాసాలు ప్రతిఫలించే ముఖాలూ కన్పిస్తాయి.

తన గదికి మరొక ప్రక్కగదిలో అనంతరావు గారు పడుకున్నారు. భగవంతుడి మీద భక్తికన్నా, ప్రకృతి దృశ్యాన్నీ, కొండల మీది వాతావరణాన్ని చూసి, కొంతకాలం గడపాలనే ఆసక్తితో తండ్రీ, కూతురూ ఇద్దర్నూ తిరుమలలో ఒక ఇల్లు తీసుకుని వుంటున్నారు. తాము కొండపైకి వస్తున్న రోజునే ఒక దుస్సంఘటన జరిగింది. అందులో తమ కారుకు తాకొనవలసిన మరి యొక కారు బోల్తా పడి, అందులో వున్న వ్యక్తికి చాలా గాయాలు తగిలాయి ఆ కారు డ్రైవు చేసుకుని వస్తున్న అవ్యక్తిని వెంటనే అనంతరావుగారు తమ డ్రైవరు సహాయంతో, బయటకు తీసి తమ కారులో ఎక్కించుకొని, కొండపైకి తమ యింటికి తీసుకు వచ్చారు. డాక్టరుని పిలిపించి చూపిస్తే తలకూ, చేతులకూ అక్కడక్కడ కుట్లువేసి, భయపడ నవసరం లేదు అన్నాడు.

అతనిని తామే సేవచేసి స్వస్థుణ్ణి చెయ్యాలని అనంతరావుగారు నిశ్చయించారు. ఎందుకంటే అతను తనకు బాగా కావలసిన వ్యక్తి ప్రకాశం. ఎన్నాళ్లనుండో ప్రకాశంతో మాట్లాడాలని ఆయన ఎదురు చూస్తున్నారు. అందువల్ల ఇది అందుకు మంచి అవకాశం. హాస్పిటల్లో చేర్పించే బదులు, తామిద్దరే వుంటున్న ఆ యింట్లోనే అన్నీ అతనికి ఏర్పాటు చేశారు. అతను కూడా వద్దనలేదు.

ప్రకాశం గురించి మునుపు ఎన్నో విషయాలు వింది. అతను చాలా దుర్మార్గుడనీ, అవినీతి పరుడనీ, ఎటువంటి ఘోరకృత్యాలకైనా వెనుదియ్యని మనిషని వింది అతని గురించి, సత్యమూర్తీ, అనంతరావుగారుల మధ్య చాలా చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా అతనొక నరరూప రాక్షసుడిలా ఆమెకు గోచరించేవాడు కాని ఈ వారం రోజులనుండీ చూస్తున్న ప్రకాశం వేరు. ఇతనిలో చాలా మంచితనం కన్పిస్తుంది తను అతనికి ఏ సహాయం చేసినా ఎంతో కృతజ్ఞత చూపిస్తున్నాడు. పైగా, ప్రక్కమీద బాధతో అసహాయుడిలా పడుకున్న అతను చంటి పిల్లాడిలా ప్రతి విషయానికీ తనపై ఆధారపడడం, ఏ మాత్రమూ బెరుకుగాని గంభీరతగాని లేకుండా అమాయకంగా ప్రతివిషయం అడగటం ఆమెలో ఏవో లోతులు కదిల్చింది. ఒకొక్కప్పుడు అతను నిశ్చలంగా తనవైపు చూసే చూపులు, తన శరీరాన్నంతా ఎక్సురే తీస్తున్నాయా? అన్నట్లుంటాయి.

తన దగ్గర ఎంతో సౌమ్యులా కన్పించే ప్రకాశం, ఒకొక్కప్పుడు చాలా క్రోధావేశాలుగల వ్యక్తిగా మారగలడనీ, పట్టుదల వస్తే దేనికైనా వెనుదియ్యడనీ, అనుకోడం అసంభవంగా కన్పిస్తోంది. ప్రకాశం గురించి తన అభిప్రాయం చెప్పాలంటే, అతను చాలా అమాయకుడనీ, మంచివాడనీ, అతని పేరుతో జరుగుతున్న దుర్మార్గాలన్నీ ఇంకెవరో చేస్తూ ఉండివుండాలని నిస్సంకోచంగా చెప్పగలదు. అందుకు కేవలం అతను నిస్సహాయుడిగా ఉన్నప్పటి ప్రవర్తన నాధారంగా తీసుకోవడం సరికాకపోవచ్చు కాని అతనికీ, తనకూ, అనంతరావుగారికీ మధ్య జరుగుతున్న సంభాషణలను పరిశీలించినప్పటికీ అతని భావాలు ఎంత సున్నితమైనవో, అతని హృదయం ఎంత మెత్తనిదో తెలుస్తూ వుంది.

'అతనిది అందమైన ముఖం. సన్నని మనిషి. ఇంకా వివాహం కాలేదు. అయినా రాజకీయ రంగంలో మంచి పేరు సంపాదించుకున్నాడు. వివాహం అన్నా, స్త్రీలన్నా అతని అభిప్రాయమేమిటో తెలియదు కాని అతను తరుచూ పురుషుల మధ్యే తిరిగే వ్యక్తిలా కన్పిస్తున్నాడు. స్త్రీయొక్క ప్రభావం అతనిపై పడినట్లు కన్పించదు. అతను నోటితో చెప్పకపోయినా, అప్పుడప్పుడు కళ్లతో తన అందాన్ని పొగుడుతున్నట్లు చూస్తాడు. తను తన కళ్లతో అతని వైపు ఓరగా చూసినప్పుడు, అతని కళ్లల్లో అదొక రకమైన బంగారు కన్పించేది ఏది ఏమైనా ఈ వారం రోజులనుండీ, అతనితో సరదాగానే గడుస్తోంది.

రాత్రి చాలాసేపు గడిచేవరకూ ఉమ ఆలోచిస్తూనే వుంది. తరువాత మెల్లిగా పక్కమీదకు చేరి పడుకుంది. ప్రకాశం గాఢ నిద్రలో వున్నాడు.

మరునాడు ప్రొద్దున్న డాక్టరు వచ్చి వెళ్లాక అనంతరావుగారు ప్రకాశం పక్కను వచ్చి కూర్చున్నారు. డాక్టరు ప్రకాశాన్ని కుట్లు విప్పేదాకా ప్రక్కమీదే గడపమని చెప్పాడు. అతనికి ప్రక్కమీదే వుండి పోవడం చాలా విసుగ్గా వుంది. అయినా మరొక నాలుగైదు రోజులు ఓపిక పట్టాలి ఉమ కాఫీ, 'బ్రెడ్డూ' తెచ్చి యిచ్చింది. ఆమె చేత సేవ పొందడం అతనికి మహాభాగ్యంలా వుంది. ఆమె కేవలం తెచ్చి పెట్టుకోదు. అతని చేతులకు దెబ్బలు తగలడం వల్ల, కాఫీ త్రాగడం లోనూ, 'బ్రెడ్డు' తినడం లోనూ ఎంతో సహాయం చేస్తుంది ఎంతో అభిమానంతో అవి తను [illegible]కునేటట్లు చేసి, ఒక్కొక్కప్పుడు నోటికి [illegible]స్తుంది అవి తీసుకోవడం పూర్తయ్యేదాకా [illegible] ప్రక్కనే వుంటుంది. అనంతరావుగారు [illegible] తీసుకున్నారు

"ఎలా వుందోయ్? ఇవాళ నీ వంట్లో?" అని అడిగారు.

"చాలా తేలిగ్గా వుంది కాని ఈ పక్కమీద గడపటమే విసుగ్గా వుంది. లేచి తిరగాలని వుంది. కాని డాక్టరు ఒప్పుకోవటం లేదు." అన్నాడు గునుస్తూ.

ఉమ తను దైవదర్శనానికి వెళ్తానని చెప్పి వెళ్లింది.

"రామవరం నుంచి ఏవరినైనా పిలిపించ మంటావా?"

"వద్దు మేష్టారూ నాకు ఈ వాతావరణం చాలా హాయిగా వుంది. ఈ పవిత్రమైన తిరుమల

క్షేత్రం, మీరూ మీ అమ్మాయి చూపిస్తున్న ఆదరం, మీ దగ్గర నేను నేర్చుకుంటున్న విషయాలూ నన్ను ఈపరిస్థితిలో మరో నాలుగు రోజు లుండ నివ్వండి! అక్కడి ఫాక్టరీ గొడవలూ, రాజకీయాలూ వీటితో నాకు విసుగెత్తి పోయింది. విశ్రాంతి కోసం కలవరిస్తున్నాను. తిరుపతి వచ్చి భగవద్దర్శనం చేసుకుంటే మనశ్శాంతి లభిస్తుందని వచ్చాను. కేవలం దర్శనం చేసుకొని వెళ్ళిపోతూంటే, ఈ 'యాక్సిడెంటు' జరగడం, మీరునన్ను తీసుకు రావడం జరిగింది. ఈ 'యాక్సిడెంటు' నిజంగా నాకెంతో మేలు జేసింది. అసలు రాఘవరానికి ఈ విషయమే తెలియ చెయ్యద్దు చేస్తే వాళ్ళంతా వచ్చి ఈప్రశాంతతకు భంగం కలిగిస్తారు.'

"నేనూ అదే అనుకున్నాను. అప్పుడే ఈవార్త రాఘవరావుకి తెలిపివుంటుంది. కాని నువ్విక్కడున్నట్లు ఎవరికీ తెలియదు. నువన్నట్లు మరొక నాలుగు రోజులుండి, మనం వెళ్ళిపోదాం."

ప్రకాశం కొద్దిసేపు మౌనంగా కళ్ళు మూసుకున్నాడు. తరువాత మెల్లిగా "చనిపోవలసినవాణ్ణి నన్ను బ్రతికించారు. మీరుణం తీర్చుకోలేను." అన్నాడు. కృతజ్ఞతా పూర్వక స్వరంతో.

"అంతాదైవేచ్ఛ. నీవల్ల ఎన్నో ప్రయోజనాలు జరుగవలసి వుండగా భగవంతుడు నిన్ను చని పోనిస్తాడా? ఎందరు నీమీద ఆధారపడివున్నారు. వాళ్ళ గతేం కాను? అంత సులభంగా చావు మాత్రం వస్తుందా?"

"నామీద వాళ్ళు ఆధారపడి వున్నారని అనుకోవటం లోకసహజమైనా, నిజానికి నేను వాళ్ళమీద ఆధార పడ్డాననుకుంటూంటాను. ఈమధ్య కర్మికులు సమ్మె చేశారు. ఆ సమయంలో నాకు కను విప్పయింది. మూడు రోజుల సమ్మెలో ముప్ఫై వేలు నష్టమైంది. ఆ నష్టాన్ని భరించవలసింది నేను. అందులోనూ, ఇన్నాళ్ళూ నా ప్రియమిత్రుడిలా నటించిన సత్యమూర్తి ఆ కార్మికులకు నాయకుడై సన్నాదిరించాడు. అంటే అతనికి స్పష్టంగా నా నిస్సహాయత బోధపడిందన్నమాట. చివరకి వాళ్ళడిగిన షరతులకు లొంగవలసివచ్చింది." అన్నాడు.

"అందుకు విచారించవలసిన పని లేదోయ్. నీదృక్పథంలో మార్పురావాలి. లేకపోతే చాలా బాధ పడవలసి వస్తుంది."

"ఏంమార్పు రావాలో చెప్పండి."

"నేనొక ప్రశ్న అడగుతాను విను. నువ్వు చాలా డబ్బు సంపాదించావు అధికారం, పలుకుబడి విపరీతంగా సంపాదించావు కాని సుఖాన్ని పొంద గలిగావా? మనశ్శాంతిని అనుభవిస్తున్నావా? ఆత్మ తృప్తి వుందా? చెప్పు?"


"డబ్బుతో కొనగలిగిన సుఖాన్ని పొందుతూనే వున్నాను మనశ్శాంతి రాజకీయాలలో తిరిగే వారికెవరికీ వుండదనుకుంటాను. ఆత్మతృప్తి కలిగిన మానవుడు ముందుకు పోలేడని నా విశ్వాసం"

"డబ్బుతో కొనగలిగింది శారీరకసుఖం మాత్రమే! అదికూడా 'రిలేటివ్' గానే వుంటుంది. నేల మీద పడుకునే వాడికి బూరుగు దూది సుఖమని పిస్తుంది. చివరకు అదీ అలవాటయిపోగానే దాని మీద కూడా నిద్ర పట్టదు చివరకు నేల మీద పడుకున్నవాడే సుఖంగా నిద్రపోతాడు. ఇవన్నీ భౌతిక సుఖాలు. వీటంతట ఇవి కారణ భూతాలు మాత్రమే కాని, ప్రయోజనాలు కావు. నిద్ర అనేది—మనం దేనిమీద పడుకుంటాము అన్న విషయం మీద ఆధారపడి లేదు. అది మన శారీరిక మానసిక ప్రవృత్తులపై ఆధారపడివుంది. కాయకష్టం చేసి, మనసులో నిదిగులు లేకుండా వున్నవాడు బండరాతిమీదైనా సుఖనిద్ర పోతడు. కాని ఎప్పుడూ ఆలోచనతో సతమత మయ్యేవాడు, హంస తూలికా తల్పం మీదకూడా నిద్రపట్టక దొర్లుతాడు. అందువల్ల నిద్ర అనేది పక్కమీద ఆధారపడి లేదు. అలాగే మనం అనుభవించే సుఖాలన్నీ, కారుమీదా, పట్టు పరుపులమీద, పంకాల మీదా లేవు. అది అసలు మనలోనే వుంది. దానికి సరియైన దృక్పథం కావాలి. రాజకీయాలలో తిరిగే వాడు, తనే అన్నీ నడిపిస్తున్నాననుకుంటే మనశ్శాంతి వుండదు.

అదే భగవద్గీతలో చెప్పాడు. అర్జునుడు, యుద్ధంలో తను చుట్టాలనందరినీ చంపలేను అని విచారించినప్పుడు, శ్రీ కృష్ణ పరమాత్మ, 'నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్' అని చెప్పి వాళ్ళందరూ ఎలాగా చావవలసివుంది, అది దైవ నిర్ణయం, నువ్వు నిమిత్త మాత్రుడవే నన్నారు అదే రాజకీయాలలో జ్ఞాపక ముంచుకో వలసింది అలా ఆలోచిస్తే ఎప్పుడూ మనశ్శాంతి వుంటుంది ఇక ఆత్మతృప్తి అంటావా, ఎంతడబ్బు గడించామా? అని ఆలోచించినంత వరకూ ఆత్మతృప్తి లభించదు. ఇతరులకు ఎంత వరకూ సేవ చెయ్యగలిగామా? అని ఆలోచిస్తేనే, ఆతృప్తి లభిస్తుంది"

"మీరు చెప్పింది బాగానేవుంది కానీ, ఈ సుఖాలు మనల్నెప్పుడూ ఆలోచించ నియ్యవే వాటిలోనే సుఖం వుందనే భ్రమ కల్పిస్తాయే."

"అదే ప్రకృతి రహస్యం. విజ్ఞాన శాస్త్రవేత్తలందరూ అలాగే అనుకుని విజ్ఞాన శాస్త్రాన్ని ఆరాధిస్తున్నారు. కాని సైన్సు ద్వారా మంచి కలుగుతోంది.. చెడూ కలుగుతోంది. డైనమైటును కనిపెట్టినప్పుడు నోబెల్, దానివలన జరిగే విధ్వంసక చర్యకు విచారిస్తూ ఆత్మతృప్తి కోసం నోబుల్ బహుమతులను ఏర్పాటు చేసాడు. అలాగే అణుబాంబుల్ని కనిపెట్టిన మానవుడు కూడా అదే విధంగా విచారించి అణు శక్తిని మానవాభ్యుదయం కోసం ఉపయోగించాలని తాపత్రయ పడుతున్నాడు. మంచి చెడులనేవి మానవుడిలో వున్నాయిగాని, ప్రకృతిలో లేవు ఆ విషయం తెలుసుకున్నవాడు మానవుడు ప్రకృతిని జయిస్తాడు. కారులో కూచుని ప్రయాణం చేస్తూ ఒక మానవుడు సుఖిస్తున్నాననుకుంటే, ఆ కారుక్రింద పడి కాలో చెయ్యో పోగొట్టు



కున్నవాడు, కారువల్లే ఈ ప్రమాదం వచ్చిందనుకుంటాడు."

"అయితే దీనిని ఆచరణలో పెట్టడం ఎలాగంటారు?"

"అదే మానవుడి అన్వేషణ. మొదట, ప్రపంచంలో మన కెదురయ్యేది, ప్రకృతియొక్క స్వభావం! దానినే పరమార్థంగా భావించి ప్రకృతే దైవం అని మానవు డారాధించిన కాలం వుంది. కాని ప్రకృతే సృష్టియొక్క పరమార్థం అనుకోవడంలో మానవుడికి తృప్తి కలుగ లేదు. అప్పుడు సత్యాన్వేషణ ప్రారంభించాడు. మహాత్ములు కొందరు ఈ సత్యాన్వేషణ కోసం తమ సర్వస్వం త్యజించి, ఎటువంటి కష్టాలకోసమైనా సిద్ధపడ్డారు. బుద్ధుడు, మృత్యువును చూడగానే తనసర్వస్వం త్యజించి సత్యాన్వేషణలో నిమగ్నులయ్యారు. బోధి వృక్షం క్రింద కూర్చుని

సుప్రభాతం

తపస్సు చేసి, తను తెలుసుకున్న సత్యాన్ని లోకానికి చాటాడు. అది అందరికీ సులభాచరణీయం కావడానికి, సుబోధకం కావడానికి, కొన్ని సూత్రాలలో బోధించాడు. ఇది 2500 సంవత్సరాలకు పూర్వం జరిగింది. తరువాత శంకరాచార్యులు అద్వైత సిద్ధాంతాన్ని చాటారు. అది ఒక మహోద్భుతమైన వేదాంతం. అంతకు మించిన వేదాంతం ప్రపంచంలో ఏదీ లేదు. కాని ఆచరణలో ఇవేవీ కూడా నెగ్గకుండా, ప్రకృతి యొక్క స్వభావం మానవుల్నెప్పటికప్పుడు తన ప్రభావానికి లొంగదీస్తోంది. అందువల్ల భారతదేశం క్రమంగా పతనమై పరజాతి దాస్యశృంఖలాలలో బంధింపబడింది. మనకు ఎదర్శాలు గాని; ధర్మాలు గాని, వేదాంతంగాని లేక మనదేశం పతనం కాలేదు, అన్నీ ఉండికూడా వాటి నాచరించడంలోని ప్రమత్తతవలన పతనమైంది. అటువంటి జాతికి పునర్జన్మ కల్పించింది గాంధీజీ. ఆయన మనదేశపు సాంప్రదాయాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నారు. మన జాతిలోని గొప్పతనాన్ని బలహీనతల్ని రెండింటినీ అర్థం చేసుకున్నారు. మన కార్యాచరణకు కావలసిన సూత్రాల్ని మన సనాతన సాంప్రదాయాల్నుండీ, హైందవ వేదాంతం నుండీ సేకరించి, సమకూర్చి, ఆచరణలో పెట్టడానికి నాయకత్వం వహించి మనలోని సత్తా పరీక్షించారు. మనకు స్వతంత్రం కావాలని గ్రహించిన నాడు, మనం ఎన్ని త్యాగాలకు సిద్ధపడ్డామో, అలాగే, మనజాతి స్వతంత్రం గనుక జాగ్రత్తగా కాపాడుకోకపోతే దానిని పోగొట్టుకునే ప్రమాదం వుందని గ్రహించిన నాడు ఎటువంటి త్యాగాలకైనా సిద్ధపడుతాం.''

"నిజమే. మీరు చెప్పినట్లుగా ఆలోచిస్తే దేశం చాలా అభివృద్ధి చెందుతుంది. కాని అందరికీ ఈ ఆలోచన లేదు. అందువల్ల వాటిని అనుసరించడం వల్ల కొన్ని ప్రమాదాలున్నాయి. గాంధీ సూత్రాలన్నీ జయప్రదం కానేలేదు. ఉదాహరణకు మద్యపాన నిషేధం చూడండి. అది పూర్తిగా విఫలమైంది. దానికి కారణం ఏమిటో ఆలోచించండి.'' అన్నాడు ప్రకాశం.

అనంతరావుగారు చిరునవ్వు నవ్వారు. "మా జాతిలో కొన్ని బలహీనతలున్నాయని, వాటిని అరికట్టడం అంత సులభం కాదని అందరికీ తెలిసిందే. కాని నాయకులైన వారు మాత్రం వాటిని నిరోధించడానికి ప్రయత్నించెయ్యాలి." అన్నారు. ప్రకాశం కూడా నవ్వాడు.

"సమస్యల కొక పరిష్కారం సూచించే వృద్ధిశం నాకు లేదు. కాని మహాత్ముల సూత్రాల్ని మట్టుకు మనం మరువ కూడదు" అన్నారు అనంతరావుగారు.

"ప్రపంచంలో మంచికి తావు లేదని అనుకుంటున్నాను నేను"


"మంచికే తావుంది నాయనా. చెడ్డ అనేది మనిషికి మొదట్లో ఎంత ఆకర్షణీయంగా కన్పించినా, చివరకు అది నాశనానికే దారితీస్తుంది. మంచే చివరకు చెడకుండా నిలుస్తుంది. ఈ పాఠం ఎప్పటికప్పుడు ప్రకృతి మనకు నేర్పుతున్నా, మనం తెలుసుకోలేక పోతున్నాం."

ప్రకాశం ఆయనతో ఏకీభవించలేనన్నట్లు తలూపాడు.

"ఈరోజుల్లో పనులు జరగాలంటే, మంచి మార్గాన పోతే, మనం ఎప్పటికీ ఎందుకు పనికిరాం. ఎలక్షన్లు ఉన్నాయనుకోండి. ప్రజలే మన మంచి గ్రహించి ఓట్లు వేస్తారని ఊరుకుంటే, ఎదుట పార్టీవాడు డబ్బిచ్చి ఓట్లు వేయించుకుని నన్ని ఓడించేస్తాడు. ఆఫీసుల్లో లంచాలివ్వకుండా మంచి మార్గాన పోదామనుకుంటే మన పనులెప్పటికీ జరుగవు సరికదా, మనకు వ్యతిరేకంగా పనులు జరిగిపోతాయి. అందుకని తప్పని సరిగా మనం కూడా ఆ గాడిలో పడవలసి వస్తుంది. ఒకసారి అందులోకి దిగాక, ఇక అన్ని నీతులూ వదలిపెట్టెయ్యవలసి వస్తుంది. మనకు పోటీ లేకుండా జాగ్రత్త పడకపోతే మన స్థానానికి భంగం కలిగే అవకాశం వుందని గ్రహించి, పోటీ రాకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవలసి వస్తుంది. అందుకు చాలా అబద్ధాలు ఆడాలి. అబద్ధాలాడితే పాపం వస్తుందని జంకితే మనల్నందరూ చాతకాని వాడి క్రింద జమ కట్టారు. భగవంతుడికేదైనా సమాధానం చెప్పుకోగలమేమో గాని, మానవులకు మాత్రం చాతకాని వాడిలా కన్పించలేం. ప్రతి వ్యక్తీ గాంధీ మహాత్ముడిలా త్యాగం చెయ్యలేడు. ఒకవేళ చేసినా ఆయన సాధించగలిగిన ఫలితాన్ని సాధించ గలమనే నమ్మకంలేదు. అటువంటి పరిస్థితులలో సామాన్య మానవుడు ఏ మార్గాన్ననుసరించాలి? తన కళ్లముందే అందరూ అవకాశాల్ని వినియోగించుకుని పైకి పోతూంటే తనుమాత్రం తనున్న స్థితిలోనే వుండడమో, లేక అధోగతి పాలవడమో అంగీకరిస్తాడా? అది ఎప్పటికి సాధ్యం కాదు" అన్నాడు.

అనంతరావుగారు చిరునవ్వుతో, "ఇప్పుడు ప్రస్తుత పరిస్థితుల్ని యథాతథంగా గ్రహించావు కాని పరిస్థితులిలాగే గనుక కొనసాగుతున్నట్లయితే కొంతకాలానికి ఎటువంటి పరిణామాలు వస్తాయో ఆలోచించు" అన్నారు.

"అందుకు నేనూ ఒప్పుకుంటాను. ఎప్పుడో ఒచ్చేటువంటి పరిస్థితులు చూసుకుందాం. అలా కాక



నడిచాయనే అనుకున్నాను. కాని అంతవరకూ మనం ఎదురు చూస్తూ కూచోలేం. ఇప్పటి పరిస్థితుల కనుగుణంగా ప్రవర్తించడమే మన తక్షణ కర్తవ్యం''

అనంతరావుగారు యేదో చెప్పబోతూంటే ఉమ తిరిగి వచ్చింది ''అబ్బబ్బ ఏమి యాత్రికులు! నిజంగా కలియుగ వైకుంఠం అంటే ఇదే'' అని ప్రసాదాన్ని అనంతరావుగారికీ, ప్రకాశానికి ఇచ్చింది.

ఆమె ఎర్రని పట్టు చీర కట్టుకుంది స్నానం చేసిన తలతో మొహాన్ని నిండుగా పెట్టుకున్న బొట్టుతో ఆమె మొహంలో పవిత్రత ఉట్టిపడుతున్నట్లుంది. ప్రకాశం ఆమె విగ్రహాన్ని పరీక్షగా చూసి మనసుతో ఆనందించసాగాడు. అతను తనవైపు చూస్తున్నాడని గ్రహించి తన పమిట కొద్దిగా సర్దుకుంది. తను వారిద్దరికీ ఎదురుగా కూర్చొని కోవెలలో తన అనుభూతిని వర్ణించసాగింది.

ఎంతసేపు చూస్తున్నా తనివి తీరని దివ్య సుందర విగ్రహం ఆ స్వామిది. ఆయన ప్రత్యక్ష దైవం. వేలాది ప్రజలు తండోప తండాలుగా నిత్యం స్వామి దర్శనం చేసుకుంటూ వుంటారు. ''కౌసల్యా సుప్రజారామా, పూర్వాసంధ్యా ప్రవర్తతే ఉత్తిష్ఠ నరశార్దూలా, కర్తవ్యం దైవమాహ్నికం'' అనే సుప్రభాతంతో ప్రారంభమైన ఆయన దైనందిన అర్చన రాత్రి ఉయ్యాల సేవ జరిగే వరకూ, యాత్రికులంతా సాక్షాత్తూ భగవంతుడు తమ మధ్య ఉన్నట్లు అనిపించేటట్లుగా జరుగుతూ,

సుప్రభాతం

నిత్యకల్యాణం ఎప్పుడూ తోరణంగా వుంటుంది ఆ దివ్యక్షేత్రం. అక్కడ కొన్నాళ్ళుండి నిత్య దైవ దర్శనం చేసుకుంటూంటే, స్వామి ప్రసాదమైన పులిహోర, చక్రపొంగలి, లడ్డులూ ఆరగిస్తూంటే, ఆ అనంతమైన ప్రజానీకాన్ని సముద్రపు అలలలా తరగని క్యూలలో నిలబడి దర్శనానికి వచ్చే వారిని చూస్తూంటే, మనిషి తననూ, తన బాధలను ప్రపంచాన్ని మరచిపోతాడు ''ఏడు కొండలవాడా, వెంకటరమణా గోవిందా'' అన్న నినాదాలతో దిక్కులు పిక్కటిల్లేట్లు అరుస్తూ భక్తి పారవశ్యంలో మైమరచి, తను మానవ ప్రపంచాన్ని వదలి, ఏదివ్యలోకంలోనో విహరిస్తున్నట్లు అనుభూతి పొందుతాడు

ప్రకాశం మరో రెండు రోజులు గడిచేసరికి పూర్తిగా కోలుకున్నాడు. అనంతరావుగారితో రోజూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చర్చించడం ద్వారా పగలు కాలం గడుపుతున్నాడు. రాత్రి పూట ఉమను చూస్తూంటే మనసు అనేక విధాలుగ పరిశోధించేది. ఈమెకు తన యందెటువంటి అభిప్రాయముందా? అని ఆలోచించేవాడు. ఉమలో చాలా చొరవ వుంది. [illegible] ముంది. ఎంతమాత్రం బిడియ పడదు. తనతో ఆమె మాట్లాడుతున్నప్పుడు ఆమె కళ్ళల్లోని వుత్సాహం, ఒక్కొక్కప్పుడు అనంతరావుగారు బయటకి వెళ్ళినప్పుడు తనకు దగ్గరగా వచ్చి కూర్చోవటం, తన మనస్సులోని భావాల్ని విచిత్రంగా పసిగట్టడం, చూస్తూంటే ఉమకు తనయందు గల అభిమానం ఎటువంటిదా? అని ఆలోచించి, అదే గనుక తను వూహించినటువంటి భావన అయితే దాని పరిణామం ఎలాంటిదా అని ఆశ్చర్యపడేవాడు. వాళ్ళు తనని ప్రాణాపాయ స్థితి కాపాడారు. ఆమె తనకు ఇరవై నాలుగు గంటలూ పరిచర్య చేసి తనను గాయాల నుండి చాలా త్వరగా కోలుకునేట్లు చేసింది. ఒకవేళ ఆమెకు అటువంటి అభిప్రాయం లేకపోతే, తను పొరపాటు చేస్తే, తనను చాలా నీచుడిగా చూస్తారు. నీచకార్యం చేసినా, నీచుడిలా చూడబడడం ఎవరికీ ఇష్టం వుండదు. అయినా తన యందు వీరికింత అభిమానం ఎందుకు కలిగింది. వాళ్ళెవరు? తనెవరు? మనుషులలో నిస్వార్థ క్రియలుంటాయా? వీళ్ళు తనకు సపర్యలు చెయ్యటంలో ఏదైనా నిగూఢమైన రహస్యం వుందా? అని పరిపరివిధాలుగా ఆలోచిస్తూండేవాడు.

మరునాడు ఉమతో కలిసి దైవ దర్శనానికి వెళ్ళాడు ప్రకాశం. ఆరోజు అనంతరావుగారు ప్రొద్దున్నే దిగువ తిరుపతికి వెళ్ళారు, మరునాటి ప్రయాణానికి కొన్ని ఏర్పాట్లు చేయించడానికి. ప్రకాశం ఇదే బయటికి రావటం. అతను చాలా వుత్సాహంగా వున్నాడు. ఇద్దరూ స్వామిదర్శనం చేసినమీదట ఉమ 'కాటేజీ'లో కూర్చున్నారు. ప్రకాశం ఉమ మనస్సు తెలుసుకోవడానికి ఇదే సమయం అనుకున్నాడు. ''మీతో ఒక విషయం మాట్లాడదలుచుకుంటున్నాను'' అన్నాడు.

''నేనూ మిమ్మల్నొక విషయం అడగాలనుకుంటున్నాను'' అంది ఉమ, చిరునవ్వుతో. ప్రకాశం ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు.

''ఏమిటది?'' అని అడిగాడు ఉత్సాహంతో.

''మీరింతకు ముందు ఎవర్నైనా ప్రేమించారా ఆసేవా? ప్రేమించడమా?''

''అప్పను కొన్నేళ్ళ క్రిందట ఒకయువతిని ప్రేమించిన మాట నిజమేనా? అబద్ధమాడకుండా చెప్పండి?''

''కొన్ని సంవత్సరాల క్రిందట నేను ప్రేమించిన మాట వాస్తవమే. అయినా ఈ విషయం మీకెలా తెలిసింది?''


''అది తర్వాత చెప్తాను. ఆమెను మీరెందుకు వివాహం చేసుకోలేదు. ఆమెను నమ్మించి మోసం చేశారా?''

''నేను మోసం చెయ్యాలనుకో లేదు గాని, ఆమెతో వివాహం చేసుకోనని చెప్పాను అందుకు ఇప్పుడు విచారిస్తున్నాను''

''ఎందుచేత విచారిస్తున్నారు?''

''ఆమెను నిజంగా ప్రేమించాను ఆ విషయం తరువాత తెలుసుకోగలిగాను. కాని ఆమె పేదదనే వుద్దేశంతో వివాహం చేసుకోకూడదనుకున్నాను. అందుకు ఆమె చాలా బాధ పడింది. అభిమానంతో ఎక్కడికో వెళ్ళిపోయింది కాని అటువంటి యువతి నాకు మళ్ళీ కన్పించలేదు''

(సశేషం)



గాలి విజయలక్ష్మి

నాకు తెలిసిన అమెరికా

నేను అమెరికా వచ్చి నాలుగు నెల లవుతున్నది. క్రొత్తదేశం—క్రొత్త మనుషులు—క్రొత్త వాతావరణం, ఎలా వుంటుందో అని చాల భయపడ్డాను యిక్కడికి రాబోయే ముందు. ఈ దేశంలో నేను తెలుసుకున్న విషయాలు సోదరీమణుల ముందుంచాలని ప్రయత్నిస్తున్నాను. నేను భారతదేశంలో, వున్నప్పుడు, అమెరికా చాల గొప్ప దేశమంటారు, ఎలా వుంటాయో అక్కడి పరిస్థితులు, తెలుసుకోవాలనిపించేది. నా వంటి సోదరీమణులు ఏ కొద్దిమందైనా వుండక పోరు, వాళ్లకైనా, యీనా వ్యాసం వుపయోగపడుతుందని భావిస్తున్నాను.

వాతావరణం

ఇక్కడ అక్టోబరు నుండి మార్చి వరకు చలికాలం. ఏప్రియల్ నుండి సెప్టెంబరు వరకు వేసవికాలం. చలికాలంలో బయట కడుగు పెడితే ఎముకలు కొరికే చలి. బైటకు వెళ్లేటప్పుడు స్వెట్టరు, ఒక బరువైన పెద్ద కోటు, చేతులకు గ్లోవ్స్, మగవాళ్లయితే తలకి టోపీ, ఆడవాళ్ళయితే మఫ్లర్, కాళ్ళకి బూట్లు... ఇత్యాది సరంజామా తగిలించుకుని బయటకి వెళ్ళాలి. ఇన్ని రక్షక కవచాలున్నా గానీ, ఆ చలికి, చలిగాలికి, చెవులు మంటలు, పెదాలు పగలటం, ముక్కుల వెంట నెత్తురుపడటం లాంటివి జరుగుతుంటాయి. ఇక్కడి యిళ్ళు చాల వరకు చెక్కతోనే కట్టబడి వుంటాయి, నేల కూడ చెక్కతోనే పరచబడి ఉంటుంది. ఇటుకతో కట్టిన యిళ్ళు, గచ్చునేల ఉన్న యిళ్ళు కూడ వుంటాయి గాని చెక్కయితే వేడిని నిలవచేస్తుందట, అందుకని చెక్కతో కట్టిన యిళ్ళే ఎక్కువగా వుంటాయి.

ఇక్కడ వేసవికాలం చాల బాగుంటుందట. చలికాలంలో ఎండిపోయి మోడులు బారిపోయిన చెట్లు వేసవి వచ్చేటప్పటికి పచ్చని ఆకులతో రంగు రంగుల పువ్వులతో కళకళ లాడుతూ ప్రకృతి అంతా శోభాయమానంగా వుంటుందట. ఈ సీజన్లో పువ్వులుండవిక్కడ.

వంటా - వార్పు

మన మహిళలో ఉపయోగపడే వస్తువు 'బ్లెండరు' ఇది కరెంటు ద్వారా పని చేస్తుంది. ఏ కొబ్బరి పచ్చడో, కంది పచ్చడో చేయాలంటే దాన్లోకి సరిపోయేవన్నీ దాంట్లో వేసి బండ తీసుకుని పావు గంట వరకు చేతులు నొప్పులు పుడుతూ నూరటమో, రుబ్బటమో చేస్తేగాని పచ్చడిగానీ, పిండి గానీ తయారు కాదు. ఈ బ్లెండరులో మనం వెయ్యవలసిన వన్నీ వేసేసి మూత పెట్టి, స్విచ్ వేస్తే పచ్చడిగానీ, పిండిగానీ, రెండు మూడు నిమిషాలలో తయారవుతుంది. పొడులు—పిండి—పచ్చడి ఏదైన దీని ద్వారా చేసుకోవచ్చు. ఇక్కడ భారతీయులకు ఒక బ్లెండర్ తప్పక వుంటుంది. ఈ బ్లెండర్లను మనం వుపయోగించినంతగా అమెరికనులు వుపయోగించరు. వీళ్ళు మన లాగ ప్రత్యేకంగా వంట తయారుచేసుకోరు. మాంసం, చేపలు, వెజిటబుల్స్ లాంటివన్నీ వుడికించి డబ్బాలో నిలవవుంచి అమ్ముతారు. అవి తెచ్చుకుని వేడి చేసుకుని తింటారు. బ్రెడ్లు 'టోస్టర్'లో వేసేసి, ఆమ్లెటు వేసేసుకుని ఒకటి రెండు పండ్లు, యీ వేడి చేసిన కూరలు వీటితో వీళ్ళ భోజనం అయిపోతుంది. మనకైతే రెండుమూడు గంటలైనా లేనిదే వంట పూర్తికాదు.

మెయిల్ బాక్స్

'మెయిల్ బాక్స్ 'గార్బేజిబాక్స్' ప్రతియింటా వుంటాయి. మెయిల్మాన్ (పోస్టుమాన్) ప్రతి రోజూ కారులో వచ్చి ప్రతి యింటికి వుత్తరాలు మెయిల్ బాక్స్లో వేసి వెళ్తుంటాడు. ఇంటిలో పనికిరాని చెత్త చెదారం మొదలైనవి వేసుకోవటానికి మనకి పెంటకుప్పలుంటాయి. కానీ యిక్కడ అలాంటివన్నీ యీ గార్బేజి బాక్స్లో వెయ్యాలి. ప్రతి మంగళవారం, శనివారం 'గార్బేజి కారు' వస్తుంది. ఈ కారుల ఒక మిషనుంటుంది. ఈ రెండు రోజుల్లోను గార్బేజి బాక్స్లు తీసుకెళ్ళి మనం రోడ్డు ప్రక్కగా పెట్టాలి. ఆ కారులోని మనిషి యీ చెత్తను తీసుకెళ్ళి యంత్రంలో వేస్తాడు. అవన్నీ పిప్పి పిప్పిగా నలిగిపోతాయి. ఇవి తీసుకెళ్ళి ఎక్కడో దూరంగా పారేస్తారు. మంచు పడుతున్నా వాన కురుస్తున్నా, ఏది ఎలాగైనా యీ 'మెయిల్మాన్' 'గార్బేజిమాన్'లు మాత్రం తమ కర్తవ్యం నెరవేరుస్తూనే వుంటారు. వీళ్లే కాదు యీ దేశంలో ప్రతివ్యక్తీ చేయవలసిన పని ఆ టైముకి పూర్తి చెయ్యవలసిందే! సమయం విలువ వీళ్ళకి బాగ తెలుసు ననిపిస్తుంది.

షాపింగ్

ఏదైనా కావాలని షాపింగ్కి వెళ్తారనుకోండి, ఏది వుపయోగమో దానికి సరిపోయిన డబ్బులు మాత్రమే తీసుకెళ్ళి ఆ వస్తువునే కొనుక్కొస్తారు. అదే మనమయితే చూడండి, మనకి కావలసిన వస్తువు వున్నా, లేకపోయినా, మనకి అందంగాను, క్రొత్త మోడల్గాను కన్పించిన వస్తువు అప్పటికప్పుడు కొని యింటికి తీసుకురాకపోతే యింక నిద్రపట్టదు.

ఇక్కడి షాపింగ్ చాల బాగుంటుంది. మనం షాపు లోపలికి వెళ్లేటప్పుడు.. ఒకచోట, ట్రాము బండ్ల లాంటి చిన్న బండ్లుంటాయి. ఒక బండి తీసుకుని నడుపుకుంటూ వెళ్లి అందులో మనకి కావలసినవన్నీ వేసుకుని చివరికి కౌంటర్ దగ్గర డబ్బు చెల్లించి బండి తీసుకెళ్లి సామాను కార్లో పెట్టుకుని మళ్ళీ బండి తీసుకొచ్చి యథాస్థానంలో పెట్టాలి. ఈ బండిలో చిన్నపిల్లలని కూర్చో పెట్టుకోవటానికి ప్రత్యేకమైన అర వుంటుంది. ఇలాంటి షాపులో ఒక 'టైపురైటర్' వంటి మిషనుంటుంది. ఆ మిషన్ నొక్కుతుంటే అదే బిల్లు వేస్తుంది. లెక్కల్లో దిట్టలైనా కూడ కూడికలు తప్పు చేయవచ్చుగానీ యీ మిషన్ మాత్రం తప్పు వేయదు. ఇక్కడ కూరగాయలన్నీ దొరుకుతాయి కానీ మన కాయలంత రుచి వుండవు. వంకాయ మన చిన్నసైజు ఆనపకాయలాగాను, దోసకాయ బెండకాయ సైజులోను బీరకాయ పొట్లకాయ ఆకారంలోను వుంటాయి.

రహదార్లు

కాలిబాటలు పెద్దపెద్ద పట్నాలల్లో ఏమైనా మనకి వున్నాయనుకోండి. రోడ్డును దాటి అవతలికి వెళ్ళాలనుకోండి. మనం నుంచున్న వైపు కాలిబాట చివర ఒక స్తంభం వుంటుంది. దాని మీద ఒక బటను వుంటుంది. ఆ బటను క్రింద, 'రోడ్డు మధ్యగా వెళ్లేటప్పుడు యీ బటన్ నొక్కి, 'వాక్ లైటు' (నడు అనే అక్షరాల ఆకుపచ్చ లైటు వెలుగుతుంది) వచ్చే వరకూ ఆగు' అని వ్రాసి వుంటుంది. ఈ లైటు వెలుగుతున్నప్పుడు నాలుగు రోడ్ల నుండి వచ్చే కార్లు విధిగా ఆగితీరుతాయి. నిరపాయంగా మనుష్యులు అవతలి వైపుకి వెళ్ళవచ్చు. ప్రతి కారుకి సీటు బెల్టులు, ఎక్కడికక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్! ఎన్ని జాగ్రత్తలు, కట్టుబాట్లు చేసినా యీదేశంలో కారు ప్రమాదాలు చాల ఎక్కువ. సంవత్సరానికి 20 వేల మంది యీ కారు ప్రమాదాల్లో చనిపోతారట.

బోయ్ ఫ్రెండ్స్

మనదేశంలో అమ్మాయిలకి 15 ఏళ్ళు వస్తే యిల్లు కదల నివ్వరు తల్లిదండ్రులు. ఈ దేశంలో 15 ఏళ్ళు వచ్చిన అమ్మాయికి 'బోయ్ఫ్రెండ్స్'ని తీసుకురాలేక సతమత మవుతుంటారు తల్లిదండ్రులు. తమ కూతురుకి ఎక్కువమంది మగపిల్లల పరిచయం కావాలని ప్రయత్నిస్తుంటారు. మనలో ప్రేమ—ప్రేమ పెళ్లిళ్లు అరుదనుకోండి, అలాంటివి వుంటే తల్లిదండ్రులకి ఎలా చెప్పాలా అని భయపడ్తుంటారు. కాని యిక్కడ మగపిల్లలుగానీ, ఆడపిల్లలుగానీ యిలాంటి విషయాల్లో తల్లిదండ్రుల సలహా మీదే రెండువాళ్లతో స్నేహం చెయ్యటం కానీ, విడిపోవటం కానీ చేస్తారు. ఒక అబ్బాయి ఒక అమ్మాయిని తనతో పిక్చర్కి గానీ, పార్టీకిగానీ, డాన్స్కిగానీ పిక్నిక్కి గానీ రమ్మని ఆహ్వానిస్తాడనుకోండి. ఇలా యిలా అమ్మాయిలూ అబ్బాయిలూ కలిసి వెళ్ళటానికి 'డేటింగ్' అంటారు. మనలో పెండ్లి జరిగే ముందు బయటి సంబంధమైతే పెళ్లికూతురు పెళ్లికొడుకులకు పెళ్లి చూపులనాడు, పెళ్లిరోజు

తప్పు ఒకళ్ళ కొకళ్ళు తెలియదు అన్నీ నచ్చిన వెను కుంటే ముహూర్తం నిశ్చయించి పెళ్ళి చేసేస్తారు మనపెద్దలు ఇక్కడి వాళ్ళకి యిలాంటి పెళ్ళిళ్ళంటే విడ్డూరంగా వుంటుంది కనీసం నాలుగైదేళ్ళ పరిచయం—ప్రేమ, గ్రంథాలు లేనిదే వీళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోరు మనకి యితరులను ఏమయినా అడగాలంటే ఏమనుకుంటారోనని అనుమానం, బిడియం వుంటాయి కాని వీళ్ళు తమకి వున్న అనుమానం బైట పెట్టేసి నిజం తెలుసుకుంటారు మన కట్టుబాట్లు ఎంతో గమ్మత్తుగా వుంటాయి వీళ్ళకి "నీ భర్త అమెరికన్ లాగ డ్రస్సు వేసుకుంటాడు కదా, మరి నువ్వెందుకు వేసుకోవు? నీ ముఖం మీద ఆ ఎర్రటి దేమిటి? ఎందుకు పెట్టుకున్నావు?" యిలాంటి ప్రశ్న లడుగుతుంటారు

బేబీ సిట్టింగ్

"నువ్వు బేబీ సిట్టింగ్ ఎప్పుడైనా చేశావా విజయా?"

"లేదు మా(డ)మ్."

"కొన్నాళ్ళు చేసి చూడు, ఖాళీగ నే వుంటావుగా నీకూ కాస్త సమయం గడిచి పోతుంది గంటకి 'హాఫ్ డాలర్' యిస్తారు మా 'కాత్యా' ప్రతి ఆదివారం బేబీ సిట్టింగ్ చేసి డబ్బు సంపాదిస్తుంది" ఒక ప్రొఫెసర్ భార్య నోటి నుండి యిలాంటి మాటలు విని ఆశ్చర్యపోయాను భార్య, భర్త యిద్దరూ చదువుకోటంగాని, ఏదైనా పార్టీకి వెళ్ళటంగాని (పార్టీలకి పిల్లలని తీసుకెళ్ళరు) జరిగితే పిల్లలని వాళ్ళు వచ్చే వరకు చూడటానికి ఎవరైనా కాలేజి ఎవరైన ఖాళీగా వున్నారని తెలిసినవాళ్ళని పిలిచి పిల్లలని వాళ్ళకిఅప్పచెప్పుతారు అలా పిల్లలని చూడటాన్ని 'బేబీసిట్టింగ్' అంటారు ఈ బేబీసిటింగ్ చేసినందుకు గంటకి 'హాఫ్‌డాలర్' యిస్తారు దీన్నే మన నిజమైన తెలుగులో 'బేబీ సిట్టర్' అంటే 'నిమనిషి' (ఆయా,దాది కాదు) అని అడుతుంది కాని యీ బేబీ సిట్టర్‌కి మన పనిమనిషికి చాల తేడా వుంది ఈ బేబీసిట్టర్ ఒక చుట్టంలాగ గౌరవంగా చూడబడుతుంది ఇక మన పనిమనిషి ఎలా చూడబడుతుందో నేను చెప్పక్కరలేదనుకుంటాను ఒక ప్రొఫెసర్ కూతురు బేబీ సిట్టింగ్ చేస్తే, చేసేవాళ్ళకిగాని, చూసేవాళ్ళకిగాని న్యూనతగాని, ఇబ్బందిగాని వుండదు పిల్లలకి చిన్నప్పటి నుండి డబ్బు సంపాదించే మార్గాలు, తెలియాలని అనుభవం వుంటుందని వాళ్ళ అభిప్రాయం

ఇంతగా పురోభివృద్ధి గాంచిన యీదేశం అంటే అసూయ వేస్తుంది నాకు అప్పుడప్పుడు అలవాట్లు పద్ధతులు, సంస్కృతి, సాంప్రదాయాల్లో మొదటి నుండి మనకీ, వీళ్ళకి ఎంతో తేడా వుంది

అర్థం చేసుకునేంత వీలుగ వ్రాయగల్గానో లేదో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తారు కదూ! ●

వనితలు-వెన్నుపోట్లు

వెన్నుపోటు, నడుము పట్టడం, బెణకడం ఇవన్నీ దాదాపు ఒక జాతికి చెందినవే

ఆడవాళ్ళు సర్వ సామాన్యంగా వెన్నుపోటుతో బాధపడుతూ వుండడంకద్దు జీవిత పర్యంతం ఇలానే బాధపడుతూ వుండాలేమోనని చాలమంది అనుకొంటూ వుంటారు వైద్యశాస్త్రవేత్తలు దీనిమీద కొంత పరిశోధన చేశారు ఈ వెన్నుపోట్లల్లో ఇరవై శాతం వెన్నుపూసకు అంకురించిన జబ్బులవల్ల, వెన్నెముకకు సంబంధించిన కొన్ని లోపాలవల్ల వెన్నుపోటు కలుగుతుందని వారు నిర్ధారణ చేశారు

శరీరంలో బిగువు లేకపోవడం, కండరాల బలహీనత, సక్రమమైన అంగ విన్యాసంలేకపోవడంవల్ల సరిఅయిన వ్యాయామం కొరతపడ్డంవల్లను ఈ వెన్నుపోటు తరచు రావడానికి ఆస్కారంవుంది వైద్యశాస్త్రవేత్తలు పరిశీలన చేసినదానిని బట్టి వెన్నుపోటుకు శారీరకమానసిక ఉద్రిక్తతలు,కండరాల బలహీనత, ముఖ్యకారణాలని రూఢిగాతెలుస్తోంది

డాక్టరుకు—రోగికి బాగా సన్నిహిత సంబంధ మున్నట్టయితే వెన్నుపోటుకు చల తేలికగా పసిగడతారని, పోటును తగ్గించేందుకు చక్కని చికిత్స చేయడానికి అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు రోగితో అంతగా పరిచయం లని డాక్టరు వెన్నుపోటు కారణాన్ని వెంటనే కనిపెట్టలేడని దీని అర్థం!

మరీ విపరీతంగా వుండే వెన్నుపోట్లని తగ్గించడం కష్టం ఈ వెన్నుపోటు, కూర్చోవడం సరిగ్గా లేకపోతే నొప్పి ఎలాపెడుతుందో అంతటి చిన్నదిగాను వుంటుంది ఒకోసారి కీళ్ళవాతంవల్ల కలిగే నొప్పులంత అపరిమితంగాను వుంటుంది వెన్నుపోటుకు ఉపశమనం కలగాలంటే ఆ ప్రాంతంలో వున్న కండరాల్ని బంధించాలి నడుం కట్టు బాగా పని చేస్తుంది ఇలా నివారించబడని వెన్నుపోటు, శస్త్ర చికిత్సకు లోనవుతున్నంత బాధను కలిగజేయడానికి కూడా అవకాశం వుంది

శరీరంలో ఏ భాగమైన జబ్బుపడి వున్నప్పుడు వెన్నుపోటు అప్పుడప్పుడు వస్తూ వుంటుంది మూత్రపిండంలో రాళ్ళు, లేదా ఆ సంబంధమైన వ్యాధులవల్లను, న్యూమోనియా, ఇన్‌ఫ్లుయెంజా లాంటి అంటు రోగములవల్లను వెన్నుపోటు అధికం అవుతుంది

అద్దమే చెబుతుంది!

తరచు వెన్నుపోటుతో బాధపడుతున్న స్త్రీలు నిలువుటద్దంముందు కూర్చున్నట్టయితే ఆసౌఖ్యంగా ఎక్కడ, ఏ వైపున బాధ పడుతున్నారో తెలుసుకోవడం తేలిక నిలబడే తీరు, నడిచే వైఖరి వీటిమీద కూడా వెన్నుపోటు ఆధారపడి వుంటుంది నడిచేటప్పుడు, నిలబడినప్పుడు తల వ్రేలాడేసుకోవడం మంచిదికాదు ఋంటి భాగం కంటె మోకాళ్ళు క్రిందికి వంచుకుని, ముందుకువంగుని కూర్చోవడం మంచిదికాదు బాగా ఎత్తు మడమల చెప్పులు ధరించడమంతకంటె మంచిదికాదు శరీరం బరువును మోయలేనంతబలహీనమైనదావెన్నెముక?

ప్రతివారికి పరుపులు కావాలికాని, వెన్నుపోటున్న వారికి ఎక్కువ సదుపాయమయిన ఆలంబనం కావాల్సి వుంటుంది అని ప్రఖ్యాతి వహించిన డా మార్విన్ ఓర్న్స్ అన్నారు

ఉన్నితో తయారయిన పరుపులు మంచివే వెన్నుపోటున్నవాళ్ళు 'ప్లైవుడ్ బెడ్‌బోర్డు'ను ఉపయోగించడం మంచిది ఇది చాలా చవకకూడాను విరివిగా దొరుకుతుంది పరుపుకు, స్ప్రింగులకు మధ్య బాగా దొర్లాడుతుంది

ఇంత సదుపాయంగా నిద్రించినా, ప్రతి ఉదయం వెన్నుపోటు వస్తున్నట్టయితే పడుకున్న తీరును గమనించడం ముఖ్యం ఒక ప్రక్కగా పడుకొన్నట్లయితే వెన్నుపోటున్నవాళ్ళకు మంచిది కాని చేతిని తలక్రిందగాని, తలమీదగాని ఉంచుకోకూడదు బాగా ఎత్తుగా ఉన్న తలగడ, మెడను వంచేస్తుంది అంతతో భుజాలు, చేతులు నొప్పి పుడతాయి తలపోటు, భారంగా కూడావుంటుంది చదునుగా పడుకోవడం, లేదా వెల్లకిలా పడుకోవడం ద్వారా వెన్నుపోట్లు ప్రారంభమవుతాయి బోర్లా పడుకోవడంకంటె చెడ్డది మరొకటిలేదు

ఇస్త్రీ చేసుకునేప్పుడు, వంట చేసుకునేప్పుడు స్త్రీలు ఎక్కువగా నిలబడాల్సివస్తుంది అటువంటప్పుడు ఒక కాలు చిన్న స్టూలుమీదగాని, అంత ఎత్తయిన దేనిమీదనన్నా వుంచుకుని పని చేసుకున్నట్టయితే వెన్నుపోటు అదుపులో వుంటుంది నడుంవంచి పనిచేయవలసి వచ్చినప్పుడు మోకాళ్ళ మీద కూర్చుని పనిచేయడం మంచిది ఎట్టి పరిస్థితుల్లోను నడుంవంచడం మంచిది కాదు!

మరికొన్ని సలహాలు

వెన్నుపోట్లు ఎందుకు వస్తుంటాయో వివరిస్తూ, వాటిని పోగొట్టేందుకు సూచనలిస్తూ డా ఓర్న్స్ ఒక పుస్తకాన్ని రచించారు ఆపుస్తకం పేరు 'ఏ వుమన్స్ గయిడ్ టు బేక్ కేర్' డా ఓర్న్స్ వెన్నుపోటును గురించి ఎంతో పరిశోధనలుచేసి ఈ గ్రంథాన్ని రూపొందించారు అందులో ఇచ్చిన కొన్ని సూచనలు

నరాల ఉద్రిక్తతను అదుపులో ఉంచుకోవాలి మరీ పిచ్చెత్తినట్టు వ్యవహరించకూడదు అహంకారాన్ని, ఉక్రోషాన్ని అదుపులో వుంచుకోవాలి నిర్విచారంగా వుండాలి (బాధ విపరీతంగా వచ్చినప్పుడు వెంటనే డాక్టర్ని కలుసుకుని ఉపశమనానికి తగిన చికిత్సను పొందడం ముఖ్యం) రోజూ వ్యాయామం చేస్తున్నట్లయితే, ఎప్పుడైనా ఎక్కువ పని చేయాల్సివచ్చినా భరించవచ్చు బహిష్టుకాలంలో ఎంత నడిస్తే అంత మంచిది

స్త్రీలు బిగుతయిన ఉడుపులు ధరించడం వల్ల మేలు కలుగుతుంది బిగుతయిన బట్టలు కండరాల్ని ఒత్తి, వెన్నెముకకు బలాన్ని కలిగించి తరచు వెన్నుపోట్లు రాకుండా సంరక్షిస్తాయి. —ఇన్‌సా ●

సీరియల్

రామశాస్త్రి

వి. ఎస్. సుక్తాంకర్

12

(జరిగిన కథ: మరాఠా సామ్రాజ్యం పీష్వా నారాయణరావ్‌ని రఘోబా హత్య చేయిస్తాడు. నారాయణరావ్ అంతరంగిక రక్షకభటుడయిన సంతాజీ, అతని భార్య శ్యామా స్వామిరక్షణ ప్రయత్నంలో విఫలు లవుతారు. కాని సంతాజీ ఆదేశం ప్రకారం శ్యామా హంతకుల కుట్ర రహస్యాన్ని భేదించటానికి మరాఠా సామ్రాజ్య ప్రధాన న్యాయమూర్తి రామ్‌శాస్త్రిని ఆశ్రయించి కృతార్థురాలవుతుంది. నారాయణరావ్‌ను చంపమని రఘోబా ఇచ్చిన ఆజ్ఞాపత్రాన్ని రామ్‌శాస్త్రి చేజిక్కించుకుంటాడు.)

"ఆగండి! దాదాసాహెబ్‌గారూ, బాజీరావ్, నానాసాహెబ్‌లవంటి మహనీయులు అలంకరించిన ఈ పవిత్ర పీష్వా సింహాసనాన్ని అధిష్టించేముందు మరొక్కసారి ఆలోచించి చూడండి!"

రాం, పీష్వా సింహాసనాధిష్ఠానాన్ని చూడటానికి వచ్చిన సభాసదు లందరూ ఈ మాటల్ని విని అదిరి పడ్డారు. సింహాసనం మెట్లు ఎక్కబోతున్న రఘోబా (దాదాసాహెబ్) కూడా ఆశ్చర్య చకితుడయి వెనక్కి తిరిగి చూశాడు, ఎవరు తనని ఈ విధంగా సంబోధించిన దన్నట్టు. అందరికళ్ళూ ప్రధాన న్యాయమూర్తిపై ఉన్నాయి. బహిరంగసభలో కాబోయే పీష్వాని 'అంత నిర్భయంగా సంబోధించగలిగినది రామ్‌శాస్త్రి తప్ప మరెవరు?' అన్న ఆలోచన అందరికీ కలిగింది.

రఘోబా కోలుకోవటానికి ఎక్కువ సేపు పట్టలేదు.

"సమ్మతిని ప్రశ్నించే అధికారం మీకెవరు ఇచ్చారు?" అని అరిచాడు కోపంతో వణికిపోతూ. "మీరెవరు? మంత్రాలు పఠించుకునే బ్రాహ్మణులు కదూ! మహా యోధుడుగా పేరు పొందిన నన్ను అవమానిస్తున్నావా! రఘోబా అంటే అఖిల భారతదేశమూ దద్దరిల్లిపోతుంది తెలుసా?!"

రామ్‌శాస్త్రి చలించలేదు. "ఇది న్యాయదేవత వాక్కు!" అన్నాడు ప్రశాంతంగా. "ఇది మానవాతీతమయిన శక్తిగల న్యాయదేవత ఇచ్చిన అధికారం దాదాసాహెబ్‌గారూ! ఈ పవిత్ర సింహాసనాన్ని పంకిలం చెయ్యవద్దని శాసిస్తున్నది!—

"దాదాసాహెబ్! మీరు హంతకులు! ఈ సింహాసనం అధిష్టించే అర్హత మీకు లేదు."

రామ్‌శాస్త్రి ఈ ఆరోపణకి సభలోని వారంతా మరింత అదిరిపోయారు. రఘోబా ఒక క్షణం నిరుత్తరుడయ్యాడు. వెంటనే తేరుకొని కత్తి పిడి మీద చెయ్యి వేశాడు.

"శాస్త్రీ జాగ్రత్త!! ఈ భద్రంగానే నీ నాలుక తెగ కోసెయ్యగలను! దేని ఆధారం చేసుకుని ఈ ఘోరమయిన ఆరోపణ చేస్తున్నావు? చెప్పు!" అని గర్జించాడు.

"నా కర్తవ్యం నెరవేర్చినట్లయితే ప్రాణహాని కలుగవచ్చునని నాకు తెలుసు. మరాఠా సామ్రాజ్యం ప్రధాన న్యాయమూర్తిగా నా విధిని నెరవేరుస్తున్నాను.

"అమాయకుడయిన నారాయణరావ్‌ని హత్య చేయించిన ఘాతకుడు నన్ను చంపటానికి వెనుదియ్యడని నాకు తెలుసు. కాని కర్తవ్య నిర్వహణం కన్నా నా ప్రాణం ముఖ్యం కాదు!—

"ఇదిగో రుజువు!" అని రామ్‌శాస్త్రి జోహార్‌సింగ్ దగ్గర్నుంచి తెచ్చిపెట్టుకున్న రహస్య పత్రాన్ని బయటకి తీసి సభాసదులందరికీ కనిపించేట్లు పైకి ఎత్తి పట్టుకున్నాడు.

"ఇదిగో మీరు నారాయణరావ్‌ని చంపమని గార్దీలకి ఇచ్చిన ఆజ్ఞాపత్రం! మా ప్రభువు నారాయణరావ్ పీష్వాగారిని హత్య చేయించింది మీరేనని స్పష్టంగా తెలిపే రుజువు ఇదే!"

సభ 'హాహా' కారాలతో నిండిపోయింది.

రామ్‌శాస్త్రి అంతటితో ఆగలేదు. అక్కడ సమావేశమయిన పెద్దలని ఉద్దేశించి ఇంకా ఇలా చెప్పుకుంటూ పోయాడు—

"పీష్వా నారాయణరావ్‌గారి ప్రాణానికి ప్రమాదం కలుగ వచ్చునని అనుమానం కొంతకాలంగా వారి అంతరంగికులలో చాలా మందికి కలుగుతూ వచ్చింది. కాని ఈ అనుమానాన్ని వెలిబుచ్చే అవకాశం వారికి రాలేదు. గాఢ విశ్వాసం కలవారు కొందరు మాత్రం తమకి వీలయినంతలో కట్టుదిట్టాలు చేశారు.

"వారిలో సంతాజీ ఒకడు. సంతాజీ శౌర్యం, స్వామిభక్తి మీకు తెలియనివి కావు! అన్ని వేళలా అప్రమత్తుడయి తన ప్రభువుకి ఏ అపాయమూ రాకుండా కాపాడాలని చూసేవాడు.

"గార్దీలు రాజభవనం మీద పడిన రోజు అతను వారిని అరికట్టాలని ఎంతో ప్రయత్నించాడు. తన భార్య శ్యామాతో చెప్పి నారాయణరావ్ వారి సతీమణి గార్దీల చేతిక్కకుండా ఉండేందుకు కట్టుదిట్టాలు చేశాడు! తన ప్రాణాన్ని లెక్క చెయ్యకుండా గార్దీలని ఎదిరించాడు. అధిక సంఖ్యాకులయిన వారి ధాటికి సంతాజీ, అతని అనుచరులు తట్టుకోలేక పోయారు.

"గాయపడి కొనవూపిరితో ఉన్న సంతాజీ మరణించాడనుకుని గార్దీలు కొందరు అజాగ్రత్తగా తమ రహస్యాలు బయటకి చెప్పుకున్నారు. దాదాసాహెబ్ వారి స్వభావం బాగా తెలుసుకున్న గార్దీ నాయకుడు ఒకడు, పీష్వా వారిని చంపమని ఇచ్చిన రహస్య ఆజ్ఞాపత్రం వదిలిపెడితే కాని తమకే ప్రమాదం రావచ్చునని ఊహించి తన అనుచరుడయిన జోహార్‌సింగ్‌ని దానిని దాచమని చెప్పాడు.

"జోహార్‌సింగ్ ఆ పత్రాన్ని ఒకచోట దాచాడు. ఆ రహస్య స్థలమేదో తెలుసుకునే బాధ్యత సంతాజీ తన భార్య శ్యామాకి అప్పగించాడు. ఒక పక్క భర్త మరణిస్తున్నా అతని ఆజ్ఞని శిరసా వహించి అతి సాహసంగా జోహార్‌సింగ్‌ని అనుసరించి అతని రహస్య స్థలం ఏదో తెలుసుకుంది వీర వనిత శ్యామా!

"అయితే దురదృష్టవశాత్తు తిరిగి రాజభవనంలోకి భర్తని చూడాలని వెళ్ళినప్పుడు గార్దీల చేజిక్కింది. వారామెని కారాగృహంలో బంధించారు. ఆమె కేమి రహస్యాలు తెలుసునో అని అనుమానించి వాటిని రాబట్టాలని ప్రయత్నించారు! వారి ప్రయత్నాలు ఫలించలేదు.

"తిలాంజలి జరిగిన నాడు నేను స్నానంనుంచి తిరిగి వస్తూ వుండగా ఒక స్త్రీ వచ్చి నా కాళ్ళ మీద పడి ఒక అర్జీ పెట్టుకుంది. ఆ స్త్రీ శ్యామా! ఎంత స్వామిభక్తి లేకపోతే ఆమె తన కారాగృహం లోనుంచి రాజభవనం చుట్టూ వున్న కందకంలోకి దూకి, దానిని ఈది ఇలా వచ్చి అర్జీ పెట్టుకుంటుంది?

"జరిగినదంతా నాతో చెప్పింది. అదే సమయంలో కొత్వాల్ అటు వచ్చాడు. మేమంతా శ్యామా తీసుకు వెళ్ళిన ప్రదేశానికి వెళ్ళి జోహార్‌సింగ్‌ని బంధించి ఈ రహస్య ఆజ్ఞాపత్రాన్ని చేజిక్కించు కున్నాను.

"మేము సాక్ష్యాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించాము! పీష్వా నారాయణరావ్‌ని దారుణంగా హత్య చేయించిన వ్యక్తి రఘోబా అని నిస్సందేహంగా చెప్ప గలుగుతున్నాను.

"ఇక చెప్పండి దాదాసాహెబ్‌గారూ! మీకు ఈ పవిత్ర సింహాసనాన్ని అధిష్టించే అర్హత ఉందో లేదో!"

రఘోబా తన ధీమాని కొంత కోల్పోయాడు.



రామ్‌శాస్త్రి వైపు రెండడుగులు వేసి అతి వినయంగా ఇలా అన్నాడు "ప్రధాన న్యాయమూర్తి గారూ! రాజనీతిలో ఎన్నో రకాల ఉపాయాలని ప్రయోగించవలసి వస్తుంది పరిస్థితులని బట్టి ఎదుమకుంటూ వుంటాము! మీరు ప్రధాన న్యాయమూర్తులు! మాకు తగిన ప్రాయశ్చిత్తాన్ని మీరే నిర్ణయించండి! ఎంత వ్యయమయినా వెల లెక్కచెయ్యము!"

— "అవును ఇటువంటి సంప్రదాయం మనకి కొత్తకాదు! సాధారణ మానవులు చేస్తే మరణ శిక్ష పడే నేరాలు రాజులు చేసినప్పుడు వారిని తీర్థ యాత్రలకి పంపి, యజ్ఞాలు చేయించి వదిలి వెయ్యలేదా?' అనుకున్నారు కొందరు.

— "ఇది మంచి సంప్రదాయం కాదు! దీనిని నిర్మూలించటమే మంచిది! ధర్మదేవత ముందు అందరూ సమానులేకదా!" అనుకున్నారు మరి కొందరు

—"రఘోబా మంచి ప్రశ్నవే వేశాడు రామ్‌శాస్త్రిగారు పాత అలవాటుని కాదనగలరా?" ఇంకా కొందరు ఇలా అనుకున్నారు.

రామ్‌శాస్త్రి తన మామూలు ప్రశాంత ధోరణి తోనే జవాబు చెప్పాడు· "మీరే ప్రాయశ్చిత్తం ఏమిటో చెప్పమన్నారు. అయితే వినండి!. . ... దేహాంత ప్రాయశ్చిత్తమే మీకు తగినది! ధర్మ శాస్త్రాలు మీకు విధించే ప్రాయశ్చిత్తం ఇదే."

నిశ్శబ్దంగా ఉన్న ఆ సభలో రామ్‌శాస్త్రి మాటలు పిడుగు పడినట్లు పడ్డాయి

రఘోబా ఈ ప్రాయశ్చిత్తం విని క్రుంగి పోయాడు తనని క్షమించ వలసిందని కొంతసేపు వేడుకున్నాడు రామ్‌శాస్త్రి ధృఢవైఖరిని కనిపెట్టి శ్రుతి మార్చాడు "మీరు నా మీద దారుణమయిన అపనింద మోపినా మేము ఆ సంగతిని మరచిపోవటానికి సిద్ధంగా ఉన్నాము! జరిగిందేదో జరిగిపోయింది, మీరు ప్రధాన న్యాయమూర్తిగానూ మేము పీష్వాగాను స్నేహ భావంతో మెలగ వచ్చు!" అన్నాడు.

"నిజమే రామ్‌శాస్త్రిగారూ! రఘోబా చెప్పేది సమంజసంగానే ఉంది!" అని సమర్థించ బోయారు సభలోని ఒక ప్రభువు మరికొందరు కూడా అదే మాట అన్నారు

"దాదాసాహెబ్! మీరు నన్ను ప్రధాన న్యాయమూర్తి పదవినుంచి తొలగించనని అంటున్నారు. ఈ విధంగా నన్ను మభ్యపెట్టాలని చూస్తున్నారు కాని, నేనే ఈ ఉద్యోగానికి రాజీనామా ఇస్తున్నాను. అంతేకాదు హంతకుడు పరిపాలించే ఈ మరాఠా రాజ్యంలో నేనిక నివసించను!!'

రామ్‌శాస్త్రి ఈ మాటలని నెమ్మదిగానే అన్నాడు కాని అవి ఆ సభలో పెద్ద కోలాహలాన్నే కలిగించాయి. ఎవరికి తోచినట్లు వారు ఏవేవో అనుకుంటూ ఉండగా రామ్‌శాస్త్రి ఆ సభని వదిలి వెళ్లిపోయాడు.

(సశేషం)

వారఫలం

24-3-1967 శుక్రవారం మొదలు 30-3-1967 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభించగలదు. వ్యాపారంలో క్రొత్తవారి పోటీని ఎదుర్కోవలసి వస్తుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. కాని గౌరవం బాగా ఉంటుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించగలదు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృషభం : మీరు ఎంతగానో ఆశించిన వ్యవహారాల్లో ఫలితం సామాన్యంగా ఉంటుంది. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగా ఉంటాయి. పోటివారితో మాట పట్టింపులు తగవు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది. ప్రయాణాలు ఫలించగలవు.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మిథునం : వ్యాపారవిస్తరణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభించగలవు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. బంధువులకు సహాయం చేస్తారు.

కర్కాటకం : భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సమయానికి ఏదో ఒకవిధంగ డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు. కోర్టు వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. పొరుగువారిలో గౌరవం లభిస్తుంది.

సింహం : వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాలు ఊహించని సంఘటనలు జరుగుతాయి

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య : ఈ వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చిక్కులు ఏర్పడి తరువాత సర్దుకొంటాయి. వ్యాపారంలో ప్రయోజనకరమైన వ్యక్తులను కల్సుకొంటారు. అధికవ్యయం జరగడంవలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—స్వల్ప అనారోగ్యం చేస్తుంది. ప్రయాణాలు వాయిదా వేస్తారు.

తుల : వృత్తి వ్యాపారాల్లో మీరు ఇదివరలో చేసిన ప్రయత్నాలు ఇప్పుడు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభిస్తాయి. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు ఏర్పడతాయి. ఉద్యోగంలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. మిత్రుల సహాయం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. దైవకార్యాలు నెరవేరుతాయి.

వృశ్చికం : ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాలు వల్ల మున్ముందు కూడా ఉపయోగం ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహిత్య కళా రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారాంతంలో వృత్తిరీత్యా పరిస్థితి ఏర్పడుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ధనుస్సు : ఇదివరకు మీకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు విరివిగా నెరవేరుతాయి. బంధువులకు సహాయం చేస్తారు.

మకరం : కొన్ని వ్యవహారాల్లో మీ లాభాలకు మనుష్యులే మిమ్మల్ని మోసం చేయగల ప్రమాదం ఉంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో మంచి పరిస్థితి ఏర్పడుతుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. నూతన వ్యాపారాలు లాభిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కుంభం : ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనిపించిన అనుకూలత ఆఖరు వరకు నిలవదు. వృత్తిలో మీరు ఇదివరకు కొన్ని వ్యవహారాలు నిర్లక్ష్యం చేయడంవలన ఇప్పుడు ఇబ్బంది కలుగుతుంది. ప్రయాణాల్లో శ్రమ అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—ఆడంబరంకోసం వ్యయం చేస్తారు. బంధు మిత్రులను కల్సుకొంటారు.

మీనం : వృత్తి వ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. ఇతరుల మీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. పోటీవారితో మాట పట్టింపులు తగవు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.


—మహేష్

మెదడుకి మేత



డాక్టర్ మహీధర నళినీ మోహన్


పెనిసిళ్ళు




(క)ఒకడు పెనిసిళ్ళు కొందామని ఒక దుకాణంలోకి వెళ్ళాడు. ధరలన్నీ వస్తువుల పక్కనే వ్రాసి ఉన్నాయి. ఎవరినీ ప్రత్యేకించి అడుగనక్కర లేదు. అతని పర్సులో రూపాయి లోపున కొంత చిల్లర ఉంది. ఒక పెనిసిలు తీసుకుని, పర్సులో నుంచి ఆరు నాణెములు తీసి, కొట్టు యజమానికి ఇవ్వబోయాడు. అంతలో జ్ఞాపకం వచ్చింది, తన కొడుక్కి కూడా ఒక పెనిసిలు అవసరం అని. సరేనని రెండు పెనిసిళ్ళు తీసుకుని, వాటి ధర సరిగ్గా 5 నాణెములలో ఇవ్వబోయాడు. అంతలో మళ్ళీ జ్ఞాపకం వచ్చింది, తన కూతురికి కూడా ఒక పెనిసిలు అవసరమని. పోని లెమ్మని మూడు పెనిసిళ్ళు తీసుకుని, వాటి ధర సరిగ్గా 4 నాణెములలో ఇవ్వబోయాడు. అంతలో చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. మరో పెనిసిలు అదనంగా ఇంట్లో ఉండడం మంచిది అని తోచి, నాలుగు పెనిసిళ్ళు తీసుకుని, వాటి ధర సరిగ్గా 3 నాణెములలో చెల్లించి బయటికి వచ్చాడు ఆ పెద్ద మనిషి, తన తటపటాయింపులు చూచి నవ్వుకుంటున్న దుకాణదారుకేసి చూడకుండా.

ఇంతకీ అతడి పర్సులో ఏయే నాణెములున్నాయో ఒక్కొక్క పెనిసిలు ఖరీదు ఎంతో వూహించగలరా?

భూతద్దం



(చ) నాలుగు రెట్లు పెద్దదిగా కనబరచే భూతద్దములో నుంచి చూస్తే 1 న్నర డిగ్రీల కోణం ఎంత పెద్దదిగా కనిపిస్తుంది?



* * *

(ట)గాఢ చిత్రంలో వున్న పరమశివుని జటాజూటంలో అమరి ఉన్న నెలవంకను వినాయకుడు, కుమారస్వామి, పూడబెట్టి, ఆడుకోడానికి తీసుకు పోయారు. కొంతసేపు అయాక వాటితో వారికి వివాదం వచ్చింది.

నెలవంక



నెలవంకతో ఇద్దరూ కలిసి ఆడుకోవడం మానేశారు. కుమారుడు కత్తి దూసి, నెలవంకను తిన్నగా ఒక్క కోత కోశాడు వినాయకుడు తక్కువ వాడా? తాను కూడా కత్తి తీసుకుని నెలవంక మీద తిన్నగా మరొక్క కోత కోశాడు. తమాషా ఏమిటంటే ఆ రెండు కోతలవల్లనూ నెలవంక ఆరు ముక్కలై పోయింది! తరువాత పార్వతీదేవి వచ్చి, పిల్లలను కోప్పడి, ఆ ముక్కలను అతికి శివుడు నిద్రలేకముందే చడీ చప్పుడూ కాకుండా తలమీద అమర్చేసింది అనుకోండి, అది వేరే కథ. ఇంతకీ రెండే రెండు తిన్నని కోతలతో ఇక్కడి బొమ్మలో చూపిన నెలవంకను ఆరు ముక్కలుగా చేయడం ఎలా సాధ్యమో మీకు తెలుసా? (అన్నట్లు, వ్యాసుడు వ్రాసిన 18 పురాణాలూ కాక, విశ్వామిత్రుడు 19 వ పుక్కిటి పురాణం వ్రాశాడు. ఈ కథ అందులోనిది)

ఏది కావాలి?



(త)ఒక భాగ్యవంతునికి లేక లేక కొడుకు పుట్టిన సందర్భంలో దానం చెయ్యాలని బుద్ధి పుట్టింది. ఒక కుంచం నిండుగా నిప్ప వెండి రూపాయలు, మరో కుంచం నిండుగా వెండి పావలా కాసులూ పోసి, సిద్ధంగా ఉంచాడు. పొద్దున్నే మొట్టమొదటగా తనకు ఎదురుపడి దారేపోయే దానయ్యను తన ఇంటికి తీసుకు వచ్చాడు.

"కుంచెడు రూపాయలు కావాలా? కుంచెడు పావలాలు కావాలా?" అని అడిగేడు.

దానయ్య ఉక్కిరిబిక్కిరైపోయాడు. తనకు ఇంతటి అదృష్టం పడుతుందని అతడు కలలో కూడా వూహించలేదు.

"కుంచెడు రూపాయలే కావాలి!" అని వెంటనే చెప్పేశాడు. ఆ డబ్బు అంగవస్త్రంలో మూట కట్టుకుని ఇంటికి వెళ్ళేడు.

సంగతి అంతా విని దానయ్య భార్య ముక్కుమీద వేలు వేసుకుంది. "కుంచెడు పావలాలే అడగలేక పోయారుటండీ!" అంది.

దానయ్య మరోసారి విస్తుపోయాడు.

ఇంతకీ ఏది కోరుకుంటే లాభం?

జవాబులు


(క). 50 పై., 25 పై., 10 పై., 5 పై., నాలుగు పైసలూ అతడి పర్సులో ఉన్నాయి. ఒక్కొక్క పెనిసిలు ఖరీదు 19 పైసలు. ఒక్క పెనిసిలు కొంటే 10, 5, 1, 1, 1, 1, నాణెములు ఇవ్వవచ్చు. రెండుకొంటే 25, 10, 1, 1, 1, నాణెములు మూడుకొంటే: 50, 5, 1, 1 నాణెములు, నాలుగుకొంటే: 50, 25, 1, నాణెములు ఇవ్వవచ్చు.

(చ) $1\frac{1}{2} \times 4 = 6$ డిగ్రీలు అని మీ సమాధానం అయితే తప్పులో కాలువేశారన్న మాటే, భూతద్దం వస్తువులను పెద్దవిగా చేసి చూపగలదే కాని, కోణములను పెద్దవిగా చేయదు.



భూతద్దంలో నుంచి చూస్తే చాపం నాలుగు రెట్లు పెద్దదిగా కనిపిస్తుంది నిజమే కాని, వ్యాసార్థము కూడా నాలుగు రెట్లే పెరుగుతుంది కనుక, కోణం మారకుండా స్థిరంగానే ఉంటుంది.


(ట) నెలవంకను రెండే రెండు ఋజురేఖలతో ఇక్కడి బొమ్మలో చూపినట్లు ఆరు భాగాలుగా చేయవచ్చును.



(త) కుంచెడు పావలాలే ఎక్కువ లాభం. ఏమంటే రూపాయలకన్న పావలాలు సైజులో చిన్నవి, పలుచగానూ ఉంటాయి. కనుక కుంచంలో రూపాయల మధ్య మిగిలిపోయే ఖాళీజాగాకన్న పావలాల మధ్య మిగిలే జాగా చాలా తక్కువ. నిజంగా లెక్క పెట్టి చూస్తే కుంచంలో పట్టే రూపాయల సంఖ్యకి సుమారు ఆరు రెట్లు పావలాలు కుంచంలో పడతాయి. కనుక పావలాల విలువ రూపాయలకు $1\frac{1}{2}$ రెట్లు అవుతుంది. సుమారుగా పావలా కన్న చిన్న నాణెం— వెండితో చేసినది మరి ఒకటి ఏదైనా వుంటే— మాట వరుసకు వెండి పైసలు కనుక ఉంటే— వాటిని కుంచంతో కొలిస్తే పావలాల కన్న, రూపాయలకన్న ఎక్కువ విలువైనవి అయి వుంటాయి!

అనూహ్యం

చుక్కారెడ్డి



"ఎంత కావాలన్నావు అన్నయ్యా?" మంజుల వంటింట్లోంచి బయటికి వస్తూ అడిగింది.

సారథి నీరసంగా నవ్వాడు.

"అవి లేకపోయాక ఎంతయితే ఏంలే అమ్మా! ఇప్పుడు ఏమవి ప్రయోజనమేమిటి?"

"కాదులే! చెప్పు. ముందు నువ్వెంత కావాలో చెప్పుటూ!" అంది మంజుల సారథి ఎదుట ఉన్న చాపమీద కూర్చుంటూ.

"అయిదొందలబ్బా ఏంటి?

"అవి కడితే ఉద్యోగం వస్తుందన్నవాడు కాయమేనా?"

"ఎందుకు రాదూ! చిన్నగనక ఉండి ఉంటే ఈ పాటికి చేరిపోయేవాణ్ణి. చిన్న దుర్గారావ్ కూడా లేడాయె. ఇవాళ వస్తాడు గావును. కాని అతను వచ్చేదాకా మనకోసమే ఎదురు చూస్తుంటుందా ఉద్యోగం. సమయానికి అన్నీ అలా కలిసివస్తాయి. మేనేజరుతో అంతడబ్బు ఇచ్చుకోలేనని చెప్పి వొచ్చేశాను." అన్నాడు సారథి.

మంజుల మాట్లాడలేదు. ఏమిటి కొంగు ముడివిప్పి అయిదువందల రూపాయల కాగితాలు తీసి అందించింది.

సారథి ఆశ్చర్యంగా చూశాడు.

"ఇంతకూ ఏదెక్కడిది?" సందేహంగా అడిగాడు వాటినందుకుంటూ.

మంజుల నవ్వి "చిన్న లలిత దగ్గర తీసుకొచ్చాను. డబ్బు అవసరం ఉంది. అనగానే ఎందుకూ అని అడగకుండా తీసిచ్చింది. లలిత మంచిదమ్మాయి కదూ అన్నయ్యా!" అంది.

సారథి మాట్లాడలేదు. అడగ్గానే ఎంతంటే అంత ఇస్తున్న లలిత మంచితనం గురించి ఆలోచిస్తున్నాడు. రోజు రోజుకీ ఆమె పట్ల పెరుగుతున్న కృతజ్ఞతా భారంతో క్రుంగి పోతున్నాడు.

"మాట్లాడవేం అన్నయ్యా! లలిత మనింట్లో ఉంటే బాగుండదూ!" మంజుల రెట్టించింది.

"ఎందుకు బాగుండదూ? కాని ఆమెగారేమో తమింటికే రమ్మంటున్నదామె!" అన్నాడు సారథి నవ్వుతూ.

"ఇప్పుడలానే అంటుందిలే. ఓ రోజు మనింటికే వస్తానని ప్రాధేయపడక పోతే చూడు సర్లే. గాని భోజనానికి లే అన్నయ్యా! చెప్పు నవ్వుతున్నది." అన్నది మంజుల.

ఆ రెండు గదుల కొంపలో ఇప్పుడు వాళ్ళిద్దరే ఉంటున్నారు. ఏడాది క్రితం నాన్నగారు కూడా ఉండేవారు. బ్రతికున్నప్పుడు ఆయన బడిపంతులు చేసేవాడు. యావజ్జీవితం కృషిచేసి వాళ్ళ కోసం రెండెకరాల పొలం సంపాదించాడు. మంజుల చిన్నతనంలోనే లక్ష్మి చచ్చిపోయింది ఏదో జబ్బుతో తీసుకుని. అప్పటినుంచి వంటా, పిల్లలికి స్నానాలు చేయించటం, అన్నం తినిపించటం లాంటి పనులన్నీ ఒక్కడే చేస్తూ వాళ్ళని పెద్దచేశాడు. కూతురు పెళ్ళి చేయాలి అనుకుంటున్న సమయంలోనే ఆయన కన్నుమూశాడు.

ఆయనున్నంత కాలం సారథి నిశ్చింతగా గడిపాడు. ఆయన పోయిన దగ్గరనుంచి ఇల్లు ఎట్లా గడపాలా అనే చింతతో సతమత మవుతున్నాడు. ఉన్న రెండెకరాల మీద వచ్చే ధాన్యం వాళ్ళిద్దరికే సరిపోతుంది. కాని మనుష్యులు బ్రతకటానికి ఒక్క తిండే ప్రధానం కాదుగదా. ఇంటద్దె, బట్టలూ, పెద్ద ఖర్చులూ, మొదలయిన కనీసావసరాలు ఏవో వుంటాయి.

మంజుల చదువు మానేసి ఇంటి పట్టునే వుంటోంది. ఆమె పెళ్ళి చెయ్యటం ప్రధాన కర్తవ్యం. పోగా ఇంటి ఖర్చులకే లేని కాలంలో కాని పెళ్ళికి పుస్తకాలకీ ఎక్కడున్నుంచి తేగలడు? అది పల్లెటూరు కూడా కాదు. అయ్యో, పాపం సుందర రామయ్యగారు పోయి ఆయన బిడ్డలు అల్లాడి పోతున్నారు, వాళ్ళ సంసారం పంచెట్టాలి అని పటుం కట్టే పెద్దమనుష్యు లుండటానికి. పక్కింట్లో ఎవరుంటున్నారో తెలియని పట్నం అది.

అన్నీ ఆలోచించి ఆఖరు సంవత్సరం బి. కామ్. చదువుతున్న సారథి, అంతటితో చదువు ఆపెయ్యటానికి నిశ్చయించుకున్నాడు. ఏదైనా ఉద్యోగం చేసి చెల్లెలి పెళ్ళి చేశాక తన సంగతి చూసుకో వచ్చునని అతని అభిప్రాయం. అన యా విజ్ఞయుల

చిన్ననాటి స్నేహితుడు దుర్గారావ్‌కు, చెల్లెలు మంజులకూ, ఆమె స్నేహితురాలు లలితకూ చెప్పాడు. మంజుల మాట ఎట్లా ఉన్నా, దుర్గారావ్ లలితలు వారించారు అతన్ని. గ్రాడ్యుయేట్లకే ఉద్యోగాలు దొరకని ఈరోజుల్లో చదువు మానెయ్యట మంత అవివేకమయిన పని మరొకటి లేదన్నారు.

ఇవన్నీ సారథికి తెలుసు. కాని ఇంటి పరిస్థితి చూస్తే ఇలావుంది. దుర్గారావ్ అతనికి అనేక విధాలుగా నచ్చచెప్పాడు. డబ్బు ఎంత కావలిస్తే అంత తను సర్దుతానన్నాడు. అటు మంజుల అవసరమయితే లలితకూడా డబ్బు సర్దుతుందని వాదించింది.

ఇక అప్పటికి చదువు కొనసాగించటానికి సారథి అంగీకరించాడు. అతని అవసరాలు అతను చెప్పకున్నా దుర్గారావ్ తెలుసుకుని డబ్బు ఇస్తూ వచ్చాడు. దుర్గారావ్‌ని అడగటానికి సిగ్గుపడ్డప్పుడల్లా, మంజుల లలిత దగ్గర తీసుకువచ్చేది. ఇక అన్నీ మరచి పోయి సారథి దీక్షగా చదువు పూర్తి చేశాడు.

డిగ్రీ తీసుకున్న అయిదు నెలలనుంచి, అతను ఉద్యోగం కోసం వెదుకుతున్నాడు. కాని అంత సులభంగా దొరికేటట్లు అనుపించటం లేదు. లలిత తండ్రి ద్వారా ప్రయత్నిస్తే ఉద్యోగం నిస్సందేహంగా దొరుకుతుందని అతనికి తెలుసు కాని దానికి అతని మనసు అంగీకరించటం లేదు. స్వశక్తిద్వారా ఉద్యోగం సంపాదించు కోవాలని అనుకున్నాడు.

దానికి కారణం ఉన్నది. లలితతండ్రి రంగనాథం గారు లక్షాధికారి. ఆయనకు ఆ అమ్మాయి ఒక్కగా నొక్క కూతురు. పెళ్ళీడు వచ్చిన కూతురు కోసం ఆయన సంబంధాలు వెదకటం సాగించారు. బుద్ధిమంతుడైన, ఇల్లరికం వుండే బీద వరుడెక్కడ దొరుకుతాడా అని ఆయన చూస్తున్న తరుణంలో సారథి ఆయన దృష్టిలో పడ్డాడు. దానికి లలిత కొంత కారణం అని చెప్పవచ్చు. ఆయన సారథిని ఓరోజు పిలిపించి అడిగాడు.

ఇల్లరికం అంటే అందరికీ ఉండే భయం సారథికి కూడా ఉంది. తన చదువు పూర్తయి ఉద్యోగం చేస్తున్నప్పుడైతే తనకు కొంత గౌరవం ఉంటుందని సారథి అనుకున్నాడు. అందుకని తన చదువు పూర్తయి ఉద్యోగం దొరికాక చేసుకుంటా నని చెప్పాడు.

దానికాయన పెళ్ళిచేసుకొని ఎందరు చదువు కుంటున్నారో సోదాహరణంగా వివరించారు. పైగా అతనికి ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఏమా త్రమూ లేదన్నాడు.

అప్పటికి తప్పించు కోటానికి చెల్లెలు పెండ్లి కానిదే తను చేసుకోవటం బాగుండదన్నాడు. ఆయన రెండు పెళ్ళిళ్ళు ఒకనాడే చేస్తానని మంజుల కొరకు వరుణ్ణి చూడమని చెప్పాడు. సారథి దానికి కూడా అంగీకరించలేదు...మరొ కరి డబ్బుతో తన చెల్లెలి పెళ్ళిచేయటం తనకు సుతరామూ ఇష్టం లేదన్నాడు. ఆయన ఆశ వదులుకుని వూరుకున్నాడు.

లలిత కూడా అతన్ని ఒంటరిగా కలుసు కొని ఒత్తిడిచేసింది. అతను ఎటూ చెప్పలేక, ఆమె అంటే అయిష్టం ఏంతమాత్రం లేదని, చెల్లెలి పెళ్ళి అయ్యాక చేసుకుంటానికి సిద్ధమని నచ్చ చెప్పాడు.

ఆవిషయం అక్కడితో ఆగిపోయింది— సుమారు పదింబావు ప్రాంతాల్లో ఆఫీసు చేరుకున్నాడు సారథి. ఇంకా ఎవరూ రాలేదు. ఉన్న ఒక్క ప్యూనూ, సారథిని మర్యాదచేసి, బెంచి మీద దుమ్ము దులిపి కూర్చోబెట్టి, మేనేజరు పదకొండు తరువాతగాని రాడని చెప్పాడు. ఆ ఇన్ఫర్మేషన్ ఇచ్చినందుకుగాను టీకి డబ్బులిమ్మని తీసుకుని హోటల్‌కి వెళ్ళాడు.

ఒంటరిగ కూర్చున్న సారథి ఆలోచిస్తున్నాడు. తనకు నిస్వార్థంగా సహాయం చేస్తున్న దుర్గారావ్ గురించి, స్వార్థముంచుకునైనా సరే సమయానికి ఆదుకుంటున్న లలితగురించి ఆలోచిస్తున్నాడు. ఇంకా తనకు దొరక బోయే ఉద్యోగం గురించి, చెల్లెలి వివాహం గురించీ ఆలోచిస్తున్నాడు.

అతని కున్న పెద్ద పెద్ద ఆశల్లో మొదటిది చెల్లెలి పెండ్లి వైభవంగా చేయటం. బాగా చదువుకున్న అందగాడైన వరునికిచ్చి చెల్లెలి పెళ్ళి చేయాలని అతను మొదటి నుంచీ అనుకుంటూ వచ్చాడు. కాని ఈరోజుల్లో వరులు కూడా ఉద్యోగాల్లాగే కరువైనారు. పెళ్ళికి కూడా రికమండేషనూ, లంచాలూ కావలసి వచ్చాయి. పైగా మధ్యవర్తిత్వం నెరపటానికి పెద్దమనుషులు కావాలి. చెల్లెలికి తను తప్ప ఎవరూ లేరు. తను మాట్లాడదామంటే కుర్ర వాడివి నీకేం తెలుసు పొమ్మన్నట్లు మాట్లాడ తారు. నిజానికి తనకేమీ తెలియదు కూడాను. నాన్నగారి స్నేహితులు చాలా మంది ఉన్నారు, ఒక్క సహాయం చేయటానికి వస్తారన్న నమ్మకం లేదు. తనచేతినుంచి డబ్బు వదులుతుందేమోనని ఎవరికి వారే తప్పించు కోటానికి ప్రయత్నిస్తారు.

రెండో సమస్య కట్నాలు కానుకలు. ఉన్న రెండెకరాలు తెగనమ్మితే పది పన్నెండువేలు రాక పోవు. వాటిని పూర్తిగా చెల్లెలి పెళ్ళికే వినియోగించాలని ఆనాడే నిశ్చయించుకున్నాడు. తనకేదో ఉద్యోగం దొరికితే తన బ్రతుకు తనేలాగో బ్రతగ్గలడు.

చాలా కాలంనుంచి సారథి దుర్గారావ్‌ను మంజుల ప్రక్కన వూహిస్తున్నాడు. దుర్గారావ్ తనకెంతో సహాయం చెయ్యటమే కాకుండా వ్యక్తిగతంగా చాలా మంచివాడు. దురల వాట్లు ఏవీలేవు తనకు తెలిసినంత వరకు ఆస్తిపరుడు, అందగాడు. తనతో పాటే బి. కాం. చదివాడు.

పైగా మంజుల కూడా అతనంటే ఇష్టపడు తుంది. వాళ్ళిద్దరు చాలా చనువుగా మాట్లాడు కుంటారు. అతన్ని చూసినప్పుడు చెల్లెలి కళ్ళల్లో మెరుపులు తనకి గుర్తే. తనున్నా లేక పోయినా అతను తమ ఇంటికి రోజూవచ్చి కాసేపు మంజులతో మాట్లాడి వెళ్ళిపోతాడు. ఇవన్నీ అత నికి కూడా మంజుల పట్ల ఆసక్తి ఉందన టానికి నిదర్శనం.

పైగా అతను తమను చాలా విషయాల్లో ఆదు కున్నాడు. అతని సహాయం లేకపోతే తను బి. కాం. పూర్తి చేయలేక ఎక్కడో ప్యూన్‌గిరీ వెదు కుతుండేవాడు. అవసరమొచ్చినప్పుడల్లా దుర్గా రావ్ ప్రత్యక్షంగాను, లలిత పరోక్షంగాను డబ్బు ఇచ్చారు. ఎవరికెంతివ్వాలో తనకు లెక్క కూడా తెలీదు. తిరిగి ఇవ్వటం మాట మాట మాత్రంగా నైనా అనలేదు వాళ్ళు. తనే ఆ విష యం ప్రస్తావిస్తే, నువ్వు ఉద్యోగంలో చేరి జీవితంలో పూర్తిగా స్థిరపడ్డాక ఇవ్వవచ్చు లెమ్మన్నాడు దుర్గారావ్. నిస్వార్థపరుడు అతను. అతని రుణం తను డబ్బు తిరిగి ఇచ్చేసినంత మాత్రాన తీర్చుకోలేడు.

సమయం చూసి అతన్ని విషయంలో కదిలిం చాలి. అతని తలిదండ్రులొప్పు కుంటారా? ఏమో! ఆవిషయం అతనికే వదిలి పెడితేసరి. అయినా కట్నం కానుకలు సరిగా ఇస్తుంటే ఒప్పుకోక పోవటం మాట ఉండదు. ఆ సమ యంలో సారథి కళ్ళల్లో దుర్గారావ్, మంజు లలు పూలదండలు మార్చుకుంటున్నట్లు కనిపించారు.

ఆఫీసుకి ఒక్కొక్కరే వస్తున్నారు. కాని తనకు కావల్సిన మేనేజరు ఇంకా రాలేదు. పద కొండుకి ఇంకొక పదిహేను నిముషాలున్నది.

సారథి మళ్ళీ తన వూహా లోకంలో మునిగాడు. లలితకూడా తను పెళ్ళివిషయం ఎటూ తేల్చి చెప్పకున్నా తనను అభిమానిస్తూంది. ఆమె అనాకారి ఏంతమాత్రం కాదు. ఇల్లరికం విషయంలో కూడా తను అంతగా భయపడ వలసిందేమీ లేదు. తను సంపాదిస్తున్నంతకాలం తన విలువ ఏమాత్రమూ తగ్గదు. లలిత తనను ప్రేమించానన్నది. ప్రేమంటే తనకి సదభి ప్రాయం లేదు. తనకుమాత్రం ఆమె అంటే ఇష్టమే. అయినా తను ప్రేమించే వాళ్ళకంటే తనని ప్రేమించే వాళ్ళే నయం అన్నారెవరో. ఆమె తనలో ఏం చూసి ప్రేమిస్తున్నదో తెలీదు. తనకి. అవసరొచ్చినప్పుడల్లా మంజుల వందలకి వందలు తెస్తోంది ఆమెదగ్గిర. ఈ సమ యంలో కూడా ఆమె ఆదుకోకుంటే ఉద్యోగం గురించి ఆశ వదులుకోవాల్సి వచ్చేది. లలితా, దుర్గారావ్‌లు ఆస్తిపరులే కావచ్చు. కాని అడ్డ మైన వాళ్ళందరికీ సహాయం చెయ్యాలని ఎక్క డున్నది? వాళ్ళు సహృదయులు కావటం వల్లా తమ కష్టాలని వాళ్ళవిగా భావిస్తున్నారు.

ఏవైపు నుంచి చూసినా తను లలితను పెళ్ళిచేసుకోటం వల్ల వచ్చే నష్టాలు కనిపిం చటం లేదు లాభాలుతప్ప. ఇదేమంత పెద్ద సమస్య కాదు. తల బద్దలుకొట్టుకుని ఆలో చించటానికి. తన అంగీకారం తెలియ బరిస్తే సరి. వాళ్ళతో బాటు మంజుల కూడా సంతో షిస్తుంది.

అటు దుర్గారావ్ రుణం, ఇటు లలిత రుణమూ ఈవిధంగ తప్ప వేరే తీరే మార్గం లేదు.

సారథి ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చేసరికి ప్యూన్ పిలుస్తున్నాడు.

"అయ్యగరు వచ్చేశారు సార్! కలుసుకోవాలం టిరి కదా?" అంటూ.

సారథి మౌనంగా తనపేరూ వచ్చినపని ఓ కాగి తం మీద రాసి ప్యూన్ చేతికిచ్చాడు.

అయిదు నిముషాల తరువాత ప్యూన్‌వచ్చి రమ్మం

అనూహ్యం

ఉన్నారని చెప్పాడు. సారథి లేచాడు. జేబులో వున్న వంద రూపాయల నోట్లని పిడికిట్లో బిగించి పట్టుకొని మేనేజరుగదిలోకి వెళ్లాడు. చేతిలో వున్న ఫైలుని మూసి టేబిల్ మీద ఉంచుతూ ఆయన సారథిని కూర్చోమని సైగ చేశాడు.

సారథి కూర్చున్నాక, ఆయన కళ్ళజోడు సర్దుకుంటూ, ''మిస్టర్ సారథి, మీరు నిన్న ఇంటర్వ్యూకి వచ్చారు కదూ!'' అన్నాడు.

''అవునండీ!'' అన్నాడు సారథి వినయంగా.

''మీరు నిన్న సెలెక్టు అయ్యారు. డిపాజిట్ కట్టమంటే అంతడబ్బు లేదని చెప్పి వెళ్ళిపోయి నట్టు జ్ఞాపకం!'' అన్నాడాయన.

''అవునండి.''

''ఇప్పుడు ఏం పని మీద వచ్చారు?'' సారథి రాసిచ్చిన కాగితం చూస్తూ అన్నాడాయన.

''అదే ఉద్యోగం కోసమండి నిన్న చెప్పిన మాట నిజమే. ఇవాళ ఒకరి దగ్గర తీసుకుని వచ్చాను.'' అన్నాడు సారథి డబ్బు టేబిల్ మీద పెడుతూ.

ఆయన అటువంక చూడనైనా చూడలేదు ''అయామ్ సారీ, మిస్టర్ సారథి! మీరు డిపాజిట్ కట్టలేనని చెప్పటంవల్ల వేరొకర్ని తీసుకోవలసి వచ్చింది. మీరు కట్టేదాకా ఆగమన్నా ఆగేవాళ్ళం!'' అన్నాడు.

సారథి మొహం పాలిపోయింది.

''నేను ..నేను....'' ఏదో చెప్పటానికి ప్రయత్నం చేసేలోపలే ఆయన తిరిగి అన్నాడు.

''అయామ్ వెరీసారీ మిస్టర్ సారథి! ఇప్పుడు నేనేమీ చెయ్యలేను వెళ్ళండి ..''

ఏదో అదృశ్యశక్తి తన కాళ్ళని చెల్లాచెదురుచేస్తున్నట్లనిపించింది సారథికి. అతని ఆత్మవిశ్వాసమంతా ఎగిరిపోయింది. ఎదురుచూసిన స్వర్గం తనదాకా వచ్చి జారిపోయినట్లనిపించింది. అతి ప్రయత్నంమీద కుర్చీలోంచి లేచి నిలుచోగలిగాడు, మేనేజరేమో అంటున్నా వినిపించుకోకుండా గిరుక్కున వెనక్కి తిరిగి తలుపు తీసి నడిచాడు.

''మిస్టర్ సారథి! ఈడబ్బు తీసుకుపొండి!'' ఆయన బిగ్గరగా కేకపెట్టాడు. అప్రయత్నంగా వెనక్కితిరిగి డబ్బుజేబులో కుక్కుకుని గబగబా బయటికి నడిచాడు అతను.

రోడ్డువెంట యాంత్రికంగా నడుస్తున్నాడు సారథి. అతని మెదడు ఖాళీగావుంది. ఒక్కటే ప్రశ్న 'ఏమిటి చెయ్యటం? ఉద్యోగం దొరకక తిరిగిరావటం ఇది మొదటిసారి కాదు. కాని ఏ ఉద్యోగమూ తప్పకుండా దొరుకుతుందని అతను ఆశించలేదు. నోటి దగ్గరి అన్నం ఎవరో లాక్కున్నట్టు బాధపడ్డాడు అతను. ఎన్ని కలలుకన్నాడో అతను, అన్నీ కరిగిపోతున్నాయి. నిన్నటిరోజు అలా చెప్పకున్నా బావుండేది అనుకొంటున్నాడు ఇప్పుడు. అంతా జరిగిపోయాక ఇప్పుడనుకుంటే ఏమిటి లాభం?''

మంజుల తనకుద్యోగం ఇవాళ దొరికి తీరుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. ఆమె ఆశల్ని ఇప్పుడు రూపుమాపాలి ఇంటికివెళ్ళి. వయసువచ్చిన చెల్లెలికి పెళ్ళి చెయ్యలేని, ఆమె కోరికలనేవిధంగానూ తీర్చలేని అసమర్థుడు తను. తన కోసం కాకున్నా, మంజుల కోసమైనా తనకు ఉద్యోగం కావాలి. కానీ ఎట్లా?

ఎంతనడిచాడో గుర్తులేదు సారథి ఎదుట లలిత వాళ్ళ పచ్చమేడ కనిపించగానే ఆగిపోయాడు పోర్టికోలో కారు ఉంది. ఎటో వెళ్ళటానికి తయారవుతున్నట్లున్నారు. జేబులో ఉన్న పచ్చనోట్లు అతనికి కర్తవ్యం గుర్తుకి తెచ్చాయి. అవసరం తీరకపోయాక ఈడబ్బు ఏంచేసుకోను తనకి. లలితకిచ్చేస్తే సరిపోతుంది. ఇప్పుడింటికి వెళ్ళి మంజుల కలల్ని ఛిన్నాభిన్నం చేయటమేకాకుండా డబ్బుతిరిగి ఇచ్చిరమ్మని పంపించలేడు. ఉద్యోగం దొరకలేదని చెప్పటం ఎంతబాధకరమైనా, డబ్బు తిరిగి ఇచ్చివేసి రమ్మనటంకూడా అంత బాధకరమే.

గేట్లోంచి మెల్లగా లోపలికి నడిచాడు సారథి.

మెట్లెక్కుతుండగానే రంగనాథంగారు బయటికి వస్తూ కనిపించారు. సారథి నమస్కారం చెయ్యగానే ఆయన ప్రతినమస్కారంచేస్తూ, ''ఓ హో! నువ్వటోయ్ సారథి! చాలాకాలానికి కనిపించావే'' అన్నాడు.

సారథి అతి ప్రయత్నం మీద నవ్వు మొహం పెడుతూ ''మరేం లేదండీ, కొద్దిగా పనులుండటం వల్ల రాలేకపోయాను'' అన్నాడు.

ఆయన ''సరేలే! ఇప్పటికయినావచ్చావు అమ్మాయి లోపలుంది వెళ్ళు. నేను పనిమీద బయటకెడుతున్నాను!'' అంటూ వెళ్ళి కారులో కూర్చున్నాడు.

కారు కదిలివెళ్ళేదాకా అటేచూసి వెనక్కితిరిగాడు. ఎదుట లలిత నిలబడివుంది. సన్నని కంఠంతో లోపలికి ఆహ్వానించింది.

''చాలా రోజులకి దయకలిగిందే మామీద రండి''

ఆమెవెంట లోపలికివెళ్ళి సోఫాలో కూర్చున్నాడు సారథి.

ఆమె నౌకరుని పిలిచి, ఏమిచేయమంటుందో తెలియనివ్వకుండా చెబుతోంది

''వద్దు లలితా! ఇప్పుడేమీ వద్దునాకు'' అన్నాడు అస్పష్టంగా సారథి.

''అలాఅంటే ఎలా, రాకరాక వచ్చిన అతిథులను సత్కరించవద్దా!'' చిన్నగా నవ్వుతూ అంది లలిత.

సారథి మాట్లాడలేదు.

''అదిసరేగాని, మేము జ్ఞాపకం ఉన్నామా అసలు మీకు'' లలితకంఠంలో నిష్ఠూరం ధ్వనించింది.

''జ్ఞాపకం లేకేం లలితా! పనితొందరవల్ల రాలేకపోయాను లేకపోతే నాకు ఇంత సహాయం చేస్తున్న నిన్నెట్లా మర్చిపోగలను!'' అన్నాడుసారథి. అతనికి లలితను కొంతసేపైనా ఆమే మంచితనం గురించి చెప్పి బరువు దింపుకోవాలనుంది.

''సహాయమా! నేనేం సహాయంచేశానండోయ్!'' అంది నవ్వుతూ లలిత.

నౌకరు ప్లేటులో బిస్కట్లు, టీ తీసుకువచ్చాడు. టీ కలిపి సారథికి ఇచ్చి, తనోకప్పు అందుకుంది లలిత.

బిస్కెట్ కొరుకుతూ ''నిన్న నువ్వు సమయానికే డబ్బుఇచ్చావు లలితా. కాని నేనే దురదృష్టవంతుణ్ణి. వాటిని ఉపయోగించుకోలేక పోయాను'' అన్నాడు సారథి.

''డబ్బేమిటి? అన్నది లలిత ఆశ్చర్యంగా.

''అదే నిన్న నువ్వు మంజులకిచ్చిన అయిదువందలు. అవిఅసలు నాఉద్యోగానికి డిపాజిట్ కట్టటానికి తీసుకుంది మంజుల. కాని లాభంలేకపోయింది. ఉద్యోగం పోయింది. ఉద్యోగం ఇంకొకరికి వెళ్ళి పోయింది.''

అన్నాడు నిట్టూరుస్తూ సారథి

''అయిదు వందలేమిటి? నేనివ్వటమేమిటి! నేనెప్పుడు మంజులకు డబ్బివ్వలేదే. అది అసలు వస్తేనా లేదు కూడాను!'' అన్నది లలిత.

''నువ్వు అలానేఅంటావు కానీ ఇవి తీసుకో లలితా నాదగ్గర ఖర్చయిపోతాయి. బీదవాళ్ళదగ్గర లక్ష్మి నిలబడు'' అన్నాడు సారథి.

''నేనివ్వలేదు మొర్రో అంటూంటే వినిపించుకోరేం! కావాలంటే దాయమంటే దాస్తాను. ఇవ్వండి.'' అంది లలిత.

సారథికి తోచకపోయింది. ఆమె నిలబడివున్నాడు.

''సరే. అయితే, మంజులచేతనే పంపిస్తాను. వస్తాను'' అంటూ బయటికి నడిచాడు సారథి.

''అంత తొందరేం!'' అందిలలిత అతని వెనకాలే వస్తూ.

''మళ్ళీ ఎప్పుడైనా వస్తాన్లే'' అంటూ బయట పడ్డాడు సారథి.

ఇంటివేపు నడుస్తున్నాడు సారథి. లలితమీద గౌరవం మరింత పెరిగింది అతనికి. ఇచ్చికూడా నేనివ్వలేదని ఎందరు చెప్పుకుంటారు. అంత డబ్బు ఇస్తూ, నేనెప్పుడూ మంజులకు డబ్బివ్వలేదంటుంది లలిత. ఫలవాళ్లేను. ప్రపంచంమీద మంచి అన్నది జీవించే ఉన్నది. దుర్గారావ్ లలితలలాంటి వాళ్ళతో. ఇట్లాంటి లలితలూ దుర్గారావ్‌లు మరికొందరుంటే స్వర్గమై విలసిల్లుతుంది లోకం. డబ్బు ఉండగానే సరికాదు, దాన్నెట్లా సక్రమమైన పద్ధతిలో వినియోగించాలో చాలా కొద్దిమందికే తెలిసి ఉంటుంది.

ఇల్లు దగ్గరపడుతున్న కొద్దీ అతని ఆలోచనలు పెరుగసాగాయి. చెల్లెలి కేమని సమాధానం ఇవ్వటం? ఉద్యోగం దొరకలేదని ఎట్లా చెప్పటం? ఎంత నొచ్చుకుంటుందో ఆమె!

తన బాధలు ఇవాళటికైనా తీరుతాయని కలలు కంటుండచ్చు ఆమె కాని సీరియల్ కథలా ఎప్పటికీ సశేషంగానే వుంటాయని ఆమెకేం తెలుసు.

అత్తవారింట్లో సుఖంగా ఉండవలసిన తనచిన్నారి చెల్లెలు ఈ వయసులో తనతోబాటు కష్టాలు పడుతోంది చెల్లెలిక సుఖం చేకూర్చలేని తన అసమర్థతకు తనమీద తనకే కోపంవచ్చింది సారథికి. అతనికి క్షణంలో ఏడవాలనిపిస్తోంది. హాయిగా, స్వేచ్ఛగా ఎక్కడికైనా పోయి, బావురుమని ఏడవాలని తపన. గొంతుకలో ఏదో అడ్డుపడ్డట్టనిపించింది సారథికి. కళ్ళవెంట వస్తున్న నీళ్ళని తుడుచుకుంటూ ఇంటి ముందరి మెట్లెక్కాడు సారథి.

రెండు మెట్లెక్కి మూడో మెట్టెక్కబోయే సమయానికి ఇంట్లోంచి ఏడుపు వినవచ్చింది సారథికి. లోపల దుర్గారావ్ గొంతు వినపడుతోంది. వీళ్లకీ తెల్సిపోయిందా తన కివాళ కూడా ఉద్యోగం దొరకలేదని, అక్కడే ఆగిపోయాడు సారథి. దుర్గారావ్ అంటున్నది శ్రద్ధగా విన్నాడు.

''ఏడిచి ప్రయోజనంలేదు మంజూ, పెళ్ళిమాట మర్చిపో. వస్తుగురించి నువ్వేమనుకున్నా సరే, నువ్విచ్చిందానికి బదులుగా నా అన్నయ్యకే కాక నీకూ అడిగినప్పుడల్లా వందలకి వందలు ఇస్తూవచ్చాను. దానికి దానికి సరి.''

మంజుల వెక్కివెక్కి ఏడుస్తోంది. ●

సైంటిస్టులు
నొప్పిని అతి శీఘ్రంగా తొలగించునట్టి విధానమును
కనుగొన్నారు
కొత్త మైక్రోఫైనడ్ 'ఆస్ప్రో'

'ఇప్పుడు, మొదటిసారిగా భారతదేశంలో ప్రవేశ పెట్టబడినది

బాధ మీ సమస్య: "ఆస్ప్రో" యొక్క పరిశోధన సంస్థలో, బాధ యొక్క సమస్య మీద పని చేస్తున్న సైంటిస్టులు ఇప్పుడు, క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రోను కనుగొన్నారు – ఇది బాధను అతి శీఘ్రంగా పోగొట్టే సాధనము

మైక్రోఫైనడ్ అంటే ఏమిటి: మైక్రోఫైనడ్ అంటే ఆస్ప్రోలోని నొప్పిని పోగొట్టే పదార్థము ముప్పది రెట్లు సన్నగా క్రొత్త ప్రత్యేకమైన పద్ధతిలో చెయ్యబడినది ప్రతి మాత్రలోను ఇప్పుడు ఇంచుమించు 15 కోట్లు అతి సూక్ష్మమైన అణువులు వుంటాయి అందువలన రెండింతల కన్నా ఎక్కువగా నొప్పిని పోగొట్టే శక్తి అతి శీఘ్రంగా పని చేసి మూడు రెట్లు శీఘ్రంగా నొప్పిని తొలగించును

అతి శీఘ్రంగా పని చేస్తుంది-చాలా సేపు వుంటుంది: క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రోలోని చురుకైన, పదార్థము అనాయాసంగా, అతి త్వరగా ఇమిడి శరీరమందు 6 నుండి 7 గంటల దాకా వుంటుంది ఇందువల్లనే మైక్రోఫైనడ్ ఆస్ప్రో అతి శీఘ్రంగా నొప్పిని తొలగిస్తుంది, మరియు చాలా సేపు వుంటుంది

తీసుకోవడం చాలా సులభము క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రోను మీకు ఇష్టమైనట్లు తీసుకోవచ్చును అలాగే కాని, నీళ్ళలో కలిపి కాని ఒక గ్లాసుడు నీళ్ళలో కాని లేక వేడి పానీయముతో కాని తీసుకోవచ్చును

వీటికోసం క్రొత్త మైక్రోఫైనడ్ 'ఆస్ప్రో'ను వాడండి: నొప్పి, తల నొప్పి ఒళ్ళు నొప్పి పంటి పోటు, కీళ్ళ నొప్పి జ్వరముతో కూడిన జలుబు, ఫ్లూ, కీళ్ళ నొప్పులతో కూడిన జ్వరము, గొంతుగనొప్పి

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్ళలు, అవసరమైతే మళ్ళీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ళ, లేక డాక్టర్ సలహా ప్రకారము వేసుకోవలెను.

క్రొత్త మైక్రోఫైనడ్ 'ఆస్ప్రో' ఈ విధంగా పనిచేస్తుంది



బిళ్ళలోని అణువు ఎంత పెద్దదిగా వుంటే అంత నెమ్మదిగాను అది ఇముడుతుంది– అందువల్ల మీకు, నొప్పి తగ్గడానికి చాలా సేపు అగారి



ఇది మైక్రోఫైనడ్ చెయ్యబడుట వలన, ప్రతి క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రో బిళ్ళలోను ఇంచుమించు 15 కోట్ల అతి సూక్ష్మమైన అణువులు వుంటాయి ఇందువలన ఇవి అతి త్వరగా ఇమిడి అతి శీఘ్రంగా నివారణ నిచ్చును

క్రొత్త మైక్రోఫైనడ్ 'ఆస్ప్రో', నొప్పిని, నివారించుటకు ఇప్పుడు మీకు లభించే వాటిలో అతి ఆధునికమైన సాధనము





క్రొత్త
మైక్రోఫైనడ్
ఆస్ప్రో
అతి శీఘ్రంగా నొప్పిని తొలగించునది

నికోలస్ Ⓝ ఉత్పత్తి

A.C.4.67 TL

సీరియల్



జాహ్నవీ హైమవతులు

సి. ఆనందారామం

జరిగిన కథ

ఉమాపతికి ఇద్దరు భార్యలు హైమవతీ జాహ్నవి లిద్దరూ అక్కచెల్లెళ్లే. సహనం, సానుభూతి హైమవతికి ఆభరణాలయితే, ద్వేషం, అసూయ జాహ్నవి సొత్తు. జాహ్నవికి అవకరంగా జన్మించింది నీరజ. శ్రీరామచంద్రమూర్తి, మనోరమా ఇద్దరూ హైమవతి సంతానం శ్రీరామచంద్రమూర్తి మెడిసిన్‌లో చేరాడు ఆడపిల్లలిద్దరూ కాలేజీలో చదువుతున్నారు గోపాల్‌ను కలుసుకునే మిషమీద రాజా మనోరమను చూడ్డానికి తరచువస్తున్నాడు రాజాను నీరజకు చేసుకోవాలని జాహ్నవి దృఢంగా సంకల్పించుకుంది

6

జాహ్నవి మనోరమను ఆప్యాయంగా పిలిచింది జాహ్నవి నోరువిప్పి ఏనాడూ మనోరమను ఏమీ అనకపోయినా, జాహ్నవి చూపులో తీక్షణతకు తట్టుకోలేక మనోరమ జాహ్నవిని తప్పుకు తప్పుకు తిరిగేది ఎన్నడూలేనిది జాహ్నవి ఆప్యాయంగా పిలిచేసరికి బెరుగ్గా వెళ్ళింది జాహ్నవి వెళ్ళి గది తలుపులు వేసొచ్చింది మనోరమ వింతగా చూసింది ఏదో అవ్యక్త భయంతో గుండెలు వేగంగా కొట్టుకున్నాయి

"మన నీరజకు మంచి సంబంధం కుదరటం నీ కిష్టమేనా?"

సంతోషంతో వెలిగిపోయింది మనోరమ ముఖం

"ఎందు కిష్టంలేదు పిన్నీ! నాకు చాలా సంతోషంగా ఉంది."

"ఎందుకు సంతోషం? అది కుదరదు"

"ఎందుకు కుదరదు?"

"నీ కారణంగానే!"

"నా కారణంగనా? నేనేం చేసాను పిన్నీ?" జాలిగా అడిగింది మనోరమ

'నువ్వేం చెయ్యలేదమ్మా! నా దురదృష్టం చేసింది నీరజకంటే నువ్వు బాగుంటావు పైగా నీరజ అవకరం పిల్ల అందుకు ఆ పెళ్ళికొడుకు నిన్నే చేసుకుంటానని అంటాడేమో?"

"అదేమిటి పిన్నీ! నీరజకు కుదిరిన సంబంధం నన్ను చేసుకుంటానని అనటమేమిటి? అన్నా, నే నెందుకు ఒప్పుకుంటాను?"

"నాకు తెలుసమ్మా! నీరజకు ఈ సంబంధం కుదరాలంటే నువ్వు నాకో సహాయం చెయ్యాలి"

"తప్పకుండా చేస్తాను పిన్నీ"

"ఆ పెళ్ళి కొడుక్కి నేను చెప్పినట్లుగా ఉత్తరం రాయాలి"

అదిరిపడింది మనోరమ

"ఉత్తరమా? నేనా? ముక్కు మొహమూ తెలియని వాడికి నేను ఉత్తరం రాయటమేమిటి పిన్నీ!"

"సరే! అయితే వెళ్ళు! ఈ జన్మలో నీరజకు పెళ్ళికాదు. నీరజ కర్మ! నా కర్మ!"

జాహ్నవి కళ్ళలో నీళ్ళు తిరిగాయి మనోరమ జాలిగా చూసింది

"అక్కయ్యకోసం రాస్తాను పిన్నీ! చెప్పు ఏం రాయాలో!"

జాహ్నవి గబగబ కాగితం, పెన్ తెచ్చింది

"కాబోయే పెళ్ళికొడుకుగారికి,

నాకు మీమీద ప్రేమలేదు మన వివాహం అసంభవం— నామీద మీకేమాత్రం గౌరవమున్నా నీరజక్కయ్యను చేసుకోండి—ఇది నా ప్రార్థన మనోరమ."

ఏదో భయంతో, చికాకుతో తనేం రాస్తోందో తనకే తెలియకుండా రాసేసింది మనోరమ

జాహ్నవి ముఖం వికసించింది ఆత్రంగా ఆ ఉత్తరాన్ని దాచుకుని, "ఇంక వెళ్ళమ్మా!" అంది తలుపులు తెరుచుకుని ఇవతల పడిన మనోరమ ఏదో పెద్ద బరువు దింపుకున్నట్లు తేలిగ్గా నిట్టూర్చింది

ఆ ఉత్తరం తీసుకుని తిన్నగా గోపాల్ దగ్గర కెళ్ళింది జాహ్నవి

'ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మయిండ్' అన్న సూక్తి ఎవరి విషయంలో ఎంతవరకూ నిజమో చెప్పలేం కానీ, జాహ్నవి విషయంలో అది ప్రత్యక్షర సత్యం అపురూప సౌందర్యవతి కాకపోయినా, జాహ్నవిని అందగత్తెలలోనే లెక్కేసుకోవాలి అయినా ఆమె ముఖం చూడగానే చటుక్కున ఏదో వ్యతిరిక్త భావం కలుగుతుంది ఎదుటి వ్యక్తుల మనసుల్లో! ఆవిడ తమకేమీ అపకారం చెయ్యదని తెలిసినా, ఏదో కుత్సితవాయువు తమ నావరించినట్లు అనుభూతి కలుగుతుంది సాధారణంగా ఎవ్వరూ జాహ్నవి సమక్షంలో పది క్షణాలపాటు హాయిగా గడపలేరు, నీరజతప్ప నీరజకు తల్లి సమక్షంలో సుఖంగా ఉండదు తల్లి తనపై కురిపించే ప్రేమామృతంలో ఏదో విషజ్వాల అంతర్లీనమై నీరజను సోకుతూనే ఉంటుంది అయినా, తల్లి పట్ల విపరీతమైన సానుభూతి నీరజకు

జాహ్నవిని చూస్తూనే మలిపోయింది గోపాల్‌కు

"గోపాల్!" అని జాహ్నవి కటువుగా పిలవగానే పై ప్రాణాలు పైనేపోయాయి గోపాల్‌కు.

"రాయబారాలు జరుపుతున్నావన్నమాట!" తీక్షణంగా అంది నీరయిపోయాడు

ఏ సమాధానమూ తోచలేదు ఎడగాలికి తీగలా వణికిపోతూ నిలిచిపోయాడు,

"పూర్తి! రాయబారం పూర్తి చెయ్యి ఇదిగో ఈ ఉత్తరం రాజా కియ్యి—జాగ్రత్త! రాజాకే ఇయ్యి ఎవరితోను పంపకు—నువ్వే ఇయ్యి నేను చెప్పిన దానికి భిన్నంగా జరిగినట్లు నాకు తెలియకూడదు."

క్రూరంగా గోపాల్‌ను చూసి ఉత్తరం అతని మీదకు విసిరి దర్పంగా వెళ్ళిపోయింది జాహ్నవి.

పెద్దపులి గాండ్రిస్తూ మీదకు ఉరికి మెడను కరిచి పట్టుకొని చంపకుండా వదిలేసి వెళ్ళిపోయిన ప్రాణిలా అనుభూతి చెందాడు గోపాల్

గబ గబ ఒక గ్లాసుడు మంచినీళ్ళు త్రాగాడు.

రాజా నీరజమ్మకు వ్రాశాడు.

సమాధానం మనోరమ రాసింది

పైగా జాహ్నవమ్మ ద్వారా పంపింది

ఇదేదో ప్రళయంలా ఉంది బహుశః వ్యవహారం సవ్యంగా నడిచి ఉండదు

సందేహిస్తూనే ఉత్తరం చదివాడు గోపాల్. తెల్లబోయాడు మనోరమ రాయటం, పైగా జాహ్నవితో పంపటం, దీన్నిబట్టి మనోరమకు రాజాపట్ల ఏకోశానా ఆర్ద్రభావం లేదని అర్థం చేసుకున్నాడు కొంచెం బాధ పడుతూనే ఉత్తరాన్ని రాజా కిచ్చాడు

గోపాల్ భయపడినట్లుగానే ఉత్తరం చదివిన రాజా ముఖం పాలిపోయింది

"రాజా! ఆ మనోరమ్మ పట్టి మట్టిబొమ్మ—అనవసరంగా మనసనుకున్నావ్ నువ్వు—"

మనసులో జాహ్నవి ఉగ్రరూపాన్ని భావించుకొని అన్నాడు గోపాల్.

రాజా శూన్యంగా చూస్తూ కూర్చున్నాడు ఏ సమాధానమూ ఇవ్వలేదు

"మనోరమ మట్టిబొమ్మా?"

అలా అన్న వాళ్ళు పిచ్చివాళ్ళు

వాళ్ళకు మనోరమను గురించి ఏమీ తెలియదు మనో బిగించిన మనోజ్ఞుని వింటినారి తన నరనరాలనన్నింటినీ పులకరింప చేయగల రాగమయి తేనెలు చిప్పిలే నవ వికసిత అనాఘ్రాతపుష్పం రూపు దాల్చిన చైతన్యం—ఆనాటి తన అనుభవమే ఇందుకు సాక్ష్యం ఆ కొన్ని ఘడియలూ తన మానస వీధిలో ఎన్నిసార్లు పునరావృతమయ్యాయో ఆ అనుభూతి స్మరణ మాత్రాన తన శరీర మీపటికీ ఎలా జ్వలిస్తుందో తనకుతప్ప ఎవరికి తెలుసు?

ఆ మనోరమ—తన మనోరమ—తనమీద ప్రేమ లేదని రాస్తుందా? అబద్ధం పచ్చి అబద్ధం—ఇంత అబద్ధమెందుకు వ్రాసింది? నీరజకోసమా? అక్కయ్యకోసం తను త్యాగం చెయ్యాలనుకొందా?

ధనాన్ని త్యాగం చెయ్యవచ్చు ఇంకేదైనా త్యాగం చెయ్యచ్చు కానీ, ప్రేమ విషయంలో త్యాగమేమిటీ ఎంత అర్థంలేని విషయం! రెండు హృదయాలు కలిసి పాడుకునే జీవనరాగం కదూ ప్రేమ? అందులో ఒక హృదయం మూగపోయిన తరువాత ప్రేమేమిటి? తనమీద గ మాత్రం ప్రేమాభిమానాలు లేని వ్యక్తితో నీరజ ఏం సుఖపడగలదు?

మనోరమ త్యాగం చెయ్యలేదు శిక్ష విధించింది తనకు తమా విధించుకొంది నీరజకూ ఇది శిక్షే! మనోరమ దేన్ని చేజేతులా త్యాగం పేరిట వదులుకుంటుందో, అది నీరజ ఎన్నిటికీ పొందలేదు

* * *

"మన నీరజకు మంచి సంబంధమేదైనా కుదిరిందా?" రుస రుస లాడుతూ అడిగింది జాహ్నవి

ఇటీవల జాహ్నవి గదిలోకి రావటమంటే చాలా భయంగా ఉంది ఉమాపతికి జాహ్నవితో మాట్లాడవలసిన బాధ తప్పిపోవటానికి తనకు జ్వరంలాంటి దేదైనా వస్తే బాగుండునని కోరుకునేవాడుకూడా

ఉమాపతి బెదురుగా "చూస్తున్నాను కుదరటం లేదు" అన్నాడు

లోలోపల నీరజకు కూడా తను కుదిర్చిన సంబంధం వచ్చులేదా? అనుకుని నిట్టూర్పు విడుచుకొన్నాడు

"ఎలా కుదురుతుంది? మీరేమో కట్నాలివ్వరు అదేమో అవకరం పిల్ల! ఇంక పెళ్ళేలా అవుతుంది?"

"అదేమిటి జాహ్నవీ! అరవైవేలకు పైగా ఇస్తానంటున్నానుకదా!"

"అవసరమయితే, ఇంకా ఇవ్వాల్సి వస్తుంది"

"మరి మనోరమ కేమిస్తాను?

"మనోరమ కేం తక్కువని? అందం ఉంది ఏ వంకా లేదు కట్నం తక్కువయినా మంచి సంబంధమే వస్తుంది నీరజకు ఎనభైవేలు కట్నంగా ఇచ్చితీరాలి—ఏం! శ్రీరామచంద్రమూర్తి చదువు కొంటుంటేనా"

"[illegible]"

[illegible]

"తరువాత గతి?"

"ఇంతింత డబ్బుపోసి చదువు చెప్పిస్తున్నారు శ్రీరామచంద్రమూర్తి ఆమాత్రం తిండిపెట్టడా?"

"కూతురికి డబ్బంతా కట్నంగా ఇచ్చేసాను. నాకూ నా ఇద్దరి భార్యలకూ తిండిపెట్టమని వాణ్ణి అడగనా?"

"ఎందుకు పెడకూడదూ? ఎవడికోసం పెడతాడు?"

'సరేలే సంబంధం కుదరనీ!'' విసుగ్గా అన్నాడు

"మీరేం శ్రమ పడక్కర్లేదు నేను కుదిర్చాను సంబంధం—" వెటకారం ధ్వనించే స్వరంతో అంది

ఎగిరి కూర్చున్నాడు ఉమాపతి

"గడప దాటకుండా సంబంధం కుదిర్చావా? ఎవరు?"

"రాధాయమ్మగారబ్బాయి రాజా!"

ఉమాపతి ముఖం వెలవెలపోయింది.

"అరే! ఆ సంబంధం మనో కనుకుంటున్నామే"

"అనుకుంటున్నారా? ఎవరనుకుంటున్నారు?



పెద్దదానికి కాకుండా చిన్నదానికి సంబంధం మాట్లాడేటంత పిచ్చి బుద్ధి ఎవరిది?''

"అబ్బబ్బ! అనవసరంగా మాటలు రాసియకు. సంబంధం ఎవరు స్థిరపరిచారు? రాజా తల్లే స్వయంగా హైమ దగ్గిర మనోరమను తన కోడలిగా చేసుకోవాలని ఉన్నట్లు సూచించిందట!

హైమ కూడా బాగుందనుకొంది. ముందు నీరజ పెళ్ళయ్యాకే మనోరమ పెళ్ళి. ఆమాత్రం నాకు తెలీదా?''

"మీ కెందుకు తెలీదు? నా కే తెలీదు. మీరూ, మీరూ, ఒకటి. నేనే పరాయిదాన్ని. మీలో మీరే అన్నీ అనుకుంటున్నారు. నాకెం చెప్పరు. చెప్ప వలసిన అవసరం కనిపించదు. అయినా ఏముఖం పెట్టుకు చెపుతారు? మీ ఆలోచనలన్నీ నాకు తప్పే గోతులైతే? ఏదో ఒక సంబంధం చూసి నీరజకు ముడిపెట్టేసి, మనోరమను రాజాకియ్యాలని పథకమన్నమాట! నీరజను రాజా కియ్యాలనే వరికి ఎంత కష్టం?''

"దేవుడా నీ యిష్టం! అలాగే! నీరజనే రాజా కిద్దాం. రాజా కిష్టమైతే అలగే చేద్దాం!''

"ఏహ్వా! ఏం తెలివి? అవకరం పిల్లకదా! రాజా ఇష్టపడకపోవచ్చునని ఆశ. రాజా ఇష్టం మీదనే ఈ సంబంధం గురించి మాట్లాడుతున్నాను'' అదిరిపడ్డాడు ఉమాపతి.

"ఏమిటిది.''

"అంత ఆశ్చర్యపడక్కర్లేదు. ప్రేమ అనేది ఎప్పుడు ఎవరిమీద కలుగుతుందో ఎవరూ చెప్ప లేరు. కాస్త అవకరం ఉన్నంతమాత్రాన నా కూతురు అనాకారి కాదు''

"అవునవును. ప్రేమ గుడ్డిది. హైమను పెట్టుకొని నేను నిన్ను ప్రేమించలా?''

భగ్గున మండింది జాహ్నవి—పొగం, ఉమాపతి జాహ్నవిని నొప్పించాలని అనలేదు. మనసులో తోచింది అన్నాడు.

"కానీ, రాజా మీలా గుడ్డివాడు కాదు.''

"కాపోచ్చు. నా అంత గుడ్డిగా ఎవరూ ఉండరు''

కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి జాహ్నవికి. చూపులతో ఉమాపతిని కాల్చేస్తూ, "రాజా తల్లికి డబ్బుమీద ఆశ ఎక్కువ. ఎక్కువ పోసిస్తే దర్జాగా నీరజను చేసుకొంటుంది. ఎక్కువ వేలూ జతపడచండి ముందు'' అంది శాసిస్తూ....

"సరే! హైమనడిగి చెప్తాను.''

"హైమ! హైమ! ఆవిడగారు అడిస్తుంది. మీరాడతారు. ఇన్నాళ్ళూ సహించాను. ఇంక సహించను. ఇది నా ఒక్కగా నొక్క కూతురి జీవిత సమస్య. నాకు మిగిలిన దొకే ఒక్క ఆనందం. నీరజకు రాజాతో వివాహం జరిగితీరాలి. దీనికి ఎవరూ అడ్డుపడలేరు. అడ్డుపడిన వాళ్ళను వదిలేస్తాను'' సివంగిలా రొప్పింది జాహ్నవి.

అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు ఉమాపతి.

* * *

తర్వాత ద్వారా విషయమంతా విన్నది హైమ. ఒక్క లిప్తమాత్రం మనసు చివుక్కుమనకపోలేదు. కాని నీరజనే రాజా ఇష్టపడిన్నప్పుడు తాను మరోకలా ఆలోచించటం అన్యాయమని తనను తానూ నిందించుకొంది— ఒక దాసి ద్వారా జాహ్నవికి కబురు పంపింది.

"నేను వెళ్ళిపోతాను. మీ రిద్దరూ మాట్లాడుకోండి.''

అల నొక్కుకుంటూ అన్నాడు ఉమాపతి.

"కాదు. మీరూ ఉండాలి.'' శాంతంగానే చెప్పింది హైమ. విసుగ్గా వాలు కుర్చీలో జేరగిలబడ్డాడు ఉమాపతి సుడిగాలిలా వచ్చింది జాహ్నవి. ఆమె అంతరంగంలో రగులుతూన్న జ్వాల కళ్ళలోంచి విషాలు క్రక్కుతుంది.

"అంతా విన్నాను జాహ్నవీ! నీ ఆలోచన బాగుంది. నీరజను రాజాకే ఇద్దాం! ఇద్దరికీ ఇష్టమయితే!'' మామూలుగా అంది హైమ.

జాహ్నవి ఒక్కసారిగా చల్లారిపోయింది. ఎంతో తీవ్రమైన కలహాన్ని వూహించుకొని, అందుకు సన్నద్ధురాలై వచ్చిన ఆమెకు కొంత నిరుత్సాహం కూడా కలిగింది.

"ఇద్దరికీ ఇష్టమైనంతమాత్రాన సరిపోదు తల్లికికూడా ఇష్టం కావాలి ఆవిడకు కట్నంకావాలి.''

"నాకు తెలుసా సంగతి—కట్నానికేముంది? మన కున్నదంతా అమ్మేసైనా ఇద్దాం. ఎన్ని వేలు కావాలంటే, అన్నైనా ఇద్దాం. శ్రీ రామచంద్రమూర్తికి రాస్తాను. వాడు నామాట కాదనడు. అయినా పిల్లలకు పెళ్ళిళ్ళయి కొడుకు ప్రయోజకుడయి పోయిందర్వాత మనకేమీ మిగిలి పోతే మాత్రమేం? నీరజ పెళ్ళి విషయమే నాకు పెద్ద బెంగ— దేవుడు దాని కన్నీ ఇచ్చి ఆ కాస్త అవకరం పెట్టాడు. నీరజ పెళ్ళయి పోతే, ఇంక మనోరమ పెళ్ళి ఎలా అయినా అయిపోయింది. అయినా శ్రీరామ చేసుకుంటాడా సంగతి మంచిరోజు చూసుకుని రాధాయమ్మగారితో మాట్లాడదాం''!

జాహ్నవి తన చెవులను తానునమ్మలేక పోయింది. ఒక్కసారి హైమను కౌగిలించుకుని బావురుమని ఏడవాలనిపించింది. హైమ కాళ్ళమీద తల పగల కొట్టుకోవాలనిపించింది. ఏదీ చెయ్యకుండా చిన్నబోయి పోయింది.

"ఒక్క మంచి మాట నోటినుండి రాదు—''

జాహ్నవివెళ్ళినవైపే చూస్తూ అన్నాడు ఉమాపతి.

"జాహ్నవి అనుభవిస్తున్న చిత్రహింస నాకుతెలుసు. జాన్నేమీ అనకండి'' దిగులుగా అంది హైమ.

మంచిరోజు నిర్ణయించి జాహ్నవితో "మనం వెళ్ళి రాధాయమ్మగారితో మాట్లాడదామా? అంది హైమ. జాహ్నవి గుండెలు దడదడలాడుకున్నాయి. మనోరమ ఉత్తరం ప్రసక్తి వస్తుందేమోనని జాహ్నవి భయం.

"నేను వెళ్తాను'' అంది పొడిగా.

ఇప్పటికీ చెల్లెలు తనపర్థం చేసుకోలేక పోవటం కష్టమనిపించింది హైమకు. నిట్టూర్చి వూరుకుంది.

ఎన్నడూరాని జాహ్నవి తమఇంటికి వచ్చేసరికి రాధాయమ్మ ఆశ్చర్యపోయింది.

తనెక్కడికి వెళ్ళినా అందరూ అదోలాచూడటం, పక్కకెళ్ళి చెవులు కొరుక్కోవటం బాగా అనుభవమైపోయింది. అందుకే జాహ్నవి బయటకు రావటం మానుకుంది.

జాహ్నవిపట్ల పెద్ద అభిమానం రాధాయమ్మకు లేదు. పాటిపోని ఆదరించాలి కనుక ఆదరించింది.

ఎలా మొదలు పెట్టాలో, ఏమని మాట్లాడాలో అర్థంకావటంలేదు జాహ్నవికి.

కొంచెం సేపు అదీ ఇదీ మాట్లాడిన తరువాత, "మా నీరజమ్మకు సంబంధాలు చూస్తున్నాం'' అంది.

"కుదిరిందండమ్మా!''

"ప్రయత్నిస్తున్నాం. కట్నం ఎంతైనా సరే మంచి సంబంధం తేవాలని మా అందరి ఆశ. డబ్బు పోయినా, నీరజమ్మ సుఖపడాలని.''

"అంతే లెండమ్మా!''

జాహ్నవి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది.

"మీ రాజాకు సంబంధాలొస్తున్నాయా?''

రాధాయమ్మ గర్వంగా నవ్వింది.

"రాకేమమ్మా, రాజాకి పదిమంది తిరుగుతున్నారు. నాకు మీ మనోరమమ్మను చేసుకోవాలనుంది. నీరజమ్మకు సంబంధం కుదిరిపోతే, మనోరమమ్మను మారాజాకు చేసుకుంటాను. హైమమ్మకు ఇష్టమే.''

జాహ్నవికి తలదిరిగి పోయినంది.

"పెద్దపిల్లకి కాకుండా చిన్నపిల్లకెలా నిశ్చయమవుతుందండమ్మా?''

"నీరజమ్మ కయ్యాకేనండమ్మా ఈడొచ్చిన పిల్లని ఎంతకాలం ఉంచుకుంటాం? ఏదోఒకటి కుదిర్చెయ్యండి.''

"పోనీ, మానీరజమ్మను రాజాకు చేసుకోరాదూ?'' ఉగ్గబట్టుకుని అడిగేసింది.

రాధాయమ్మ వెలవెలపోయింది. ఏసమాధానమూ తోచలేదు.

"మా రాజా నడిగి చెప్తానులెండమ్మా ఎటొచ్చి మనకాలాయిపోయాయి. ఈ రోజుల్లో పిల్లలు మనమాట వినరు. ఎవరిమనసులు వాళ్ళకి నచ్చాలి.''

"అడగండమ్మా హైమక్క ఎన్ని వేలిస్తానంటుంది. మనరాజా ఇంకా కావాలన్నా ఎందేనాంచ పద్దు.'' ఆత్రంగా అంది జాహ్నవి.

"హైమవతమ్మ అన్నారా అమ్మా?''

ఆశ్చర్యపోతూ అంది రాధాయమ్మ. ఆ ఆశ్చర్యాన్ని గమనించిన జాహ్నవికి కష్టం తోచింది.

"అందులో ఏముందండమ్మా ఆస్తి సగం నాది, సగం హైమక్కదీ నాకిస్తున్నారు నీరజ తప్ప?'' ఈ మాటలు విని రాధాయమ్మలో లోపల మరింత ఆశ్చర్యపోయింది. మొత్తం ఆస్తి వ్యవహారాన్ని హైమే చూసుకుంటుందని, మొత్తం ఇల్లంతా హైమ మాటమీద నడుస్తుందని ఆవిడకు తెలుసు.

"సరే లెండమ్మా నేను హైమవతమ్మనొకసారి కనపడమన్నానని చెప్పండి. వీలైతే మాట్లాడుకోవచ్చు!.''

జాహ్నవికి తలకొట్టేసినట్లయింది. ఈవిడ తన మాటకు విలువనియ్యటం లేదు. హైమవతక్క వచ్చి చెప్తేనేకాని, ఏవిషయమూ నిశ్చయంకాదు. ఇంటా బయటా తన విలువ ఇంతఘోరంగా ఉంది. ఏమనగలదు? నాటి జమీందారీ వంశపు స్త్రీ— కానీ యే వియ్యంకురాలు— ఏమాట్లాడకుండా సెలవు తీసుకుని వచ్చేసింది.

"అత్తమీదకోపం దుత్తమీద తీర్చినట్లు'' హైమమీద విరుచుకు పడింది.

"ఈఇంట్లో నీమాటతప్ప, నామాట కొల్లదని టాంటాం వేసావుగా. ఆవిడ నీతోనే మాట్లాడుతుందిట. రేపెళ్ళి ఏం మాట్లాడుతావో మాట్లాడు.''

హైమ కళ్ళప్పజెప్పి చూస్తూ నిల్చుంది.

ఆ మరునాడు రాధాయమ్మ దగ్గరికి వెళ్ళాలో అక్కర్లేదో అర్థంకాలేదు హైమకు. సందేహిస్తుండగానే జాహ్నవి వచ్చింది.

"ఇంకా బయలుదేరలేదుకదూ? అవునులే, వెళ్ళకు. నీ పుణ్యానా అని ఆవిడకు నావగాటమీాద విలువలేదు. ఈ పెళ్ళి ఎలాగా జరగదు. ఉదారంగా బోలెడు మాటలు మాట్లాడిన మంచితనం నీకు మిగిలి పోతుంది.

"వెళుతున్నానమ్మా ఇప్పుడే వెళ్తాను ఈ పెళ్ళి జరిగి తీరుతుంది. జరిగించే బాధ్యతనాది."

హైమ అప్పటికప్పుడు తయారయి బయలు దేరింది.

* * *

హైమంటే ఎంతో అభిమానం రాధాయమ్మకు. ఎప్పుడూ ఎంతో ఆప్యాయంగా, ఆదరంగా ఆహ్వానించేది కానీ, ఆరోజు హైమను చూడగానే బొమలు ముడిపడ్డాయి. అయినా మామూలు మర్యాదలకి లోపం జరుగలేదు. సంభాషణ హైమే ప్రారంభించింది.

"నన్ను పిలిపించారట!"

రాధాయమ్మ ఇంక అణచుకోలేక పోయింది, "అవునమ్మా! మనోరమను రాజాకు చేసుకోవాలని మన మిదివరలో అనుకున్నాం. జాహ్నవమ్మ విన్నొచ్చి రాజాకు నీరజమ్మనిస్తానంటున్నారు. వండంటి బిడ్డకి ఆమె నెట్లాచేసుకోవాలమ్మా! కట్నమిస్తామంటున్నారు. డబ్బు కక్కుర్తికి మాకేం తక్కువయింది?"

హైమ సమాధానం చెప్పలేక పోయింది ఎలాగో అంది "మా నీరజమ్మకు కాస్త అవకరం కానీ, చాలా ఎన్నదగ్గ మనిషి. తెలివితేటలు, వినయం— అన్నీ ఉన్నాయి. కళగలముఖం.'

రాధాయమ్మ ముఖం మాడ్చుకుంది.

"ఇష్టంలే. పోతేపోయింది. మీ మనోరమ రాజాకా ఉత్తరం రాయటమేమిటమ్మా! ఆ ఉత్తరం ముక్క పట్టుకుని నీరజమ్మనే చేసుకుంటానంటున్నాడు రాజా! ఇదెక్కడి న్యాయమమ్మా! మనోరమ కాకపోతే ఏం సంబంధం. అవకరం పిల్లనెందుకు కోడలిగా చేసుకోవాలి?"

హైమ నిర్ఘాంతపోయింది.

"ఉత్తరమా? ఏ ఉత్తరం? మనోరమ రాసిందా? రాజాకా?"

"తెస్తా ముండండి....."

రాధాయమ్మ లేచి జాహ్నవి ద్వారా రాజాకందిన మనోరమ ఉత్తరం తెచ్చి హైమ చేతుల్లో పెట్టింది.

మాటలు కొంతులు కోదంటాడనే ఉద్దేశంతో "నాయనా! జాహ్నవమ్మొచ్చి నీరజమ్మను నీకు చేసుకోమని అడిగారు. నియిష్టమని చెప్పాను." అంది రాధాయమ్మ రాజా నిర్లిప్తంగా "సరేనమ్మా! ఆ సంబంధమే నిశ్చయం చెయ్యి...." అన్నాడు.

విస్తుపోయింది రాధాయమ్మ—

"నాకు మనోరమ మీదుందినాయనా! ఆమెను కోడలుగా చేసుకోవాలి! నీరజమ్మంటే నాకంత గురి లేదు."

రాజా పేలవంగా నవ్వాడు.

"మనోరమకు నన్ను చేసుకోవాలని లేదమ్మా!"

"అదేంటయ్యా! ఆమెమనసు నీకెట్లా తెలుసు?"

"ఆవిడే స్వయంగా రాసింది." పరధ్యానంగా అనేసాడు రాజా! అన్నవెంటనే నాలుక కరుచుకున్నాడు. కాని రాధాయమ్మ వదిలిపెట్టలేదు. విధిలేక మనోరమ రాసిన ఉత్తరం తల్లి కిచ్చాడు రాజా— చదువుతూనే ఉగ్రురాలయి పోయింది రాధాయమ్మ.

ఆమె కిష్టంలేక పోతే పోయింది.

తన కొడుకుకు మరో సంబంధం రాదా? ఆమెదే దురదృష్టం. నీరజమ్మను చేసుకోమనటమేమిటి?

ఆమెమాట పట్టుకొని ఈయన నీరజమ్మను చేసుకుంటాననట మేమిటి?

నీరజమ్మ తన కోడలు కానక్కర్లేదు— అసలా వంశమే అంత. ఆ వంశంలో పిల్లలు తనకక్కర్లేదు. మనోరమ తలదన్నే పిల్లను కోడలిగా తెచ్చుకుంటుంది తను.

వణుకుతున్న చేతులతో ఉత్తరాన్ని తిరిగి రాధాయమ్మ చేతులలో పెట్టింది హైమ.

"చూసారమ్మా!" ఉక్రోషంగా అడిగింది రాధాయమ్మ. క్రింది పెదవి కొరుక్కుంటూ, కన్నీళ్ళాపుకుంటూ కూర్చుంది హైమ. ఆమె అంతరంగం క్షోభించిపోతుంది. ఏమీ ఎరుగని ముద్దరాలిలా ఉండే మనోరమ ఇంతపని చేసిందా! కటువుగా దానిలను కూడా ఒక్క మాటనలేదే! సాటి జమిందారీ యువకునికి అంత మర్యాదలేకుండా రాస్తుందా?

ఏమి దురదృష్టమో! మొదటినుంచీ తను ఎంతో విశ్వాసం ఉంచిన వ్యక్తులే తనను నట్టేట్లో ముంచుతున్నారు.

అతి ప్రయత్నంమీద తన ఆవేదనను మింగి ప్రాధేయ పడుతున్నట్లుగా "రాజాకూడా ఇష్టపడితే నీరజమ్మను చేసుకోండమ్మా! అది ఒకింటిదయితే, అందులో మీ ఇంటికోడలయితే, మా కందరికీ పెద్ద బరువు దిగిపోతుంది. మీకు డబ్బు కక్కుర్తని ఎవరంటారమ్మా! ఏదో మాట వరస కనుంటుంది. నేనన్నాను. ఎనభై వేలయినా, ఇంకా ఎక్కువయినా ఇద్దామని— మరి రాజాలాటి సంబంధం సామాన్యంగా వస్తుందా?" అంది కట్నం సంగతి హైమనోట విన్నాక రాధాయమ్మ కళ్ళు మెరిసాయి. హైమ అది గమనించింది. లేస్తూ "ఆలోచించుకుని కబురు చేయండమ్మా!" అని ఇంటికొచ్చేసింది.

'ఏన్యువల్' పరీక్షలలో ఆఖరు పరీక్ష రాసేసి ఎంతో ఉల్లాసంగా నీరజతో ఇంటికొచ్చింది మనోరమ. తల్లి ముఖం చూసి వెలవెల పోయింది. నీరజ కూడా అలా ఉన్నావేం పిన్నీ?" అని అడిగింది.

"ఏం లేదు" అంది హైమ శాంతంగా— అయినా నీరజకూ, మనోరమకూ కూడా హైమ ఎందుకో చాల బాధపడుతూందనిపించింది.



నీరజ లేకుండా చూసి మనోరమను గదిలోకి పిల్చి తలుపువేసి చెళ్ళున ఆచెంప, ఈచెంప వాయించింది హైమ.

ప్రశ్నించటమూ, ఏడవటమూ కూడా మరిచిపోయి, చిత్తరువులా నిల్చి అమాయకంగా తల్లిని చూడసాగింది మనోరమ.

మనోరమ చూపులు హైమ గుండెలను చీలుస్తున్నా, కర్కశంగా "పాపిష్టి దానా! రాజాకు ఉత్తరం వ్రాస్తావా? చావక పోయావా?" అంది.

"రాజాకా? ఉత్తరమా? నేనా?"

"దౌర్భాగ్యురాలా! అబద్ధాలా? స్వయంగా నాకళ్ళతో చూసాను."

మూఢురాలిలా తల్లివంక చూస్తూ నిలబడింది మనోరమ.

"గొప్పగా 'కాబోయే పెళ్ళికొడుకు గారికి' అని సంబోధించి మరీ రాయలేదూ నువ్వు?"

మనోరమ కెవ్వున కేకపెట్టి గుండెలు పగిలేలా వెక్కివెక్కి ఏడవసాగింది.

ఆ ఏడుపు తగిలిన దెబ్బక కాదు. పిన్ని తనతో వ్రాయించిన ఉత్తరం రాజాకని తెలియటంవల్ల." ఎన్నడూ గట్టిగా మందలించడం కూడా చేయంది ఆనాడు అలా కొట్టింది హైమ. కూతురి ఏడుపు చూసి కరిగిపోయింది. గద్గదికంగా "సరే! వూరుకో! ఇంకోసారి అలా చెయ్యకు" అంది.

కానీ, మనోరమ తనను తాను సమ్హాళించుకోవటానికి చాలా సేపు పట్టింది. ఇంకా వెక్కుతూనే తల్లికి జరిగిందంతా చెప్పి "ఆ ఉత్తరం రాజాకని నాకు తెలియదు. తెలిస్తే ప్రాణాలైనా వదిలేదాన్ని కాని, ఇలా రాసేదాన్ని కాను. నేనలా రాస్తే నీరజక్కకు మంచి సంబంధం దొరుకుతుందని రాసాను" అంది.

మళ్ళీ ఏడుపు పొంగుకొచ్చింది మనోరమకు— స్థాణువయిపోయింది హైమ! ఈ జాహ్నవి!!

ఒకనాడు ఈ జాహ్నవి కారణంగా స్త్రీ లెవరూ సహించలేని రంపపుకోత సహించింది.

జీవిత సౌఖ్యాన్ని రెండుగా భాగించి జాహ్నవి చేతుల్లో పెట్టింది స్వయంగా—

నీ, నా, భేదంలేకుండా పిల్లల్ని పెంచింది. ఐశ్వర్యాన్నంతనూ నీరజకోసం వదులుకోవటానికి సిద్ధపడింది.

అయినా,

తన కడుపు పంట— అప్పుడే కళ్ళువిప్పిన పసిపాపలాటి మనోరమ శత్రువులలోనైనా ప్రేమ పుట్టించే సాధు హృదయం— ఈ కరుణ పుష్పాన్ని కాలితో నలిపి వెయ్యటానికి సిద్ధపడింది జాహ్నవి.

తను తన సౌఖ్యాలన్నీ నాశనం చేసుకుంది. తన కూతురి జీవితం కూడా జాహ్నవికి బలి కావాలా?

అలా బలిచేసే అధికారం తనకెక్కడిదీ?

ఎందుకు చెయ్యాలి?

"అమ్మా! ఈ సంగతులు నీరజక్కకు చెప్పవు కదూ!" కళ్ళు తుడుచుకుంటూ బేలగా అంది మనోరమ. సంతోషంతో హైమ శరీరం పులకించింది. మనోరమను కౌగిలించుకుని "నాకూతురివైన నువ్వే ఇంత విశాలంగా ఆలోచిస్తున్నావు— నీ తల్లిని. నీతో చెప్పించుకునేలా ప్రవర్తిస్తానా?" అని దీర్ఘంగా ఒక్క నిట్టూర్పు విడిచి, అగ్నిని దాచుకోవటం అలవాటయిన గుండెల్లో ఈ అగ్నిని కూడా ఇముడ్చేసింది.

(సశేషం)

అంతర్జ్వాలలు

పాలడుగు వెంకటేశ్వరరావు



బందరులో చదువుకుంటూ ఉన్న నా మేనల్లుడిని చూసి వద్దామని బయలు దేరాను. గుడివాడ 'బస్టాండు'లో పిలగారు నుంచి రావలసిన బస్సు కోసం ఎదురు చూస్తూ వున్నాను. గంట సేపటి నుంచి చూస్తూ వున్నా బస్సు అయిపు లేదు. 'బస్టాండు' ప్రయాణీకులతో కిటకిటలాడుతూ వుంది.

"నమస్కారం బాబూ! ఎక్కడికి బయలు దేరారు?" పరిచయమున్న గొంతు.

చిరాకుగా ఆలోచనల్లో మునిగివున్న నేను ఈ మాటలతో బయటపడి తల ఎత్తి చూశాను. నాకు ఎదురుగా 'సీతారాముడు' నిలబడి వున్నాడు.

చవకబారు లాల్చీ, అదుపులేకుండా ఎదిగి మొహం మీద పడుతు వున్న జుట్టూను. గారపట్టిన పళ్ళతో వికారంగా అసహ్యంగా వున్న నోరు. మాసిపోయి నల్లగా వున్నాయి బట్టలు. శరీరం చెమటలతో మురికి వోడుతూ వున్నది. అతని పక్కనే నేస్తులు కాబోలు మరో ఇద్దరు అదే అవతారంలో వున్నారు.

నాకు అసహ్యం వేసింది. అసలే చిరాకుగావున్న నాకు సీతారాముణ్ణి చూసి మరింత విసుగేసింది. చాలాకాలానికి కనబడిన సీతారాముడు నాలో కొంచము కుతూహలమూ కలిగించక పోలేదు.

"మన వూళ్ళో అందరూ బాగా ఉన్నార బాబూ!"

"ఆఁ."

"ఎక్కడికి బయ లుదేరినట్లున్నారు."

"వూరికి వెడదామని."

అస్పష్టంగా సమాధానం ఇచ్చాను. నేను ఎక్కడికి వెడుతున్నదీ సీతారాముడికి తెలియడం నాకు ఇష్టంలేదు. వీడు, నానుంచి ఏదైనా కోరడేం, నన్ను కావాలని వదిలిపెట్టడం లేదా?

"టికెట్లు తీసుకున్నారా?"

"లేదు."

"ఇంకా ఇవ్వడం లేదల్లే వుంది. బస్సు వచ్చినాక ఇస్తారేమో?"

సీతారాముడి నేస్తులిద్దరూ అవతలకి వెళ్ళి బీడీలు కాల్చుకుంటున్నారు.

బస్సు వచ్చింది.

కండక్టరు బస్సు దిగి 'బుకింగు' వద్దకు నడిచాడు.

'బుకింగు' వద్ద జనం కిటకిట లాడుతూ వున్నారు. బాగా రద్దీగా వున్నది. ఈ 'తొక్కిడి' లో 'టికెట్టు' తెచ్చుకోవడము నాకు అసాధ్యముగా తోచింది.

నిస్సహాయంగా అటునైపే చూస్తూ వున్న నన్ను సీతారాముడు అడిగేడు: "మీరు వెళ్ళవలసింది ఆ బస్సుకేనా?"

"అవును." అన్నాను.

"ఏవూరు వెళ్ళాలో చెప్పండి. నేను 'టికెట్టు' తెచ్చిపెడతాను." అన్నాడు.

సీతారాముడి పీడ నాకు చెప్పలేనంత అయిష్టంగావుంది. వాడితో మాట్లాడటం నాకు ఏమాత్రమూ ఇష్టము లేదు. కాని ఇప్పుడు నాకు వాడి సహాయమే అవసరమయింది. నేను ఆ రోజే తప్పకుండా బందరు వెళ్ళి చూడవలసిన 'విషయాలు' కొన్ని వున్నాయి. తరువాత బస్సులో మాత్రం నాకు సీటు దొరుకుతుందన్న నమ్మకం ఏమిటి? ఇప్పట్లో 'రైలు' కూడా వున్నట్లు లేదు.

అయిష్టంగానే పేరు చెప్పి డబ్బులిచ్చాను.

సీతారాముడు జనంలో దూరబడ్డాడు.

మరో పది నిముషాలలో 'టికెట్టు' తీసుకుని బయటకి వచ్చాడు నవ్వుతూ. అప్పుడే టికెట్లు అయిపోయాయని, మిగిలి పోయిన జనం నిరుత్సాహంగా అవతలకు వచ్చేస్తున్నారు. నేను నిజంగా అదృష్టవంతుణ్ణి!

నన్ను బస్సు ఎక్కించి, బయలుదేరేదాకా ఏవో విషయాలు మాట్లాడుతూనే వున్నాడు సీతారాముడు. అందరినీ పేరు పేరునా క్షేమం అడిగేడు. సీతారావమ్మగారూ, వెంకట సుబ్బయ్యగారూ ఎలా వున్నారని తరచి తరచి అడిగేడు.

ముక్తసరిగా సమాధానాలు చెప్పేను. బస్సు బయలు దేరింది. సీతారాముడు వెనకనే మిగిలి పోయేడు.

వాడి గురించిన స్మృతులు మాత్రం నన్ను వదిలిపోలేదు.

నిజంగా బతకడం అన్నది ఒక కళ. కొంత మంది బయటికి ఎన్నో బాధలు పడుతూ వున్నట్లు కనిపించినా, అంతరంగంలో ఒక చిన్న చోటు ప్రత్యేకించుకుని అందులో సంతోషం ప్రతిష్ఠించుకుంటారు. మరికొందరు, బయటికి ఎంతో బాగా వున్నట్లు నటిస్తూ లోలోపల దుర్భర వేదననీ, మనస్సుని పిచ్చి పిచ్చిచేసే జ్ఞాపకాల్నీ పదిలపరుచుకుంటారు. ఈ బాధలూ సుఖాలూ అసలు పట్టించుకోకుండా యాంత్రికంగా బ్రతుకును వెళ్ళబుచ్చడంలో 'తృప్తి' పడతారు మరికొందరు. ఇవన్నీ, మరెన్నో కాక మరొక రకమయిన తెగ ఉన్నది మనుషుల్లో. వాళ్ళకి బ్రతుకుమీద ఒక అభిప్రాయమంటూ వుంటుందో లేదో తెలియదు. వారి జీవితం కాల్చి వేసే మంట వంటిది. వాళ్ళు కావాలనుకున్న వాళ్ళకి, బాధా, భయమూ తప్ప వాళ్ళు ఇవ్వగలిగింది మరేమీ వుండదు. మనస్సుని పిచ్చి పిచ్చి చెయ్యగల జ్ఞాప

బాధలూ, వేదనలూ తెప్పించగల అనుభూతులూ అన్న వాళ్ల జీవితాలలో పేర్కొనదగ్గ మరే అంశమూ వుండదు.

అందువలననే సీతారాముణ్ణి గురించి ఆలోచించాలన్నా నాకు అసహ్యం కలుగుతుంది.

సీతారాముడి తండ్రి, తాత, ముత్తాతల దగ్గర నుంచీ రామమూర్తిగారి దగ్గర 'కమతం' వుంటున్నారు. ఆ సంప్రదాయం సీతారాముడి తండ్రి వీరయ్య వరకే నడిచింది. వీరయ్యకి సీతారాముడు ఒక్కడే కొడుకు.

కాని వీరయ్య భార్య, కన్నకొడుకని అక్కున్నైనా లేక సీతారాముణ్ణి రాచి రంపాన పెట్టేదట! దానికి కారణం చిన్నతనం నుంచి పేరుకుని వున్న సీతారాముడి అవలక్షణాలే నంటారు.

ఆ దంపతులకి పుట్టిన దగ్గరనుంచి సీతారాముడు సమస్యే అయిపోయాడట. రామమూర్తి గారి భార్య సీతారావమ్మగారు ఆయనకి ఆవిడ మూడవ భార్య. కాలు కింద పెట్టకుండా సౌకర్యాలు, మూలుగుతూ వున్న ఐశ్వర్యం, ముసలి వాడయినా ఆప్యాయంగా ఆదరంగా చూసుకునే భర్త— సీతారామమ్మగారు అదృష్టవంతురాలు అనుకునే వారు. సీతారామమ్మగారిది జాలి గుండె. ఆమె చేసిన దానధర్మాలు లెక్కలేదంటారు. దాదాపు వూళ్లోవున్న పేదవాళ్ళందరూ ఆవిడ్ని భక్తి శ్రద్ధలతో తల్చుకుంటూ వుంటారు.

సీతారాముడు చిన్నతనమంతా సీతారావమ్మగారి దొడ్లోనే గడిపేడని చెప్పవచ్చు. వీరయ్య వెంట తోకలాగా తిరుగుతూ వాడు సీతారావమ్మగారి వాత్సల్యాన్ని రెండు చేతులా జుర్రుకున్నాడని అనుకునే వారు. పిల్లలు లేనందువలన సహజంగా ఆమె పిల్లల మీద ఎంతో పేక్ష కనబరిచేది. ముందూ వెనకా దగ్గర బంధువులు లేని రామమూర్తిగారు రెండేళ్ళ క్రితం ఏదో జబ్బుతో తీసుకుని చచ్చిపోయాడు.

కష్ట సమయంలో ఆమెని ఆదుకుని ప్రతిదానికీ నేను వున్నానని నడుము కట్టుకుని నిలబడినవాడు వెంకట సుబ్బయ్యగారు. వెంకట సుబ్బయ్య, రామమూర్తిగారికి దూరపు బంధువు. ఆ వూళ్లో బాగా పరువూ, ప్రతిష్ఠ, గౌరవమూ వున్న పెద్ద మనుషుల్లో మునసబుగారి తరువాత వెంకట సుబ్బయ్య గారే వస్తారు.

సీతారాముడు చిన్నప్పటినుంచీ అల్లరి చిల్లరగా తిరిగేడు. అవలక్షణాలన్నీ అబ్బేయి. చెప్పిన మాట వినకుండా, ఇల్లు పట్టకుండా తిరిగేవాడట. రాత్రి ప్రొద్దుపోయినాక తాగి వచ్చి అల్లరి పెట్టేవాడట. ఇంట్లో చెప్పకుండా డబ్బు పట్టుకుపోయి పేకాటలో పెట్టేవాడట. రోజురోజుకీ ఈ లక్షణాలు ఎక్కువయ్యేయి. వయస్సు వస్తున్న రోజులలో ఒకరిద్దరు ఆడపిల్లల్ని కూడా అల్లరిపెట్టి దెబ్బలు తిన్నాడని అనుకున్నారు.

ఆ విధంగా నయినా ఒకదారికి వస్తాడేమోనని, వీరయ్య సీతారావమ్మగారి సలహా మీద నాలుగేళ్ళ క్రితమే వాడికి పెళ్ళి చేశాడు. కాని వీరయ్య అంచనా తల్లక్రిందు లయింది. అమాయకురాలయిన ఇంకొక ఆడపిల్లని మడిగుండంలోకి ఈడ్చారు వాళ్ళు. సీతారాముడు మారకపోగా, భార్యని నానా బాధలూ పెట్టేవాడు. అర్ధరాత్రి తాగి వచ్చి అల్లరి చేసేవాడు.

సీతారాముడు మనిషేనా?

వాడికి హృదయ ముందా?

కన్నవాళ్ళని, కట్టుకున్న వాళ్ళని ఈ రకంగా పీడించటానికి ఎవరికయినా ఏమి హక్కు వున్నది? కని, పెంచి ప్రేమని పంచి ఇచ్చిన తల్లిదండ్రులకీ, సర్వస్వం అర్పించి తానే సర్వమూ అని నమ్మివున్న ఇల్లాలికీ అతను కృతజ్ఞత చూపించే విధము అదేనా? బ్రతికి వున్నంతకాలం, కన్న వాళ్ల గుండెల్లో నిప్పులు, కట్టుకున్న వాళ్ళ కళ్ళల్లో కన్నీళ్లు నింపడమే ధ్యేయమైతే ఇక ఆ మనిషి బ్రతుకు ఏమి బ్రతుకు?

అందుకే అన్నాను, సీతారాముడంటే నాకు అసహ్యమని.

అక్కడ వూళ్లో, భార్య, పిడిమీదే ప్రాణాలు నిల్పుకుని జబ్బుతో బాధపడుతూ కొన ప్రాణంతో వున్నది. సీతారాముడు, ఇక్కడ, ఏమీ పట్టకుండా స్నేహితులతో కులాసాగా తిరుగుతున్నాడు!

అంతవరకూ పరిపెట్టుకొంటే పోనీ అని ఎవరూ పట్టించుకోకుండా వుందురు. కాని సీతారాముడు వూరిలోని వాళ్ల మంచితనాన్ని కూడా ఉపయోగించుకొని విజృంభిస్తున్నాడని తెలిస్తే ఎవరు మాత్రం ఎట్లా వూరుకుంటారు?

ఒకనాడు నా చెవులారా నేనే విన్నాను.

ఆ రాత్రి పనిమీద సీతారావమ్మ గారి ఇంటికి వెళ్లాను. నాకు కొంచెము సైకము అవసరం అయింది.

వీధి గడప దాటి లోపలికి అడుగు పెట్టే టప్పటికి ఏవో మాటలు వినబడి అలాగే ఆగిపోయాను.

ఆ గొంతులు గుర్తుపట్టాను!

ఒకటి సీతారావమ్మ గారిది. రెండవది సీతారాముడిది.

సీతారాముడికి డబ్బు అవసరమయితే తప్ప మా వూళ్లో చచ్చినా అడుగుపెట్టడని నాకు తెలుసు. నెలకో, ఆరునెలలకో వచ్చి డబ్బుకోసం వీరయ్యని బాధపెట్టడం అందరూ ఎరిగున్న విషయమే!

కాని సీతారాముడు ఇక్కడి కెందుకు వచ్చినట్టు?

ఆమె చెబుతున్నది. తన ప్రవర్తనని మార్చుకోమనీ, మంచివాడుగా వుండమనీ హితవు పలుకుతున్నది. తను చెప్పినట్టు చేస్తే, ఎంతడబ్బు కావలసినా ఆదుకోవటానికి తను వున్నానంటున్నది. ఏ వ్యాపారమో, వ్యవసాయమో చేసుకుని ఇంటిపట్టున ఉండినట్లయితే అందరూ సంతోషిస్తారని ఎన్నో విధాలుగా నచ్చ జెప్పింది.

సీతారాముడు మాట్లాడకుండా విన్నాడు. డబ్బు ఎంతో అవసరంగా ఉందనీ, వర్తుబాటు చేయవలసిందనీ అడిగాడు, ఆ కర్ణ దీనంగా మనసు కరిగేట్టుగా.

సీతారావమ్మగారిది జాలి గుండె. సీతారాముడికి తన మాటలు మనసులో నాటుకున్నాయని నమ్మింది, వాడు బాగుపడతాడని ఆశించింది.

చేతిలో డబ్బు పట్టుకుని నాకు గుమ్మంలో ఎదురయిన సీతారాముడు గతుక్కుమని ఒక క్షణం ఆగి, వెంటనే తమాయించుకుని తిరిగి వెళ్లిపోయాడు, తల వంచుకొని.

ఆ తరువాత ఆమెని అట్లా ఎన్నోసార్లు వాడు మోసం చేశాడని తెలిసింది. ఆమెతో పలుగురూ చెప్పారట! 'వాడికి డబ్బు అలవాటు చేస్తున్నావు. అది మంచిదికాదు. దుష్టుడిని దూరంగా వుంచటం మంచిది. అయినా వాడు నీకు ఏమిటి? కొడుకా, తమ్ముడా? ఈ సారి గుమ్మం తొక్కితే కాళ్ళు విరగ్గొడతామని చెప్పు.' అని.

అప్పట్నుంచి సీతారాముడ్ని, వాళ్ళింట్లో ఎవరూ చూడలేదు. కాని సీతారాముడు అప్పుడప్పుడు రహస్యంగా రాత్రివేళ వచ్చి ఆమెని బ్రతిమాలి పోతికా, వందా తీసుకు పోతున్నాడని నాకు తెలుసు. నా కళ్లబడింది ఆ సంగతి, ఇంకొక రోజున.

ఆమె ఏమి మనిషి? వాడి సంగతి తెలిసీ ఆమె అంత దయ ఎలా చూపిస్తున్నదినే!

సీతారాముడిని చూస్తే దయ్యము జ్ఞాపకం వస్తుంది. వాడు రక్షసుడు.

సీతారావమ్మగారు దేవత. ఆ వూళ్లో ఎందరికో ఆమె 'తల్లి'! దయగల తల్లి.

అవును.

మంచితనాన్ని రాక్షసత్వం పొడుచుకుంటున్నది.

వాత్సల్యం నగిచి నగిచి నేసారి తరదు గట్టింది వీరయ్యలో.

త్యాగం, గుర్తింపులేక తల్లడిల్లి, ఇంకా ఏడుస్తూనే వుంది సీతారాముడి భార్యలో.

స్వార్థం హాయిగా దుప్పటి కప్పుకుని నిద్రపోతున్నది వీరయ్య భార్యలో. ఆమె ఏమిమనిషి? హృదయం లేదా? విరక్తితో ఆ తలుపులు మూసుకున్నావా? ఆమెలో 'కన్నప్రేమ' ఏమయినది? సీతారాముడిని గురించి ఆమె అసలు పట్టించుకోవటమే లేదు. అవును. వీరయ్య భార్య నిజంగా రాక్షసి. ఆ రాక్షసి కొడుకు రాక్షసుడు. మరి!

ఇంకా సీతారాముడు, తెగిన గాలిపటంవలె, తిరగటం మానలేదు ఎప్పుడయినా పట్నంలో ఇట్లా ఎవరయినా కనబడితే ఎంతో ఆప్యాయత చూపిస్తాడు సీతారాముడు ఏమి మనిషి? అతడిని ఏమని అర్థం చేసుకోవాలి......? తరువాత అతన్ని మరిచిపోయాను, నన్ను బస్సులో ఎవరో పలకరించడంతో.

ఆ వెళ్లటము, బందరులో మూడు రోజులు వుండవలసి వచ్చింది. వెళ్లిన పని అనుకూలంగ నెరవేరింది. నాలుగోరోజున మా వూరికి తిరిగి బయలదేరాను. బందరునుంచి నాలుగింటికి బయల్దేరిన ఆ బస్సు త్రోవలో చెడిపోవటము వలన గుడ్లివాడ చేరేసరికి రాత్రి పదిన్నర అయింది. రిక్షాలవీ ఏవీ లేకపోవడము వలన మూడు మైళ్ళు నడిచి మా వూరు చేరేసరికి పదకొండు దాటింది ఆ రాత్రి.

అప్పటికే వూరు సద్దు మణిగి వుంది.

చుట్టూ నల్లగా చీకటి పరుచుకుని వుంది భయంకర నిశ్శబ్దం అంతటా వ్యాపించింది 'కీచురాళ్ళ మోతని' చెవులు సహించలేకుండ వున్నాయి.

సీతారావమ్మగారి ఇంటి ప్రక్కనుంచి నడుస్తున్నాను.

హటాత్తుగా, లోపల్నించి మాటలు వినబడాయి!

నా మనస్సు ఒక్కసారిగా గడ్డ కట్టింది! అలాగే నిలబడి పోయాను!!

"నీ ప్రాణం తీస్తాను. చెప్పు నువ్వు చేస్తున్నదేమిటి? ఛీ. నీదీ ఒక బ్రతుకేనా?" తగ్గు స్వరంలో దృఢమయిన స్వరం, బలంగా అంటున్నాడు

‘దబదబ’ మని దెబ్బలు పడిన చప్పుడు!

ఇక నిలబడలేక పోయాను. ఆరడుగుల ఎత్తున్న ప్రహరీ గోడని ఆనుకొని లోపలికి వెళ్ళాను. చావిడిలో గొడ్లు నెమరు వేస్తూ చెవులతో దోమల్ని, ఈగల్ని ఉదారంగా తోలుతున్నాయి.

గాడి లోని చెత్తలో ఎవరో పడుకుని నిద్ర పోతున్నట్టు తెల్లగా అగుపిస్తున్నది. గబగబ అడుగులు వేశాను.

ఇంటి తలుపులు దగ్గరగానే వేసి వున్నాయి. చప్పుడు కాకుండా తీసి లోపలికి వెళ్ళాను.

‘పడమటింటిలో గుడ్డిలాంతరు వెల్తురులో నేను చూసిన దృశ్యం నన్ను ఆశ్చర్యంలో ముంచి వేసింది.

సీతారామమ్మగారు, కారుతున్న కన్నీటి చారికలు మొహాన్ని వికృతంగా మార్చగా, స్తంభానికి ఆనుకుని నిలబడి వుంది.

వెంకట సుబ్బయ్యగారు నోట మాటరాక నిశ్చేష్టులై శరీరాన్ని అప్పగించి నిలబడి వున్నారు. సీతారాముడి బలమయిన చేతులలో ఆయన చొక్కా బిగించి పట్టుకోబడి వుంది.

నాకు ఆశ్చర్యమూ కోపమూ కలిగాయి.

సీతారాముడి మీదికి దూక బోయాను.

“ఆగు అన్న సీతారామమ్మగారి గర్జన విని ఆగిపోయాను. నిరసనగా మొహం విదిలించాడు సీతారాముడు. “ఛీ!” అని పట్టు ఒదిలించాడు సీతారాముడు. తల వంచుకుని చకచకా నడిచి తలుపు తీసుకుని వెళ్ళిపోయారు వెంకట సుబ్బయ్యగారు. నేను అక్కడున్న విషయం ఆయన గ్రహించినదీ

అంతర్జ్వాల

లేనిదీ అనుమానాస్పదమే. ఆయన నిలువునా వణికిపోతున్నారు. వెంకటసుబ్బయ్యగారు వెళ్ళిపోయేక సీతారాముడి వంక చూశాను. సీతారాముడి కళ్ళు విస్ఫులింగాలా వెలుగుతున్నాయి.

మరుక్షణం నానుంచి చూపులు మరల్చుకుని సీతారామమ్మ వంక దీనంగా, బాధగా, ఆర్ద్రంగా, జాలి కలిగించేటట్లు చూశాడు.

ఆమె తల వంచుకుని బాధగా వెక్కిళ్ళు పెడుతున్నది.

అప్రయత్నంగానే నా అడుగులు బయటకి పడ్డాయ్! ఆ వాతావరణంలో నిలబడివుండటం నాకు భరించరానిదిగా అయింది.

మనస్సులో అనేక ప్రశ్నలు. నేను చూస్తున్నది అంతా నిజమేనా అన్నది అసలు ప్రశ్న.

వెంకట సుబ్బయ్యగారు ఎందుకు వచ్చారు ఇక్కడికి ఈవేళ?

సీతారాముడంటే, వాడు ఎందుకు వచ్చిందీ నేను అర్థం చేసుకోగలను. సీతారాముడంతటి అల్పుడిచేత అంత అవమానమూ సహించి ఆయన మారు మాట్లాడక ఎందుకు వెళ్ళిపోయినట్లు? అంత పెద్ద మనిషి నిశ్చేతనంగా నిలబడిపోయి దెబ్బలు తిన్నాడు! ఇవీ నాలో వుద్భవించిన సమాధానం దొరకని ప్రశ్నలు.

ఎడ్లగాడిలో నుంచి పకిలింపు వినబడి తలెత్తి చూశాను.

అక్కడే ముటి కాల్చుకుంటూ కూర్చుని వున్నాడు, ఒక మనిషి, చీకట్లో తెల్ల తెల్లగా.

“ఎవరది?” అన్నాను.


“నేను బాబూ వీరయ్యని.”


“లోపల అంత గొడవ జరుగుతూ వుంటే ఆగి, వెంకటసుబ్బయ్యగారిని ఆ కొడుకు అల్లరి పెడుతూవుంటే నువ్వు చీమయినా కుట్టనట్టు కూర్చున్నావా?” అన్నాను కోపముగా. వీరయ్య మాట్లాడలేదు కాసేపు. ఐదు నిముషాల తర్వాత ఆవేశంగా, “అందులో పరాయి వాళ్ళెవరు బాబూ? కాకపోతే ఆ ‘సన్నాసి’కి ‘సీతారామమ్మ తల్లి’ ‘చల్లని తల్లి’ని మాత్రం తెలుసే గాని ఆ ‘సంగతి’ తెలియదు. అందుకే గొడవ. ఇది ఇప్పుడు సంగతా? ఆడు పుట్టక ముందు సంగతాయె. ‘తల్లిదండ్రులూ’ కన్న కొడుకూ మధ్యన నేనెందుకు బాబూ? నేను పిచ్చాణ్ణనుకున్నారా? కాకపోతే ఆనాడు ఆణ్ణి నా కడుపులో పెట్టుకోక......”


నేను నిర్విణ్ణుడనయ్యాను! శరీరంలో ‘విద్యుత్’ ప్రవహించినట్లయింది.


టక్కున ఆపేశాడు, వీరయ్య, ఏదో జ్ఞాపకం వచ్చినట్టు. పళ్ళు గట్టిగా కరుచుకుని వూరుకున్నాడు వీరయ్య, ఇక మీద నోరు జారకుండా వుండాలన్నట్టుగా.

“తమరు పట్నం నుంచి వస్తున్నారా బాబూ?” అన్న వీరయ్య ప్రశ్నకి సమాధానం చెప్పకుండా గబగబా అడుగులు వేశాను. ●






LIFEBUOY
for health
ఎక్కడ
లైఫ్‌బాయ్ వున్నదో
అక్కడ ఆరోగ్యము వున్నది
లైఫ్‌బాయ్‌తో స్నానము మీకు అత్యంత ఆరోగ్యమైన హాయి గొలుపుతుంది.
లైఫ్‌బాయ్‌లో ఉత్తమమైన సబ్బులో వుండ వలసిన అన్ని సుగుణములే గాక ఇంకా
ఎన్నియో వున్నవని మీరు తెలిసికొందురు.
లైఫ్‌బాయ్ మురికిలోగల క్రిములను కడిగి వేస్తుంది
హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి



విజ్ఞాన వికాసములో అవలోకనావిదే అగ్ర స్థానము. వాదాలు అవలోకాన్ని సమర్థించవలసినదే. వాదాలు వివరించలేని కొత్త సంగతిగాని కనబడిందంటే వాదాలు సర్దుకుని ఆకొత్త విషయాన్ని కూడా తమ ఒళ్లోకి తెచ్చుకోవలసినదే. ఈ ప్రక్రియ పరమాణువాదము కథతో చక్కగా తెలుస్తుంది.

గవాక్షమునుండి గదిలోనికి ప్రసరించే సూర్య కిరణాలలో తేలియాడే త్రసరేణువులు వాటంతటికి అవి స్వతంత్రంగా తిరుగుతూండడమును గమనించి, చార్వాకులు సృష్టిని ఏర్పరచే పరమాణువులు అవే నన్నారు. అనగా అతి కనీసపు కణములు అవేనన్నారు. జగత్తు కూడా అనాదియేనన్న జైన మతస్థులు పరమాణువులన్నవి అన్నీ ఒకేరూపంగా వుంటాయని అవి అనేకములు చేరడము వల్ల పృథివ్యాది పంచభూతములు ఏర్పడినవని చెప్పేరు. ఈ రెండు అభిప్రాయాలూ 'భూతములు నాలుగే' అన్న గ్రీకు తత్త్వజ్ఞుల వూహకు పూర్వానివే! క్రీస్తు పూర్వము ఆరవ శతాబ్దంలో వ్యాపించిన బౌద్ధులు గ్రీకులవలెనే ఆకాశమన్నది పదార్థము కానేకాదన్నారూ, పరమాణువు లన్నవి—ఏ భూతానికి దానిని— వేర్వేరు రకాలుగానే వుంటాయిగాని ఏకాకారము కాజాల వన్నారు. వేదాలలో బంగారము, వెండి, రాగి, సీసము, ఇనుము, తుత్తునాగమూ చెప్పబడ్డాయి. సుమారు క్రీ. పూ. ఆరవ శతాబ్ద ప్రాంతాన్న వుండిన కణాదుడు వైశేషిక దర్శనములో పరమాణువులు ముందు రెండేసి తరవాత చాలా చాలాసూ— చేరి, వస్తువులౌతా యున్నాడు. అయితే ఇవన్నీ తత్త్వవికాసములో తేలినట్టివే కాని వాతావరణ పరిశోధన కోసము కాదు.

17వ శతాబ్దారంభంలో బెల్జియము దేశములో ఉండిన వాన్ హెల్మాంటు వాయువులలో రకాలున్నాయని చూపించాడు. ఆ తరువాత ఆక్సిజను, హైడ్రోజను, అంగారామ్ల వాయువూ వంటి వాయువుల్ని చాలా వాటిని కనుక్కున్నారు రసాయనికులు. 1799లో ప్రౌస్టు, రసాయనిక సంయోగములోని విడిపదార్థాలు ఎప్పుడూ స్థిరమైన పాళ్లలోనే కలిసి వుంటాయన్నాడు. 19వ శతాబ్దారంభములో జాన్ డాల్టన్ అనే మాంచెస్టరు స్కూలు మాస్టరు "పరమాణువులు మూల పదార్థము లన్నిటికీ వేర్వేరవీ, వాటి బరువులు వేరుగా వుంటాయనీ రసాయనిక సంయోగంలో పరమాణువులు పిండైనవే చేరతాయి గాని ముక్క లవవు" అని పరమాణు వాదము చెప్పేడు. ఈవాదము 1895 వరకూ చిక్కు పడలేదు.

ఆ ప్రాంతంలో థాంప్సను అన్న బ్రిటిష్ భౌతిక శాస్త్రజ్ఞుడు, మూసిన గాజుగొట్టములో రకరకాల వాయువుల్ని ప్రవేశపెట్టి ఆ గాలుల్ని పలచన చేసి, ఆగొట్టములోంచి పెద్ద ఒత్తిడితో విద్యుత్తుని దాటించాడు. గొట్టములోని ఋణవిద్యుత్ ధ్రువాన్నించి పరమాణువుల కన్నా సూక్ష్మమైన ఋణవిద్యుదావేశిత కణాలు వెలువడ్డాయి. ఏవాయువును ఉపయోగించినా అవే కణాలు వచ్చాయి. కనక పరమాణువులన్నవి పరమమైన —అనగా విడగొట్టడానికి వీలుకాని—అణువులు కావనీ, ప్రతీ పరమాణువులోనూ ఋణ విద్యుదావేశముకల ఎలక్ట్రానులనే సూక్ష్మకణాలున్నూ, ధనవిద్యుదావేశము కల కేంద్రకమనే కణములున్నూ ఉంటాయన్నారు. ఇందాకా చెప్పిన గాజుగొట్టాలలో అదనపు సాధన లుపయోగించి, రకరకాలవాయువుల పరమాణువుల్ని విడగొట్టి ధనవిద్యుత్కణాల్నీ ఋణవిద్యుత్కణాల్నీ వేరు చేసి పరిశీలించారు. యురేనియమూ, థోరియమూ, అనే మూల పదార్థముల నుంచి ఆల్ఫా, బీటా—, కణాలు వాటంతట అవే చిమ్మకు రావడము గుర్తించారు వైజ్ఞానికులు. ఆల్ఫా కణాలు ధనవిద్యుత్తుతోనూ బీటా కణాలు ఋణవిద్యుత్తుతోనూ ఉండడమూ గుర్తించారు. పరమాణువులో కేంద్రకమనే నడిమి కణమూ దాని చుట్టూ ఎలక్ట్రానులనే అతి సూక్ష్మకణాలూ ఉంటాయనుకున్నారు గదా? ఈ ఆల్ఫా, బీటా కణాలు కేంద్రము నుంచే రావాలి మరి! అంటే ఏమన్న మాటా? విడగొట్టడానికి వీలే లేదనుకున్న పరమాణువు రెండు భాగాలుగా ఉంటుందనీ, ఆరెండింటా బరువైన కేంద్రములో ధన —ఋణ—, విద్యుత్తుకల సూక్ష్మకణాలు ఇంకా ఉన్నాయనీ తేలింది.

నక్షత్రాకాశము నుంచి ఎక్కడినుంచో మన భూమి వైపు వస్తూండే విశ్వమయూఖాల్ని శోధిస్తూ, ఏండర్సన్ అనే వైజ్ఞానికుడు ఎలక్ట్రాను అంత సూక్ష్మముగానూ వుండి—వాటి వలె ఋణావేశము కాక— ధనావేశముతో వున్న కణాలు కనుక్కున్నాడు 1932లో. అంటే పరమాణువులలో ఈ 'పాజిట్రానులు' కూడా ఉన్నాయన్నమాట. అయితే ఈయనగారే గామా కిరణాన్ని సీసపు పలక లోంచి పోనిచ్చినప్పుడు, అవతలివైపుకి శక్తి తగ్గిన గామా కిరణాలున్నూ, ఆ తగ్గిన శక్తికిసరి పోయేటట్టుగా పాజిట్రాను—ఎలక్ట్రాను జంటలున్నూ వస్తున్నాయని చూచాడు. ఐన్‌స్టీను చెప్పినట్లుగా ఈ ప్రయోగములో శక్తి ఎలక్ట్రాను జంట యొక్క వస్తువుగా మారిందన్న మాట. అయితే మరి ప్రధానముగా కణము రూపంలో ఉన్నవి ఏవి? — శక్తి వస్తువు రూపంలోకి మారినప్పుడు కణాలుగా ఏర్పడినవి ఏవి? అన్న ప్రశ్న వచ్చింది.

ప్రధాన కణములు ఏవి? ఎలక్ట్రానూ, ప్రోటానూ మాత్రము ప్రధాన కణము లనుకున్నారు కొందరు. తక్కినవి పాజిట్రానూ, ఆల్ఫాకణమూ— ఆగంతుకముగా ఏర్పడ్డవి అన్నారు. 1933 లో బోథే బెక్కరులు, బెరీలియమును ఆల్ఫాకణములతో తాడనము చేస్తే బెరీలియమునుండి న్యూట్రాను అన్న విద్యుద్రహిత కణములు వచ్చాయి. శాస్త్రజ్ఞులు, ప్రోటానులూ న్యూట్రానులూ ఎలక్ట్రానులూ మాత్రమే ప్రధాన కణముల నీన్నీ, పరమాణు కేంద్రములు న్యూట్రానులూ, ప్రోటానులూచేరి ఏర్పడుతున్నాయనీ అన్నారు. 'విద్యుదావేశము ధనము అయిన ప్రోటానులూ, విద్యుదావేశములేని న్యూట్రానులు చేరి కేంద్రములో ఏరీతిగా ఉన్నాయి?' అన్న సమస్యను తీర్చడములో యుకావా అనే భౌతిక శాస్త్రవాది విజ్ఞానికి లెక్కలవల్ల మీసాను అనే (ఎలక్ట్రాను— ప్రోటాను) నడిమి కణము—కొత్తది— తేలింది. విశ్వ మయూఖాలు తగిలి భిన్నాభిన్నములైన గాలి కణశకలములలో మీసానులు —ధనాలూ ఋణాలూ— రెండురకాలు కనబడ్డాయి పవెల్ వంటి వైజ్ఞానిక పరిశోధకులకు.

పరమాణువులను విరగగొట్టి వాటి శకలాలను బట్టి వాటి నిర్మాణ విజ్ఞానము సంపాదించాలని అమెరికనులు భారీ ఎత్తున నిర్మించిన సైక్లోట్రాను, సింక్రోటాన్, బీటాట్రాన్, సింక్రోసైక్లోట్రాన్ బెవెట్రాన్ వంటి రాక్షస యంత్రాల వల్లలోంచి న్యూట్రినో, ప్రతిప్రోటాను, ప్రతి న్యూట్రానూ హైపెరాను, మీసానూ అంటూ చాలా చాలా పరమాణుశకలాలు బయటపడ్డాయి. ఇవి 30 రకాలు దాటాయి. 'పరమాణు కేంద్రకంలో ఇవన్నీ ఎలాగ అమరగలవు?' అన్నది ఈనాటి (పరమాణు) కేంద్రకవిజ్ఞానపు సమస్య. విడదియ్యడానికి వీలులేని పరమాణువు దాని శకలాలతో దాన్ని నిర్మించడానికి తెలియరాని కణవ్యూహ కూర్చుంది. ●

విచ్చిన మబ్బులు



ఆ. సరస్వతీదేవి

విశ్వనాథం కాలుతున్న ఇంట్లోకివెళ్లి మంటల్లో నుండి శాంతను రెండుచేతులా పట్టి లాక్కొచ్చి మంచ మీద పడుకోబెట్టాడు.

"శాంతా! ఏమిటే అఘాయిత్యం! ఎందుకువెళ్లావు మండుతున్న ఇంట్లోకి?"

శాంతకు అప్పటికే కట్టుకున్న చీరె చాలా వరకు కాలింది. తల వెంట్రుకలు కూడా అంటుకున్నాయి. చేతులూ, ముఖమూ కమిలి నలుపుకు తిరిగాయి.

"మన ప్రాణాలు దక్కితేచాలు. ముఖ్యమైన సామాన్లు వెంకన్న తెచ్చి బయట పడేస్తున్నాడు. నీవెందుకు వెళ్లావు చెప్పు యింట్లోకి? అయినా ఈ స్థితిలో నీవు వెళ్లవచ్చా? ఏమిటే గూళ్లన్నీ అలా వెదుకుతున్నావు?"

శాంత నుదురు కొబ్బరి నూనెలో తడిపిన దూదితో అద్దుతూ దగ్గరగా మంచమీద కూర్చున్నాడు విశ్వనాథం.

శాంత భయంతో గజగజ వణికిపోతున్నది. కన్నీటి తడికి తల వెంట్రుకలు చెంపలకు అతుక్కున్నాయి. కళ్లు మూసుకుని మూలుగుతున్నది.

చటుక్కున విశ్వనాథానికి ఏదో జ్ఞాపకానికి వచ్చింది. వెంకన్నా అంటూ పరుగెత్తాడు. అప్పటికి వెంకన్న చేతికందిన సామానంతా చేరవేశాడు. దణ్ణేలమీద బట్టలన్నీ లుంగచుట్టి సరువు చుట్టలమీద పడే శాడు. విశ్వనాథం తన లా పుస్తకాలూ ఆఫీసు కాగితాలు వచ్చినవి లెక్క చూసుకుని పెట్టెలన్నీ ఒకదానిమీద ఒకటి పేర్చాడు.

సంధ్య చీకట్లలో విశ్వనాథం రాజవీధిలో క్రొత్తగా కట్టిస్తున్న ఇంటిని చూసి వస్తున్నాడు. వీధిమలుపు తిరగకముందే "ఇల్లంటుకుంది బాబూ" అంటూ కేకలు పెడుతూ వెంకన్న ఎదురుగా వచ్చాడు. వెంకన్న తోపాటు ఉరుకుపరుగులమీద ఇల్లుచేరుకుని ఆఫీసు గది తాళంతీసి చేతనయినన్ని లా పుస్తకాలు బయటి గదిలోకి వేయించాడు. ఇరుగుపొరుగుల సహాయంతో ఇంచు మించుగా సామానంతా బయటికి వచ్చింది.

వస్తువులు కంటికి సరిగా కనబడకుండా పొగ ముట్టేసింది. ఒక్కొక్క దిశనుంచి మంటలు నాలు కలు చాపుతూ పైకెగిసి ఆకాశాన్నంటుతున్నాయి. మంటల విజృంభణకు జనం వెనక్కు తగ్గారు.

"అయ్యో! బాబూ! అమ్మగారేరి?"

విశ్వనాథానికి మతిపోయినట్లయింది. శాంత మంచమ్మీదలేదు. విశ్వనాథం వెంకన్నను తోసు కుంటూ లోపలికి ఉరికాడు. నాలుగుమూలలా అలు ముకుపోయిన పొగలో కంటికేమీ కనబడటం లేదు. పొగ గొంతులోకి పోయి దగ్గు వస్తున్నది. శాంతకోసం చేతులతో తడుముకుంటూ ముందుకు వెళ్లాడు.

శాంతగదిలో గూళ్లన్నీ చేత్తో తడిమి చూస్తు న్నది. చేతికందినవన్నీ క్రింద పారేసి దేనికోసమో వెదుకుతున్నది. ఆమె చీరె కుచ్చిళ్లు అతడి చేతి కందాయి. బయటికి లాక్కొచ్చాడు రెండు చేతులూ పట్టుకుని.

రాత్రి పదకొండుగంటలకు మంటల విజృంభణ కొంతవరకూ తగ్గింది. ఇంటికలప చాలావరకూ కాలి పోయింది. వీధి వారంతాచేరి గాలికి ఆ నిప్పు మరో యింటిమీదికి ఎగరకుండా మళ్లీనీళ్లు పొయ్యటం మొదలు పెట్టారు.

యింటి ముందున్న చెట్టు ఆకులన్నీ మంటల వేడికి మాడి పోయాయి. కాలి మోడులా ఉన్న చెట్టు క్రింద శూన్యమనస్కుడిలా నిలబడిపోయాడు విశ్వ నాథం. అతడికి ఉండి ఉండి దుఃఖము ఉబుకుకుంటూ పైకి పొంగులా వస్తున్నది. అతడితాతగారు ముగ్గురు కూతుళ్ళ, నలుగురు కొడుకులతో సిరిసంపద లను అభివృద్ధి చేసుకుంటూ నలభయి సంవత్సరాలు ఆయింట్లో సుఖసంతోషాలతో కాలం గడిపాడు. అతడితండ్రి అప్పచెప్పిన ఆయింట్లో తన ఒక్క కొడుకు పెంచి పెద్దవాడిని చేసి మదరాసుపంపి లాయర్ని చేశాడు. ఇంటిచుట్టూ తోట వేశాడు. విశ్వనాథం ఆవూరిమీద అభిమానము ఆయింటిమీద మమతను చంపుకోలేక అక్కడే ప్రాక్టీసు పెట్టాడు. ఇల్లుకొంతభాగం పడగొట్టి ఆధునిక పద్ధతులలో కట్టించి కొత్త ఫర్నిచరుతో నూతనాలంకారములు చేశాడు. ఇదంతా జరిగి ఎని మిది సంవత్సరాలు కాలేదు.

విశ్వనాథం మనోవీధిలో తప్పటడుగులు వేస్తూ వేస్తూ ఉన్న అతడి పిల్లలుముగ్గురు వచ్చిరాని మాటల మాధుర్యాన్ని చవి చూపిస్తూ చూపిస్తూ చెయ్యిజారి పోయిన దృశ్యాలు గోచరమయ్యాయి. అతడిగుండె దిగజారినట్లయింది. నిర్ఘాంతపోయి నిట్టూర్చాడు.

ఇంటిముందు పోగయిన జనం ఒక్కొక్కరే వెళ్లి పోయారు. ఆవేదన నణచుకుంటూ విశ్వనాథం శాంత మంచంముందుకు కుర్చీజరుపుకున్నాడు. శాంత బాధతో మూలుగుతున్నది. తెరచినకళ్లు వాటంతట అవే మూతలు పడుతున్నాయి. పలకరిస్తే ఒక దాని కొకటి సంబంధంలేని మాటలు మాట్లాడు తున్నది. వినవక్రతో మందంగా వీస్తూ ఆమెముఖంలోకి చూశాడు విశ్వనాథం. రెండవసారి ఇంట్లోకి వెళ్లి నప్పుడు నడుముభాగం కాలి బొబ్బలెక్కింది.

ఆ వంసలో నాలుగు యిళ్లు కాలి పోయాయి. జననష్టంకాలేదు. కాని వస్తునష్టం చాలా అయింది. పొగంతా మేఘాలరూపంలో ఆకాశమంతటా అలు ముకు పోయింది. వీధి దీపాలయినాలేని ఆరాత్రివేళ మసకమసకగా ఉన్న చంద్రకాంతిలో ఆయిళ్లల్లోని వాళ్లు సామాన్లమీదే ఒక్కొక్కరే ఒరిగారు.

వెంకన్న డాక్టర్ని వెంటబెట్టుకుని వచ్చేసరికి చర్చిలో రెండుగంటలు కొట్టారు. డాక్టరు గాయాలను పరీక్ష చేసి ఇంజక్షను ఇచ్చినందువల్ల శాంతకు నిద్రపట్టింది. కాని ఉదయం లేచేవేళకు జ్వరం నూటమూడు దాటింది.

కాలిన యింట్లోనుంచి వెచ్చటిపొగలు ఇంకా వస్తున్నాయి. వాకిటివైపు గ్రామాలనుంచి వచ్చే పార్టీలకొరకు కట్టించిన పెద్ద చావడివంటిది చెక్కు చెదరలేదు. వెంకన్న ఉదయమేలేచి ముఖ్యమైన సామాను దానిలోకి చేరవేశాడు. మెల్లగా శాంత మంచము లోపలికి పట్టారు ఇద్దరూ కలిసి.

"వెంకన్నా!" శాంతమెల్లగా పిలిచింది. "సామా నంతా వచ్చిందా?"

"సామానుగదిలో బియ్యం మూటలూ అవీ ఉండి పోయాయండి".

"నాగదిలో గూళ్లన్నీ ఖాళీచేశావా?"

"వాటిలో ఉన్నవన్నీ ఓపెట్టెలో పడేశానండి"

శాంతకు అప్పుడప్పుడు స్పృహ తప్పినట్టుగా ఉంటు న్నది. వెంకన్న చేతులు నులుముకుంటూ మంచం దగ్గర నిలబడిపోయాడు.

పదిగంటలు దాటినప్పటినుండి శాంతకు పలవరిం తలు ప్రారంభమయ్యాయి. డాక్టరువచ్చి గాయాలను పరీక్షచేశాడు. జ్వరం నూటనాలుగు సమీపించింది, మరొకఇంజక్షన్ యిచ్చాడు.

"అవచ్చుడబ్బా కాలి పోకూడదు"

రెండుగజాలదూరంలో కాఫీ తాగుతున్న డాక్టరూ, విశ్వనాథమూ ఉలిక్కిపడ్డారు.

"1953 నుంచి ప్రాణాధికంగా దాచుకుంటున్న నా ఉత్తరాలు కాలిపోకూడదు."

'శాంతా! ఏమిటీ నీవేది? మెలకువతోనే ఉన్నావా?' దగ్గరగా వచ్చి కదిలించి పలకరించాడు విశ్వనాథం.

శాంత కళ్లు తెరిచి విశ్వనాథం ముఖంలోకి సూటిగానే చూసింది.

"నా ఉత్తరాలు! నా పెట్టె! వాటిని చూసుకుని కష్టాలన్నీ మరచి బ్రతుకుతున్నాను." చేతుల్తో కళ్లు మూసుకుని ఏడవటం మొదలుపెట్టింది.

డాక్టరు విశ్వనాథం ముఖంలోకి చూశాడు. విశ్వనాథం తలవంచుకున్నాడు.

"జ్వరం నూటనాలుగు దాటుతున్నది: జ్వరం తగ్గితేగాని పలవరింతలు తగ్గవు. ఐస్‌నీళ్లలో ముంచిన బట్ట నుదిటిమీద వెయ్యండి."

డాక్టరు వెళ్లిపోయిన తరువాత విశ్వనాథం శాంత మంచందగ్గరనే కుర్చీవేసుకుని కూర్చున్నాడు. ఆమె కళ్లు మూసుకుని పడుకుంది కాని అప్పుడప్పుడు పలవరిస్తూనే ఉంది. విశ్వనాథం ఆదుర్దా పడుతున్నాడు.

"1953లో క్వీన్‌మేరీస్ కాలేజీ హాస్టల్లో ఉండగా నీ ఉత్తరాలకోసం ప్రతిరోజూ సాయంత్రం కాగానే వరండాలోకి వచ్చి నిలబడి పోయేదాన్ని. నిరీక్షణలో పడ్డ బాధంతా నీ ఉత్తరం గ్రీష్మంలో శీతల వాయువులా సేదతీర్చేది. ప్రభూ! నీ ఉత్తరాలన్నీ భద్రం చేసుకుని ప్రతినిత్యం చూసుకుని కళ్లు తుడుచుకుంటే నా హృదయం పురివిప్పిన మయూరిలా నాట్యం చేస్తుంది. నన్ను మర్చిపోయావా ప్రభూ!"

విశ్వనాథం దిగ్భ్రాంతుడయిపోయాడు. తన వివాహం 1955లో జరిగింది. దేహము కంపించిపోయినది. ఐస్‌నీళ్లలో బట్ట మరొకసారి తడిపి ఆమె నుదిటిమీద వేశాడు.

ఆనాడు శాంత బలవంతంమీద ఒకకప్పు పాలు తాగింది. రాత్రంతా మగతగా పడుకునే ఉన్నది. మధ్యమధ్య మూలుగుతున్నది.

ఉదయం విశ్వనాథం లేచి జ్వరం చూశాడు. నూరుకి మించలేదు. ముఖం పీక్కుపోయింది శాంతకు. కళ్లుగుంటలు పడ్డాయి. మాట బావిలోంచి వచ్చినట్టుగా ఉన్నది. డాక్టర్ని చూసిలేచి కూర్చోబోయింది.

"ఇప్పటికంటే తేలిగ్గా ఉందికదండీ" శాంత నాడి చూస్తూ పలకరించాడు డాక్టరు.

అవునన్నట్లు తల ఆడించింది.

విశ్వనాథం చెప్పాడు రాత్రంతా పలవరించిందని.

"జ్వరతీవ్రతండీ, జ్వరంతగ్గగానే ఆలక్షణాలన్నీ వాటంతట అవే తగ్గిపోతాయి. రేపటికింకా నయమయిపోతుంది. ఆ మంటలు చూస్తుంటే ఎవరికయినా గాభరా ఎత్తుతుంది. అందులో ఒళ్లు కాలిందాయెను."

సాయంకాలానికి కూడా శాంతకు జ్వరం హెచ్చలేదు. బాగా నిద్రపోయింది.

మరునాడు ఉదయం కాఫీ తాగుతూ "మనయిల్లు పూర్తిగా భస్మమయిపోయింది శాంతా!" అన్నాడు విశ్వనాథం ఆమె ముఖంలోకి చూస్తూ.

ఆమె ముఖం దిగాలుపడిపోయింది.

"నీవు మండుతున్న యింట్లోకి ఎందుకు వెళ్లావు? ఒళ్లుపైపైన కాలిందికనుక సరిపోయింది కాని లేకపోతే ఎంత ప్రమాదమయేదో!" అతడి దృష్టి ఆమె గర్భంమీద పడ్డది

విచ్చిన మబ్బులు

శాంత కళ్లు దించుకుని కాఫీగ్లాసు క్రింద పెట్టింది.

"నీవు మొన్న ఎలా కలవరించావో తెలుసా! 1953లో ఉత్తరాలంటూ కలవరించావు చాలాసేపు."

శాంత గతుక్కుమన్నది. పైకి కనబడనీయకుండా సర్దుకుని విషాదంగా నవ్వింది.

ఆమెలో కలిగిన సంచలనాన్ని ఓరకంట కనిపెడుతూ విశ్వనాథం ఆలోచనల వలయంలో చిక్కుకుపోయాడు. 1953లో శాంత ఎక్కడుంది?

ఆరాత్రి విశ్వనాథం సామాన్లకి కాపలాకాసినట్టుగా మెలుకునే ఉన్నాడు. నిద్రపోతున్న శాంత ముఖం చూస్తూ భావతరంగాలు ముసురుకోగా ఆచావడి చుట్టూ తిరుగుతున్నాడు.

శాంతకు హాస్టల్లో ఉండగా ఎవరో ప్రేమలేఖలు వ్రాసిఉండాలి. పావలాడబ్బులకు కాపలావాళ్లు లొంగిపోతారు. హాస్టల్లో ఉంటే ఏం— ఒంటిస్తంభం మేడమీద ఉంటేనేం—ఆడది ఆడదే. మర్మము ముందు పుట్టి ఆడది తరువాత పుట్టింది. కలవరింతలు నిజాన్ని బయట పడేస్తూ ఉంటాయి. సముద్రం హోరుపెట్టినట్టుగా హృదయం హోరు పెడుతోంది. గాలివానకు ఊగిపోయే వృక్షంలా ఉంది అతడి మనసు.

విశ్వనాథం తలుపూ ద్వారబంధమూ లేని చావడిలో పదిహేనురోజులుండి పోవలసివచ్చింది. అంతలో క్రొత్తయిల్లు తయారయింది. ఒకగది పూర్తికాగానే గృహప్రవేశమయ్యారు కనుక క్రొత్తయింట్లో ప్రవేశించారు వెంటనే.

శాంతలేచి మామూలుగా తిరుగుతున్నది. సామాను ఒక్కొక్కటే తీసి సర్దుకున్నది. డ్రెస్సింగ్ టేబుల్ అద్దం గుడిచింది. సొరుగులు సర్దుతూ ఉండగా లేతనీలపురంగుపచ్చడబ్బా బయట పడ్డది. ఆమెముఖం ఒక్కసారి ప్రకాశించి ప్రఫుల్లమయింది. ఈడబ్బా! దీనికోసమే కాలుతున్న యింట్లోకి వెళ్లి వెదికింది. విశ్వనాథం చూడకుండా రెండుసార్లు వెళ్లి గాలించింది. ఆ పెట్టె తన ప్రాణంతో ప్రాణం. దాన్ని గుండెకానించుకుని కళ్లు మూసింది. ఆనందంతో మూతతెరిచి చూసుకుంది. గులాబీరేకులు తొలగించి పూలద్దిన జేబురుమాలుపైకెత్తి చూసింది. ఉన్నాయి. తన ప్రాణసమానమయినవీ అమృత సమానమయినవీ ఉన్నాయి. భద్రంగా పెట్టిన మడతలు పెట్టినట్లే ఉన్నాయి. ఆ పెట్టెనొకసారి కళ్లకద్దుకొని అలికిడికి వెనక్కు తిరిగి చూసింది. విశ్వనాథం తల దువ్వుకుంటూ నిలబడి ఉన్నాడు.

పట్టుబడిన అపరాధిలా శాంత గతుక్కుమన్నది. తలదించుకుని ఆరోజల్లా తపించుకు తిరిగింది.

కొత్తయింట్లోకి వచ్చి పదిరోజులన్నా గడవక ముందే విశ్వనాథాన్ని పెంచిన పెత్తల్లికి నుస్తీగా ఉందని టెలిగ్రాము వచ్చింది. స్థలం మార్పు కోరుకుంటున్న విశ్వనాథానికి అదొకమంచి సాకుగాకనబడ్డది.

"ఎన్నాళ్లు మీ ప్రయాణం? ఉండమంటేఉండకుండా గృహప్రవేశానికి వచ్చి మరువాడే అత్తయ్యగారు వెళ్లిపోయారు. మీరు వెళ్లి వెంటనే తీసుకువచ్చేయండి" ఆదుర్దా పడుతూ అన్నది శాంత.

"నేను దగ్గరఉండి సేవచేస్తుంటే అదే తగ్గిపోతుంది" ముభావంగా ముందడుగు వేశాడు. చీరె సర్దుకుని వాకిటి గడపదగ్గర నిలబడ్డ శాంత స్టేషనుకు విశ్వనాథం రమ్మంటే వెళ్దామనుకుంది.

అతడు సూట్‌కేస్ తీసుకుని బండీ ఎక్కాడు.

విశ్వనాథం పెత్తల్లి శాంతను గురించి గుచ్చిగుచ్చి ప్రశ్నించింది. నుస్తీ తగ్గిపోయి నాలుగోనాటికల్లా తిరగటం మొదలు పెట్టింది. విశ్వనాథం బట్టలు సర్దుకున్నాడు.

"ఇంతదూరం వచ్చావు. వారమన్నా కాకముందే బయలుదేరుతున్నావు. శాంత ఉత్తరం చూశాక నాకు ఉండబుద్ధికావటంలేదు. రేపు ఒక్కరోజూ ఉండు. నేనూ వస్తాను."

"నేను యింటికి వెళ్లటంలేదు అమ్మా. మద్రాసు వెళ్లాల్సిన పని ఉంది. మెయిలులో వెళ్ళాలి."

"లేలేతదాన్ని ఒక్కతెనూ ఇంట్లో వదిలిపెట్టి ఊళ్లు పట్టుకుతిరుగుతావా? నామాటవిని ఇప్పటికీ ప్రయాణం వాయిదా వేసుకో."

"లేదు లేదం"టూ విశ్వనాథం తలతిప్పాడు.

ఏమనయినా వద్దువద్దంటే పంతంకొద్దీ చేసితీరే విశ్వనాథం స్వభావం ఆమెకు గుర్తుకువచ్చి నవ్వుకుంది. "నీపంతమే నీపంతం. సమయాసమయాలు చూసుకోకుండా ఏమిటా తిరగటం? ఈ విషయంలో కూడా నీకొకరు చెప్పాలా?" మందలించింది తులశమ్మ.

విశ్వనాథం శాంతను గురించి ఆలోచనలన్నీ మెదడులోనుంచి బయటికిపెట్టి వెయ్యాలని అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాడు. ఆమెకు దూరంగా ఉండాలనుకున్నాడు. ఆ పది సంవత్సరాలనుండీ ఆమె జీవితంతో అతడి ఆలోచనలూ అలవాట్లూ పెనవేసుకుపోయాయి. వాటిన్నిటినీ ఛేదించి వేయాలి. పది సంవత్సరాల జీవితాన్ని ఒక దుస్స్వప్న మనుకోవాలి. పూర్తిగా మర్చిపోవటానికి దూరంగా పోవాలి. ఆమెమాట, ఆమెగాలి—ఆమెను గురించిన భావన ఏదీ తన దరికి రాకూడదు.

రైలుపెట్టెలో కూర్చుని చదవటానికి పత్రిక విప్పాడు. శాంత భద్రంగా దాచుకుని కళ్లకద్దుకున్న ఉత్తరాలపెట్టె కంటిముందర ప్రత్యక్షమయింది. పది సంవత్సరాల దాంపత్యజీవితం తరువాత తనపూర్వ ప్రణయ చిహ్నాలను భద్రంగా దాచుకుని చూసి మురిసిపోయే శాంతపట్ల కసి పెరుగుతోంది. ఆమెకు దూరంగా ఉండాలని మనసు పరుగెత్తటం మొదలు పెట్టింది. పరుగెత్తే మనసును ఉత్తరాల పెట్టె వెంబడిస్తోంది. విశ్వనాథం ముఖంలో కోపం అసహ్యం రోషం బుస్సున పైకి పొంగాయి.

తులశమ్మ యింట్లో అడుగుపెడుతుండగానే వెంకన్న ఎదురుగావచ్చి "అమ్మగారికి పురుడువచ్చి ఇవాళ్టికి నాలుగు" అన్నాడు.

"నాలుగు సామాన్లూ సర్దుకుని వద్దామనుకున్నా. ఇంతలోకే నుస్తీ చేసింది. విశ్వం నిన్ను వదిలిపెట్టి మదరాసు ఎందుకు వెళ్లినట్టు?" తులశమ్మ కొడుకును కసురుకుంటూ పురిటి గదిలో అడుగు పెట్టింది.

శాంత కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తులశమ్మ చూడకుండా ముఖం తిప్పుకుంది.

విశ్వనాథం కోర్టు తెరిచిన నాడే ప్రొద్దుటిపూట రైలులో దిగాడు. అతడు గడపలో కాలు పెట్టగానే తులశమ్మ చవాట్లు పెట్టింది. నిర్లిప్తంగా నవ్వి లోపలికి వెళ్ళాడు.

తులశమ్మ పాపాయికి పేరు పెట్టించాలని ఎంతో ఆశపడ్డది.

"నీ కిష్టమయిన పేరుతో పిలుస్తూ ఉండు." విశ్వనాథం అన్నమాటలో తులశమ్మ కెంతో వైరాగ్యమూ నిర్లిప్తత గోచరించాయి. పోయిన బిడ్డలను జ్ఞప్తికి తెచ్చుకొని ఆమె మరి మాట్లాడలేదు.

విశ్వనాథం ఇంట్లో ఏమీ జరగనట్టే మామూలుగా తన పని చూసుకుంటూ కోర్టుకు వెళ్ళుతున్నాడు. అతడి మనసులో పీఠం వేసుకుని కూర్చున్న అనుమానము ఇంటికి రాగానే తలఎత్తి బుస్సు మంటున్నది. అతడి అరికాళ్ళ క్రింద నిప్పులు పోస్తున్నది అప్పుడు లా పుస్తకాల నన్నింటినీ ప్రక్కకు పెట్టి ఇతర గ్రంథాలను తిరగవెయ్యటం మొదలు పెట్టాడు.

శాంతకు అతడి విదిలింపులూ ముభావమూ దూరదూరంగా తిరగటమూ మరొక విధంగా అర్థమవుతున్నాయి. ముగ్గురు బిడ్డలు పోయిన విచారంలో ఈ బిడ్డ మీద మమతలు పెంచుకో లేకపోతున్నాడని అనుకుంది. కాని తనుమాత్రం పసి బిడ్డ సేవలో మునిగిపోయి క్రొత్త ప్రపంచాన్ని సృష్టించుకున్నది.

ఉదయము ఎనిమిది గంటలవేళ. విశ్వనాథం కట్టించిన కొత్త యింటి చుట్టూ పూలచెట్లు రంగురంగుల పూవులు విప్పి ఆ యింటి అందాన్ని ఇనుమడింప చేస్తున్నాయి. వాటి ముందు ఎర్ర ముక్కల బోర్డరు మరింత అందాన్నిస్తున్నది. పారిజాతాలు భూమి కనబడకుండా రాలాయి. పెరటి ప్రక్క మందారాలూ మల్లెలూ విచ్చుకుని చిరుగాలికి తల లూపుతూ రండి రండి అని అందరినీ పిలుస్తున్నాయి. చెట్టు చెట్టునూ ముట్టుకుని చూసి క్షేమ మడిగి ముందుకు పోతున్నాడు విశ్వనాథం. బోగన్‌విలా అన్ని రంగులలో ఇంటి ప్రహరీ గోడపై కెక్కి ముట్టుకున్న వాళ్ళను ముళ్ళతో గుచ్చుతున్నది. నాలుగు ప్రక్కలా కలియజూసి విశ్వనాథం వెనక్కు తిరిగాడు. సాంబశివరావు నవ్వుతూ నిలబడ్డాడు ఎదురుగా.

"హఠాత్తుగా ఇలా వూడి పడ్డావేం? ఉత్తరము ముక్క వ్రాస్తే స్టేషనుకు వచ్చేవాడినిగా!" చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళాడు.

కాఫీ ఉప్మా తీసుకుంటూ "ఒరేయ్! నీచేత్తో ఒక కార్డు ముక్క వ్రాయలేక పోయావు నీ యింట్లో లక్ష్మి పుట్టిందంటూ. పైగా ఇంటికి వచ్చిన వాడిని పట్టుకుని ఉత్తరం వ్రాసి రాలే దంటున్నావు. ఏమిట్రా నీ జబర్దస్తీ?"

"నిజం నిజం. అలా అడుగు నాయనా వాడిని." అంటూ తులశమ్మ ఉప్మా మారు వడ్డించింది.

తల వూపుతూ లేచి వచ్చి సాంబశివరావు బుజం తట్టాడు విశ్వనాథం.

ఖాళీ కప్పు క్రింద పెడుతూ "మా ఆవిడ తన ప్రియస్నేహితురాలి బిడ్డను చూసిరండని పోరు పెడితే వదలేక వచ్చాననుకో!"

"చెప్పవూ అసలు సంగతి! నీవు పెళ్ళయిన తరువాత మారి నాకు కనబడ్డావా చెప్పు? నీవు ఎక్కడుంటున్నదీ ఏం చేస్తున్నదీ ఒక్కమాటయినా నాకు వ్రాశావా చెప్పు?"

"ఇప్పుడు చెప్ప మంటావా? పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉద్యోగం వెలగ పెడుతున్నా. అదీ పురుష లక్షణం కోసమే."

తులశమ్మ బిడ్డను తీసుకు వచ్చి సాంబశివరావు చేతి కిచ్చింది. అతడు ఆ బిడ్డ ముఖంలో కనబడుతున్న పోలికలను వర్ణిస్తున్నాడు.

ఏడుస్తున్న బిడ్డను తీసుకుపోవటానికి వచ్చిన శాంత సాంబశివరావును చూసి నివ్వెర పోయింది. తడబడుతున్న కాళ్ళతో బిడ్డను లోపలికి తీసుకు వెళ్ళింది. అతడిని చూసినప్పటినుండీ ఆమెకు కాళ్ళూ చేతులూ వణుకటం మొదలు పెట్టాయి. బిడ్డ ప్రక్కనే ఒరిగి నీరసంగా కళ్ళు మూసుకుంది. గతచరిత్ర ఫిల్మురీలులా గిరగిర తిరుగుతున్నది ఆమె మనసులో. దాని నుండి తప్పించుకోవట మెట్లా? తలఎత్తి ఒకసారి విదిలించి మళ్ళీ దిండు మీదకి వాల్చింది.

పదకొండేళ్ళ పిల్ల. పుట్టక పూర్వమే తండ్రిని పోగొట్టుకున్నది. ఏడవ ఏట తల్లి చనిపోతూ మేన మామ చేతిలో పెట్టింది. మామయ్య లేనప్పుడు అత్తయ్య ఇంటెడుచాకిరీ చేయిస్తూ నెత్తిమీద మొట్టుతూ ఉండేది. సాయంత్రపు వేళల్లో మామయ్య ఆ పిల్లను ఒంటరిగా దగ్గరికి తీసుకుని వోదారుస్తూ కన్నీళ్ళు తుడుస్తూ ఉండేవాడు. ఆ మాటల్తో ప్రొద్దుటినుండీ పడ్డ బాధలన్నీ మర్చిపోగలిగేది. ఒకనాడు అత్తయ్య పొరుగింటికి వెళ్ళుతూ కాఫీ డికాక్షను వెయ్యమని చెప్పింది. కుంపటి మీద ఉన్న గిన్నెను గుడ్డతో పట్టుకుని ఫిల్టరులో పోస్తున్న పిల్లకు చేతికి ఆవిరి కొట్టింది. ఆమె చేతిలో ఉన్న గిన్నె జారి ఫిల్టరుమీద పడటమూ, అది దొర్లిపోవటమూ అనుకోకుండా ఒక్క క్షణంలో జరిగి పోయాయి. మళ్ళీ నీళ్ళు పెట్టటానికి కాఫీపొడి లేదు. భయంతో గజ గజ వణకులూ కుంపటికి ఎదురుగా కూర్చుంది తల వంచుకుని. మూడు గంటల వేళకు అత్తయ్య వచ్చింది కాఫీ కలపమంటూ. అరగంటయినా కదలక పోతే జుట్టుపట్టుకుని హాల్లోకి లాక్కొచ్చి ఆ చెంప ఆ చెంపా వాయించింది.

ఆ పిల్లకానాడు ఆ దెబ్బలకు ఏడుపు రాలేదు. ముఖం కందిగడ్డలా అయింది. తల వంచుకొని గోడవారగా నిలబడి ఒక నిశ్చయానికి వచ్చింది. తనకెవరూ లేరు. ఉన్న మామయ్య వోదార్చటమే కాని తన నవీ కష్టాల నుంచి రక్షించలేడు. అత్తయ్య లోపలికి వెళ్ళినప్పుడు పెరటి తలుపు తెరుచుకొని అలసిపోయేవరకూ పరుగెత్తింది. ఆ పరుగుచూసి పోలీసు పట్టుకున్నాడు. కోర్టులో విచారణ జరిగింది. తనకెవరూ లేరన్నది. ఏ తప్పూ చేయలేదన్నది. అందుకని వాళ్ళు తీసుకునిపోయి—బాల నేరస్థుల పాఠశాలలో చేర్పించారు.

ఆడుకోవటానికి సహవాసము చెయ్యటానికి పాఠశాలలో అరవై మంది పిల్లలు వున్నారు. మెట్రిక్‌వరకూ చదువుకోవచ్చు. కాని ఆ పిల్లలంతా దొంగతనం చేసి ఈ పాఠశాలకు వచ్చారు. టీచర్లు వాళ్ళను నీచంగా చూస్తున్నారు. ఆ పిల్లలు పాఠశాలలో కూడా బట్టలూ, రిబ్బన్లూ, తల పిన్నులూ పువ్వులూ ఒకరివి ఒకరు దొంగిలించుకుని నీచాతినీచంగా తిట్టుకుని కొట్టుకుంటారు. ఈ పదకొండేళ్ళ పిల్ల ఎవరితోనూ ఆడుకోదు. ఎవరితోనూ మాట్లాడదు. తనలో తాను ఏవో పాటలు పాడుకుంటూ ఉంటుంది. ముంగి అంటూ. తోటిపిల్లలు పిలిచినా తల ఎత్తదు. ఆమె మెట్రిక్ ప్యాసయ్యేవరకూ పద్దెనిమిది సంవత్సరాలు వచ్చాయి.

ఆ పాఠశాల సలహా సంఘ సభ్యురాలు లక్ష్మీదేవమ్మను ఆ పిల్ల ఆకర్షించింది. ఆమెకు చనిపోయిన తన రెండవ కుమార్తె శాంత ఆ పిల్లలో కనిపించింది. ఆ పిల్ల సంరక్షణాభారం తాను వహిస్తానని చెప్పి తీసుకు వచ్చి తన పిల్లలతోపాటు మద్రాసు పంపి క్వీన్‌మేరీస్ కాలేజీలో చేర్పించి హాస్టల్లో ఉంచింది. ఆ పిల్లను శాంత అని పిలుస్తూ మనసును శాంతింప చేసుకుంటున్నది.

శైశవంలో మేనత్త మేనమామల వద్ద—కౌమారంలో బాలనేరస్థుల పాఠశాలలో పెరిగిన శాంతలో ముఖమాటం మూటకట్టినట్టుగా



విచ్చిన మబ్బులు

ఉంటుంది. చూపులో బెరుకుతనం, మనసులో బెంకు బాగా పాతుకుపోయాయి. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటుంది. ఉత్సాహాన్ని సంతోషాన్ని పైకి పొంగనీయదు.

లక్ష్మీదేవమ్మ పెద్ద కూతురు ప్రభావతి. అందరితోనూ కలుపుగోలుగా మాట్లాడుతూ వుండేది. ఆమె తాను ఉత్సాహంగా ఉల్లాసంగా వుంటుంది. ఎదుటివారిలో కూడా వాటిని ఉద్దీపన చేస్తుంది. శాంత తలఎత్తి నలుగురితోనూ మాట్లాడేటట్లు ఆమె చేసింది. జమీందార్ కుటుంబంలో మంచి సంబంధం చూసి ప్రభావతికి వివాహం చేశారు. ఆమె వెళ్ళినప్పటి నుండీ శాంత మళ్ళీ ఒంటరి దయింది. ప్రభావతి అత్తవారింటి నుంచి శాంతలో బెరుకుతనం, నిరుత్సాహము మందకొడితనం పోగొట్టాలని ఉత్తరాలు వ్రాస్తూ వుండేది. ముఖ్యంగా వాటిలో ఒక ఉత్తరం జీవంలేని శాంతకు జీవం పోసింది. ఆ ఉత్తరం ఎప్పుడు చదువుకున్నా శాంతలో నూతనోత్సాహము కలుగుతుంది. హృదయం ఆనందంతో నిండి, పొంగులు వారి ఒడ్డులొరుసుకుంటూ ఉరవడితో ప్రవహించే జీవనదిలా ఉంటుంది.

మరుసటి సంవత్సరం శాంత బి.ఏ. ప్యాసు కాగానే లక్ష్మీదేవమ్మ తన భర్తకు జూనియరుగా ఉన్న విశ్వనాథానికి ఇచ్చి వివాహం చేసింది.

అత్తవారింటికి వెళ్ళేనాడు శాంత ఆమె కాళ్ళకు నమస్కరిస్తూ "అనాథగా వీధిలో ఉండే చింపిరి బట్టల పిల్లను తీసుకువచ్చి కడుపులో పెట్టుకుని పెంచారు. పెళ్లి చేశారు. నేను మీ ఋణం ఎలా తీర్చుకోను?" కన్నీళ్ళు కార్చింది.

శాంత కన్నీళ్ళు ఒత్తుతూ "నీవు మా శాంతవు." అంటూ గుండెకు హత్తుకుంది లక్ష్మీదేవమ్మ.

శాంత అలా గాలిపటంగా వచ్చి సంపన్నుడయిన విశ్వనాథం యింట్లో పడ్డది. విశ్వనాథం ఆమె సౌందర్యాన్ని విజ్ఞానాన్ని అన్నిటిని మించి ఆమెలో పాదుకుపోయిన వినమ్రతనూ రెప్ప వాల్చకుండా తనివితీరా చూస్తాడు. శాంత తనకు ప్రభావతి వ్రాసిన ఉత్తరాలను తలచుకుంటూ పులకలు దేరుతూ వుంటుంది. లక్ష్మీదేవమ్మ ఔదార్యాన్ని దేవితో కొలవాలో అని ఆలోచిస్తూ వుంటుంది.

ప్రొద్దుపోయి భోజనం చేసిన విశ్వనాథం సాంబశివరావులు కాఫీ తాగేవరకూ శాంత నిద్రపోయింది. ఆ పగటి నిద్రలో పీడకల. సాంబశివరావు పెద్ద దయ్యంలా కనబడుతున్నాడు. బాలనేరస్థుల పాఠశాల నుంచి వచ్చిన దొంగపిల్ల అని వేలెత్తి తనను పదిమందితో చూపుతున్నాడు. విశ్వనాథానికి ఆమె మీద జుగుప్స కలిగిస్తున్నాడు. శాంత కెవ్వున కేకవేసింది.

"నిద్రలో జడుసుకున్నావా శాంతా?" తుళ్ళుతున్న పెరుగు పెరుగున భోజనాల యింట్లోనుంచి వచ్చింది. మంచం మీద నుండి క్రిందపడిన శాంతను లేవనెత్తింది. తాగుతున్న కాఫీ వదిలి పెట్టి సాంబశివరావు వచ్చాడు. విశ్వనాథం అతడి వెనకాలే వచ్చాడు.

అందరినీ చూసి శాంత సిగ్గుపడ్డది. నిద్రలో వెనక్కు జరిగానంది ఏకలో వంచుకుంటూ.

ఆ రాత్రి మిత్రులిద్దరూ వరండాలో మంచాలు వేయించుకుని చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"నేను యింటికి వెళ్ళగానే ఇక్కడికి నా ప్రతి ప్రయాణం వాళ్ళిద్దరూ ఒకరినొకరు చూసుకుని చాలా కాలమయింది.'

విశ్వనాథం దేహమంతా ముళ్ళు ముళ్ళుగా తేలింది. పడుకున్న వాడల్లా లేచి కూర్చున్నాడు. సాంబశివరావుతో అప్పటినుంచి ఉత్సాహంతో మాట్లాడుతున్న విశ్వనాథంలో ఆ ఉత్సాహమంతా మాయమయిపోయింది. కనుబొమలు ముడి పడ్డాయి. అణగి ఉన్న రోషము, కోపం, కసి బుస్సుమని పైకి పొంగాయి.

"నీవు అన్నీ తెలిసిన పెద్ద మనిషివనుకున్నాను. నీచ సంబంధాలను ప్రోత్సహించే అప్రాచ్యుడవనుకో లేదు." మంచం మీద నుండి ఉద్రేకంతో లేచాడు విశ్వనాథం.

రెండు చేతులా అడ్డం పెట్టుకుంటూ లేచాడు సాంబశివరావు.

ఉద్రేకంతో లేచిన విశ్వనాథం తన గదిలోకి వెళ్ళి తల మీద రెండుచేతులూ పెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు. ఇంటికి వచ్చిన అతిథి. తనకి సహాధ్యాయి. ప్రాణ స్నేహితుడు. చిరకాలాన్ని కలుసు కున్నారు. కాని తన ఉద్రేకాన్ని అదుపులో పెట్టుకోలేక పోతున్నాడు. సిగ్గుతో కుంచించుకుపోతూ జుట్టు పీక్కుంటున్నాడు విశ్వనాథం.

సాంబశివరావు మెల్లగా లేచి గదిలోకి వెళ్ళి విశ్వనాథం భుజమ్మీద చెయ్యి వేశాడు.

"విశ్వం! ఉద్రేకంలో నీవేమన్నావో నాకేమీ అర్థం కాలేదు. శాంతను చూడటానికి నా ప్రతి పని ఉంటే పంపుదామనుకున్నాను. నీ కిష్టం లేకపోతే మానేస్తుంది. ఏమయినా నేను మధ్యాహ్నం ఈ పన్నెండు గంటల రైలులో వెళ్ళి తీరాలి. టిక్కెట్టు కూడా వచ్చిననాడే కొని రిజర్వు చేసుకున్నాను. నా మాటల వల్ల నీకేమయినా కష్టం కలిగితే క్షమించు. వస్తా." వెనక్కు తిరిగాడు.

చడీ చప్పుడూ లేకుండా వాళ్ళిద్దరి మధ్య వచ్చి నిలబడ్డది శాంత. "ప్రభు నాకు దైవసమానులు. మీరు వెళ్లి పంపటం కాదు. ఇక్కడవుండే టెలిగ్రాము యివ్వండి వెంటనే బయలుదేరమని. స్వయంగా వచ్చి పాపను దీవించమనండి" సాంబశివరావు కదలకుండా శాంత వ్యాంబంధానికి అడ్డముగా నిలబడ్డది.

"అవునురా సాంబూ! నాకూ ఆ దేవతాదర్శనం యిప్పించరా. నా ప్రోహాలన్నీ తొలగి పోయాయి. నన్ను క్షమించు సాంబూ. ఇందాకటి నా మాటలకు కోపము తెచ్చుకోలేదు కదూ. నా స్వభావం నీకు ఎరుగనిదేట్రా" సాంబశివరావు చేతులు పట్టుకుని గుండెకానించు కున్నాడు.

పిల్ల ఏడుపు విని శాంత వాళ్ళిద్దరి మధ్యనుండి దూరి లోపలికి వెళ్ళింది తృప్తిగా.

సుడిగాలికి కళ్ళలో దుమ్ము పడ్డది. కాని త్వరలోనే కళ్ళు తెరిపిడికి వచ్చాయి. ఏదీ సుడిగాలి? ఎటునుంచి వచ్చింది? ఎటు వెళ్ళింది? ఎప్పుడు మాయమయింది? అర్థంకాక సాంబశివరావు విశ్వముఖంలోకి చూశాడు. ●

చైనాకథ అడ్డం తిరిగింది!



మావ్‌త్సేటుంగ్
(చిత్రం: చైనీస్ సౌజన్యంతో)

[ఈ క్రింది వ్యాసంలో ఒక రాజకీయ పరిశీలకుడు మావ్ విధానాలని పరిశీలిస్తూ ఆసియా, ఆఫ్రికాలలో చైనా పేరు పడిపోవటానికి కారణం ఆదేశ విధానాలు కావని, కేవలం ఆ దేశం పై ఖతే నని వాదిస్తాడు.
రచయిత సిలోన్ దేశం తరపున పెకింగ్‌లోని రాయబార వర్గంలో పని చేసిన వ్యక్తి.]

ఈ వ్యాసంలో చైనా విధానాలలో ఒక అంశం గురించి అధికంగా ప్రస్తావిస్తాను. చైనా తన ఇరుగు పొరుగు దేశాల పట్ల ఎందుకింత విరోధంగా ప్రవర్తిస్తోంది? అసలు చైనా దృక్పథాన్ని, లేక ఉద్దేశాన్ని ఇతరులు అర్థం చేసుకోలేక పోయారంటే అది చైనా తప్పే అనాలి. చైనా వెలువరించే ప్రచారం అతి పరుషభాషలో ఉండటంచేత దాని వెనుక దాగి ఉన్న 'సత్యం' ఎందరికో వంటబట్టకోవటంలేదు.

చైనా అవలంబించిన రెండు ముఖ్యవిధానాలు ఇతరదేశాలు అనుకరించ ఉండవచ్చు (చైనావారు ఏయే విధానాలు కూడా ముందు వెనుకలు చూసుకోకుండా అవలంబించారు) ఒకటి, విదేశ సహాయం లేకుండా స్వశక్తి మీదనే ఆధారపడటం. రెండు. మావ్‌త్సేటుంగ్ అనుసరించిన ప్రజాబాహుళ్యాన్ని ఉద్యమింపజేసే ప్రచారం దానినే 'మావ్ ప్రజాబాహుళ్య సిద్ధాంతం' అనవచ్చు.

చైనా స్వశక్తి మీద ఆధారపడాలనటంలో ఆశ్చర్యం లేదు. విదేశ సహాయం స్వాతంత్ర్యానికి విరుద్ధం అని చైనా నాయకుల వాదన. 'విప్లవం' తర్వాత రష్యా ఇచ్చిన సహాయం చైనాకి ఎంతో తోడ్పడిన మాట నిజం కాని, ఇది ఎంతో కాలం జరగరాదని చైనా నాయకుల అభిప్రాయం. (అంతేకాక, ఇది ఎప్పుడు ఆగిపోతుందో అని వారు భయపడ్డారు. వారి భయాలు చివరికి నిజం అయ్యాయి.)

నెలకొక భోజనం

అధ్యక్షుడు ల్యూ—షావ్‌చీ గురించి ఒక కథ ఉన్నాయి. ఒకసారి ఒక ఆసియా దేశపు రాయబారి తనదేశానికి చైనాని సహాయం చెయ్యమని అడిగాడుట. అధ్యక్షుడు షావ్ చీ ఆయనతో ఇలా అన్నాడుట. "రాయబారిగారూ! చైనాలో 70 కోట్ల మంది జనం ఉన్నారు. వారందరూ, విదేశ సహాయం మీద ఆధారపడ్డారనుకోండి! వారిలో మనిషికి నెలకొక భోజనం కన్నా పెట్టగలరంటారా?"

మావ్ సిద్ధాంతం ఇటువంటిదే 1949 లో చైనాలో ఉన్న పరిశ్రమలలో చాలాభాగం విదేశీ పెట్టుబడితో కొద్దిమంది చైనావారు పెట్టినవే దేశంలో ఉన్న సంపదని అంతగా వాడటం జరుగలేదు. అన్నిటికన్నా ముఖ్యమయిన 'జనసంపద'ని గురించి ఎవరూ ఆలోచించినట్లు లేదు! ఈ సంపదని 'పెట్టుబడిగా' వాడాలని మొట్టమొదటి సారిగా 'పెద్ద ముందుకు ఉరుకు' ఉద్యమంలో వివరించటం జరిగింది. అయితే, ఈ ఉద్యమం మరీ ఉధృతంగా జరిపించటం చేత లాభాల కన్నా నష్టాలు అధికంగా ఏర్పడ్డాయి. ప్రజలు ఈ రకం ఉద్యమానికి మానసికంగా సిద్ధంగా లేరు. నాయకత్వం చెదిరిపోయింది. మావ్ అధ్యక్ష పదవిని కోల్పోయి పార్టీ 'ఛెయిర్‌మెన్' అయ్యారు.

అంటే, ప్రజలని సరిగ్గా ఉద్యమింపచేయటం జరగలేదని అనటానికి వీల్లేదు. కాని, ఉద్యమింపచేయటం ప్రజాస్వామ్యకమయిన పద్ధతిలో జరగక పశ్చిమ రాజ్యాలని మించాలనే ద్వేషపూరితమయిన పద్ధతిలోనే జరిగింది. విదేశీ పరిపాలన తిరిగి రావచ్చుననే బెదిరింపులతో ప్రజలని ఆయుపెట్టారు. ఎప్పుడూ విదేశ దురాక్రమణ భయం చూపెట్టేవారు. అమెరికా చైనాని ఐక్యరాజ్యసమితిలో చేర్చకపోవటం ఈ భయాన్ని ఎక్కువ చేసింది.

చివరికి ఉద్యమం విజయవంతం కానప్పుడు నాయకుల కోపం మేధావులకి ఎదురు తిరిగింది.

విదేశ విధానం

ఇంట గెలవ లేక చైనా నాయకులు బయట గెలవపోయారు. తమ కోపాన్ని, నిస్పృహని విదేశాల మీద చూపించారు. క్రుశ్చేవ్, ఐసెన్‌హోవర్‌ని కలిసినప్పుడు చైనా ఫార్మోసా మీద ఫిరంగులు పేల్చింది. భారతదేశం మీద దండు నడిపింది. ఇటీవల చైనా అణ్వస్త్ర పరీక్ష వప్పందాన్ని ఆమోదించలేదు. అటువంటి రాజ్యాలని వప్పందం మీద సంతకం పెట్టవద్దని ఉద్బోధించింది. రష్యా—అమెరికాలు రెండూ 'పెద్దదేశాలు' కాబట్టి ప్రపంచ సంరక్షణ సమస్య పూర్తిగా వాటికే వదలరాదని చైనా వాదన. అసలు ఈ రెండుదేశాలు అణ్వస్త్రాలని తమ వద్ద ఉంచుకుని ఇతరులకి దొరకకుండా చేస్తున్నాయని చైనా అనుమానం, ఆరోపణ. (ఫ్రెంచి వారు కూడా ఇదే ధోరణి కనబరిచారు కాని డిగాల్ తన వ్యూహాన్ని ఉంచి ప్రచారం అంతా చైనాకి వదిలి వేశాడు. తను మాత్రం చక్కగా అణ్వస్త్రాలని అభివృద్ధి చేసుకున్నాడు. రష్యా కూడా బెల్‌గ్రేడ్ సమావేశం ముందు అణ్వస్త్రం పేలుస్తూనే చైనా మీద అణ్వస్త్ర పరీక్ష నేరం మోపింది.)

ఇదంతా చైనాకి శ్వేత-శ్వేతేతర జాతుల మధ్య పోరాటంగా కనిపిస్తుంది. ఇందులో ఆశ్చర్యం లేదు. కాని ఆదేశ నాయకత్వం తీవ్ర ధోరణి చైనాయే జాతి దురహంకారం చూపిస్తూ ఉన్నదా అనే అనుమానం ఎందుకో కలిగించింది. ఈ సందర్భం లోనూ చైనా వెనుకబడిన దేశాల సంగతి అశ్రద్ధ చేసింది. ప్రపంచంలో బీద ధనవంతమయిన దేశాలు మాత్రమే ఉన్నాయన్న నిజాన్ని చైనా గుర్తించింది. ఈ విషయాన్ని జెనీవాలో 1964 లో జరిగిన 'వాణిజ్యాభివృద్ధి సమావేశం'లో ప్రస్తావించింది. కాని—ఒకసారి తప్పితే రష్యా ఎప్పుడూ అభివృద్ధి చెందిన దేశాల పక్షమే వహించింది.

పొరపాట్లు

భవిష్యత్తు మాట ఏమిటి? భారతదేశంతో పోరాటం వల్ల చైనా ఎన్నో ఆఫ్రికా, ఆసియా దేశాల సానుభూతిని కోల్పోయింది. అంతేకాక చైనా నాయకులు ఒక కొత్త ప్రచారం ప్రారంభించారు. ఎన్నో ఆఫ్రికా ఆసియా దేశాల నాయకులు ఆదేశ శ్రేయస్సుని గుర్తించలేరు కాబట్టి వారిని పారద్రోలమని అక్కడి ప్రజలకి సలహా ఇచ్చారు. ఇది ఆ ప్రజలకి హాస్యాస్పదంగా తోచి ఉంటుంది. తాము అభిమానించి ఎన్నుకున్న నాయకులు దేశద్రోహులంటే ఎలా అంగీకరిస్తారు? వారికన్నా చైనా నాయకులు తమ దేశ శ్రేయోభిలాషులంటే ఎలా నమ్ముతారు?

నేడు, కొన్ని చీలిక కమ్యూనిస్టు పార్టీల అభిమానాన్ని మినహాయిస్తే, చైనా ప్రపంచంలో ఒంటరి దేశం అయిపోయింది. రష్యా కొన్ని ఆఫ్రికా, ఆసియా దేశాలకి సహాయం చేసింది కాబట్టి చైనాలో 'మహాఖాన్' స్వదేశ దురభిమానం ఉందని చాటుతూ ఉంటోంది. మావ్ జీవించి ఉన్నంత కాలం చైనా విధానంలో పెద్దమార్పు రాదు. మావ్ తనని ఒక దేశంగా చేసి కనీస అవసరాలని ఇచ్చిన నాయకుడని ప్రజలకు తెలుసు.

చైనా వద్ద ఇతర వెనుకబడిన దేశాలు నేర్చుకో వలసిన పాఠాలు. స్వశక్తి మీద ఆధారపడటం ప్రపంచాన్ని జాతి ప్రకారం విభజించటంలో ఉన్న ప్రమాదాన్ని గుర్తించటం, చైనా మీద నమ్మకం చెయ్యలేని అంశం—పై సత్యాలని గుర్తించినా దురహంకారంతో ప్రవర్తించి పాశ్చాత్యదేశాల పట్ల తను చేసిన వాదనాలని అగ్రరహితంగా చెప్పుకున్నది.

నేడు ఆఫ్రికా ఆసియా దేశాలలో 'మావో సిద్ధాంతా'లలో ఏ కొంచెం నమ్మకం ఉన్న వ్యక్తి అయినా చైనా విధానాలలోని విలువని గురించి మాట్లాడితే అందరూ అతనిని 'మావ్ భక్తు'డని, ఎర్ర రక్షకుడని హేళన చేస్తారు. ఎర్ర రక్షకులు తమ విప్లవ ఉత్సాహంతో ఎంతో హాని కలిగించారు. అందరూ చైనా ఉద్దేశాలని, పద్ధతులని అనుమానిస్తున్నారు, చూసి అసహ్యించుకుంటున్నారు.

ఈనాడు చైనాలో ఏర్పడిన సంచలనం పై చైతన్యం అక్కడ అనివార్యంగా వచ్చిన ఏదో ఫలితమేనని చెప్పవచ్చు.

(—ఫోరం వరల్డ్ ఫీచర్స్)

పుస్తకాలు

కాంతి రేఖ

అనువాదకర్త: శ్రీ దండమూడి మహీధర్, క్రౌను 138 పుటలు. వెల రెండున్నర రూపాయలు. ప్రకాశకులు దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్సు, శరత్ బిల్డింగ్సు, విజయవాడ—2.

ఇది వివిధభాషల కథా సంకలనం. ఇందులో గొర్రెల కాపరి—చైనా ముష్కరులూ, పరోపకారి, చెదిరిన కల, లెటర్ టు ది ఎడిటర్, మనిషిలోని మనిషి, పాప—పావురం, దివి నుండి భువికి దిగిన కాళిదాసు, పర్యవసానం, సునంద, కాంతిరేఖ అనే పది కథలున్నాయి. మొదటి రెండూ హిందీ అనువాదాలు. తర్వాతి మూడూ బెంగాలీ కథల తర్జుమాలు. 'పాప పావురం, దివి నుండి భువికి' అనేవి మరాఠీ మూలాలనికి తెలిగింపులు. 'పర్యవసానం సునంద, కాంతిరేఖ' అనేవి వరుసగా పంజాబీ, గుజరాతీ, కాశ్మీరీ కథల తెలుగు సేతలు.

కథానికల్లోనైనా, నవలల్లోనైనా అనువాదాల కంటె స్వతంత్ర రచనలే మేలైనవంటూ చాలా మంది అభిప్రాయం. కొన్ని పరిస్థితుల్లో అనువాదాలదే పై చెయ్యి కావడం కానవస్తుంది. అది అనువాదకుని శక్తి, సామర్థ్యాల పైని కూడా ఆధారపడి వుంటుంది. రచన అనువాద పద్ధతిలో కాకుండా స్వేచ్ఛగా కొనసాగినప్పుడు చెప్పితే తప్ప అది అనువాదమని అనుకోలేని రచనలు లేకపోలేదు. అవి ఎంతో ఆకర్షిస్తాయి! వివిధ ప్రాంతాల పరిస్థితులు, ఆచార వ్యవహారాలూ కూడా వీటివల్ల మనకు బాగా తెలుస్తాయి.

ఇందులని ఒక్కొక్క కథా విభిన్న మనస్తత్వాన్ని చక్కగా చిత్రిస్తూ ఉన్నది. మొదటి కథలో గొర్రెల బాబాయిని చైనీయుడు ఎలా నమ్మించి మోసగించినదీ, బాబాయి తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా చైనా దుండగులను తప్పుదారిలో పెట్టి ఎలా కసి తీర్చుకున్నదీ, తన భవిష్యత్తును గురించి తియ్యని కలలు కంటున్న బాబాయి చైనీయుని తుపాకి గుండుకు ఎలా గురి అయినదీ చిత్రించబడింది. సరిహద్దు ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు స్వాభావికంగా వర్ణించబడినవి. 'పరోపకారి' కథలో ఉత్తమ స్వభావం కల సుహాసిని విషయంలో విద్యా వినోద్ ఎంత దుర్మార్గంగా ప్రవర్తించినదీ, చివరకు ఆమెకు మహోపకారం చేస్తున్నట్లు శేఖర్‌తో చెప్పి, తన తప్పులు బయలుపడకుండా ఆమెను పని నుండి తప్పించి ఎలా రైలెక్కించి పంపివేసినదీ—మానవుల కుత్సితబుద్ధికీ, ప్రతారణానికి చక్కని నిదర్శనాలు. 'చెదిరిన కల' అనే మూడో కథలో తనేశ్ గొప్ప ధనవంతుడని భ్రాంతిపడి, అతనిని ప్రేమించి వివాహమాడదలచిన— నవనాగరకతా వాతావరణంలో విహరించే మందాకిని యదార్థం తెలుసుకుని నిరుత్సాహం పొందడం కానవస్తుంది. ప్రేమకు మనస్సుతో కాక ధనంతో లంకె పెట్టబడింది యిందులో.

'లెటర్ టు ది ఎడిటర్' లో సామాన్య సంసారి సుధీర్ బాబు భార్య మృణాళిని, భర్త గ్రామాంతరంలో ఉద్యోగం చేస్తున్నప్పుడు పరిమళబాబు ఎలా మోసగించి స్వాధీనం చేసుకుని, ఆశలు కల్పించి సొమ్ము ఖర్చు పెట్టించినదీ చిత్రించబడినది. కల్పనా పద్ధతిలో ఎంతో చమత్కృతి కానవస్తుంది. లోకంలో ఒకర్ని మించిన మోసగాడు మరొకడుంటాడనీ, బడాయి రాయళ్ల కోతలకు అంతం ఉండదని 'మనిషిలో మనిషి' అనే కథలో వ్యక్తపరచబడింది. జమీందారుల దుర్న్యాయాలు సూచించబడ్డాయి.

'పాప— పావురం' అనే ఆరో కథ ఎంతో చక్కగా ఉంది. రచయితకు మనస్తత్వ పరిశీలనలో ఉండే నైపుణ్యం ఇందులో సమగ్రంగా కానవస్తుంది. పసిపాప మనస్తత్వం, తల్లిదండ్రుల అనుచిత ప్రవర్తనా దీనిలో బాగా పోషించబడింది.

'దివి నుండి భువికి' అనే కథలో మహాకవి కాళిదాసు రచనలకు యిప్పటి వారు ఎలా ఆభాసు పట్టిస్తున్నదీ వ్యక్తపరచబడినది. 'పర్యవసానం'లో పంజాబీ వాతావరణం కళ్లకు కట్టినట్లు కానవస్తుంది. గులేరికి భర్తపై గల ప్రగాఢ ప్రేమ, మానక్ ఆమెకు చేసిన అన్యాయం, పశ్చాత్తాపం స్వాభావికంగా ఉన్నాయి. 'సునంద'లో సినిమా చిత్ర నిర్మాతల ప్రవృత్తి, భార్యల విషయంలో వారి నిర్లక్ష్యభావమూ, అవినీతి ప్రవర్తనా చిత్రించబడ్డాయి. దీని రచన శైలీ ధారాసంగా చమత్కారంగా సాగింది.

చివరి కథ 'కాంతిరేఖ'. అన్నిటి కన్నా యీ కథ బాగా ఉన్నదనీ, పేరు బాగున్నదనో, సంగ్రహంగా ఉన్నదనో ఈ పేరే పుస్తకానికి పెట్టబడింది. అనాథ శరణాలయంలో ఉన్న రాజా అనే బాలుడు తన నాలుగేళ్ల వయస్సులో మరణించిన [illegible] మూర్తిని ఒక కథానికా రచయిత్రిలో చూసి ఎంతో భక్తి ప్రేమలతో సేవించడం, ఆమె నిర్లక్ష్య భావము ఇందులోని ప్రధానాంశాలు!

కథలన్నింటిలోనూ పాత్ర చిత్రణా, వివిధ సంఘటనల కూర్పూ, ప్రకృతి వర్ణనా మిక్కిలి స్వాభావికంగా ఉన్నవి. అనువాదకులు మొదటే వివిధ భాషల్లోని మంచి కథలను ఎన్నుకొని, తర్జుమా చేసి వుండాలి. అనువాదాలయినా, ఇవి అనువాదాలు కానట్టుగానే కానవస్తాయి. రచయిత నైపుణ్యం మెచ్చుకోదగినది. ఇట్టి కథలు ఎన్నయినా తెలుగులోకి రావలసి ఉన్నది. అట్టి పనికి శ్రీ మహీధర్ వంటి వారే పూనుకోవాలి.

—అంగీరస.

అవీ - యివీ...

బొంబాయి ఆంధ్రుల 'భాగ్య నగరం'

బొంబాయి ఆంధ్ర మహాసభ సాంస్కృతిక శాఖవారు శ్రీ వార్ల చిరంజీవి రచన 'భాగ్యనగరం' అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో కుమారి సరస్వతీరావు, శ్రీమతి రమ, టి. శివరామ చంద్రమూర్తి, యం. పి. శర్మ, ఆర్. లక్ష్మణరావు సూర్యనారాయణమూర్తి, జి. కొండలరావు, పి. రాజశేఖరశాస్త్రి నటించారు. శ్రీ కూచి మంచి దర్శకత్వం నిర్వహించిన ఈ నాటకానికి యస్. పి. కృష్ణమూర్తి చక్కని సంగీతం కూర్చారు. భాగమతిగా నటించిన కుమారి సరస్వతీరావు నృత్యాలు ప్రేక్షకుల్ని అలరించాయి.

గ్లిసరిన్ ప్రవాహం

గోద్రెజ్‌వారి విక్రోలీ (బొంబాయి) ఫ్యాక్టరీలో గ్లిసరిన్ ఉత్పత్తి ప్రారంభమయింది. ఈ కంపెనీ ఇదివరలో చాల పరిమితిగా గ్లిసరిన్ తయారుచేస్తూ వుండేది. ఫ్యాక్టరీని విస్తృతంచేసి ధారావాహికమైన ఉత్పత్తిని సాధించారు. ఇప్పుడు గోద్రెజ్ కంపెనీ, సంవత్సరానికి 1,600 టన్నుల గ్లిసరిన్ తయారు చేయడానికి స్థోమతను కలిగి ఉన్నది.

ఫార్మసియటికల్స్, పెయింట్సు, ఇంకులు, రంగులు, పూతలు, రసాయనాలు, బట్టలు, కాగితం, రబ్బరు, పొగాకు, మిఠాయిలు, సౌంధర్యసాధనాలు మొదలైన 1,500ల తయారీలలో గ్లిసరిన్ ఉపయోగించబడుతుంది.

1971 నాటికి ప్రతిసంవత్సరమూ 14,400 టన్నుల గ్లిసరిన్ అవసరమవుతూ ఉంటుంది. 1965 నుంచి మనదేశంలో చాలినంత గ్లిసరిన్ లభించడం లేదు. మన అవసరాలు తీరడానికి—ఉత్పత్తికీ మధ్య 20 శాతం కొరత కనిపిస్తూవుంది. ప్రపంచ మార్కెట్లులో కూడా గ్లిసరిన్ విలువ ఎక్కువగా వుంది. అందుచేత గ్లిసరిన్ అధికోత్పత్తి విదేశీ మారక ద్రవ్యానికి ఒక సాధనం అవుతుంది అందుకు కృషి చేస్తున్న గోద్రెజ్ సంస్థ అభినందనీయమైనది.

సినిమా డయిరీ

శ్రీ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో వెలువడిన 1967 సినిమా డయిరీ మా కార్యాలయం చేరింది. ఇందులో సినిమాలకు సంబంధించిన, సినీతారలకు సంబంధించిన వివరాలు ఎన్నో ఉన్నాయి. వెల మూడు రూపాయలు. 25 మేడ్లి 2వ వీధి, టి.నగర్, మద్రాసు—17కు వ్రాసి ప్రతిని పొందవచ్చును.

బ్రిటన్‌లో విశేషాలు

బ్రిటిష్ ఇంఫర్‌మేషన్ సర్వీసెస్ (మద్రాసు)వారు ప్రచురించిన 'బ్రిటన్‌లో విశేషాలు' అనే పుస్తకం మా కార్యాలయం చేరింది. చక్కని ముద్రణతో అలంకరించబడిన ఈ పుస్తకం బ్రిటన్ స్వరూపాన్ని విచిత్రంగా మన ముందు ఉంచుతుంది. ఈ పుస్తకం విద్యాసంస్థలకు, గ్రంథాలయాలకి ఉచితంగా లభిస్తుంది. వారి కార్యాలయానికి రాసి పొందవచ్చును.

'ఆఫ్జా' రజితోత్సవం

ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్టు అసోసియేషన్ రజతోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 24న మద్రాసు [illegible] వాణీమహల్‌లో సినీ పత్రికారంగంలో విఖ్యాతులైన వారిని సన్మానించడానికి ఏర్పాటు చేశారు.

వాల్ట్ డిస్నీ చిత్రాలు

యునైటెడ్ స్టేట్స్ ఇంఫర్‌మేషన్ సర్వీస్ ఇంఫర్‌మేషన్ ఆఫీసర్ శ్రీ ఎడ్విన్ ఫీల్డ్స్, శ్రీ ఓ ఓర్‌ఫీల్డ్, వారి 'మేఫెయిర్' నివాసంలో వాల్ట్ డిస్నీ సృష్టి చిత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రెండుగంటల వ్యవధిలో నాలుగు శీర్షికలపై ప్రదర్శించిన చిత్రాలు, శ్రీ. శ్రీ. వాల్ట్‌డిస్నీ అశేష కృషిని ప్రతిబింబించేవిగా ఉన్నాయి. —పికరాజా.

సుప్రసిద్ధ దర్శకనిర్మాత శ్రీ బి. యన్. రెడ్డి



"సినిమాలు తీయటం కళకోసం కాదు, వ్యాపారం కోసం!"

[illegible] చలనచిత్ర పరిశ్రమలో దర్శకుడిగా శ్రీ బి. యన్.కి ఒక విశిష్టస్థానం ఉన్నది. ఆయన చిత్రాలు జాతీయతను, సంస్కృతిని ప్రతిబింబింప జేసేవిగా సాంప్రదాయసిద్ధంగా ఉంటాయి. అందుకే బి. యన్. చిత్రాలలో ఒక ప్రత్యేకత కొట్టవచ్చినట్లు కనిపిస్తూ ఉంటుంది. ఆయన చిత్రాలలో పాటే మనిషిలో కూడ నిండుగా తెలుగుదనం ద్యోతకం అవుతుంది.

బి. యన్. 1908 నవంబరు 16న కడప జిల్లాలోని కొత్తపల్లిలో జన్మించారు. అకౌంటెన్సీలో డిప్లొమా పొందారు. సినిమా పరిశ్రమకు 1936లో వచ్చారు. స్వర్గీయ హెచ్. ఎం. రెడ్డిగారితో భాగస్వాములుగా చేరి "గృహలక్ష్మి" చిత్రం నిర్మించారు. 1937 లో వాహిని పిక్చర్స్ స్థాపించారు.

వాహిని పిక్చర్స్ సంస్థ పేరిట తొలిసారిగా "వందేమాతరం" చిత్రాన్ని నిర్మించడమేగాక ఆ చిత్రానికి దర్శకత్వమూ వహించారు. అప్పటి రోజుల్లో నిర్మాతల అభిరుచులు ఎలా ఉండేవి? అని నేనడిగిన ప్రశ్నకు శ్రీ బి. యన్. సమాధానం చెబుతూ అప్పుడు నిర్మాతలుగా వచ్చిన వాళ్లలో క్రియేటివ్ వర్క్ చెయ్యాలనీ చిత్రాలు ఆదర్శప్రాయంగా వుండాలనీ కోరిక కలిగి వుండేవారు. క్వాలిటీ కోసం ఎక్కువగా ప్రయత్నించేవారు. ఆ కాలంలో డిస్ట్రిబ్యూటర్స్ లేరు. నిర్మాతలే విడుదల చేసుకుంటూ ఉండేవారు" అన్నారు.

వందేమాతరం తర్వాత రెడ్డిగారు సుమంగళి, దేవత, స్వర్గసీమ చిత్రాలను తీశారు. స్వర్గసీమ తరువాత 1945 లో వాహినీ స్టూడియో నిర్మాణానికి ఉపక్రమించారు. 45 నుంచి 1950 దాకా వాహిని స్టూడియో కట్టించే పనిలో నిమగ్నులయ్యారు. ఆ తర్వాత మల్లీశ్వరి, బంగారుపాప, భాగ్యరేఖ, రాజమకుటం, పూజాఫలం, రంగులరాట్నం చిత్రాలను తీశారు. వీటిలో భాగ్యరేఖ, పూజాఫలం బయటి నిర్మాతలకుగాను బి. యన్. దర్శకత్వం వహించి పెట్టినవి. మిగిలినవన్నీ వాహిని బేనర్ మీద తీసినవి. వాటిలో రాజమకుటం ఒక్కటే జానపదం. మిగిలినవన్నీ సాంఘికాలు. "అన్నీ సాంఘికాలే తీసి మధ్యలో జానపదం ఎందుకు తీశారు?" అని అడిగాను. "జానపదం తీస్తే డబ్బు వస్తుందని అంతా చెప్పారు. అందుకని తీశాను" అన్నారు బి. యన్. 1958 నుంచి 1964 దాకా ఎం. ఎల్. ఏ.గా ఉన్నారు.

బి. యన్. చిత్రాలకు డబ్బు రాదనే నానుడి ఒకటుండేది. కాని ఇటీవల ఆయన తీసిన "రంగులరాట్నం" ఆ విషయం నిజం కాదని నిరూపించింది. రెడ్డిగారికి యీ చిత్రం విశేషమయిన పేరు ప్రఖ్యాతులతో పాటు డబ్బూ తీసుకువచ్చింది. అగ్రతారలతో తీసిన ఒక చిత్రం నూరురోజులకు వచ్చినంత మొత్తం రంగులరాట్నం 41వ రోజుకు వచ్చిందని బి. యన్. చెప్పారు.

రంగులరాట్నంలో ముఖ్యభూమికలు నిర్వహించిన వారంతా దాదాపు కొత్తవారనే చెప్పాలి, అంజలీదేవి, రమణారెడ్డి, పుష్పవల్లిలను మినహాయిస్తే. నటనలో ఓనమాలను తెలియని వాళ్లను కూడా చక్కగా నటింప జేసి రూపొందించారు రంగులరాట్నంలో. ఈ చిత్రం తీస్తున్నపుడు బి. యన్. రంగులరాట్నం నిర్మాణంలోని సాధకబాధకాలను వివరించమని నేను కోరినపుడు "ఈ చిత్రం తీయటం నాకెంతో సులభమయింది. కొత్తవాళ్లయినా చెప్పిన మాటల్ని విని జాగ్రత్తగా చేశారు. మరొకటి ఏమిటంటే మన నటీమణుల్లో అరుదుగా కనిపించే నటి అంజలీదేవి నా చిత్రంలో పని చేయటం నాకు మరింత సంతోషం కలిగించింది. ఈ చిత్ర నిర్మాణం నాకెంతో సులభ్యమయింది. అది నా అదృష్టం!" అని చెప్పారాయన.

"సినిమాలపై మీ అభిప్రాయం?" అని అడిగిన మరో ప్రశ్నకు బి. యన్. సమాధానం యిస్తూ "సినిమాలు తీయటం కళ కోసంకాదు, వ్యాపారం కోసం. సినిమాలు తీయటంలో నాకేమీ సరదా లేదు. అయితే మరెందుకు తీస్తున్నారూ అంటే— బతుకుతెరువు కోసం.. ఈ లైన్లో అలవాటు పడి వున్నాం గనుక తీస్తున్నాం.." అంటూ ఆగి "సినిమా పదిమందీ కలిసి చేయవలసిన పని. అంతా కలిసిరాకపోతే ఏం చెయ్యలేము" అన్నారు.

విజయా ప్రొడక్షన్స్ అధినేతల్లో ఒకరయిన శ్రీ బి. నాగిరెడ్డి బి. యన్. గారి స్వంత సోదరుడు. శ్రీ బి. యన్.కి ఒకే ఒక అమ్మాయి. కళా పిపాసిత మయిన తండ్రి హృదయాన్ని దుఃఖపూరితం చేసి ఆమె యీ లోకం విడిచి వెళ్లారు.

రంగులరాట్నం సాధించిన విజయం గురించి మాట్లాడుతూ "ఈ విజయం నాదికాదు, పత్రికలది. ఈ చిత్ర విజయానికి తోడ్పడిన పత్రికలకూ, ప్రజలకూ నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు" అన్నారు బి. యన్. ●

వ్యాసం
మోహన్ కుమార్



నా విదేశయాత్ర

జమునా రమణారావు

ఆ సాయంత్రానికి లండన్ చేరుకున్నాం. మాస్కో వెళుతూ యింతకుముందు లండన్‌లో దిగి వున్నాము గనుక, తిరిగి లండన్ ఎయిర్‌పోర్టులో అడుగుపెట్టగానే అంత కొత్త అనిపించలేదు. అక్కడేవున్న చిన్న ట్రాలీలో మా హేండ్‌బాగేజి వేసుకుని దాన్నితోసుకుంటూ కస్టమ్స్‌లోకి వెళ్ళాం. మమ్మల్ని తీసుకు వెళ్లేందుకు అక్కడ 'హమ్‌రాహి' చిత్రం ప్రీమియర్ ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూటర్ వచ్చారు. మమ్మల్ని ఒకమంచి హోటల్లో దింపారు. 4వ తేదీన లండన్‌కు 50 మైళ్లదూరంలో వున్న సిటీలో 'హమ్‌రాహి' వేస్తున్నారుట! అక్కడికి మమ్మల్ని తీసుకు వెళ్లేందుకు నిశ్చయించారుట!

హోటల్‌చేరాక, రవీంద్రగారనే అతిముఖ్యమయిన స్నేహితులు గుమ్మడిగారికి ఫోన్‌చేసి, మమ్మల్ని ఉదయం వారింటికి రమ్మని ఆహ్వానించారు ఆమర్నాడు పదింటికి రవీంద్రగారువచ్చి మమ్మల్ని వారింటికి తీసుకువెళ్లారు అది వారిస్వంతయిల్లు.వోల్డ్ స్టైల్డ్ ఇంగ్లీష్ కాటేజ్. ఎంతోశుభ్రంగా, చక్కని ఫర్నిచర్‌తో అందంగావుంది. కాసేపు అక్కడ గడిపాం. వారి కుటుంబంతో అక్కణ్ణుంచి డిపార్ట్‌మెంటల్ స్టోర్‌కివెళ్లి, మా సినిమా మేకప్‌కి సంబంధించిన సామగ్రిని కొనుక్కున్నాం. అప్పటికే ఒంటిగంటన్నర అయింది. మామిత్రులయిన రవీంద్రగారు, వారి భార్య మమ్మల్ని ఆనగరంలో బాగా పేరుగాంచిన ఇండియన్ రెస్టారెంట్‌కు తీసుకు వెళ్లారు. సాంబారు, ఆవకాయ మొదలయిన పదార్థాలతో కడుపు నిండా భోంచేశాం. ఆహోటల్ యజమాని మాతో తెలుగు, కన్నడం, అరవం, హిందీ, భాషలన్నిటిలోను మాట్లాడాడు. అతను ఏళ్లతరబడిగా అక్కడ వుంటున్నా మన భాషను మరువనందుకు మేము ఎంతో సంతోషించాం.

మూడింటికి 'మేడమ్ టుస్సాట్స్ వాక్స్ మ్యూజియమ్'కి వెళ్ళాం. టుస్సాట్స్ అనే ఆమె కొన్నాళ్ల కిందట—తన అద్భుతమయిన కళాశక్తితో నిర్మించిన మైనపుబొమ్మలు అనేకం ఆ ప్రదర్శన శాలలో ఉంచబడినవి. ఆమె వంశస్తులు, మనుమలు, మునిమనుమలు కూడా తయారుచేసిన బొమ్మలూ ఉన్నవి. ఇప్పటి ప్రసిద్ధనాయకులు, కళాకారులు, రాజవంశస్తులు, నేరస్థులు మొదలయినవారి బొమ్మలవి.

టికెట్‌కొని లోపలకు వెళ్లాం. 'ఈబొమ్మలు కొంటికి అంతస్తులో ఉన్నవి. మిసెస్ రవీంద్రగారు, నేను, మధుగారు, గుమ్మడిగారు మెట్లెక్కుతున్నాం. గుమ్మడిగారు యింతకుముందు దీన్ని చూశారు గనుక ఏదోనాకు చెప్పబోతూ ఆగిపోయి,"ఆ, చెప్పనులెండి' అన్నారు. ఈలోగా మేం మెట్లెక్కి పైకివచ్చేశాం. మాకు ఎదురుగా యిద్దరు పోలీసులు అటెన్షన్‌లో నించున్నారు.వాళ్ల బొమ్మల్లా కదలకుండావున్నారు. "గుమ్మడిగారూ, వాళ్ళ చూడండి, ఎలాబొమ్మలా నించున్నారో!" అన్నాను. ఆయన పకాల్న నవ్వేశారు. ఎందుకలా నవ్వుతున్నారనిపించింది. ఒకవేళ నిజంగా బొమ్మలేమో అని దగ్గరకువెళ్లి మరీ చూశాను. అయినా నాకు సందేహమే! ముట్టుకుని చూద్దాం మంటే ఒకవేళనిజంగా మనుషులయితే... ..? పైగా అంతకుముందు మాస్కోలో గార్డ్సుచేంజ్ చూశాం. వాళ్లు యిలాగేకదలకుండా బొమ్మల్లా నించున్నారు.

ఈ సందేహంతో కొట్టుమిట్టులాడుతుండగా, ధైర్యంతో ఆగార్డుచెయ్యి ముట్టుకున్నాను. గట్టిగా తగిలింది. అప్పటికిగాని బొమ్మ అని తెలుసుకోలేకపోయాను. ప్రవేశమార్గంలోనే యింత ఆశ్చర్యాన్ని కలిగించిన కళాసృష్టి— లోపలఅన్నీ చూశాక మతులు పోతాయోనే ననిపించింది. నవ్వుకుంటూ విశాలమయిన హాల్లో ప్రవేశించి 'క్యూ'లోనించున్నాం

ముందు రాజ వంశస్తుల బొమ్మలతో ప్రారంభం అయింది. ఎలిజబెత్‌రాణి, ఎడింబరో, మార్గరెట్ మొదలయిన రాజప్రముఖుల మూర్తులు— ముఖ్యముగా ఎలిజబెత్‌రాణి మూర్తి చెప్పనలవికానంత సహజంగా వుంది ఆమె మద్రాసువచ్చినప్పుడు చూశాం. తిరిగి యిపుడామెను నిజంగాచూస్తున్నట్టనిపించింది. ఆమె ధరించిన దుస్తులు రాజసంప్రదాయానికితగినట్లుగా, కిరీటం, మెళ్లో వజ్రాలహారంతో సహా అలంకరించి ఉన్నవి. శరీరపు రంగు, శిరోజాలంకరణా, కళ్లు, పెదవులు, ముక్కు, చెవులు, చేతులు ఎత్తు, లావు— ప్రతి అంగుళం కూడ సహజంగా కనిపించింది. ఆ ఎలిజబెత్‌రాణి నిజంగా అక్కడ నించినట్లే చిరునవ్వుతో మనల్ని చూచినట్లే అనిపిస్తుంది. అంత సజీవంగా బొమ్మలు ఉండటం చాలా అరుదు. అందులోనూ మైనంతో రూపొందించటం —అద్భుతమయిన కళ. ప్రతిబొమ్మ జీవం ఉట్టిపడుతున్నట్టుగా ఉన్నది.

ఆ బొమ్మలకు తగినట్లు పరిసరాలు కూడా అలంకరించారు. ఆరాజ కుటుంబం అంతా వారి సభలో వున్నట్టు—ఒక్కొక్కరు వివిధ భంగిమలతో, వివిధ భావప్రదర్శనలతో మనవేపు చూస్తూ వుంటారు. ఎంతపరిశీలించినా అవి బొమ్మలని మనం నమ్మలేనంత గొప్పదనం వాటిలో ఉన్నది. అంత అద్భుతంగా ఆ బొమ్మల్ని తయారుచేసిన 'టుస్సాట్స్' యొక్క సంతతి ప్రతిభను మెచ్చుకుంటూ యింకా ముందుకు వెళ్లాం.

అక్కడ హాట్స్, బూట్స్ ధరించిన ప్రముఖ వ్యక్తుల బొమ్మలున్నవి. వారంతా ఒక రౌండ్ టేబిల్‌చుట్టూ వివిధ భంగిమలతో కూచున్నారు. మరికొంచెం ముందుకి వెళ్తే— బండారునాయుకే, హిట్లర్, లుముంబా, గాంధి, నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, కెన్నెడీ, కృశ్చేవ్, లెనిన్ మొదలయిన ప్రసిద్ధ నాయకుల మూర్తులు కనిపించాయి. అంతేకాక కళాకారులు 'సోఫియాలారెన్'(ఇటాలియన్‌తార) 'బీటిల్స్' (ప్రసిద్ధ గాయకులు) మూర్తులు కూడా ఉన్నవి. మరోచోట యింకో తమాషా చూశాం. మా 'క్యూ'కి కొద్దిదూరంలో ఒకపక్కన బెంచీమీద 80 ఏళ్ల ముసలమ్మ— మ్యూజియమ్ అంతా చూసి అలసిపోయిన ముఖంతో నీరసంగా, మొహాన దైన్యం కొండవేస్తుండగా తల వాల్చుకుని వుంది. కళ్లజోడు ముక్కుమీద జారిపడుతున్నది నిద్రపోతున్నట్లు వాలుమని వున్నది ఆమెచేతిలోని 'మేడమ్ టుస్సాట్స్' యొక్క కేటలాగ్ కిందజారిపడి కాళ్లదగ్గరవుంది. అదిమైనపు బొమ్మే! ఈబొమ్మగురించే చెప్పబోయి ఆగిపోయారుట గుమ్మడిగారు. దాన్ని చూస్తున్నపుడు చెప్పరు స్పృశిస్తేకాని బొమ్మఅని తెలుసుకోలేనంత సహజత్వం వుట్టిపడుతున్నది ఆ బొమ్మలో.

మరికొంత ముందుకి నడిచాం. మేడమ్ టుస్సాట్స్ తన ప్రతిబింబాన్ని మైనంతో తను స్వయంగా తయారు చేసుకున్నది. తను రూపొందించిన స్లీపింగ్ బ్యూటీ బొమ్మను తీక్షణంగా చూస్తున్నట్లు నించుని వున్నది. టుస్సాట్స్ అందమైన స్త్రీ. నైట్‌గౌన్‌లో నిద్రపోతూన్నది.ఆ నిద్రలో శ్వాస తీసుకోవటం, విడవటం కూడా మనం చూస్తాం. చూపరుల దృష్టిని యింకా ఆకర్షించటానికి ఎగిరిపడే ఆగుండెపైన— ఒక, చక్కని గొలుసులో పతకంపెట్టాడా అమర్చారు. నిజంగా మనిషి నిద్రిస్తున్నట్లే వున్నది. ఎంత అందమయిన బొమ్మ!

అక్కణ్ణుంచి మరో విభాగానికి వెళ్లాం. నేరస్థుల బొమ్మలున్న చోటు అది. ఆబొమ్మలకు అనుగుణంగా వాతావరణం, పరిసరాలూ తీర్చి దిద్దారు.

ఈ విభాగాన్ని చూడటానికి వెళ్ళేదారి— సొరంగ మార్గంలాగున్నటికంతితో ఏర్పరిచారు. నిజంగా మనం సొరంగంలోంచి జైళ్ళోకి వెళుతున్నట్లు అనిపిస్తుంది. అలా కొంత దూరం నడిచాక—వరుసగా జైళ్ళలో నేరస్థుల మూర్తులు— వివిధ భంగిమల్లో ఉన్నవి. మొహాలలో క్రూరత్వం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది. మిణుకు మిణుకు మనే దీపం సన్నటికాంతిని ప్రసరిస్తున్నది. వాళ్ళంతా నిజమయిన నేరస్థులే! వాళ్ళ జీవితాలు, చేసిన నేరాలు అవీ అక్కడే రసిపెట్టారు. మరికొందర్ని ఉరితీసి చనిపోయాక వారి మొహాల్ని చూసి తయారు చేసిన బొమ్మలు. మరో చోట వెనుకటి రోజుల్లో నేరస్థుల శిరస్సులు ఏవిధంగా కత్తిరించేవారో అది, అక్కడ నిర్మించారు. ఆ బొమ్మలుకొన్నివాటి సహజత్వంతో కొంచెంభయాన్ని కలుగజేస్తవి. ఆరింటి దాకా చూసి మా హోటల్ చేరాం.

గదుల్లోకి చేరగానే, ఎవరికివాళ్ళం 'డైరీ' రాస్తూ తొమ్మిదింటివరకూ గడిపాము. మాస్కోలో జరిగిన సంఘటనలు, ఉత్సవాల విషయాలు జ్ఞాపకం చేసుకుంటూ, ఏదైనామరచిపోయామేమోనని ఒకరి కొకరం ఫోన్‌లో అడిగితెలుసుకుంటూ మూడుగంటల కాలాన్ని ఆసక్తిగా వాడాము. మేం దిగిన హోటల్లో మన తిండి దొరకదుగా! అందుకని అంతా సరదాగా నడుస్తూ కొంతదూరం వెళ్ళాక టక్సీలో 'ఆగ్రా రెస్టారెంట్'కి బయలుదేరాం. ఆహోటలవాళ్ళు మళయాళీలు. నన్ను గుర్తించి ఎంతో సంబర పడ్డారు. డబ్బుతీసుకోమన్నారు. మేం బలవంతాన డబ్బు యిచ్చాం. ఏమయినా ఆ మర్నాడు మధ్యాహ్నం మమ్మల్ని భోజనానికి పిలిచారు. సరేనని మాటయిచ్చాం.

ఆమర్నాడు పదింటికి తయారయి రవీంద్రగారి కారుకోసం కూచొన్నాం. 'పిల్లలతో తెమలటానికి యింకా అరగంట పడుతుందనీ, యీలోగా మీరు బకింగ్‌హామ్ పాలెస్ వద్దకు వచ్చేయమనీ' ఫోన్ చేశారు వారు. టాక్సీలో పదిన్నరకి అక్కడికి చేరాం. పదకొండింటికి 'గార్డ్సుచేంజి'అని, ఆచలిలో పాలెస్ చుట్టూ నిర్మించిన యినుప కటకటాల్లో తలలు దూర్చాం. అక్కడేవున్న ఇద్దరు గార్డ్సుని, వారి సంకేతాలని, అటూ, యిటూ, తిరగడం చూస్తూ కొంతసేపు గడిపాం. ఇంకా రవీంద్రగారు రాలేదు. అనుమానం వచ్చి గార్డ్సుచేంజి ఎప్పుడనిఅక్కడి వార్ని అడిగాము. పదకొండున్నరకని చెప్పారు. అప్పటికే అరగంటనుంచి చలిలో నా కాళ్ళు మొద్దుబారాయి. ఇంకాసేపు వుంటే ఆచలికి ఏమవుతానో అనిపించింది. అవాళఆబరువయిన బూట్సువేసుకోకుండా మామూలు హీల్స్ చెప్పులు వేసుకున్నాను. మూడు జతల సాక్సుఒకదానిపై ఒకటి వేసినా చలి భరించలేక పోయినాను. ఏదయినా షాపుకి వెళదాం అంటే యీలోగా యీ గార్డ్సుచేంజి అయిపోతుందేమో అన్న బాధ. ఏం చేస్తాం? అలాగే చలిలో వణుకుతూ నించున్నాం.

మరో పావుగంటకి రవీంద్రగారు భార్యపిల్లలతో వచ్చి మమ్మల్ని కలిశారు. అప్పటికే అక్కడ కొన్ని వందలమంది చేరారు. సరిగా పదకొండున్నర కాగానే 100 మంది పాలెస్ గార్డ్సు మూడు భాగాలుగా విడి వచ్చారు. వరుసక్రమంలో వున్నారు. కొందరు బాండ్ వాయిస్తుంటే అందరికన్న ముందు యిద్దరు గుర్రాలపై వస్తున్నారు. వెనుక వాళ్ళంతా ఆ సంగీతానికి అనుగుణంగా 'రిథమిక్'గా నడుస్తూ పాలెస్ గేట్లోంచి ఆవరణలోకి వెళ్ళి— అక్కడ 15 నిమిషాలు బాండ్ వాయించి, వచ్చిన విధంగానే తిరిగి వెళ్ళారు. ఇదంతా చూడటానికి చాలా బాగుంది. రోడ్‌కి యిరువైపులా వున్న జనాన్ని పోలీసులు అదుపులో పెడుతూ వుంటారు.

మేము అక్కడినుంచి బయట పడేసరికి గంట పట్టింది. తిన్నగా అంతాఆగ్రా రెస్టారెంట్‌కి వెళ్ళాం. మాకోసం ఆహోటల్ యజమాని, వారి భార్య కని పెట్టుకుని వున్నారు. వారూ మాతోపాటే భోం చేశారు. చక్కని దక్షిణాదిభోజనం. వారికి నా ఫోటోలు కొన్ని యిచ్చి వారి చిరునామా తీసుకుని కృతజ్ఞత చెప్పి, అక్కడికి చేరువలో వున్న 'పోస్ట్ ఫోన్ టవర్'కి వెళ్ళాం. ఇది మద్రాసులోని 'లైట్‌హవుస్'లా కట్టబడింది. దాని పైనుంచి చూస్తే 'లండన్ సిటీ వ్యూ' చక్కగా కనిపిస్తుంది. లిఫ్ట్‌లో పైకి వెళ్ళాం. అక్కణ్ణుంచి ట్రఫాల్గర్ స్క్వేర్‌కి వెళ్ళి, అక్కడ ఫౌంటన్‌లో డబ్బులు వేశాం. ట్రఫాల్గర్ స్క్వేర్



'చదరంగం' సెట్ మీద ఒక మనోహర దృశ్యం: జమున, ఎస్. వి. రంగారావు. ఫోటో: మోహన్ జగన్,

ఎంతో ప్రసిద్ధి చెందినది. అందులో కొన్నివేల పావురాళ్ళు మన మధ్య తిరుగుతూ ఉంటవి. వాటికి తిన టానికి గింజలు అక్కడే చిన్న చిన్న డబ్బాల్లో అమ్ముతారు. అవి మన చేతుల్లో చూడగానే అన్నీ ఎగిరి మన మీద వాల్తాయి. అదో సరదా!

మెట్రోస్టేషన్ ఆగగానే మాస్కోలో స్టేషన్ను చూసిన మాకళ్ళు—ఈలండన్‌స్టేషన్‌ని హర్షించలేకపోయినవి. లోపలంతా చీకటిగా గలీజుగా వుంటవి. పరిశుభ్రతలేదు. ఎలాగో రోడ్‌మీదకు వచ్చి ఎనిమిదింటికి సినిమాహాల్ చేరాం. సినిమాహాల్ చాలా పెద్దది. బహుశ మూడువేల మంది ఒక్కసారిగా చూడవచ్చు. 'డాక్టర్ జివాగో' చాలా బాగుంది.

పదకొండింటికి హోటల్‌కిచేరుకున్నాం. 5వ తేదీ ఉదయం పదింటికి తయారయి ఎయిర్‌యిండియాకు వెళ్ళి టిక్కెట్స్ సంగతి చూసుకుని బయట పడ్డాం. అవతలవైపు వున్న మాకారు రోడ్‌క్రాస్‌చేసి వెళ్ళా. అక్కడి సిగ్నల్స్‌మాకు తెలీనందువల్ల కార్లన్నీ ఆగివున్నాయికదా అని రోడ్డుకి అడ్డంగా నడవబోయాం. ఒక ఇంగ్లీషు అతను మమ్మల్ని వెళ్ళకూడదని చెప్పాడు. "పట్టి గబ్బిలాయిల్లా వున్నారే! కార్ల కిందపడి చావాలని వుందా!" అని అన్నాడు. 15 రోజులనుంచి రష్యాలో ఎంతో ఆత్మీయత ప్రదర్శించిన ప్రజలమధ్య వుండివచ్చిన మాకు— ఆఇంగ్లీషు వాడిప్రవర్తన, వాడు చెప్పేతీరు అసహ్యాన్ని కలుగజేసినవి. మనల్ని వారు ఎన్నోఏళ్ళు పరిపాలించారు కనుక, మన భారతీయుల్ని చూస్తే అలా అనిపిస్తుందేమో అనిపించింది. ఏమయినా ఆదేశంలో భారతీయులంటే లెక్కలేనట్టు కనిపిస్తారు.

ఇంకో విచిత్రం. ఆదేశపు స్త్రీ, పురుషులిద్దరిలో 'బీటిల్స్' ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఈ బీటిల్స్ నలుగురు. సుప్రసిద్ధి చెందిన గాయకులు. వీరు ఒకరకమయిన 'హేర్‌డ్రెస్' కనిపెట్టి—నలుగురూ ఎప్పుడూ ఒకేవిధంగా కనిపిస్తారు. వారి పాటలు ఎంత ప్రజాదరణ పొందాయో, వారి 'హేర్‌డ్రెస్'ఖూడా అంత పాపులర్ అయింది. ఆడ, మగ, డాన్సు మాస్టర్ల పూర్వం గిరిజాల జుట్లు పెంచేవారే! అలా భుజాలపైకి వేలాడుతూ పిచ్చిగా మొహంమీదపడుతూ ఉంటుంది జుట్టు! నేను కొంతమంది స్త్రీలను చూసి, ఆడో, మగోకూడా గుర్తించలేని సందర్భం తటస్థ పడ్డది. 'ఏమిటీ పిచ్చి?' అనిపించింది. నవ్వుకున్నాం.

మధ్యాహ్నం భోంచేసి, తిరిగి కాసేపు లండన్ విశేషాలు డైరీ రాసి సాయంత్రం ఎయిర్ పోర్టుకు చేరుకున్నాం. మేకప్ సామాన్లతో మా భుజాలమీద సంచులు బరువెక్కినవి. మమ్మల్ని సాగనంపటానికి మామిత్రులంతా వచ్చారు. వారందరికీ కృతజ్ఞత తెలియజేసి ఎయిర్‌ఇండియా ఎక్కాము రాత్రి తొమ్మిదింటికి ప్రపంచ ప్రఖ్యాతిచెందిన అందాల పట్టణం— 'పారిస్' చేరాం.

(ఇంకా వుంది)



'సతీసుమతి'లో అంజలీదేవి.

చిత్రసమీక్ష

సతీ సుమతి

పురాణాలు, ఇతిహాసాలు మనజాతి సంస్కృతికి నిదర్శనాలు. మనిషికి ఒక ఆదర్శాన్ని చూపిస్తూ ఉనాది చరిత్రను పునాదిగా చేసుకుని జన్మల్ని పునీతం చేసుకోమని సుబోధకం చేస్తున్నాయి.

పతి ఎంత దుర్నీతిపరుడయినా ఆహర్నిశమూ, అతన్ని సేవిస్తూ కష్టమెరుగని సేవలోనే ఆనందానుభూతులనందుకొంటూ తన పాతివ్రత్య మహిమచేత ఉదిదేవుణ్ని సహితం చలవరహితుణ్ని చేసిన 'సతీ సుమతి' గాథ ఈ చలన చిత్రం.

రూపకల్పనలో రమణీయకత, చిత్రీకరణలో సొగసు, ముగింపులో బిగింపు, ఆభరణాలయితే, సతీ సుమతి పాత్రను పోషించిన అంజలీదేవి ఈ చిత్రానికి ప్రాణం. స్త్రీజాతి శిరోమణియైన సుమతిని అంజలీదేవిలో చూస్తున్నప్పుడు, అది మనకు చలనచిత్రమని పించదు, ప్రత్యక్ష సాక్ష్యంగా కనిపిస్తుంది. అంతటి ఉదాత్తంగా పాత్రలో లీనమైపోయారామె.

ఆదిమధ్యాంతాలూ రసపుష్టితో నడిచిన ఈ చిత్రానికి కాంచన ఒక అందమైన ఒకర్షణ. రేలంగి, గిరిజ అందించిన హాస్యం బాగున్నది. ముఖ్య పాత్రల్లో కాంతారావు, యస్ వి రంగారావు, నాగభూషణ్, సూర్యకాంతం, వాసంతి, ఉన్నారు. అల్లు రమలింగయ్య, వంగర, రామచంద్రరావు, రెడ్డి, యల్. విజయలక్ష్మి, పుష్పవల్లి, జ్యోతి, తారాగణ సముదాయం నాగేశ్వరరావు, జగ్గయ్య, జెమిని గణేష్, రమణారెడ్డి, సావిత్రి, జమున, కృష్ణకుమారి అతిథి నటులుగా కనిపిస్తారు.

సముద్రాల జూనియర్, కొసరాజుల్లు రాసిన మాటలు, పాటలు కథాగ్రాసం మరింతగా వన్నెకెక్కింది. అశ్వత్థామ సంగీతం ప్రతిపాటా సంగీత వాహినిగా ప్రవహించి మానసోల్లాసం కల్గిస్తుంది.

కన్నులపండువగా అంజలీదేవి సమర్పించిన శ్రీ త్రిదర్శవారి చిత్రం 'సతీసుమతి' వేదాంతం రాఘవయ్య దర్శకత్వంతో వన్నెచిన్నెలు దిద్దుకున్నది.

సకుటుంబంగా చూసి ఆనందించతగ్గ 'సతీసుమతి' వాణీ ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.

సి. కనకాంబరరాజు ●

చిత్రలహరి

గతనెల రెండవభాగంలో న్యూఢిల్లీ రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి డా. యస్ రాధాకృష్ణన్ ఎ వి యం. వారి వర్ణచిత్రం "భక్తప్రహ్లాద" చూసి ముగ్ధులై ఎంతగానో ప్రశంసించారుట. ముఖ్యంగా ప్రహ్లాద పాత్రధారిణి బేబీ రోజారమణిని దగ్గరకు తీసుకుని "బేబీ, చాలా బాగా చేశావమ్మా!" అని ఆప్యాయంగా అభినందించి ఆశీర్వదించారు. రాష్ట్రపతి ఆశీస్సులు పొందిన యీ చిరంజీవి బేబీ రోజారమణికి ఉజ్వల భవిష్యత్తు ఉన్నది



'అందంకోసంపందెం'లో భారతి.

హృషికేశ్ పిక్చర్స్ పతాకం కింద "అందం కోసం పందెం" అనే జానపద చిత్రం తయారవుతున్నది. కాంతారావు, కాంచన, భారతి, పద్మజ, సిధన, రాజనాల, రమణారెడ్డి, రాజబాబు, మిక్కిలినేని, చలం, కొత్తనటుడు వరప్రసాద్ ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు రచన పింగళి, సంగీతం. కోదండపాణి నిర్వహిస్తున్నారు.

శ్రీ జగ్గయ్యకు సన్మానం

ఒంగోలు నియోజకవర్గం నుంచి సినీ నటుడు శ్రీ కొంగర జగ్గయ్య బి.ఏ. (లిట్) పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయారు. ఎనభై వేల వోట్లకు పైగా మెజారిటీతో గెలిచారు. ఆయన గెలుపుకు సినీమా పరిశ్రమ కూడా ఎంతో కృషి చేసింది. నటుడుగా నిర్మాతగా, సినీమారంగపు కష్టసుఖాలు బాగా ఆకళింపు చేసుకున్న వ్యక్తి శ్రీ జగ్గయ్య. యీ ప్రయత్నంలో విజయం సాధిస్తే సినీమాపరిశ్రమకు మేలు జరుగుతుందన్న భావం యీ కృషి వెనుక వుంది. ఆయన ఎం. పి. గా రావటం అవసరం అని యిక్కడి వారు తలపోశారు.


అయితే 'శ్రీ జగ్గయ్య గెలుస్తారా?' అనే సందేహం పలువురిలోను ఉత్పన్నం అయింది. కమ్యూ



'పట్టుకుంటే పదివేలు'లో చలం, గీతాంజలి

నిస్టులకు కీలక స్థానమూ, కంచుకోటా అయిన ఒంగోలు నియోజకవర్గంలో నెగ్గుకురాగలనా అని శ్రీ జగ్గయ్యకూ అనుమానం రాకపోలేదు. మిత్రులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహంతో పెద్దల ఆశీస్సులతో ధైర్యంగా నిలిచారు. ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. ఆదరించారు. అభిమానం కురిపించారు. తనది కాదనుకున్న చోట, కాంగ్రెసుకు సీటు రాదనుకున్న చోట వచ్చింది. శ్రీ జగ్గయ్యను విజయలక్ష్మి వరించింది.

శ్రీ జగ్గయ్య విజయ వార్త వినగానే సినిమా పరిశ్రమ ఎంతగానో పొంగిపోయింది. ఈ విజయం తమదిగానే మురిసిపోయింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మార్చి 4వ తేదీన స్థానిక హోటల్ ఉడ్‌లాండ్స్‌లో పదముగ్గురు ప్రముఖ నిర్మాతలు ఒక కమిటీగా ఏర్పడి శ్రీ జగ్గయ్యకు



సన్మానసభలో శ్రీ జగ్గయ్య మాటాడుతున్న దృశ్యం.

రిసెప్షన్ యిచ్చారు. ఆనాటి సభకు పరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు, నిర్మాతలు, దర్శకులు, పత్రికా ప్రతినిధులు హాజరయినారు.

ఈ సభకు శ్రీ యన్. టి. రామారావు బి. ఏ. అధ్యక్షత వహించారు. శ్రీయుతులు డి. వి. యస్. రాజు, బి. యన్. రెడ్డి, పద్మశ్రీ నాగయ్య, రేలంగి వెంకట్రామయ్య, సి. యస్. రావు, ఇంటూరి వెంకటేశ్వరరావు, శ్రీమతి జమున ఉపన్యసించారు. శ్రీ జగ్గయ్యను అభినందిస్తూ కొందరు, ఆయన ఇన్ఫర్మేషన్ బ్రాడ్‌కాస్టింగ్ మినిస్టరు కూడా అవాలనే ఆశాభావాన్ని కొందరు ఉపన్యాసకులు వెల్లడించారు. శ్రీ యన్. టి. రామారావు అధ్యక్ష స్థానం నుంచి ప్రసంగిస్తూ ఈ విజయం మన అందరిదీ అనీ, కళాకారుడి పట్ల ప్రజలకు గల గౌరవభావం, ఎనలేని ప్రేమాదరాలు ఎంతో స్పష్టంగా వ్యక్తమయినవనీ, పన్నుల భారంతో పరిశ్రమ కుంగిపోతున్నదనీ, వాటిని రూపుమాపే ప్రయత్నంలో శ్రీ జగ్గయ్య గట్టిగా కృషి చేయాలనీ చెప్పారు. శ్రీ జగ్గయ్య సమాధానం చెబుతూ సినిమా పరిశ్రమ తనకు పుట్టినిల్లయితే ఒంగోలు నియోజకవర్గం మెట్టినిల్లనీ, ఈ రెం



'నువ్వే'లో జయలలిత, జయశంకర్.

డింటి పట్లా తనకు సమానమైన బాధ్యతలున్నవని లోటుపాట్లు లక్ష్యపెంచక లేకుండా తీరుస్తానని, తీర్చే ప్రయత్నం చేస్తానని హామీ యిచ్చారు. ఎం పి అయినందు వల్ల యిక మీదట సినిమాల్లో నటిస్తారా, లేదా? అనే ప్రశ్నలు ఎదురవుతున్నవి అందుకు శ్రీ జగ్గయ్య 'ఇకమీదట కూడా సినిమాల్లో నటిస్తానని, నటిసూనే రాజకీయ కార్యకలాపాలు చక్కబెట్టుకుంటానని చెప్పారు. శ్రీ తోట సుబ్బారావు వందన సమర్పణ చేశారు. అనంతరం సభ ముగిసింది.



'ప్రేమలో ప్రమాదం'లో కృష్ణకుమారి, రామకృష్ణ.

రిసెప్షన్ కమిటీలో సభ్యులుగా శ్రీయుతులు యన్. త్రివిక్రమరావు (రామకృష్ణ యన్. ఏ. టి. కంబైన్స్), డి. వి. యస్. రాజు (డి. వి. యస్. ప్రొడక్షన్స్), డి రామానాయుడు (సురేష్ ప్రొడక్షన్స్), యన్ భావనారాయణ (గౌరీ ప్రొడక్షన్స్,) బి విఠలాచార్య (విఠల్ ప్రొడక్షన్స్), యన్ రామబ్రహ్మం (గౌతమీ పిక్చర్స్), ఎం. జగన్నాథరావు (యస్ వి యస్ ఫిలిమ్స్), యు విశ్వేశ్వరరావు (విశ్వశాంతి పిక్చర్స్), ఏ యస్ ఆర్ ఆంజనేయులు (మాధవి ప్రొడక్షన్స్), తోట సుబ్బారావు (శ్రీదేవి ప్రొడక్షన్స్), పి గంగాధరరావు (హైదరాబాద్ మూవీస్), ఏ పుండరీకాక్షయ్య (తారకరామా పిక్చర్స్), కె. సోమశేఖరరావు (శేఖర్ ఫిలిమ్స్) ఉన్నారు



'ముళ్ళకిరీటము'లో ఎల్. విజయలక్ష్మి

* * *

చిత్రలహరి



'భువనసుందరి కథ'లో కృష్ణకుమారి

శ్రీ వెంకటేశ్వరస్వామి ఫిలింస్ వారి తొలి సాంఘిక చిత్రానికి యింతవరకు రెండు షెడ్యూళ్ళలో పని జరిగింది. యన్. టి. రామారావు, దేవిక, వాణిశ్రీ, ఎల్. విజయలక్ష్మి, ఛాయాదేవి, రాజనాల, రమణారెడ్డి, రాజబాబు, రావికొండలరావు, సత్యనారాయణ, ధూళిపాళ, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి, ఆనందమోహన్ ప్రభృతులు నటిస్తున్నారు. మాటలు పినిసెట్టి, పాటలు సి నారాయణరెడ్డి, దాశరధి, సంగీతం టి వి. రాజు, కూర్పు బి గోపాలరావు, కెమెరా. యస్ యస్. లాల్, దర్శకుడు యస్ డి. లాల్, నిర్మాత యం. జగన్నాథరావు.



'అందంకోసం పందెం'లో కాంతారావు, భారతి.



సురేష్‌కంబయిన్స్ తొలిచిత్రం ప్రారంభించినప్పటిదృశ్యం ఇందులో పూర్ణచంద్రరావు, సముద్రాల, యస్. త్రివిక్రమరావు, పి సుశీల, కృష్ణకుమారి, రామానాయుడు ఉన్నారు.

జనజ్యోతి పిక్చర్స్ వారి ద్వితీయ చిత్రానికి "ఇదా ప్రపంచం" అనే పేరును మార్చి, ఇప్పుడు "పట్టుకుంటే పదివేలు" అని ఖాయం చేసినట్లు ఆ చిత్ర దర్శకుడు శ్రీ యం. మల్లికార్జునరావు తెలియజేశారు. ఇంతవరకు ఏడు రీళ్ల చిత్రం పూర్తి అయింది. నాలుగు పాటలు చిత్రీకరణ జరిపారు. చలం, గీతాంజలి, భారతి, గుమ్మడి, నాగయ్య, రేలంగి, మిక్కిలినేని, రాజబాబు, సత్యనారాయణ, అల్లురామలింగయ్య, బాలకృష్ణ, డా. శివరామకృష్ణయ్య, బేబీ మల్లిక, బేబీ ఇందిర ముఖ్య భూమికలు పోషిస్తున్న యీ చిత్రనిర్మాణం త్వరితగతిన సాగుతున్నది. రచన భమిడిపాటి రాధాకృష్ణ, సంగీతం టి. చలపతిరావు, కెమెరా లక్ష్మణ్ గోరే, నిర్మాతలు. సాంబశివరావు, చందనం.

*　　*　　*

విశ్వశాంతి పిక్చర్స్ వారి "కంచుకోట" చిత్రానికి యిటీవల సేలం సమీపాన గల హోగెనకల్‌లో



'పట్టుకుంటేపదివేలు'లో భారతి.



'మామంచిఅత్తయ్య' లో శోభన్‌బాబు, అంజలీదేవి, పద్మనాభం.



[illegible] పద్మనాభం, వాణిశ్రీ.

అవుట్ డోర్ షూటింగ్ జరిగింది. ఈ అవుట్ డోర్‌లో యన్. టి. రామారావు, దేవిక పాల్గొన్నారు. రెండు పాటలు, కొన్ని దృశ్యాలు చిత్రీకరించారు. దీనితో యీ చిత్ర నిర్మాణం పూర్తి అయింది. రీరికార్డింగ్ జరుగుతున్నది. ఆంధ్ర అంతటా యీ చిత్రం జ్యోతి పిక్చర్స్ ద్వారా యీ నెల 22న విడుదల అవుతున్నది. రచన మహారథి, సంగీతం కె. వి. మహాదేవన్, దర్శకుడు సి. యస్. రావు, నిర్మాత యు. విశ్వేశ్వరరావు బి. ఎస్‌సి.

*　　*　　*

కోటి ఫిలింస్ వారి "ముళ్ల కిరీటము" ఈమార్చి నెల 'ఈస్టర్' శుభదినమున ఆంధ్ర అంతటా విడుదల అవుతున్నట్లు తెలుస్తున్నది. ఎల్. విజయలక్ష్మి, శాంతి, కుమారి, ప్రేమనజీర్, తిక్కురిస్సి, [illegible] మున్నగు వారు నటించారు. మాటలు రాజశ్రీ, పాటలు ఆత్రేయ, రాజశ్రీ, సంగీతం యస్. రాజేశ్వరరావు, కె. దేవదాస్, కెమెరా ఎస్. ఎస్. మణి, దర్శకుడు: పి. సుబ్రహ్మణ్యం, నిర్మాత కె. దేవదాస్.



'గృహలక్ష్మి'లో నాగేశ్వరరావు, పద్మశ్రీ భానుమతి.

చిత్రలహరి

బాబూ మూవీస్‌వారి "మూగ మనసులు" చిత్రాన్ని ప్రసాద్ ప్రొడక్షన్స్ వారు హిందీలో "మిలన్" పేరుతో ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించారు ఈ నెల 17న యీ చిత్రం ఉత్తరభారత మంతటా విడుదల అవుతున్నది ఇందులో ముఖ్య భూమిక ధరించిన నటి జమున, యీ చిత్ర దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు యీ 16న బొంబాయిలో ప్రీమియర్‌కి వెళుతున్నారు నూతన్ సునీల్‌దత్, ప్రాణ్ యీ చిత్రంలో యితర ముఖ్య పాత్రధారులు

శ్రీదేవి ప్రొడక్షన్స్ వారి "భువన సుందరి" కథ చిత్రనిర్మాణం పూర్తి కావస్తున్నది. హాలాహాలటీవ నిర్మింపబడుతున్నది. యన్. టి. రామారావు, కృష్ణకుమారి, ప్రధాన భూమికలు పోషిస్తున్న యీ చిత్రానికి కథకుడు: జి. వి. జి. సంభాషణలు: బి. ఎల్. ఎన్. ఆచార్య, సంగీతం ఘంటసాల, కెమెరా సి నాగేశ్వరరావు, కూర్పు బి. గోపాలరావు, దర్శకుడు పి పుల్లయ్య, నిర్మాత తోట సుబ్బారావు. ఏప్రిల్ మొదటివారంలో ఆంధ్ర అంతటా యీ చిత్రం పూర్ణా పిక్చర్స్ వారి ద్వారా విడుదల కానున్నట్లు తెలుస్తున్నది.

*   *   *

శ్రీ కె విజయకుమార్ "సరస్వతీ శపథం' వర్ణ చిత్రాన్ని త్వరలో ఆంధ్ర ప్రేక్షకులకు సమర్పించబోతున్నారు సావిత్రి, దేవిక, కె ఆర్, విజయ, పద్మిని, శివాజీగణేశన్, హరనాథ్, ప్రభాకర రెడ్డి, నాగేష్, మనోరమ నటించారు శివాజీ గణేశన్‌కి యీ చిత్రంలో జగ్గయ్య తన కంఠమును కంఠాన్ని ఎరువిచ్చారు మాటలు, పాటలు ఆరుద్ర, సంగీతం మహాదేవన్, కెమెరా కె యస్ ప్రసాద్, దర్శకుడు ఏ పి నాగరాజన్.

*   *   *

విజయలక్ష్మి పిక్చర్స్ వారు గూఢచారి 116 ఆధారంగా హిందీలో నిర్మిస్తున్న చిత్రానికి "ఫర్జ్" అని పేరు పెట్టారు ప్రస్తుతం యీ చిత్రం తాలూకు అవుట్ డోర్ షూటింగ్ ఊటీలో జరుగుతున్నది. బబీటా, జితేంద్ర, సజ్జన్ ముఖ్య భూమికలు పోషిస్తున్న యీ చిత్రం ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించబడుతున్నది సంగీతం లక్ష్మీకాంత్ ప్యారేలాల్, కెమెరా, దర్శకత్వం రవికాంత్ నిర్మాతలు సుందర్‌లాల్ నహతా, డూండీ.

—మోహన్ కుమార్



"సరస్వతీ శపథం"లో శివాజీ, దేవిక.



'పట్టుకుంటే పదివేలు'లో ఒక సన్నివేశం

17 అందులో నాలుగోవంతు
0 శతాబ్దపు విలువ
3 నెల విలువ
4 తేదీ

మొత్తం 92

92ని 7చే భాగిస్తే శేషం 1 మిగులుతుంది. కనుక ఆనాడు సోమవారం.

ఇదే నియమం ఇతర శతాబ్దాలకూ వర్తిస్తుంది. అన్నట్లు, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కాదనీ, 2000, 1600, 1200, 800, 400 వంటివి లీపు సంవత్సరాలు అనీ మీకు తెలుసు కదూ? ఇచ్చిన సంవత్సరం లీపు సంవత్సరం అవునో కాదో, అయితే ఆ తేదీ ప్రత్యేక దినములలోది అవునో కాదో పరిశీలించి ఆ తరువాత సమస్యను సాధించాలి.

జరుగుతున్న 20వ శతాబ్దానికి విలువ సున్న అనీ, 19వ శతాబ్దానికి విలువ 2 అనీ, 18వ శతాబ్దానికి 4 అనీ, 17వ శతాబ్దానికి 6 అనీ ఇదివరలో తెలుసుకున్నాం. మిగిలిన శతాబ్దాల విలువలు ఈ క్రింద ఇస్తున్నా. వీటి సాయంతో భూత భవిష్యత్తులలో ఏ శతాబ్దంలో అయినాసరే, ఏ సంవత్సరంలో ఏ నెలలో ఏ తేదీ ఇచ్చినా అది ఏ వారమైందో సులభంగా కనుక్కోవచ్చును.

శతాబ్దం	విలువ		శతాబ్దం	విలువ
24	0		6	4
23	2		5	6
22	4		4	0
21	6		3	2
20	0		2	4
19	2		1	6
18	4			
17	6			
16	0	క్రీ.పూ.	1	0
15	2	„	2	2
14	4	„	3	4
13	6	„	4	6
12	0	„	5	0
11	2	„	6	2
10	4	„	7	4
9	6	„	8	6
8	0	„	9	0
7	2	„	10	2

వీటిలో ఉన్న క్రమాన్ని పాఠకులు గ్రహించే ఉంటారు. 0, 2, 4, 6 అనే సంఖ్యలు పునరావృతమవుతూ ఉంటాయి. కనుక జ్ఞాపకం ఉంచుకోవటం సులభమే.

వీటిని ఉపయోగించి క్రీ. శ. 5—2—340 వ తేదీ ఏ వారమైందో లెక్కకడదాం ఉదాహరణకి ఇది నాలుగో శతాబ్దం. ఈ శతాబ్దపు విలువ సున్న 340 లీపు సంవత్సరం. ఫిబ్రవరి 5వ తేదీ ప్రత్యేక దినాలలో చేరుతుంది. కనుక 1 తీసి వేయాలి.

40 సంవత్సర సంఖ్య
10 నాలుగో వంతు
0 శతాబ్దపు విలువ
3 నెల విలువ
5 తేదీ
—1 (ప్రత్యేక దినం కనుక)

ఉత్తరాలు

(4వ పేజీ తరువాయి)

మొత్తం 57

57 ని 7చే భాగిస్తే శేషం 1 మిగులుతుంది కనుక ఆనాడు సోమవారం.

మరొక్క ఉదాహరణ:

క్రీ శ. 5—1—1000 ఏవారం అయింది?

ఇది లీపు సంవత్సరంకాదు కనుక ఇది ప్రత్యేక దినాలలో చేరదు. కనుక 1 తీసి వేయవలసిన పని

00 సంవత్సర సంఖ్య
0 నాలుగోవంతు
2 శతాబ్దపు విలువ
0 నెల విలువ
5 తేదీ

మొత్తం 7

దీనిని 7చే భాగిస్తే శేషం సున్న. కనుక ఆనాడు ఆదివారం.

షరా. అన్నట్లు ఇప్పుడు అమలులో ఉన్న గ్రెగేరియన్ కేలండరు ప్రకారం చూస్తే ఈ వ్యాసంలో చెప్పిన తేదీలు, వారాలు సప్పుతాయి. కాని, కొంత కాలం క్రిందట జూలియన్ కేలండరు అని మరో పద్ధతి అమలులో ఉండేది. దాని ప్రకారం చూస్తే ఈ వారాలు సరిపోవు. ఈ కేలండరుల పుట్టుపూర్వోత్తరాలను గురించి మరోసారి తెలుసుకుందాం.

- మహీధరనళినీమోహన్.

న్యూఢిల్లీ లేఖ

1966 నవంబరు 7 వ తేదీన ఢిల్లీలో జరిగిన అవాంఛనీయ సంఘటనలకు జన సంఘానిదే పూర్తి బాధ్యత అని పెద్ద ప్రచారము జరిగింది. తమ 'ఢిల్లీ లేఖ' శీర్షికలో శ్రీ కృష్ణగారు ఈ విషయమై జనసంఘాన్ని తీవ్రముగా విమర్శిస్తూ వరుసగా మూడు, నాలుగు వారములు వ్రాసేరు. శ్రీమతి ఇందిరాగాంధి సెడివినట్లు ప్రపంచంలో మన ప్రతిష్ఠకే భంగకరమైన ఈ సంఘటనలకు నిజంగా జన సంఘానిదే బాధ్యత అయిన పక్షంలో, విజ్ఞులు, వివేక వంతులు అయిన ఢిల్లీ వోటర్ల చేతిలో జన సంఘం చిత్తుగా వోడిపోయి నామ రూపాలు లేకుండా తుడుచుకు పోయివుండేది. కాని ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్‌లో సగంకంటె ఎక్కువ స్థానాలను సాధించటం ద్వారాను, ఢిల్లీనగరంనుండి పార్లమెంటుకు గల స్థానాలలో ఒక్కటి తప్ప మిగిలిన అన్నింటిలో విజయం పొందటం ద్వారానూ, జన సంఘం తన నిష్కల్మషత్వాన్ని రుజువు పరచు కొ.ది. కేవలం జనసంఘాన్ని అపఖ్యాతి పాలు చేయాలనే దుర్బుద్ధితో నవంబరు ఏడవ తేదీ సంఘటనలకు సంబంధించిన బాధ్యత జనసంఘముపై రుద్దబడిన దన్న విషయాన్ని ఢిల్లీ వోటర్లు బాలెట్ పెట్టె వద్ద తమ నిర్ణయం ద్వారా ప్రపంచానికి విశదం చేసేరు. ప్రసిద్ధ పత్రికా రచయితలైన శ్రీ కృష్ణగారు నిష్పక్షపాత బుద్ధితో యదార్థ విషయములను పాఠకుల ముందు వుంచగలరని ఆశిస్తున్నాను

ఉరిమిరి సన్యాసమ్మ (విజయనగరం)

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA